శ్రీరస్తు

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః

శ్రీమదాంధ్ర వచనరామాయణము

ఆరణ్యకాండము

సంస్కృతరామాయణమునకు సరియైనతెనుఁగు

శ్రీసరస్వతుల సుబ్బరామశాస్త్రిగారిచే

విరచితము

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
11325

చెన్నపురి:

వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచే ప్రకటితము

1951.

All Rights Reserved] [Rs 2—8—0.

మొదటికూర్పు—1925

రెండవకూర్పు— 1951

T
294.5922
SUB

Printed by

V. VENKATESWARA SASTRULU

of V. RAMASWAMY SASTRULU & SONS

AT THE 'VAVILLA' PRESS

Tondiarpet, Madras.

AOUA104B133

విషయసూచిక

ఆరణ్యకాండము

సర్గము.		పుట.
1 రాముఁడు తాపసాశ్రమములఁ జూచుట	...	1
2 విరాధుఁడు సీత నపహరించుట	...	3
3 రామలక్ష్మణులు విరాధునితోఁ బోరుట	...	5
4 విరాధవధము	...	7
5 రామలక్ష్మణులు శరభంగాశ్రమము సేరుట	...	10
6 శ్రీరాముఁడు రాక్షసవధము సేయందునని మునులతోఁ బ్రతిజ్ఞ సేయుట		13
7 రాముఁడు సుతీక్ష్ణుని యాశ్రమమునకుఁ బోవుట	...	16
8 రామలక్ష్మణులు సుతీక్ష్ణుని వీడ్కొని పోవుట	...	17
9 సీత రామునితో ప్రాణివధము యుక్తము గాదనుట	...	19
10 శ్రీరాముఁడు రాక్షసవధము యుక్తమేయని సీతకు బదులు సెప్పుట		22
11 శ్రీరాముఁ డనేకాశ్రమములు సంచరించి యగస్త్యాశ్రమము సేరుట		24
12 రాముఁ డగస్త్యాశ్రమము సొచ్చి యగస్త్యమునివలన నస్త్రములఁ బడయుట		31
13 రాముఁ డగస్త్యుని ప్రేరణవలనఁ బంచవటికిఁ బోవుట	...	34
14 జటాయువు స్వకీయ వృత్తాంతమును దెల్పుట	...	36
15 రామాదులు పంచవటిం జేరుట	...	39
16 లక్ష్మణుఁడు రామునికి హేమంతర్తువు వర్ణించి చెప్పుట	...	41
17 శూర్పణఖ రాముని జూచి మోహించుట	...	45
18 రామలక్ష్మణులు శూర్పణఖను కురూపిణిం జేయుట	...	47
19 ఖరుఁడు శూర్పణఖయొక్క వృత్తాంతమువిని సైనికులను యుద్ధమునకుఁబంపుట		49
20 ఖరుం డంపిన పదునలుగురు రక్కసులు మడియుట	...	51
21 శూర్పణఖ మఱల ఖరునితోఁ జెప్పి విలపించుట	...	53
22 ఖరుఁడు రాముని మీఁదికిఁ బోవుట	...	55
23 ఖరునకు దుశ్శకునము లగుట	...	57
24 రాముఁడు యుద్ధసన్నద్ధుఁ డగుట	...	59
25 ఖరుని సైన్యములు రామునిచే మడియుట	...	62

సర్గము.		పుట.
26 రాముఁడు దూషణాదులను జంపుట	...	65
27 రాముఁడు త్రిశిరసునిఁ జంపుట	...	68
28 ఖర రాముల యుద్ధము	...	70
29 రాముఁడు ఖరుని దూఱి గదను విరచుట	...	72
30 రాముఁడు ఖరుం జంపుట	...	75
31 అకంపనుఁడు జనస్థానవృత్తాంతము రావణునకు నెఱిఁగింపుట	...	78
32 శూర్పణఖ రావణుపాలికిఁ జనుట	...	82
33 శూర్పణఖ రాముని వృత్తాంత మెఱిఁగించుట	...	84
34 శూర్పణఖ సీత నపహరింప రావణునిఁ బురికొల్పుట	...	86
35 రావణుఁడు మారీచాశ్రమమునకుఁ జనుట	...	88
36 రావణుఁడు మారీచుని సహాయము గోరుట	...	91
37 మారీచుఁడు రావణునికి హితము సెప్పుట	...	93
38 మారీచుఁడు రాముని పరాక్రమము రావణుని కెఱిఁగించుట	...	95
39 మారీచుఁడు రావణునికి రాముని ప్రభావ మెఱిఁగించుట	...	98
40 రావణుఁడు మారీచుని సువర్ణమృగ మగుమనుట	...	100
41 మారీచుఁడు రావణుని నిష్ఠురోక్తులాడుట	...	102
42 మారీచుఁడు మాయామృగమగుట	...	103
43 సీత మాయామృగమును గోరుట	...	106
44 రాముఁడు మాయామృగమును సంహరించుట	...	110
45 సీత లక్ష్మణునిఁ గూడఁ బంపుట	...	112
46 రావణుఁడు సీతను సమీపించుట	...	116
47 రావణుఁడు తన వాస్తవరూపము దెలుపుట	...	119
48 రావణుఁడు తనపరాక్రమము సీత కెఱిఁగించుట	...	123
49 రావణుఁడు సీత నెత్తికొని పోవుట	...	125
50 జటాయువు రావణుని నెదుర్కొనుట	...	128
51 జటాయువు రావణునితోఁ బోరుట	...	131
52 రావణుఁడు సీత నెత్తికొనిపోవుట	...	135
53 సీత రావణుని దూలనాడుట	...	138
54 రావణుఁడు సీతతోడ లంకఁ జేరుట	...	141

సర్గము.		పుట.
55 రావణుఁడు సీతను మోహించి నిర్బంధించుట	...	143
56 రావణుఁడు సీత నశోకవనమున నుంచుట	...	146
57 రాముఁడు మారీచుని వధించి మఱలి లక్ష్మణుం గాంచుట	...	149
58 రాముఁడు లక్ష్మణుని సీత వృత్తాంతం బడుగుట	...	150
59 లక్ష్మణుఁడు తన రాకకుఁ గారణ మెఱిఁగించుట	...	152
60 రాముఁడు సీతను వెదకుట	...	154
61 రాముఁడు సీతను గానక విలపించుట	...	158
62 రాముఁడు సీతను గానక విలపించుట	...	160
63 రాముఁడు సీతను గానక చింతించుట	...	162
64 రామలక్ష్మణులు సీతను వెదకుట	...	164
65 లక్ష్మణుఁడు రాముని శాంతపఱచుట	...	170
66 లక్ష్మణుఁడు రామునిశోకమును శాంతపఱచుట	...	171
67 రాముఁడు జటాయువువలన సీతసంగతి నెఱుఁగుట	...	173
68 రాముఁడు జటాయుంవున కుత్తరక్రియలు సల్పుట	...	175
69 రామలక్ష్మణులు కబంధునిఁ జూచుట	...	178
70 రామలక్ష్మణులు కబంధుని చేతులు నఱుకుట	...	182
71 కబంధుఁడు తన పూర్వజన్మకథ కెఱిఁగించుట	...	183
72 కబంధుఁడు రామునకు సీతాలాభోపాయముఁ దెల్పుట	...	186
73 కబంధుఁడు రామునికి మార్గముఁ దెల్పుట	...	188
74 శబరి రాముని దర్శించి స్వర్గమునకుఁ బోవుట	...	191
75 రాముఁడు పంపాసరస్తీరము చేరుట	...	194

వచనగ్రంథములు

	ప్రతి 1-కి రూ. అ.
◄ వచనగ్రంథములు. ►	
ఆంధ్రవచనభాగవతము, ద్వాదశ	
స్కంధములు, ఒకేసంపుటము	9 0
డిటో మూడుసంపుటములు	10 8
ఆంధ్రవచనభారతము:—	
,, ఆదిసభాపర్వములు	5 0
,, ఆరణ్యపర్వము	5 0
,, విరాటోద్యోగపర్వములు	5 8
,, భీష్మద్రోణకర్ణములు	7 8
,, కర్ణశల్యసౌప్తికస్త్రీపర్వములు	5 8
,, శాంతిపర్వము	7 8
,, ఆనుశాసనికము మొదలు స్వర్గారోహణ పర్వము వరకు గలసంపుటము	7 8
ఆంధ్రవచనవాల్మీకిరామాయణము,	
బాలకాండము	2 8
అయోధ్యాకాండము	5 0
అరణ్యకాండము	2 8
తక్కిన కాండలు	అచ్చు
పంచతంత్రహితోపదేశ కథామంజరి	1 12
ఆంధ్రవాఙ్మయచరిత్ర సంగ్రహము	3 0
న్యాయవిచారణ, (ప్రహసనము)	0 12
శ్రీతిలకుగారి సెక్యూరిటీకేసు ఉపన్యాసములు	0 14
భారతరమణీమణులు, 1 భాగము	1 4
డిటో 2 భాగము	0 10
డిటో 3 భాగము	0 8
యజుర్వేదకథాసంగ్రహము	0 10
నీతిచంద్రిక, శ్రీచిన్నయసూరి;	0 10
,, టీకతో	1 4
పంచతంత్రము, వచనము	0 12

	ప్రతి 1-కి రూ. అ.
సంగ్రహరామాయణము	1 8
పతివ్రతలచరిత్రలు	3 0
భోజునికథలు	1 0
భోజకాళిదాసకథలు, I-భాగము	1 0
II-భాగము	1 0
తెనాలిరామలింగనికథలు, జీవితము	0 8
డిటో A. S. P. అయ్యరు	0 8
సంస్కృతనాటకకథలు	2 0
రాజశేఖరుడు, గోపాలుడు	0 12
చార్దర్విషుకథలు	1 0
తాతాచార్యులకథలు	0 8
బేతాళునికథలు	0 12
పరమానందశిష్యులకథలు	0 4
నలుగురుమంత్రులకథలు	0 8
అయిదుగురుదొంగలకథలు	0 8
పురాణగాథలు I	1 0
,, II	1 0
బాజీరాయనిచరిత్ర	1 4
రఘువంశకథ	0 8
విక్రమార్కచరిత్ర, శ్రీభా. రామమూర్తిశాస్త్రి	1 8
ఈసఁబునీతికథలు, 1-వ భాగము	0 8
డిటో 2-వ భాగము	0 12
వంజాఁయి అల్లరి, శ్రీమూలవ్యా	0 8
మర్యాదరామన్నకథలు	0 3
మైరావణచరిత్ర, చక్కనికూర్పు	0 2
అనంతసాగరము, బుక్కరాయసముద్ర చరిత్రము	0 12
ద్వాదశోపనిషత్తులు తెలుగువచనము	5 0
గురుజాడ అప్పారావుగారి చిన్నకథలు I సంపుటము	1 0
గేయములు పాటలు II ,,	1 0

	ప్రతి 1-కి రూ.	అ.
అరేబియన్ నైట్సుకథలు	2	0
నీతిరత్నాకరము	0	8
ప్రాచీనదేశచరిత్రలు	1	12
వైద్యులకథలు	0	6
వీరాంగనలు	0	12
రేచుక్కపగటిచుక్కకథ	0	4
సత్యసేనవిజయము	0	6
ఋషులచరిత్ర	0	8
శకుంతలచరిత్ర, చిన్ననైజు	0	6
నల "	0	8
సావిత్రి "	0	6
హరిశ్చంద్ర "	0	8

జీవితములు.

శ్రీలాలాలజపతిరాయిజీవితము	0	2
రామకృష్ణపరమహంసచరిత్రము	0	4
బాలగంగాధరతిలకుచరిత్రము	0	6
శ్రీగోపాలకృష్ణగోఖ్లేజీవితము	0	2
శ్రీమహాదేవగోవిందరానడేజీవితం	0	2
శివాజీచరిత్ర, ప్రతిమతో	1	0
గౌరాంగస్వామిచైతన్యజీవితము	0	4
శ్రీశంకరాచార్యచరిత్ర	0	6
శ్రీవేమనయోగిజీవితము	0	4
దాదాభాయినౌరోజీచరిత్ర	0	2
మహమ్మదుజీవితము	0	4
శ్రీకరంచంద్ గాంధిజీవితము, ప్రతిమతో	0	12
నెపోలియన్ చక్రవర్తిచరిత్రము	0	4
సోదరినివేదితజీవితము, ప్రతిమతో	0	2
శ్రీగైక్వారుగారిజీవితము	0	2
వివేకానందస్వామిజీవితము	0	4
శ్రీకృష్ణదేవరాయచరిత్ర	0	4
లార్డ్ కెవుజీవితము	0	8
డుమ్మ అప్పయ్యదీక్షితచారిత్రము	0	12

	ప్రతి 1-కి రూ.	అ.
స్వామిరామతీర్థజీవితము	0	2
శ్రీరామానుజాచార్యచరిత్ర	0	3
ఆనిబిసెంటుచరిత్ర, ప్రతిమతో	0	4
శాలివాహనచరిత్ర	0	3
శ్రీతుకారామస్వామిచరిత్రము	0	6
శ్రీసమర్థరామదాసస్వామి చరిత్రము	0	6
గౌతమబుద్ధుని జీవితము	0	4
శ్రీచిత్తరంజనదాసుజీవితము	0	4
ఆలీసోదరులజీవితము	0	4
రామదాసుచరిత్ర, ప్రతిమతో	1	8

నవలలు.

సీతారామము	1	4
అస్తమయము, నవల	1	8
ఐవన్హో "	0	8
సుజనరంజని "	0	8
విజ్జలదేవి "	1	8
ఉన్మాదిని "	0	6
రాధారాణి "	0	6
దుర్గేశనందని "	1	0
కపాలకుండల "	1	0
లక్ష్మణ "	1	0
టిప్పుసుల్తాన్ "	అచ్చు	
లీల "	0	6
రాజర్షి "	అచ్చు	
తారాబాయి "	1	4
దిలారామ "	1	4
మనోహరి "	1	4
వీరబాల "	0	8
ఆనందమఠ "	1	12
లాలాబాయి "	0	8
రోషినార "	0	12

	ప్రతి 1-కి రూ. అ.
నాటకములు.	
నందవధము	0 8
శాకుంతలనాటకము రాయదుర్గము నరసయ్యశాస్త్రి	1 0
నరకాసురవిజయవ్యాయోగము	0 12
నందునిచరిత్రము, నాటకము	0 12
ప్రభాకరవిజయము	1 8
శూరబొబ్బిలినాటకము	0 12
రామవనవాసనాటకము	0 12
విచిత్రపాదుకాపట్టాభిషేకము	0 12
కమలాపహరణము, జి. సి. వి. శ్రీనివాసాచార్యకృతము	1 4
ఆంధ్రప్రసన్నరాఘవనాటకము, కొక్కొండ వేంకటరత్నం పంతులు	1 0
సుజనమైత్రి	1 0
చంద్రగుప్తనాటకము	1 4
పూర్వశాకుంతలము	0 12
చినరంగారాయనాటకము	0 6
విధిలేకవైద్యుఁడు	0 8
స్వర్ణచూతము	0 10
ఎలెక్షన్ ప్రహసనము	0 2
వివిధగ్రంథములు	
హిందీ ఇంగ్లీషుబాలశిక్ష	0 4
హిందీ తెనుఁగుబాలబోధ	0 4
పెద్దబాలశిక్ష	1 8
డిటో కాలికో	2 8
చిన్నబాలశిక్ష	0 4
ఆంధ్రకన్నడబాలశిక్ష	0 4
ఆంధ్రద్రావిడబాలశిక్ష	0 4

	ప్రతి 1-కి రూ. అ.
బాలాదిత్య, నవల	3 0
చంద్రగుప్తుఁడు ,,	2 8
సీతసింధువు ,,	0 10
వనజాక్షి ,,	1 0
స్వప్నయాత్ర ,,	1 0
దేశభక్తుఁడు ,,	1 8
శంభుతో నొకనాటిసహవాసము	0 4
ముగ్గురుమూర్తులు	2 8
జీవితరహస్యములు	1 8
ప్రేమాగ్రణి	1 8

విశ్వభారతీగ్రంథమాల ప్రచురణములు.

అన్నపూర్ణాదేవి మందిరము	3 8
ఇంటా బయటా	5 0
కథాగుచ్ఛము:—	
,, I భాగము	2 8
,, II ,,	2 8
,, III ,,	2 8
,, III ,, ప్రథమఖండము	1 4
,, III ,, ద్వితీయఖండము	1 4
,, IV ,,	2 0
గృహప్రవేశము	1 12
ప్రాయశ్చిత్తము	3 8
పోస్టాఫీసు	1 0
స్టిల్ మాండ్ మేజస్ట్రేటు	1 8
పడవమునుక (నవల 560 పుటలు.)	
అట్టబైండు-గ్లేజుకాగితం	5 0
,, 1-భాగం 280 ,,	2 8
,, 2-భాగం 280 ,,	2 8
చిన్నక్క	0 8

వావిళ్ల రామస్వామిశాస్త్రులుఅండ్‌సన్స్

292, ఎన్‌ఫ్లనేడ్, చెన్నపురి. 1.

శ్రీ ర స్తు

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః

శ్రీమదాంధ్ర వచనరామాయణము

ఆరణ్యకాండము

1-వ సర్గము.

రాముఁడు తాపసాశ్రమములఁ జూచుట

అవతారిక—అయోధ్యాకాండమునఁ బితృవాక్య పరిపాలనము పరమధర్మ మని తెలుపఁబడినది. సజ్జనరక్షణరూపధర్మవిశేషముఁ బ్రతిపాదించుటకై యీ యరణ్యకాండము ప్రారంభింపఁ బడుచున్నది.

మహాధైర్యశాలియు, శత్రువుల కజయ్యుఁడునునైన శ్రీరాముఁడు దండక యనుమహారణ్యము సొచ్చి, యాయరణ్యమునం దుండు ఋషుల మనికిపట్టులనెల్లఁ జూచెను. ఆ యాశ్రమములు దర్భలతో, నారబట్టలతోను గూడి, బ్రహ్మతేజస్సుచే వెలుఁగుచు, నాకసమునఁ దేజరిల్లుచుఁ జూడ నలవికాకుండు సూర్యమండలముఁ బోలి మెఱయుచుండును. ఆ మునుల యాశ్రమములు చక్కఁగ నూడ్చి, పవిత్రపఱపఁబడి సకలభూతములకు రక్షణస్థానములై, నానా విధములగు మృగపక్షిసంఘములతోఁగూడి వెలయుచుండును. వేల్పుటాటకత్తె లెల్లప్పుడు గుంపులుగూడి వచ్చి మునులకుఁ బూజలు సల్పి నృత్యములు సల్పుచుందురు. అయ్యాశ్రమములండలి నలుదెసల నుండు విశాలములగు నగ్నిహోత్రగృహములు స్రుక్స్రువములు, హోమద్రవ్యములు, కృష్ణాజినములు, దర్భలు, సమిధలు, జలమునిండిన పాత్రములు, ఫలములు, దుంపలు విస్తారముగాఁ గలిగియుండును. తెయ్యనిపండ్లతోఁగూడిన వన్యములైన పావనములగు గొప్పవృక్షము

లచ్చట నిండియుండును. మునులు హోమములుచేసి, భూతములకు బలులువేయుచుందురు. వేదఘోషములు సర్వత్రమ్రోగుచుండును. అడవిమొల్లపూవులంతటను రాలియుండును. తామరపూవులతోఁగూడిన తామర కొలఁకులు శోభిల్లుచుండును. పండ్లు, దుంపలు నాహారముగఁ గలిగి, యింద్రియములనుగెల్చి, వల్కలాజినములను గట్టుకొని, సూర్యాగ్నులంబోలె వెలుఁగుచున్నవృద్ధులగు ముని లనేకు లచ్చట వాసము చేయుచుందురు. మఱి యనేకపరిశుద్ధమహార్ష లాహారనియమము గలిగి తపస్సు చేయుచుందురు. అట్టి సకలసుగుణములుగలవై వేదఘోషముతోఁ గూడి, బ్రహ్మభవనముఁబోలె నున్నవియు, మహాపండితులగు వేదవేత్త లయినబ్రాహ్మణులచే వెలుఁగుచున్నవియునైన తాపసుల యునికిపట్టులను జూచి, ప్రతాపముగలవాఁడయిన కాంతిమంతుఁడగు రాముఁడు ధనుస్సును సడలించికొని యయోగ్నిశ్రమములోఁ జొచ్చెను. దివ్యజ్ఞానసంపన్నులగు మహర్షులు పరమప్రీతులై వారి నెదురొక్కొనిరి. కదలనినియమము గలధర్మపరాయణులగు నా మహర్షులందఱుద యించుచున్న చంద్రునిఁబోలు రాముని, లక్ష్మణుని, కీర్తిమతియగు వైదేహినిజూచి, దీవనలు సేయుచు వారినిఁజేరఁ దీసికొనిరి. ఆ వనవాసులందఱు మిక్కిలి యచ్చెరువంది, రాముని యాకారరూప సౌకుమార్యకాంతి సౌందర్యములను, సీతాలక్ష్మణుల రూపలావణ్యాదులను రెప్పవాల్పక మిక్కిలి మక్కువతోఁ జూచిరి. మహాత్ములగు తపస్వి లందఱిట్లు తనివితీరక చూచిచూచి, సకల భూతముల మేలరయుటయందాసక్తుఁడగు రాముని దమ యాశ్రమంబున్లకుఁ దోడితెచ్చి కూర్చుండఁ బెట్టిరి. అంతట నగ్నిహోత్రునింబోలెఁ బ్రజ్వరిల్లుచుండు ధర్మపరులగు మహాత్ములైన ఋషు లందఱు రాముని గుశలంబడిగి యర్ఘ్యపాద్యములం దెచ్చియిచ్చి, యావల వనమునఁ బుట్టిన నానావిధపుష్పమూల ఫలాదులను దెచ్చిపెట్టి, చేతులు జోడించికొని, "ఓ విస్తారకీర్తిగల రాముఁడా! మమ్మునందఱను నీవు రక్షించువాఁడవు గావున, మాచేఁ బూజింపను గారవింపను దగినవాఁడవు. రాజు దుష్టులను శిక్షించి, శిష్టులను పాలించువాఁడు గానఁ దండ్రితో సమానుఁడు. నృపాలుఁడు దేవేంద్రుని నాలవ యంశమునను, తక్కిన లోకపాలుర యంశమునను

బుట్టిజనులను బాలించుచున్నాఁడు గావున నృపాలుఁడు జనుల పొగడ్తలఁ
గైకొనుచు మేలిమి భోగముల ననుభవించుచున్నాఁడు. అట్లే నీదేశ
వాసులమయిన మేము నీచేఁ గాపాడఁ దగినవారము. సకల జనములఁ
బాలించు నీ వరణ్యవాసివైనను, పురవాసివైనను మా యేలికవు. మే
మన్ననో యాయుధములను విడిచి, కోపము నడఁచుకొని, యింద్రియ
ముల గెల్చినవారమై తపస్సే ధనముగా నెంచి, యీ తపోధనమును
గడించుచున్నారము. మేము మీ బిడ్డలవంటివారము. కాఁబట్టి నీవు
మమ్మెల్లప్పుడు రక్షింపవలయును" అని చెప్పుచు, వన్యములయిన కంద
మూలఫలములను, మఱియు వనమునదొరకు నానావిధాహారముల
నొసఁగి మర్యాదచేసిరి. వెంబడే లక్ష్మణునికిని రామునికి వలెనే యతిథి
పూజలం గావించిరి. అట్లు తపస్సిద్ధిగలవారును, శాస్త్రోక్తనిధానముల
నెఱిఁగినవారును, అగ్నిహోత్రునివలెఁ బ్రజ్వరిల్లువారునైన తక్కిన
మునులును దమ యేలికయగు రామునిశాస్త్రనిధానమునఁ బూజించిరి.

2-వ సర్గము.

విరాధుఁడు సీత నపహరించుట

కకుత్థ్సవంశమునఁ బుట్టిన శ్రీరాముఁడు లక్ష్మణసమేతుఁడై తాప
సులవలన నతిథిపూజలం బడసి, యారేయి యచ్చటఁ గడపి, సూర్యో
దయంబగుడు నమ్మునుల నందఱు వీడ్కొని, యచ్చటనుండి వెడలి
యనేకమృగములగుంపులతోఁ గూడినదియు, తోడేళ్లయు, పులులయు
గుంపుల కునికిపట్టయినదియు, పాడుచేయఁబడిన చెట్లును, తీఁగెలును
పొదలునుగలవియు, చప్పుడు చేయక యుండుపలు తెఱఁగులగు
పక్షులు గలదియు ఈలపురుగులమ్రోఁతగలదియునైన నట్టడవికిఁ
బోయిచేరెను. రాముఁడును సీతయు నొకచోటఁ గూర్చుండిరి. వారి
చేరువనే లక్ష్మణుఁడు నిలఁబడియుండెను. ఇట్లు వారు భయంకరములగు
క్రూరజంతువులతోఁగూడిన యా నట్టడవి సొంపును జూచుచుండఁగా,
నొక కొండశిఖరముఁబోలు మానిసిదిండియయిన రాక్షసుఁడు సింహము
వలె నార్చుచు నేఁగుదెంచెను. ఆతఁడు విరాధుఁ డనుపేరుగలవాఁడు.
ఆతనియొక్క కన్నులు లోఁతయియుండు. నోరు మిక్కిలి వెడల్పయి
యుండు. దేహము మిక్కిలి పొడుగును, వికృతమును, చూపటకు

వెఱపుఁ బుట్టించునదియునై యసహ్యాకుయిఁయుండు. ఇట్టి ఘోర రూపముగలవాఁడై, వసారక్తములలోఁ దడిసిన పులితోలు గప్పుకొని, నోరు తెఱచికొనికుండు జమునిచందమున నన్నిజంతువులకు వెఱపించుచు, మూఁడు సింగములను, నాలుగు పులులను, రెండు తోఁడేళ్లను, పదిజింకలను, వసగారుచున్నదియుఁగొమ్ములుగలదియునగునొక యేనుఁగు తలను శూలముకొనకు గ్రుచ్చుకొని, గొప్పరొదసేయుచు వచ్చుచుండు నావిరాధుండు వారిదృష్టిపథము నొందెను. అవ్విరాధుఁడును రామ లక్ష్మణులను సీతను జూచినతోడనే, మిక్కిలి యలిగినవాఁడయి ప్రళయకాలాంతకుఁడు ప్రజలపైకు ఱుకుచూడ్కి వారిమీఁదికిఁ బరుగెత్తెను. అట్లు పరుగెత్తుచు వచ్చి, పుడమి యదరునట్లు గొప్ప గర్జనము గావించి, సీతనెత్తుకొని కొంతదూరముపోయి రామలక్ష్మణులంజూచి, "ఓ అల్పాయుష్కులారా! మీరు జటావల్కలములను దాల్చియును, భార్యాసమేతులయి, గదా ధనుర్బాణములను దాల్చి దండకారణ్యమును జొచ్చితిరి. మీరు చూడఁబోయిన ఋషులరై యున్నారు. మీరు పాపాత్ములు. మీకు జటరాలగు కాంతతో నేమి పని? జటావల్కలములఁ దాల్చియే యిట్టి యక్రమములు సేయుచున్న మున్యాధములగు మీ రెవ్వారు? వీరు విరాధుఁడ నను రక్కసుఁడను. ఈ చొరరాని వనమును నిర్భయముగా నాయుధముల నెత్తికొని యెల్లప్పుడు ఋషిమాంసములను దినుచు సంచరించువాఁడను. ఈ గొప్ప పిఱుఁదులుగల యతివ నాకుఁ బెండ్లామగును. మీ రూరకుండక కయ్యమునకు వత్తురేని పాపపుఁబనులు సేయు మిమ్ముజంపి మీరక్తమును ద్రావుదును" అని చెప్పెను. ఇట్లు సగర్వముగఁ జెప్పిన చెడునడతగలవాఁడయిన విరాధునిపలుకులు విని, సుడిగాలి వీఁచుసమయమున నరటిచెట్టు గదలు చందమున సీత తత్తరపాటుచే గడగడ వణఁకెను. రాముఁడును విరాధునివశమునసున్న సుందరియగు సీతనుజూచి, బెండుపాటినమోహముతో లక్ష్మణున కిట్లనియె. "ఓనాయనా! నరేంద్రుఁడగు జనకునికిఁ గూఁతురును, నాకుఁ బత్నియుఁ, బతివ్రతయు, మిక్కిలి సుఖముగాఁ బెరిగినదియు, గుణవతియని ప్రఖ్యాతిగన్నదియునైన యీ సీత విరాధునియధీనమయిపోయినది. ఇప్పు డీ సీత యెంత దిగులువడియున్నదో

చూడుము. కైకేయి మనవిషయమున నేమి చేయఁదలఁచినదో, ఏమి వరమడిగినదో, అది యిప్పుడే సిద్ధించినది. దీర్ఘాలోచనగల యా కైకేయి తన కొడుకునకు రాజ్యము రావలెనని యంతటిలోఁ దనివి నొందక సకలభూతముల మేలరయు నన్ను నడవికిఁ బంపినది. అట్టి నా నడిమితల్లి యగు కైకేయియొక్క మనోరథమిపుడు సిద్ధించినది. లక్ష్మణా! సీత పరపురుషుని యధీనమున నుండుటవలనఁ గల్గినంత శోకము పితృవియోగముచేఁగాని, రాజ్యము కోల్పోవుటచేఁగాని కలుగలేదు" అని కండ్లనిండఁ గన్నీరు పెట్టుకొని చెప్పుచుండఁగా, లక్ష్మణుఁ డలిగి, కోపము వచ్చిన పామువలె నిట్టూర్పువిడుచుచు నిట్లనియె. ఓ యన్నా! నీవు చేవేంద్రునిమాడ్కి సకలజంతువులకు నాథుఁడవయ్యి, నాబోటి బంటునుగలవాఁడవయ్యి దిక్కులేనివానిచందమున నేల పరితపించెదవు? ఇదిగో! నా కత్యాగ్రహము గలుగుచున్నది. ఈ రక్కసుని నిప్పుడే బాణముచేఁ జంపెదను. మదీయబాణప్రహారముచే నేలఁగూలిన యీతని రక్తమును బుడమి పానముచేయఁగలదు. రాజ్యముఁ గోరివచ్చినవాఁడని నేను దలఁచినప్పుడు భరతునిపై నా కెంతటి యాగ్రహము గలిగెనో, అయ్యాగ్రహమును దేవేంద్రుఁడు వజ్రాయుధమును బర్వతము మీఁదఁ బ్రయోగించినట్లు, వీనిపైఁ బ్రయోగించెదను. నేను బాహాబలముతోఁ గడు వేగిరముగా నేసిన బాణ మీ రక్కసుని హృదయమున నాఁటి ప్రాణములు దీయునుగాక! వాఁడా దెబ్బతో నేలఁగూలి పొరలుగాక. చూడుము నాదెబ్బ." అని లక్ష్మణుఁడు శ్రీరాముని నోదార్చెను.

3-వ స ర్గ ము.

రామలక్ష్మణులు విరాధునితోఁ బోరుట

కాంతిమంతుఁడగు లక్ష్మణుఁ డిట్లు రామునితోఁ బలికి, మంద హాసము చేయుచు, విరాధుం జూచి, "నీ వెవ్వాఁడ వీట్లీ వనమున విచ్చల విడిగాఁ దిరుగుచున్నాఁడవు?" అని యడుగఁగా, విరాధుఁడు తనకంత ధ్వనిచే వనమునఁ బ్రతిధ్వనిఁ గలుగఁజేయుచు, వారిం జూచి, "మీ రెవ్వారో, ఎచటి కేఁగెదరో మొదటఁ జెప్పుఁడు. పిదప నా సంగతిఁ జెప్పెద"నని మఱల నడిగెను. అంతఁ గోపముచే నెఱ్ఱివారినమోముగల

విరాధునితోఁ బ్రతాపవంతుఁడగు రాముఁడు తన యిక్ష్వాకువంశమును దెలిపి, "మేము క్షత్రియులము; స్వధర్మముఁ దప్పనివారము; అడవులఁ దిరుగుచున్నారము. నీ వెవ్వఁడవు? దండకారణ్యమునఁ దిరుగుచున్నాఁడవు? నీ వృత్తాంతముఁ దెలియఁగోరెదము" అని యడుగఁగా, విరాధుఁడు నిక్కుమగు మగటిమి గలరాముని జూచి, "రాఘవా! యాహా! నా వృత్తాంతముఁ జెప్పెదను. వినుము. నేను జయుని కొడుకను; నా తల్లిపేరు శతహ్రద. పుడమియందు రక్కసు లందఱు నన్ను విరాధుం డందురు. నేను బ్రహ్మనుగూర్చి తపంబొనర్చి శస్త్రముచేఁ జంప నలవి కాకయు, నటుక నలవికాకయు, చీల్చ నలవికాకయు నుండునట్లు వరము నొందితిని. మీ రీ యతివ నిచ్చట విడిచి, దీనియం దపేక్ష మాని, వేగిరముగా వచ్చినదారిని బరుగెత్తుఁడు. అట్లయిన, మీప్రాణ ములను దీయను" అని చెప్పెను. రాముఁ డప్పలుకులువిని, కోపముచేఁ గన్ను లెఱ్ఱనచేసి, భయంకరరూపముగలవాఁడును, దురాత్ముఁడునైన విరాధునిం జూచి, "ఛీ! మూర్ఖుఁడా! నీవు నీచుఁడవు గాన స్త్రీహర ణము చేయఁగోరితివి. నీవు చావును వెదకుచున్నావు. ఇది నిస్సంశ యము. నాతోఁ గయ్యమొనర్చి, నీ వట్లె మృత్యువు నొందఁగలవు? నిలుము. నాయొదుటినుండి ప్రాణములతోఁ బోనేరవు" అని చెప్పి, విల్లెక్కఁ బెట్టి కఱకుటమ్ములను జోడించి, యా రాక్షసునిపై నేయఁ బూని, గరుడవాయువుల వేగముఁ బోలువేగముఁగల యట్టి బంగరు ములకులుగల యే డమ్ముల నాకర్ణాంత మీడ్చి యేసెను. నెమలి తెక్కలు గట్టిన యాబాణము లగ్నిఁబోలెఁ దేజరిల్లుచు విరాధుని దేహము ఖేదించి, నెత్తుటఁ దడిసి పుడమిపైఁ బడినవి. అంత విరాధుఁడు నొచ్చి సీతను డించి కడు నలిగినవాఁడై శూలమెత్తికొని, రామలక్ష్మణుల మీఁదికిఁ బోయెను. వజ్రాయుధముఁ బోలుశూలాయుధముఁ ద్రిప్పుచుఁ గడు ఱొప్పుచు నేఁగుదెంచునపు డా విరాధుఁడు నోటుదెఱచుకొని వచ్చెడు జముఁడో యనఁదగియుండెను. అట్లు ప్రలయకాలాంతకునిఁ బోలు నా విరాధునిపై నా తోఁబుట్టువు లిరువు రంపవానఁ గురి పించిరి. వెఱపించురూపముగల యా విరాధుఁ డట్టహాసముచేసి నిలఁ బడి యూవులించెను. ఆ విరాధుఁ డూవులించినంతనే వేగముగా నాఁటిన

యా బాణములు ఆతని యొడలినుండి క్రిందఁబడినవి. విరాధుఁ డంత వరప్రభావముచేఁ బ్రాణములు బిగఁబట్టి శూలమెత్తికొని రామ లక్ష్మణుల మీఁది కురికెను. విలుకాండ్రలో మేటియైన రాముఁడు నింగిని నగ్గిచాడ్పునఁ దేజరిల్లుచున్న పిడుగుంబోలు నా శూలమును రెండు బాణములతోఁ దెగ నేసెను. రాముని బాణములచేఁ ద్రుంచఁ బడి, విరాధునిచేతినుండి జాఱిన యా శూలము వజ్రాయుధముచేఁ ద్రుంపఁబడిన బంగరుకొండమీఁదిబండవలెఁ గ్రిందఁబడెను. అంత రామ లక్ష్మణులు వేగముగఁ దమపైకేతెంచుచుండు నా విరాధుని దేహ ముపై నల్లత్రాఁచులంబోలు రెండు కత్తులతో నొవ్వ నేసిరి. భయం కరాకారుం డగు విరాధుఁ డిట్లు రామలక్ష్మణుల ప్రహారముల కోర్చు కొని, కదలింపరాని పురుషోత్తములగు వారి నిరువురిని రెండుచేతు లతో మిక్కిలి గట్టిగాఁ బట్టుకొని పయనమయ్యెను. రాముఁడతని యభి ప్రాయమెఱిఁగి, లక్ష్మణుంజూచి, "ఈ రక్కసుఁడు మనల నీ యరణ్య మార్గమున మోసికొని పోనిమ్ము. లక్ష్మణా! యీ రాక్షసుఁడేవైపు నకు మనల మోసికొని పోవునో, యా వైపునకే పోనిమ్ము. ఈ రక్క సుఁడు పోవునదియే మనము పోవలసినదారి" అని చెప్పి యూర కుండెను. అంత నా విరాధుఁడన్ననో తన బలగర్వముచే బలిష్ఠులైన యా రామలక్ష్మణులను బసివాండ్రనుబోలె మూఁపురమునిఁద నుంచి కొని భీకరముగా నార్భటము వనమువైపునకు బయలుదేరెను. పలుతెఱఁ గులగు గొప్ప వృక్షములచే శోభిల్లునదియు, నానావిధములగు పక్షు లచే నాశ్చర్యకరమైనదియు, నక్కలు, తోఁడేళ్లు, పులులు, సింగములు మొదలగు భీకరమృగములతోఁ గూడినదియునై కాఱుమబ్బువలెనున్న యరణ్యమును జొచ్చెను.

4-వ సర్గము.

◆ విరాధవధము ◆

అట్లు విరాధునిచేఁ గొంపోఁబడుచున్న రామలక్ష్మణులం జూచి, చక్కని చేతులుగల సీతాదేవి చేతులెత్తికొని "యక్కటా! సత్యశీలు రును, సదాచారసంపన్నులును, చక్కనినడతగలవారునునైనయీ దశరథ నందనుల రామలక్ష్మణుల నీ బెట్టిదపురూపుగల విరాధుఁడు గొనిపోవు

చున్నాఁడు. న న్నీ యడవియందలి కూళ మెకము లెరగొనఁ గలవు. ఓ రక్కసులతేఁడా! కాకుత్థ్సులగు రామలక్ష్మణుల నిచ్చట విడువుము. నన్నెత్తికొనిపొమ్ము. నీకు మ్రొక్కెదను" అని మిక్కిలి బిగ్గఱగా నార్చెను. శూరులగు రామలక్ష్మణు లా వై దేహియొక్క యఱపును విని, దురాత్ముఁడగు నా విరాధుని శీఘ్రముగా ముగింప మనమునఁ దలఁపు గొనిరి. అట్లు తలఁచినపదంపడి లక్ష్మణుఁడు వానియెడమచేతిని, రాముఁడు వానికుడిచేతిని ద్రుంచిరి. మేఘచ్ఛాయగల విరాధుండు చేతులుదెగిన వాఁడగుచు, భయపడి వజ్రాయుధముచే నఱుకఁబడిన పర్వతముమాడ్కిఁ గ్రిందఁబడెను. అంత రామలక్ష్మణు లా విరాధునిఁ బిడికిళ్ళతో గ్రుద్దుచు మోఁకాళ్ళతోఁ బొడుచుచుఁ బాదములతోఁ దన్నుచుఁ బైకెత్తి యొత్తి నేలపైఁ గుదియవేయుచు నలిపి పాఱవైచిరి. అవ్విరాధుఁ డనేక బాణములచేఁ గొట్టఁబడియు, కత్తులతోఁ నఱుకఁబడియును బలుతెఱఁగులుగాఁ బుడమియందుఁ బడఁద్రోచి త్రొక్కఁబడియు, వాఁడు మృతినొందఁడయ్యె. ఎట్టి భయములు తటస్థపడినను, వానిని బోకార్చునట్టి సౌందర్యవంతుఁడయిన రాముఁడు, పర్వతమునకు సాటియగు విరాధుఁడు శస్త్రముచేఁ జంప నసాధ్యుఁ డన్న సంగతి యెఱిఁగి, లక్ష్మణుఁజూచి, "పురుషశ్రేష్ఠుఁడవగు లక్ష్మణా! వీఁడు బ్రహ్మనుగూర్చి తపస్సుచేసి శస్త్రములకు వధ్యుఁడు కాకయుండునట్లు వరము నొందియున్నాఁడు. కావున వీనిని సమరమునఁ జంపుటకు వలను పడదు. కాఁబట్టి యొక పల్లము త్రవ్వి దానియందు వీనిని బూడ్చిపెట్టుదము" అని లక్ష్మణునితోఁ జెప్పఁగా, విరాధుఁడు రాముని పలుకులను విని పురుషోత్తముఁడయిన యా రాము నుద్దేశించి సవినయముగా నిట్లనియె. "ఓ పురుషశ్రేష్ఠా, దేవేంద్రునిఁబోలు పరాక్రమముగల నీచేఁ గొట్టఁబడి మృతప్రాయుఁడనైతిని. మొదట నేను వివేకము లేమిచే నీవు పురుషోత్తముఁడ వని యెఱుఁగఁజాలనైతిని. ఓ నాయనా! సాక్షాన్నారాయణుఁడవైన నీవు కౌసల్యాగర్భమున జన్మించితివనియు, సీత మహాపతివ్రతయనియు, లక్ష్మణుఁడు కీర్తిమంతుఁడనియు నెఱుఁగఁజాలనైతిని. ఇప్పుడు మీ ప్రభావమెఱిఁగితిని. నేను తుంబురువను గంధర్వుఁడను. కుబేరుని శాపమువలన నీ వికృతమైన రాక్షసరూపము నొందితిని. ఆ కుబేరుఁడు నా కీశాపమొసఁగినప్పుడు నే

నా యశస్సంపన్నుఁడయిన కుబేరుని తమింపుఁ బ్రార్థింపఁగా, "దశరథ నందనుఁడగు రాఁముడు సమరమున నెప్పుడు నిన్నుఁ జంపునో, యప్పుడు నీ వీ రూపమువదలి స్వస్వరూపమునొంది స్వర్గమునకుఁ బోఁగలవు" అని రంభయందుఁ దగులుగల నన్ను దగ్గఱిఁజేర్పక, కడుఁ గోపముతో శాప విమోచనము నొసంగెను. శత్రుసంహారకా! నీ యనుగ్రహమునఁజేసి కడు భయంకరమైన శాపమునుండి విముక్తుఁడనైతిని. నేను నా స్వస్థాన మునకుఁ బోయి చేరెదను. మీ కందఱకు మేలయ్యెడు. ఇచ్చటి కొక టిన్నరయామడ దూరమున శరభుఁడను మునీంద్రుఁ డున్నాఁడు. అతఁడు ధర్మాత్ముఁడు; తపోమహిమగలవాఁడు; సూర్యునివలెఁ దేజరిల్లు చున్నవాఁడు. రామా! మృతులయిన రాక్షసులను గుంటత్రవ్వి యందు బూడ్చినయెడల వారికి శాశ్వతములయిన పుణ్యలోకములు కలుగును. ఇది సనాతనపద్ధతి. కావున నీవు పల్లముఁ ద్రవ్వి నన్నందుఁ బూడ్చిపెట్టి క్షేమముగా నా మున్యాశ్రమమునకుఁ బొమ్ము" అని చెప్పి మహాబలుఁడగు విరాధుఁడు బాణములబాధ కోర్వఁజాలక, మగటిమిగల రాముఁడును వానిమాటను విని, "లక్ష్మణా! భయంకరుఁ డయిన యీ విరాధునకు గొప్పయేనుఁగునకువలె నీ వనమునఁ బెద్ద పల్లముఁ ద్రవ్వు" మని లక్ష్మణునికిఁ జెప్పి, తానా విరాధుని మెడమీఁదఁ గాలితో నదిమిపెట్టికొనియుండెను. లక్ష్మణుఁడును పాఱిపొత్తుకొని యా దీర్ఘకాయుఁడగు విరాధునికిఁ జేరువనే గొప్ప పల్లముఁ ద్రవ్వెను. అంతట రాముఁడు విరాధుని మెడను గాలితో బాగుగా రాచి విడువఁగనే, విరాధుఁడు భీకరధ్వనితో నార్చుచు మెడ వ్రేలాడవైచెను. ఓర్వ రాని మగటిమిగలవారును, దిట్టలునగు రామలక్ష్మణులు సంతుష్టులై తమచే యుద్ధమున జయింపఁబడి, వెఱపు పుట్టునట్లార్చుచున్న యా విరాధుని పల్లమునం బడవైచిరి. కడుసమర్థులు పురుషశ్రేష్ఠులునగు నా రామలక్ష్మణులు కటకుటమ్ములకు విరాధుఁడు లోఁబడువాఁడు గాఁడని యొఱిఁగినందునను, వనములం దిరుగుచుండు విరాధుఁడు రాముని వలననే మృత్యువును బుద్ధిపూర్వకముగా నొందఁగోరి తాను శస్త్రములచేఁ జంపఁబడువాఁడు గాఁడని చెప్పియున్నందునను పల్లము త్రవ్వి యాతనిఁ బూడ్చిపెట్టవలెనని తలఁచి యాప్రకారముచేసిరి. అప్పుడు విరాధుఁ

డా పల్లమున నుంపఁబడునప్పుడు వన మెల్ల నదురునట్లు గట్టిగా నఱచెను. రామలక్ష్మణులు విరాధునిఁ బల్లమునఁద్రోసి బాగుగాఁ గాళ్ళతోఁ గ్రుమ్మి సంహరించి, యా పల్లముపై కూలుమూసి, వెఱపుతోలఁగి, యానంద మగ్నులయిరి. వా రిట్లు విరాధునిఁ జంపి, సీతను దీసికొని, బంగారుచేఁ జిత్రింపఁబడిన విండ్లును దాల్చి, యాకసమున వెలుఁగు సూర్యచంద్రు లనుబోలి యా మహారణ్యమున నిర్భయముగను, సానందముగను దిరుగుచుండిరి.

5-వ సర్గము.

రామలక్ష్మణులు శరభంగాశ్రమము సేరుట

రామలక్ష్మణు లివ్విధమున నా యడవియందు విరాధునిఁ జంపిన పదంపడి, శూరుఁడగు రాముఁడు సీతనుం గౌఁగిలించి, యూఱడించి, తేజస్సుచేఁ బ్రకాశించుచున్న లక్ష్మణునిజూచి "ఇయ్యరణ్యము చొఱ నలవిగాక గడుసై యున్నది. మనమును వనవాసమున నలవాటుపడ్డ వారము గాము. వేగముగఁ దపస్సె కల్మిగా నెంచియుండు శరభంగునిఁ కడ కేఁగుదము" అని యాలక్ష్మణునితోఁ జెప్పి, తపసుచేఁ బరబ్రహ్మను గనుఁగొన్నవాఁడును, దేవతలమహిమంబోలు మహిమ గలవాఁడును నైన యా శరభంగుని యాశ్రమమునకు వెడలెను.

అట్లు పోవుచు, శరభంగ ముసీంద్రుని చేరువ నొకయద్భుత మును జూచెను. అట్లు రాముఁడు మఱికొంతదవ్వేఁగి, స్వర్గమునుండి విమానారూఢుఁడై వేల్పులచే వెంబడింపఁబడుచు వచ్చి, యా ముసీం ద్రుని చేరువ దిగి, పుడమిఁ దాఁకక నిల్చియున్నవాఁడును, నిగనిగ మెఱయు తొడవులం దాల్చినవాఁడును, సూర్యాగ్నులవలె మిగులఁ బ్రకాశించుచున్నవాఁడును, నిర్మలమగు పుట్టము గట్టినవాఁడును, పెక్కండ్రు తనవంటి మహాత్ములచేఁ గొల్వఁబడుచున్నవాఁడును నైన వేల్పుఱేనిని, ఆతనికి సమీపముననే శ్యామవర్ణములగు నశ్వములఁగట్టి నట్టిదియు బాలసూర్యునిబోలె వెలుఁగుచున్నదియు, నాకసమున నిలిచి యున్నదియునగు విమానమును పూవులదండలచే నలంకరింపఁబడి, తెల్లని మబ్బులగుమినిఁ జందురునిమండలమును బోలిన శ్వేతచ్ఛత్రమును, నిఱు దెసల నిలఁబడిన యిరువు రతివలచేఁ బట్టుకొనఁబడి వీవఁబడుచున్న

బంగారుకాడలుగల వింజామరలను జూచెను. అప్పుడు పలువురు దేవ గంధర్వ సిద్ధ మహర్షు లంతరిక్షమున నున్న దేవేంద్రుని వేదవాక్యము లచేఁ గొనియాడుచుండిరి. ఇంద్రుఁ డిట్లు దేవగంధర్వాదుల పొగడ్తలఁ గొనుచు శరభంగమునీంద్రునితో మాటలాడుచుండ, రాముఁ డచ్చట నున్న నూఱుజన్నములవేల్పు గూర్చున్న యరదమును లక్ష్మణునికిఁ జూపి, లక్ష్మణా! కాంతిగలదియు, వింతలు గొల్పుచు నిగనిగ మెఱయు నదియునై సూర్యనింబోలె వెలుఁగుచున్న యాకాశమునను న్న విమానమును జూడుము. దేవేంద్రుని గుఱ్ఱము లెట్టివి యని మనము వినియుండుమో యనియే యీ యాకసమున నుండు వారువములు. ఇది నిక్కము. ఈరథము చుట్టును నిల్చియున్న పురుషశ్రేష్ఠులగు వీ రందఱు పోఁగులు దాల్చినవారు, మిక్కిలి వెడల్పయిన ఱొమ్ములుగలవారు, గడియ ప్రమానులంబోలు చేతులుగలవారు, నెఱ్ఱనిరంగువస్త్రములు ధరించినవారునై బెబ్బులులచాడ్పున నొరులకు సమీపింప నలవిగాక యున్నారు. వీరియందఱి యురములందును నిప్పుకలంబోలు హార ములు వెలయుచున్నవి. లక్ష్మణా! యందఱు నిరువదిరైదేండ్లప్రాయము గలవారుగఁ గన్పట్టుచున్నారు. వీరి సొంపుసూడఁగా, నిట్టి రూపలావణ్యము దేవతలకే యొల్లపుడు నుండును గాన, వీరు దేవత లనియే తలఁచెద. లక్ష్మణా! నీవు సీతను గాచుచు నిచ్చటఁ గొంత తడ వుండుము. ఈరథమున నున్న మహానుభావుఁ డెవ్వఁడో నే బోయి స్పష్టముగాఁ గనుఁగొని వచ్చెదను" అని లక్ష్మణునితోఁ జెప్పి, శ్రీరాముఁడు శరభంగుని యాశ్రమమువైపునకుఁ బోవుచుండెను.

అంతటఁ బులోమజాభర్తయగు వేయిగన్నులతేడా వచ్చెడు రాముని జూచి, శరభంగమునీంద్రుని దాపున కేఁగుదెంచి, రహస్యముగా నమ్మునీంద్రునితో నిట్లనియె. "ఓ మునీంద్రా! రాముఁడు నన్నుఁ జూడఁగోరి వచ్చుచున్నాఁడు. ఇతఁడు రాకమునుపే మనసంభాషణము ముగింపవలయు. ఇతఁడు భూలోకమున నితరుల కెవ్వరికిఁ జేయ నలవి కాని యెన్నియో పనులు చేయవలసియున్నది. ఆ పనుల నన్నింటి నొనర్చి, దేవతల నిమిత్త మెందఱినో దానవులం గెల్చి, యితఁడు ప్రసిద్ధుఁడైనతరువాత నీతనినిఁ జూడఁగలను. ఇతఁ డింతలో నన్నుఁ

జూడఁదగదు" అని శత్రుసంహారియైన యింద్రుఁడు శరభంగమునీంద్రునితోఁ జెప్పి,యాతనిని గారవించి, వీడ్కొని గుట్టలఁ బూన్చిన విమానమెక్కి స్వర్గమునకుఁబోయెను.

దేవేంద్రుఁడు వెళ్లినంతటనే, రాముఁడు సపరివారముగ నగ్ని ప్రవేశము చేయుటకై యగ్నిచేరువఁ గూర్చుండియున్న శరభంగ ముసీంద్రు నొద్దకేతెంచెను. అంతట రాముఁడు లక్ష్మణుని "సీతం బిల్చి కొనిరమ్ము" అనెను. రాఁగానే వారు మువ్వురును గలిసి యా ముసీంద్రునికి సాష్టాంగముగాఁ బ్రణమిల్లి, యా ముసీంద్రునివలన నతిథిపూజలం బడసి, యాతని యానతినిఁ గొని యచ్చటఁ గూర్చుండిరి. అంతట రాముఁడు శరభంగమునిం జూచి, యా వచ్చిన మహాపురుషుఁ డెవ్వఁడు? ఆ విమాన మెవ్వరిది? ఆపురుషశ్రేష్ఠు లెవ్వ? రని యడిగెను. శరభంగ ముని యు రామున కీక్రిందితెఱఁగున నా వృత్తాంతమంతయు నెఱిఁగించెను. "రామా! నేనుగ్రమైన తపస్సానరించి, తపస్సిద్ధిచేఁ జెంద నలవికాని బ్రహ్మలోకము గెల్చితిని. వరముల నొసఁగు నింద్రుఁడు నన్ను బ్రహ్మలోకమునకుఁ గొనిపోవఁ గోరి యిచ్చటికేతెంచినాఁడు. పురుషోత్తమా! ప్రియాతిథివగు నీవు చేరువకు వచ్చియున్నావని విని, నిన్నుఁ జూడక పోరాదని తలఁచి బ్రహ్మలోకమునకుఁ బోవకయున్నాను. పితృవాక్యపరిపాలనాదిధర్మములం దాసక్తిగలవాఁడవును, మహాను భావుఁడవునైన నీతోఁగలిసి మాటాడిపోవ నున్నాను. నరశార్దూలా! నేను తీవ్రతప మొనర్చి, బ్రహ్మలోకమునఁ గలవియు, స్వర్గలోకమునం గలవియునైన యనేక శాశ్వత లోకములను పశపఱచుకొంటిని. ఆ నా లోకముల నన్నింటిని నీకుఁ గానుక పెట్టెదఁ గైకొనుము" అని చెప్పెను.

శరభంగమునీంద్రుఁ డిట్లు పలుకఁగా, సకలశాస్త్రవిచక్షణుఁడైన నరోత్తముఁడగు రాముఁడు మునీంద్రు నుద్దేశించి, "మహాత్మా! నేనే యన్ని లోకములను సంపాదించుకొందును. నా కీ యరణ్యమునఁ బదిల మైన యొక యునికిపట్టు దాము చూపవలయు" నని యడిగెను. దేవేంద్రున కెనవచ్చు బలముగల రామునిపలుకు లాలించి, మహా ప్రాజ్ఞుఁడగు శరభంగమునీంద్రుఁడు రామునకు వెండియు నిట్టనియె. "ఓ రామా! యీయ్యరణ్యమందు థార్మికుఁడు, తపోమహిమగలవాఁడు

నైన సుతీక్ష్ణుం డనుపేరుగల మునీంద్రుఁ డొక్కఁడుఁ డున్నవాఁడు. మిక్కిలి పరిశుద్ధుఁడై తపమొనర్చుచుండు నా సుతీక్ష్ణమునీంద్రునికడ కేఁగుము. ఆతఁడు మీకు రమ్యమైన వనప్రదేశమున నునికిపట్టు చూపఁ గలఁడు. ఈ యేటి యొడ్డుననే ప్రవాహమున కెదురుగాఁ జనుము. ఈ యేటియం దచ్చటచ్చటఁ బూలతెప్పలం జూడఁగలవు. నీవు పోవలసిన దారిని జెప్పితిని. నరశ్రేష్ఠా! నీవు కొంత నేపిచ్చట నన్నుఁ జూచుచు నుండుము. పాము ప్రాఁతకుబుసమును విడుచునట్లు, నే నీ యంగమును విడువనున్నాను" అని చెప్పి మహాతేజుఁడగు శరభంగుఁ డగ్ని హోత్ర మును వేఁకి బ్రజ్వరిల్లఁజేసి, యందుఁ జొచ్చెను. అమ్మునీంద్రుం డగ్నిం బ్రవేశించిన వెంటనే, యా మునీంద్రుని కేశలోమములు, రక్తమేదో మాంసత్వగాదులు గాలిపోయెను. ధైర్యవంతుఁడగు రాముఁడును సీతాలక్ష్మణులును దానిం జూచి మిక్కిలి యచ్చెరువందిరి. అంత శరభంగ మునీంద్రుఁ డా మంటనుండి వెలువడి యగ్నింబోలెఁ దేజరిల్లు ముప్ప దేండ్లప్రాయముగలవాఁడుగఁ గనఁబడెను. అట్లతఁడు లేచి, నిరతాగ్ను లగు మహాత్ములుండు లోకములను, దేవలోకములను దాఁటి బ్రహ్మలోక మునకుఁ బోయి చేరెను. పుణ్యకార్యములఁ జేసిన యా బ్రాహ్మణోత్త ముఁడు బ్రహ్మలోకమున కేఁగి, యచ్చట సభాస్థానమున సేవకులచేఁ జుట్టఁబడి కూర్చుండియున్న బ్రహ్మదేవుని దర్శించెను. బ్రహ్మదేవుఁడును ఆ బ్రాహ్మణోత్తమునిఁ జూచి, సంతసించి, యాతనిఁ గుశలప్రశ్న మొనర్చెను.

6-వ సర్గము.

శ్రీరాముఁడు రాక్షసవధము సేయుఁదునని మునులతోఁ బ్రతిజ్ఞ సేయుట

శరభంగ మునీంద్రుఁడు స్వర్గమున కేఁగినతర్వాత, బ్రహ్మదేవుని నఖములవలనఁ బుట్టిన వైఖానసు లనువారు, బ్రహ్మరోమములందు జన్మించిన వాలఖిల్యు లనెడుమునులు, నీటిచే నిరంతరము నంగములను బరిశోధించు మునులు, చంద్రసూర్యులకిరణములఁ బానముచేయువారు, జాలచేఁ గొట్టుకొనువారు, ఆకులు దిండిగాఁగలవారు, ధర్మమునందుఁ బ్రేమగలవారు, వడ్లు నోటిలోఁబోసికొని కొఱికి పొట్టూఁదివైచి గింజలు మాత్రము నమలువారు, గొంతువఱకు నీట నుండి తపస్సుచేయువారు,

ఱొమ్మునఁగాని, భుజములమీఁదఁగాని తలయుంచికొని నిద్రించువారు, పరుండకయే యుండువారు, బయలుననుండియె తప మొనర్చువారు, నీరుద్రాగియుండువారు, గాలిదిండులు, వృక్షాగ్రములు మున్నగువాని నుండి వ్రేలాడుచుండువారు, నేలపైఁ బరుండువారు, వ్రతములనిమిత్త ముపవాసములు సల్పువారు, జితేంద్రియులు, ఎల్లప్పుడు తడిబట్ట లతోనుండువారు, జపములుసల్పువారు, స్వాధ్యాయమునందు నిరతులు, వేసవిని బంచాగ్నిమధ్యమున నుండి తపము సల్పువారు, బ్రహ్మ తేజస్సుతోఁ గూడినవారు, యోగమునుండి చలింపనివారు, సమాధియం దుండువారునైన దండకారణ్యవాసులగు మునులందఱు శరభంగా శ్రమమున తేజమునతో వెలుఁగుచున్న రాముని కడ కేఁగుదెంచిరి.

ధర్మజ్ఞులైన ఋషిశ్రేష్ఠు లందఱు జాగ్రత్తగలవారలై, ధర్మ సూక్ష్మముల నెల్ల నెఱిఁగినవాఁడును, ధర్మపోషకులలోపల మిన్నయైన వాఁడు నగు రాముని ఁజూచి, "ఓ మహారథుఁడా! మఘవానుఁడు దేవతలకుఁబోలె నీ యిక్ష్వాకువంశమునకును బుడమికెల్లను నీవు ముఖ్యుఁడవు; రక్షకుండవు. నీవు కీర్తికిని మగటిమికిని ముల్లోకములఁ బ్రసిద్ధిఁ జెందినవాఁడవు. నీకు విస్తారమగు పితృభక్తియు, సత్యమును, ధర్మా సక్తియు మెండుగఁ గలదు. ఓ ప్రభూ! ధర్మముల నెఱిఁగినవాఁడవు, ధర్మకార్యములందుఁ బ్రేమగలవాఁడవు, గొప్ప స్వభావముగలవాఁడవు నైన నిన్నుఁ గూర్చి యొకసంగతి వేఁడుకొనెదము. నీవు మా వేఁడికోలు మన్నింతు వని తలఁచెదము. నృపాలుఁ డాఱవపాలు పన్ను గైకొని, జనులను దనబిడ్డల మాడ్కిఁ గాపాడవలయును. అట్లు ఏరాజు పన్నుఁ గైకొనియు, జనులఁ బాలింపఁడో వానికి మితిమీఱిన పాపము సంభవించును. రామా! యెల్లపుడు జాగ్రతగలిగి, తనదేశమున నుండు జనుల నందఱిని దనప్రాణములతో నీడుగను, తనప్రాణసములగు బిడ్డలతో సాటిగను దలఁచి, వారియోగక్షేమముల విచారించుకొనుచు నుండు నృపాలుఁ డిహలోకమున శాశ్వతకీర్తిని బొంది, దేహావసాన మయినపిదప బ్రహ్మలోకమునొంది యచ్చటను చిరకాలము గౌరవముఁ గాంచుచున్నాఁడు. ఋషులు కందమూలఫలాశనులై చేయు తపస్సు నందలి నాలవపాలు, జనులను న్యాయమార్గమునఁ బాలించు నృపాలు

నికిఁ జేరుచున్నది. రామా! యిచ్చోనమున వానప్రస్థులనేకులున్నారు. అందును విశేషముగా బ్రాహ్మణులున్నారు. వీరి నందఱికిని నీవు నాథుఁడవయి యుండియు, నాథుఁడులేనివారినింబోలె నీ వనవాసులగు రక్కసులు పీడించుచున్నారు. పలుతెఱఁగులుగా హింసించి చంపఁబడిన తత్త్వజ్ఞులగు మునీంద్రుల కళేబరములనేకములు పడియున్నవి. ఇటు వచ్చి చూడుము. ఈ రాక్షసులు పంపానదీతీరవాసులును, చిత్రకూటాశ్రమములం దునికిపట్లు గలవారు నగువారినే ముఖ్యముగా ఖాతియ పెట్టుచున్నారు. ఇత్తెఱంగున నీ క్రూరకర్మలగు రక్కసులు మమ్ముఁ బెట్టిడి హింసలం బడఁజాలకున్నారము. రామా! సకలజన శరణ్యుఁడవైన నిన్ను మేము శరణుఁ జొచ్చితిమి. ఈ రేఁద్రిమ్మ రులచేఁ గాఁపఁబడు మమ్ముఁ బాలింపుము. ఓ శూరా! నీకంటె మాకెవ్వరు ముఖ్యమైన దిక్కు గలరు? నృపాత్మజా! రాక్షసులబారి నుండి మమ్ముఁ దప్పించి కాపాడుము" అని మునులందఱు రామునిఁ బ్రార్థించిరి.

ధర్మాత్ముఁడగు కాకుత్థ్సుఁడు తపశ్శీలురయిన తాపసులయొక్క మాటల నాలకించి, యా మునీంద్రుల నందఱిని జూచి, "మహర్షులారా! మీరు నన్ను వేఁడుకొనఁదగునా? మహామునులరగు మీరు నా కానతి యొసఁగఁదగును. నేను నాకార్యమునిమిత్తమరణ్యము సొచ్చితిని. ఇప్పుడు తపస్విజనరక్షణరూపమగు కార్యము గూడఁ దటస్థపడినది. నేను మొదటఁ దండ్రిపనుపు చేయ నరణ్యమునకు వచ్చితిని. ఇప్పుడు మునిజనరక్షణమునకునుగూడ నేతెంచినవాఁడనైతిని. నేను మీకార్యము చక్కఁజేయుటకై స్వేచ్ఛమెయి వచ్చినవాఁడను. కావున నా జీవనవాసము "ఏకాక్రియా ద్వ్యర్థకరీబభూవ" యన్నట్లు మహోత్తరమయిన ఫలమునిచ్చునదయ్యెను. మునుల నెల్ల హింసించెడి రక్కసుల నందఱను రూపుమాపెదము. మీరు నాయొక్కయు, నాతమ్మునియొక్కయు మగఁటిమిని జూడఁగలరు" అని యిత్థంబునఁ దపస్వులకెల్ల నభయంబొసంగి, లక్ష్మణునితోఁగూడ స్వధర్మపరిపాలనమున మనసుపెట్టినవాఁడై, మునులచేతను గొనియాడఁదగు నాచారము గలవాఁడగుచు, సుతీక్ష్ణాశ్రమమునకుఁ బోయెను.

7-వ సర్గము

రాముఁడు సుతీక్ష్ణుని యాశ్రమమునకుఁ బోవుట

రాముఁడు సీతాలక్ష్మణసమేతుఁడై, బ్రాహ్మణులందఱు కొంత దవ్వు గూడరాఁగా, సుతీక్ష్ణమహాముని యాశ్రమమునకుఁ బయనమై, విస్తారజలముగల నదులను దాఁటి కడుదవ్వేఁగి, గొప్ప మేఘమువలె మిక్కిలి యెత్తైన యొక్క పర్వతముఁ జూచెను. అంతట నిక్ష్వాకువంశ శూరులగు రామలక్ష్మణులు నానావిధ పుష్పఫలములచే నిండిన వృక్ష ములతోఁ గ్రిక్కిఱిసియున్న యా ఘోరమగు కాఱడవిం జొచ్చి, యందొక్క యేకాంతస్థలమున నారబట్టల పంక్తులచేఁ గైసేయఁబడి యుండు నొక యాశ్రమముఁ జొచ్చిరి. అయ్యాశ్రమమున మాసి ముఱికిపట్టిన జడలుగల తపోవృద్ధుఁడైన సుతీక్ష్ణమునీంద్రుని దర్శనము చేసి, శాస్త్రోక్త రీతిం బ్రణమిల్లి, "భగవంతుఁడా! నేను రాముఁడను. మిమ్ముఁ జూడఁగోరి యిట కేతెంచితిని. సత్యబలంబు వీడనివాఁడవును, ధర్మజ్ఞుఁడవునైన యో మహర్షి! నీవు నన్ను దీవింపుము" అని యనఁగా, నంతట నా సుతీక్ష్ణుఁడు ధర్మరక్షకులలో మేటియగు రామునిం జూచి, యిరుకేలం గట్టిగాఁ గౌఁగిలించి, యిట్లనియె.

"ధర్మపరిపాలకులలో శ్రేష్ఠుఁడవు, శూరుఁడవునైన ఓ రాముఁడా! నీకు సుఖాగమనమిక్కడా. నీ రాకచే నా యాశ్రమము నాథుఁడుగల దాయెను. ఓ కీర్తిమంతుఁడా! నీ రాక కెదురుచూచుచు నే నింత తడవు దేహమువిడిచి, స్వర్గమునకేఁగక యుంటిని. నీవు రాజ్యముఁ బాసి చిత్ర కూటమునకు వచ్చితి వని వింటిని. నూఱుజన్నములసామియగు వేల్పుల యొకివీఁడు నన్ను స్వర్గలోకమునకుఁ గొనిపోవుటకై యింతకుమున్నే యిటకు వచ్చియుండెను. వేల్పులసామియగు నింద్రుఁడు నాకడకేతెంచి, నా పుణ్యకర్మములచేత నెల్ల పుణ్యలోకములు జయింపఁబడెనని వచిం చెను. నా తపోబలముచే సంపాదితములయిన దేవర్షు లుండెడి లోకము లను నీ కొసఁగెదను. నీ వచ్చట సీతాలక్ష్మణసమేతుఁడవై విహరింపుము" అని చెప్పెను.

అంతటఁ గాశ్యపుఁడు బ్రహ్మదేవునితోఁ జెప్పినతెఱంగున, రాముఁడు గడిమి తపము సేయువాఁడును, సత్యముపలుకువాఁడును

నైన సుతీక్ష్ణమహర్షిని జూచి, "మహామునీ! తమరు శ్రమపడి సంపాదించిన లోకములను నాకీయ నక్కఱలేదు. నేనే యీ పుణ్యలోకములను సంపాదించికొనెదను. ఈ యరణ్యమున మాకు వాసయోగ్యమయిన ప్రదేశముఁ జూపుఁడు. తమరు సర్వసమర్థుల రనియు, సకల ప్రాణుల్నుపకారకుల రనియు మహాత్ముఁడగు శరభంగమునీంద్రుఁ డానతిచ్చె" అని రాముఁడు పలుకఁగా, లోకప్రసిద్ధుఁడగు సుతీక్ష్ణుఁ డత్యానందమునొంది, రామునింగూర్చి యిట్లనియె. "రామా! యీ యాశ్రమమే ఋషుల సమూహాముల కునికిపట్టు. ఈ ఋతు వా ఋతు వనక యెల్లప్పుడు ఇది కందమూలఫలసమృద్ధిగలిగియుండును. ఈ యాశ్రమమున నసే సీతతోఁ గూడి రమింపుము. కీర్తిమంతుఁడా! ఈ యరణ్యమున మెకములగుంపులు విచ్చలవిడిగాఁ దిరుగుచు, ఋషులను కాతీయవెట్టి పోవుచుండు. ఈ యాశ్రమమున నా మృగముల బాధ తప్ప మఱె దోషమును లేదు" అని సుతీక్ష్ణమునీంద్రుఁడు చెప్పిన పలుకులు విని, విల్లెక్కు వెట్టి, మునీంద్రునిఁ జూచి, "మహాత్మా! నే నిచ్చట నున్నప్పుడు, ఇచ్చట నడయాడుచున్న క్రూరమృగములను బిడుగులం బోలెడు నావాఁడియంచులుగల తూఁపులయేటులచేఁ బడనేసెదను. అది తమకేమియు నాగ్రహము గలిగింపదేని, నా కది యెంతయు సులభకార్యము. ఈ యాశ్రమమున నేను చిరకాలముండెదను" అని చెప్పెను. అందులకు మహర్షియు సమ్మతింపఁగా, రామనృపాలుండు కొలనికిఁ బోయి, సాయంసంధ్య నుపాసించి, మనోహరమయిన యా సుతీక్ష్ణుని యాశ్రమమున నా రేయి నివసించెను. మునీంద్రుఁడును. సంధ్యవార్చి వచ్చిన పదంబడి చీకటిపడినవెంజనే శ్లేష్మలగు రామలక్ష్మణులకు వానప్రస్థులకు యోగ్యమయిన విందు పెట్టెను.

8-వ సర్గము.

రామలక్ష్మణులు సుతీక్ష్ణుని వీడ్కొని పోవుట

రాముఁడు లక్ష్మణునితోఁగూడ సుతీక్ష్ణమునీంద్రుఁ డొనర్చిన సత్కారము నైకొని, యా రాత్రి యచ్చటఁ గడపి, వఱువాత లేచి, సీతాసమేతుఁడయి కలువలవాసనగల కడుఁ జల్లని నీటఁ మునిఁగెను. లక్ష్మణుఁడును మజ్జనమొనర్చెను. అంతట రామలక్ష్మణులును సీతయుఁ

దాపసుల కునికిపట్టయిన యా యరణ్యమునఁ బ్రాతఃకాలికములయిన యనుష్ఠానములనెల్ల ముగించి, యగ్నిహోత్రములందు వేల్పులు వేల్చి, దేవతలకుఁ బూజలుసల్పి, యుదయించుచున్న సూర్యుని దర్శనముచేసి, పాపరహితులై, సుతీక్ష్ణమునీంద్రుని చేరువ కేతెంచి, తిన్నని పలుకులతో నిట్లనిరి. "ఓ మహాత్మా! పూజార్హులయిన తమ రొనర్చిన యతిథి సత్కారములం బడసి, సుఖముండితిమి. మేము సెలవడుగ వచ్చితిమి. మా కనుజ్ఞ యొసఁగుఁడు. పయనమయ్యెదము. మా వెంబడి నెతెంచు మునులుమున్నుఁద్వరపఱచుచున్నారు. మేమును దండకారణ్యమునన్నున్న పావనవర్తనులగు నాశ్రమసమూహాములనెల్లఁజూడఁగోరుచున్నారము. మాతోఁ గూడ, ధర్మనిరతులును, తపస్సుచే శాంతులును, జ్వాలలులేని యగ్నిహోత్రుని మాడ్కి వెలుఁగుచుండువారునైన యీ ఋషిపుంగవులకును ననుజ్ఞ యీయ వేఁడుకొనెదము. నీచుఁ డన్యాయమార్గముచే సంపాదించిన సంపదం బడసి యందఱిఁ జూచుచుఁ జూచునట్లు నెత్తికొండ చుఱుక్కునఁ దగులునట్లు ప్రొద్దెక్కకమున్నే బయలువెడలిపోఁగోరుచున్నారము."అని యిట్లు చెప్పి, రామలక్ష్మణులు సీతతోఁగూడి మునీంద్రుని పాదములకు మ్రొక్కిరి.

అంతట సుతీక్ష్ణమునీంద్రుఁడు తన పాదములకు మ్రొక్కుచున్న యా రామలక్ష్మణులను లేవనెత్తి గట్టిగాఁ గౌఁగిలించికొని, ప్రేమపూర్వకముగా నిట్లనియె. "రామా! నీడవలె నిన్ను విడనాడకుండు సీతను దోడ్కొని, లక్ష్మణునితోఁ గూడినవాఁడవై మించిదారిని బొమ్ము. ఈ దండకారణ్యమున వసించుచుఁ దపసుచేఁ బరమాత్మను మనసులందు ధ్యానించుచునుండు మునుల చక్కనైన యాశ్రమములను జూడుము. విస్తారములైన కందమూలపుష్పఫలసమృద్ధిగలవియు, గొప్పగొప్ప మెకముల గుంపులతోఁ గూడినవియు, నిశ్శబ్దములైన పక్షులకూటములు గలవియునైన వనములను, పూచిన తామరపూవుల సమూహాములుగలవియు, తేఁటనీటితోఁ గూడినవియు, నీరుకోళ్లచే శోభిల్లునవియునైన చెఱువులను, కొలఁకులను, చూడ్కుల కింపయిన సెలయేళ్ళను, నెమ్మల్లకూఁతలతోఁ గూడిన మనోహరములైన యరణ్యములను నీవు చూడఁగలవు. నాయనా! లక్ష్మణా! నీవును బొమ్ము. రామా! నీవును బయన

మగుము. మీరు మఱలివచ్చునప్పు డిక్కడికి రావలసినది." యని సుతీ క్ష్ణుండు రామలక్ష్మణులతోఁ జెప్పెను. "అట్లే" అని రామలక్ష్మణు లమ్మునీంద్రునికిఁ బ్రదక్షిణము గావించి; పయనమైరి. అంత నిడివి కన్నులు గలదగు సీతయు నా యన్నదమ్ముల కిరువురకును దిటవైన యమ్ములపొద లును, విండ్లను, తళతళ మెఱయు పిడులతోఁగూడిన గదలను దెచ్చి యిచ్చెను. అంత కాంతిమంతులును, సౌందర్యముగలవారును, తమ ప్రతాపముచే దిక్కులెల్ల వెలుఁగఁజేయు వారునునైన రామలక్ష్మణు లిరువురును సీతను దోడ్కొని, అమ్ములపొదులను గట్టుకొని, టంకార ముతోఁ గూడిన విండ్లను చేతఁబట్టి యాశ్రమమునుండి వెడలిరి.

9-వ స ర్గ ము.

సీత రామునితో ప్రాణివధము యుక్తము గాదనుట

సీత సుతీక్ష్ణమునీంద్రుని యనుజ్ఞవడసి ప్రయాణమయిన పెని మిటిం జూచి, మిక్కిలి తిన్నని పలుకులతో నిట్లనియెఁ: "ఈ ముని ధర్మము గొప్పది. దీనిని గడుసూక్ష్మమార్గమున సంపాదింపవలయు. ఇహలోకమున నింద్రియవిషయములందుఁ దగులు విడిచిన వానికే యీ ధర్మము సాధ్యముగాఁ గలదు. పుడమియందు బొంకులాడుట మహా పాతకము. పరదారాభిగమనమును, పగలేకయే యొక్కరిం జంపుటయు నా మహా పాతకమున కంటె మించిన మహాపాతకములు, ఈ మూఁడును కామజన్యములగు వ్యసనములు. రాఘవా! బొంకులాడుట నీకింతకు ముందును లేదు. ఇఁకమీఁదను గలుగదు. ధర్మహానిఁదెచ్చు పరదారాభి లాష నీ కెక్కడిది? నరేంద్రా! నీకుఁ బరదారాపేక్ష యిప్పుడును లేదు. ఇంతకుమునుపును లేదు. ఇఁకమీఁద నెప్పటికిని గలుగదు. శ్రీరామా! మనసునఁగూడ నీకిట్టి యాశ లేదు. అది దృఢము. నృపాత్మజా! ఎప్పటి కిని నీవు స్వభార్యయందు రతిగలిగియుండువాఁడవు. ధర్మమును దప్పని వాఁడవు. చేసినప్రతిజ్ఞ తప్పనివాఁడవు. తండ్రిమాట మీఱనివాఁడవు. సత్యసంధా! మహాత్మా! శ్రీమంతుఁడా! లక్ష్మణాగ్రజా! నీయందు ధర్మము, సత్యము, వేయియేల, సుగుణము లన్నియు స్థాపితము లైయున్నవి. మహాభావుఁవా! శుభకరమైనదర్శనము గల యోనాథా! జితేంద్రియులచే నన్ని సుగుణములు పొందఁగూడును గాన, నీయెడ

జితేంద్రియత్వముగూడ సిద్ధముగానున్నది. అయిననను, మూఁడవదగు క్రూరమయిన పరప్రాణహింస నీకుసంప్రాప్తమయినది. పామరు లజ్ఞానము వలనపగలేకయే ప్రాణిహింస చేయుదురు.పామరులుచేసెడి ప్రాణిహింసా రూపమగు పాపమునకు నీవొడిగట్టితివి. శూరా! నీవు మునిజనసంరక్షణమునిమిత్తము పోరుచేసి,దండకారణ్యముననున్న రాక్షసుల నందఱను బరిమార్చెదనని ప్రతిజ్ఞ సేసితివి. దీని నిమిత్తమే, వింటిని బాణములను దాల్చి లక్ష్మణసమేతుఁడవై యీ దండకారణ్యమునకు వచ్చితివి. ఇప్పుడు నీ వట్లు బయలువెడలుట చూచి, నీపితృవాక్య పరిపాలనాది ధర్మమును, నీ మేలును దలంచిన నా మనము వంతలపాలగుచున్నది. ఓవీరుఁడా! మనము దండకారణ్యములకుఁ బోవుట యుక్తముగాఁ దోఁపలేదు. దానికిఁ గారణము నెప్పెద నాలకింపుము. నీవు విల్లు చేతఁ బూని, తమ్మునిఁ దోడునేసికొని యడవులకుఁ బోవుచున్నాఁడవు. అచ్చటనున్న యొల్ల వనచరులను జూచి బాణప్రయోగము చేయుదువు! క్షత్రియులకు విల్లును, అగ్నిహోత్రునికిఁ గట్టెలును సమీపమున నున్నచో మఱింత చిరాకు పెచ్చున్.

మున్నొకప్పుడు బహుమృగపక్షి సంఘముల కునికిపట్టయిన యొక్క పావనమగు నాశ్రమమున సత్యము పలుకువాఁడును, సదాచారుఁడునునైన మునీంద్రుఁ డొక్కరుఁడు తపస్సుచేయుచుండెను. దేవేంద్రుఁ డా మునియొక్క తపస్సునకు విఘ్నము నొనరింపఁగోరి, కావలివానిరూపుఁదాల్చి, కత్తి యొకటిఁ దీసికొని యాయాశ్రమమునకు వచ్చెను. అట్లు దేవేంద్రుఁడు భటరూపముతో వచ్చి యయ్యాశ్రమమునఁ దీవ్రతపము సేయుచున్న యా మునీంద్రుని యెదుట నిల్చి, "యో ద్విజేంద్రా! యీ కత్తిని నీకడ నుంచికొని నే నడిగినప్పు డిమ్మని చెప్పెను. ఆ మునీంద్రుఁ డా కత్తిని దీసికొని, యది మొదలు తనయొడ దాపటికము చేసిన వస్తువును గాపాడుటయం దెక్కువ శ్రద్ధగలవాఁడై, తనవశమున నప్పగించిన ఖడ్గమును జేతఁ బట్టుకొనియే తిరుగుచుండెను. తనయొద్ద నిల్లడవెట్టినదానిని గాపాడుటయం దాసక్తిగలవాఁడగుటచే దుంపలు పండ్లు తేఁ బోవునపుడుగూడ నాకత్తి లేకుండఁ బోయి యొయ్యుఁగఁడు. తపసే కలిమిగాఁగల యా మునీంద్రుఁ డెల్లప్పుడు కత్తిని జేతఁ

బూని పోవుచు, తపసునందుఁ దలంపుమాని శస్త్రసంగమువలనఁ గ్రూర బుద్ధిఁ బూని, దేనిని బట్టినను నఱకుచు జీవహింసచేసి చేసి యన్యాయము లకుఁ, బొల్పడి నరకమున కేగెను. అని యిట్లు శస్త్రసంబంధమున నింతటి చేటుగలిగెనని పెద్దలు చెప్పఁగా నీ యితిహాసము వినియుందును

ఆయుధములఁ దాల్చియుండుట యగ్నిఁ దాల్చియుండుటం బోలి మనోవికారమునకుఁ గారణమగునని పెద్దలు చెప్పుదురు. కావున నాథా! నీయెడ నాకుఁ గలస్నేహము చేతను, నీవు నాయెడఁజూపు బహుమానము చేతను, దెలిసినవిషయమునే జ్ఞప్తికిఁ దెచ్చుచున్నాను. నీకుఁదెలియని సంగతి నుపదేశించుదాననుగాను. నీవు వింటిని దాల్చి వైరములేక, దండ కారణ్యమునన్నున్న యసురులను జంపఁబూనుట యెంతయుఁ జేయఁదగని పనియని నాకుఁ దోఁచుచున్నయది. తప్పులేక జనులను హింసించుట నా కిష్టముగాఁ దోఁపలేదు. శూరులగు క్షత్రియులు ధనుర్ధరులై నొచ్చినట్టి మునుల రక్షింపవలసినదికాని, యిట్లు రక్కసులను వైరములేక హింసిం చుట తగదు. ఆయుధ మెక్కడ? అరణ్యవాసమెక్కడ? క్షత్రియధర్మ మెక్కడ? తపస్సెక్కడ? ఇవిపరస్పర విరుద్ధములైనవి. కావున మనమిప్పుడు వనమున నున్నాము. కనుక, వనవాసయోగ్యమయిన తపస్సు చేసె దము. ఆర్యా! శస్త్రములు చేపట్టుటవలనఁ పాపబుద్ధి పుట్టును. ఇప్పు డట్టి పాపబుద్ధి మనకుఁ దగదు. వనవాసము ముగించి యయోధ్యకేఁగిన పదంపడి క్షాత్రముఁ బూనుదువు గాని యిప్పటికి మానుము. నీవు రాజ్యము వదలి యెల్లప్పుడు వనవాసమునం దాసక్తి గలిగి తాపసుఁడవై యుందువేని, నాయత్తగారగు కైకకును మామగారికిని దఱుగని ప్రేమముగలుగును. ధర్మమువలనఁ నర్థము గలుగుచున్నది. ధర్మమువలనఁ గామము గలుగుచున్నది. నరుఁడు ధర్మమువలన నంతయుఁ బొందు చున్నాఁడు. ఈ జగత్తునకు సారభూతమైనది ధర్మమేకాని వేఱొకటి కాదు. జ్ఞానులగువార లయ్యయి కృచ్ఛ్రచాంద్రాయణాదులగు, నియ మములు పూని, యుపవాసములు సలిపి, శరీరమును బూనికితో వరుగు చేసి, ధర్మమును బొందుదురు. అంతియకాక, సుఖమువలన నెన్నటికిని సుఖము గలుగనేరదు. శాంతస్వభావముగల యో నాథా! నీ వెల్లప్పుడు మంచి మనసుగలవాఁడవై తపోవనములం దున్నంతకాలము తపోరూప

ధర్మము నాచరింపుము. మూఁడులోకములకు సంబంధించిన యెల్లవిషయ ములయథార్థమును నీ వెఱుఁగుదువు. నే నాఁడుదాన నైనందునఁ జపల బుద్ధిచే నింతచెప్పితినిగాని, నీ కెవ్వఁడు నేర్పఁగలఁడు. నీవు స్వబుద్ధితోను, తమ్మునితోను ఆలోచించి యెది యుక్తమని తోఁచునో దానిని వెంటనే చేయుము"అని సీత రామునికి హిత ముపదేశించెను.

10-వ సర్గము.

శ్రీరాముఁడు రాక్షసవధము యుక్తమేయని సీతకు బదులు సెప్పుట

సీతాదేవి ప్రియునియందలిభక్తితోఁ జెప్పిన పలుకులు విని, ధర్మమార్గముననే యున్నట్టి రాముఁడు సీత కిట్లనియె. ధర్మజ్ఞురాలవైన యో జానకీ! నీవంశగౌరవమునకును, నాయందలి యనురాగమునకునుఁ దగినట్లు నా హితముఁగోరి యీ మాట చెప్పితివి. దేవీ! నొచ్చినవా రనుమాట వినరాఁ గూడదనియే క్షత్రియులు ధనుర్ధరులయి యుండవలయునని నీవే చెప్పితివిగదా! అది నీకే తెలిసియున్నప్పుడు నీ కేమి బదులు చెప్పుదును? ఈ దండకారణ్యమున మిక్కిలి తీవ్రనియ మములతోఁ దపం బొనరించుచున్నవారును, శరణుచొచ్చినవారిం గాపాడఁజాలినవారునునగు మునులందఱు రాక్షసులబారి కోర్వఁజాలక, తాముగావచ్చి, నన్ను శరణుఁ జొచ్చిరి. అరణ్యవాసులగు మునులు ధర్మము నడుపుటయుఁ దాసక్తిగలవారలై, దుంపలు, పండ్లు దినుచు, క్రూరకృత్యము లొనర్చు రక్కసులకు వెఱచి, సుఖము దక్కియున్నారు. ఒకొక్కవేళను బొలసుదిండ్లయిన క్రూరరాక్షసులు వనములం దనేక నియమములతోఁ దపస్సు చేయుచున్న మునులను నిష్కారణముగాఁ దినిపోవుచున్నారు. దండకారణ్యవాసులగు బ్రాహ్మణోత్తము లందఱు రాక్షసులచే భక్షింపఁబడుచు మనకడకు వచ్చి, మమ్ముఁ గాపాడుఁడని చెప్పిరి.

నేను వారి నోటినుండి వచ్చిన యీ మాటను విని, వారిపాదసేవ చేసి, యీ ప్రకారముగాఁ జెప్పితిని. "ఓ మునీంద్రులారా! నా యప చారము మన్నింపుఁడు. నేను స్వయముగాఁ వచ్చి యుపచారము చేయఁదగిన యింత మహిమగల మీరువచ్చి నిన్నుఁ బ్రార్థించుటయను నది నాకు మిక్కిలి సిగ్గుగానున్నది" అని చెప్పి, "నేను మీ కిప్పుడేమి

చేయవలయు"నని యా ద్విజుల నడిగితిని. వారందఱు గూడి యేక వాక్యముగా "రామా! దండకారణ్యమున వలయు రూపముల దాల్చెడి యనేకులు రాక్షసులు మమ్ము మిక్కిలి బాధించుచున్నారు. వారిని సంహరించి నీవు మమ్ముఁ గాపాడుదువుగాక. ఓ పాపరహితుఁడా! యెవరికి సాధింప నలవికాని నంజుడుదిండులైన రాక్షసులు హోమ సమ యములందును, దర్శపూర్ణమాసాది యాగకాలములందును సమీపించి, మా యాగములం బాడుసేసి, మమ్ము బెదరించుచున్నారు. ఇట్లు రాక్ష సులు పెట్టునట్టి యిడుములఁ బడుచుఁ దపస్సులు నిర్విచారముగాఁ జేసి కొనఁజాలక దుఃఖపడుచుఁ, గాపాడువారిం గానకయుండు మమ్ముఁ గాపాడ నీవే సమర్థుఁడవు. నీకంటె వేఱుగతి మాకు లేదు. ఈ రేద్రిమ్మ రులను మా తపోమహిమచే సంహరింపఁజాలుదుము. అయినను, మేము చిరకాలము శ్రమపడి సంపాదించిన తపస్సు నిత్తెఱఁగునఁ బోఁగొట్టుకొన నిష్టపడకున్నారము. రాఘవా! తపస్సున కనేకవిఘ్నములు సర్వదా సంభ వించుచుండును. కావునఁ దపమాచరించుట కడు నసాధ్యము. అట్లే రాక్షసులు మమ్ము నానావిధముల హింసించుచున్నను, కోప మొసఁగి, నానావిఘ్నముల కోర్చి సంపాదించిన తపస్సును వ్యయపఱిప మనస్సు రాక యున్నవారము. కావున రాక్షసులబారి కోర్వఁజాలకున్న దండకారణ్య వాసులమైన మమ్ము నీవును, నీ తమ్ముఁడును రక్షింపుఁడు. వనవాసుల మైన మాకు నీవె రక్షకుండవు" అని చెప్పిరి.

ఓ జానకీ! నేనిదియంతయు విని దండకారణ్యవాసులైన ఋషు లను సకలవిధములఁ గాపాడునట్లు ప్రతిజ్ఞ నేసితిని. నేను మునులయెదుటఁ బ్రతిజ్ఞ నేసి, నా బొందిని ప్రాణము లుండునంతవఱకుఁ జేసిన ప్రతిజ్ఞను నెఱవేర్పకుండఁజాలను. నా కన్నిటికంటె సత్యవాక్యపరిపాలనమె యొల్లప్పు డభిమతము. ఓ సీతా! నేను ప్రాణములను, నిన్ను, లక్ష్మణుని విడనాడుదుఁగాని యాడినమాటఁ దప్పను. అందును బ్రాహ్మణులయెడఁ బ్రతిజ్ఞ చేసి, దానినిఁ దప్పిపోవుట సరియగునే? ఋషులు నన్నడుగక పోయినను, వారిని నేను గాపాడవలసియుండ, వారడిగి, నే నట్లు చేసెద నని యొప్పుకొని యిప్పుడు తప్పిపోవుట యేటిమాట? ఓ పతివ్రతా! నీవు నా యందలి చెలిమివలనను, మంచి మనసుగలదాన వౌటవలనను,

ఈ యింపుమాటలఁ బలికితివి. ఆ మాటలకు నేను సంతసించితిని. అప్రియుని కెవ్వారును హితవు బోధింపరుగదా. నీకు నా యందుఁగల యిష్టముచేతనే యిట్టిమాఁట పలికితివి. ఈ పలుకు నీకును నీ కులమునకును దగియున్నది. నీవు నా ధర్మములందు సాబాలు పుచ్చుకొనుచుండు దానవు. నాకు నా ప్రాణములకంటె మిన్నవైనదానవు" అని యిత్తెఱఁగున మహాత్ముఁడయిన రాముఁడు తన నెచ్చెలియగు మైథిలితోఁగూడి విలుకాఁడై లక్ష్మణునితోఁగూడ మనోహరములగు తపోవనములెల్లఁ దిరుగుచుండెను.

11-వ సర్గము.

శ్రీరాముఁడనేకాశ్రమములు సంచరించి యగస్త్యాశ్రమము నేరుట

ఆ సీతారామలక్ష్మణు లరణ్యముల సంచరించునపుడు రాముఁడు ముందు నడచెను. చక్కని నడుముగల సీత నడుమ నడచెను. లక్ష్మణుఁడు విల్లు చేతఁబూని కడపట వెంబడిఁ బోయెను. అట్లు రామలక్ష్మణులు సీతను దోడ్కొని పలుతెఱఁగులగు కొండ చరులను, వనములను, పలునదులను, వీటి యిసుక తిన్నెలందుఁ దిరుగు బెగ్గురుపక్షులను, జిక్కవలను, నీట వసించు పక్షులతోఁగూడి విలసిల్లు కమలశోభితములగు కొలఁకులను, గుంపులు గుంపులుగా నిల్చియున్న జింకలను, మదముచే నొడలు తెలియని కొమ్ములుగల దున్నపోతులను, అడవిపందులను, చెట్లను విఱుచునట్టి యేనుఁగులను జూచుచుఁబోయిరి. ఇట్లు వారు చాలదవ్వేఁగి, ప్రొద్దు గ్రుంకుచుండ నొక యోజనము నిడివిగలదై, కమలములచేతను, చెందామరపూవులచేతను గ్రిక్కిరిసినదై, యడవి యేనుఁగుల గుంపులతోఁగూడి, నీటఁ దిరుగు బెగ్గురుపక్షులతోను, హంసలతోను, సారసములతోను గూడి వెలయుచున్న యొక రమణీయమైన కొలనింగనిరి. ఆరమణీయమగు తేటనీటితోఁగూడిన కొలనియందు గీతవాద్యముల ధ్వని యొక్కటి వినఁబడుచుండెను. అంత మహాబలులగు రామలక్ష్మణు లా శబ్దమునకుఁ గారణముఁ దెలియుటయందు మిక్కిలి మక్కువతో నక్కొలనికడనున్న ధర్మభృత్తనుమునీంద్రునిఁ జూచి, "మహామునీ! కడువింతయైన యీ శబ్దము వినఁగానే మా కెల్లరకు నిదియేదియో కనుఁగొనవలయునని గొప్ప యాశ పుట్టినది. బ్రాహ్మణోత్తమా! యిది

యతిరహస్యమ్ముగాక చెప్పఁదగునేని, ఇది యేమియో చెప్పఁగోరె దము" అనిరి. ఇట్లు వా రడిగిన పలుకులు విని, యా ధర్మభృత్తను ద్విజో త్తముఁడు వారి కా కొలనియొక్క మహిమను వి స్తరించి చెప్పఁ దొడఁగెను. రామా! ఇక్కొలను పంచాప్సరమనుపేరుగలది. ఇది యెల్లప్పు డిట్లు నృత్తగీతవాద్యములతోఁ గూడియుండును. మాండకర్ణి యను మునివరుఁడు తన తపోమహిమచే దీనిని నిర్మించెను. ఆ మాండ కర్ణియను మహాముని పదివేలయేండ్లు గాలి నీరు నాహారముగాఁ గల్గి యుండి గడుసుఁ దపమొనర్చెను. అప్పు డగ్నిహోత్రుఁడు మున్నగు వేల్పులందఱు మిక్కిలి నొచ్చినవారలై యొండొరులు గలిసికొని "ఈ మునీంద్రుఁడు మనలో నొక్కరితావరము నాక్రమించుకొనఁగోరి యిట్లుగ్రతపమొనర్చుచున్నాఁడు" అని యందఱు మోములు వ్రేలవైచి, మెఱుపువంటి మేనిచాయగల యేవురప్సరసల నా మునీంద్రుని తపో విఘ్నము చేయుటకై పంపిరి. ఆ యప్సరసలైదుగురు నిచ్చటికి వచ్చి దేవకార్యసిద్ధికై మంచిచెడ్డల నెఱిఁగిన యా మునీంద్రుని మిన్నథపర వశునిఁ జేసిరి. ఆ యైదుగు రప్సరసలు నామునికిఁ బ్రియురాండ్రయిరి. వారి యేవురి గృహము లీ కొలనిలోపల నున్నవి. అట్లే, ఆ యయిదుగు రచ్చరలును కొలనిలోపలిమేడలందుఁ దపప్రభావముచేఁ జవ్వనముఁ దాల్చిన యమ్మునితో నానందాతిశయముతో విహరింపుచుందురు. అట్లు విహారము సల్పు నచ్చరల వాద్యముల ధ్వనియొయిది. భూషణముల శింజితముతోఁ గలిసిన యింపగు గానములయొక్క ధ్వనియొ యిది" అని చెప్పెను.

విస్తారమగు కీర్తిగల యస్త్రవేత్తయగు రాముఁడును, ఆతని తమ్ముఁడగు లక్ష్మణుండును సీతతోఁగూడి బ్రహ్మజ్ఞానియగు నమ్మునీంద్రుని పలుకులు విని మిక్కిలి సంతసించి, దర్భలతోను నారబట్టలతోను గూడి నవియు, బ్రహ్మతేజస్సుతోఁ బ్రకాశించుచున్నవియునైన యాశ్రమము లందుఁ బ్రవేశించి, యా యాశ్రమములందలి ఋషులు చేసెడి మన్న నలఁ బడయుచు నచ్చట సుఖముండి, యయ్యాశ్రమములనుండి మఱలఁ బాను ముందున్న యాశ్రమములకే మఱలివచ్చి యొక్క యాశ్ర మమునఁ బదుమూఁడు నెలలును, మఱొక్క యాశ్రమున నొక్క

సంవత్సరమును, వేఱొక్క యాశ్రమమున నాలుగునెలలును, మఱి యొక్కచోట నైదునెలలును, వేఱొక్కప్రదేశమున నాఱునెలలును, మఱియొక తావున నేడునెలలును, ఒకచోట నొక్కటిన్నరనెలయు, వేఱొక్కచోట మూఁడు నెలలును, ఎనిమిదినెలలును నివసించెను. ఇట్లె యఁగున రాముఁడు మునులయాశ్రమములందు రెండేసిమారులు సుఖముగా నివసించుచు సంతోషముతో విహరించుచుండఁగాఁ బడ్డేండ్లు గడచినవి.

కాంతిమంతుఁడైన ధర్మవేత్తయగు రాముఁడు సీతతోడ నయ్యాయి యాశ్రమములందు విహరించి, మఱల సుతీక్ష్ణమహాముని యాశ్రమమునకే వచ్చి యచ్చటిమునులు చేసిన గారవములనొంది యచ్చటను గొంతకాలము నివసించుచుండెను. అంతటఁ గాకుత్థ్సుఁడు సుతీక్ష్ణమునీంద్రుని యాశ్రమమున నున్నవాఁడై, యమ్మునీంద్రుని చేరువకుఁ బోయి కూర్చుండి యడఁగువతో నమ్మునీంద్రుని కిట్లనియె: "మునీంద్రా! యీ యరణ్యముననే మునిశ్రేష్ఠుఁడగు నగస్త్యభగవానుఁ డున్నాఁడని మాటల సందర్భములలో మునులు చెప్పఁగా వినియున్నాను. ఈ యరణ్య ముపారమైయున్నందున నమ్మునీంద్రుని యాశ్రమ మేప్రక్కన నున్నదో నాకుఁ దెలిసినది కాదు. జ్ఞానవంతుఁడగు నమ్మునీంద్రుని యీ పావన వన మేవైపున నున్నదో తెలుపుదురేని, తమ యనుగ్రహము వలనఁ దమ్మని, సీతను దోడ్కొని యమ్మునీంద్రునకు మ్రొక్కుటకుఁ బోయెదను. అమ్మునీంద్రుని దర్శించి యాతనికి శుశ్రూష సలుపవలయు ననెడి యీ గొప్ప కోరిక నా మనమునఁ బొదలుచున్నది." అని సుతీక్ష్ణ మునీంద్రుని రాముఁ డడిగెను. సుతీక్ష్ణమునీంద్రుఁడును ధర్మాత్ముఁడగు రాముని పలుకులు విని, యాతని నుద్దేశించి యిట్లనియె. "రామా! నేను నీకును లక్ష్మణునకును నగస్త్యమునికడకుఁ బొండని చెప్పవలయునని యుంటిని. దైవవశమున నీవే యీ సంగతిఁగూర్చి యిప్పుడు నన్నడిగితివి. ఓ నాయనా! యగస్త్యమహాముని యుండు ప్రదేశము నీ కెఱిఁగించెద నాలకింపుము. ఇచ్చటికి దక్షిణముగ నాలుగు యోజనముల దూరమున నగస్త్యాశ్రితయొక్క చెన్నుమీఱు గొప్ప యాశ్రమ మున్నది. నానావిధములగు పుష్పఫలములతోఁగూడి, పలు

పులుఁగుల కూఁతలతో నిండి చక్కనైయున్న పిప్పలిచెట్లచే శోభిల్లు వనప్రాంతమున నయ్యాశ్రమ మున్నది. ఆశ్రమముసఁ జేటనీటితోఁ గూడి, హంస, కారండవ, చక్రవాకపక్షులతోడ మిక్కిలి వెలయుచున్న తామరకొలఁకులు విశేషముగా నున్నవి. రామా! అచ్చట నొక్క రాత్రియుండి, వేకువ లేచి, దక్షిణపువైపునకే యొక యోజనదూరము పోయిన నొక ప్రక్కన సగస్త్యమునీంద్రుని యాశ్రమము చూడఁ గలవు. ఆ యగస్త్యాశ్రమమునందలి యనేకవృక్షములతోఁ గూడిన మనోహరమగు వనప్రదేశమునందు నీవును, సీతయు విహరింపఁగలరు. లక్ష్మణుఁడును మిక్కిలి యానంద మొందును. ఆ వనప్రాంతము పెక్కు వృక్షములతో నిండి రమ్యమైయుండును. ఓ కీర్తిమంతుఁడా! నీ వగస్త్యమహాముని నిఁ జూడఁ గోరుదువేని, ఇప్పుడే తఱలిపొమ్ము" అని సుతీక్ష్ణమునీంద్రుఁడు రామునకుఁ జెప్పెను.

రాముఁడు మునీంద్రునియొక్క మాటలను విని, లక్ష్మణునితోఁ గూడ నమస్కరించి, సీతను లక్ష్మణునిఁ దోడొక్కని, యగస్త్యాశ్రమముఁ గూర్చి వెడలి రమ్యములైన వనములను, కాఱుమబ్బులంబోలు పర్వతములను, మార్గమున నచ్చటచ్చట దగులుచుండునదులను, కొలఁకులను జూచుచు, సుతీక్ష్ణమునీంద్రుఁడు చెప్పిన మార్గమునఁనే తిన్నగాఁబోయి, లక్ష్మణుం జూచి, "లక్ష్మణా! పావనచరిత్రములగల మహాత్ముఁడైన యగస్త్యనిభ్రాతయొక్క యాశ్రమమే యిది. దీనికి సంశయము లేదు. ఆ సుతీక్ష్ణమునీంద్రుఁడు గుఱుతుచెప్పినట్లే మార్గమునందు వేలకొలఁది వృక్షములు పుష్పఫలములబరువుచే వంగియున్నవి. మఱియు నీ వనమునుండి గాలిమార్గమునవచ్చుచున్న యీ పిప్పలవృక్షముల వాసన గాటుగ నున్నది. త్రోవలో నచ్చటచ్చట గుట్టలుకట్టఁబడిన కట్టెలమోఁపులును, వైడూర్యములకాంతివంటికాంతి గలకోయఁ బడిన దగ్ధకట్టలును గనఁబడుచున్నవి. ఈ వన మధ్యమందలి హోమాగ్నియొక్క ధూమపుఁగొన కాఱుమబ్బుకొనంబోలి యిదిగో తెలియవచ్చుచున్నది. బ్రాహ్మణులు పరిశుద్ధములగు తీర్థములందు స్నానమొనర్చి, తాము సొంతముగాఁ గోసిన పూవులచేఁ బూజచేయుచున్నారు. ఓ నాయనా! సుతీక్ష్ణమునీంద్రుఁ డెట్లుండునని చెప్పెనో,

ఆ లక్షణములెల్ల నిచ్చటఁ గానిపించుటచే నిది యగస్త్యమునీంద్రుని తమ్ముఁడగు సుదర్శనమహాముని యాశ్రమమే. ఇది నిక్కువము. ఈ సుదర్శన మునీంద్రుని యన్నయైన పుణ్యచరిత్రుఁడగు నగస్త్యమునీంద్రుఁడు జనులమేలు కోరి, తపస్సునొక్కపెంపువలన మృత్యువుం గెల్చి యీ దక్షిణదిక్కును ఋషుల నివాసమునకు యోగ్యమగునట్లు చేసెను.

✓ తొల్లి యీ వనమున నన్నదమ్ములగు నిల్వలఘాతాపు లను గొప్పరక్కసు లుండిరి. ఎల్లప్పుడు వారు చేరి బ్రాహ్మణులను హింసించు చుండిరి. వారిలో నిల్వలుఁడు బ్రాహ్మణరూపముఁ దాల్చి, దయా శూన్యుఁడై, సంస్కృతము మాటలాడుచు బ్రాహ్మణులను దన యింటికి నిమంత్రణకు రమ్మని పిలుచును. తర్వాత మేఁకరూపమెత్తియున్న తన తమునిఁ గోసి చక్కఁగాఁ బచనముచేసి, శాస్త్రవిధిచొప్పున నిమంత్రణ చెప్పినవిప్రులకుఁ జక్కఁగా భోజనముఁ బెట్టును. తర్వాత నా బ్రాహ్మణు లందఱకు భోజనమైన వెంటనే, "వాతాపీ! రమ్ము" అని బిగ్గఱగా నఱ చును. అంత నా వాతాపి యన్నమాట విని బ్రాహ్మణుల కడుపులను జించి చించి మేఁకవలె నఱచుచు వెలుపలికి వచ్చును. ఇట్లు వాతాపి వచ్చినవెనుక, మాంసభక్షకులైన యిచ్ఛారూపులగు వా రిరువురును గలిసి వారిని దినుచుండిరి. ఇట్లు వేలకొలఁదిబ్రాహ్మణులను జంపి యాసోదరు లిరువురుఁ దమపొట్టను బెట్టుకొనిరి. అప్పుడు దేవతలందఱు ప్రార్థింపఁగా నగస్త్యమహాముని యొక్కదినమున నా యిల్వలునిచే నిమంత్రణమునకుఁ బిల్వఁబడి వాతాపిని భక్షించెను. అంతట నిల్వ లుఁడు క్రోధాంతమున నగస్త్యమహర్షిని "దృష్టి యయ్యేఁగా" యని యడిగి, వారివలనఁ బ్రతివచనము దీసికొని, యుత్తరాపోశనముచేసి, "వాతాపీ! రమ్ము" అని పిలిచెను. అప్పుడు జ్ఞానవంతుఁడగు నగస్త్య ముసీంద్రుఁడు బ్రాహ్మణులఁ జంపువాఁడగు తనతమ్ముని నట్లు పిలుచు చుండు నిల్వలుం జూచి నవ్వుచు, "ఓరీ యిల్వలుఁడా! మేఁకరూపుఁ దాల్చిన నీ తమ్ముఁడగు వాతాపి నాచే భుజింపఁబడి నా కడుపున నఱిగి యమపురమున కేఁగెనే! నీవు పిలిచిన నతనికి వచ్చుటకు శక్తి యొక్క డిది?" అని చెప్పెను. అంత నా యిల్వలుఁడు తన తమ్ముని మరణముఁ

గూర్చిన యా ముసీంద్రుని మాటను విని యలుకతో నాముసిపుంగవుని హింసించుట కారంభించెను. అట్లు రక్కసుఁడు హింసించుటకయి యమ్ముసీంద్రునిపై కుఱుకఁగా, నమ్ముని శేఖరుఁడు వెలిఁగెడు తన తపో మహిమచే నగ్నిమాడ్కిఁ జేజరిల్లు దృష్టితో నతనిని నీఱుచేసెను. ఓ లక్ష్మణా! ఏ ముసీంద్రుఁడు బ్రాహ్మణుల యందలి యనుగ్రహముతో నింత చేయ నలవికాని పనినిఁజేసెనో, అట్టి యగస్త్యముసీంద్రుని తమ్మునియొక్క యాశ్రమ మిది.

అని రాముఁ డిట్లు తన తమ్మునితోఁ జెప్పుచుండఁగా, ప్రొద్దు గ్రుంకెను. సంధ్యాకాల మయ్యెను. అంత రాముఁడును లక్ష్మణుఁడును విధిఁ దప్పక సాయంసంధ్యావందనముచేసి, యగస్త్యాశ్రిత యొక్క యాశ్రమము సొచ్చి, యా ఋషికి నమస్కరించిరి. అంతట నమ్మహాముని చేసిన యాతిథ్యములు గైకొన్నవారలై, మూలములను ఫలములను భుజించి, యారేయి యచ్చట నివసించిరి. ఆరేయిగడచి, మఱునాఁడు సూర్యుఁడుదయించినవెంటనే రాముఁ డగస్త్యాశ్రిత యగు సుదర్శనుని వీడ్కొనవచ్చి, "ఓ మహాత్మా! మీ కభివాదనము నేసెద. మే మీ రేయి సుఖముగా నుంటిమి. మాకు సెలవొంసంగ వేఁడెదను. మీయన్నగారిని సందర్శింపఁ బోయెదము" అనెను. ఆ సుదర్శనుఁడు "నట్లె పోయిరం"డని చెప్పెను.

రాముఁడును సుదర్శనమునీంద్రుని యానతివడసి, సుతీక్ష్ణమునీం ద్రుఁడుచెప్పిన దారినే పోవుచు, మార్గమధ్యమున, నేనుఁగులచే విఱువఁ బడిన కొమ్మలతోఁ గూడినవియు, కోఁతులచే శోభిల్లునవియు, మదించిన పలుపులుఁగుల యింపులగు కూఁతలతో మ్రోయుచున్నవియునై, పూఁచిన కొనలుగల తీఁగెల జొంపములచే నల్లిబిల్లిగ నల్లుకొనఁబడినవియు, కుసుమభరితములునునై న నీటికడిమి పనస, తాటి, పొగడ, తినాస, చంద్ర, కానుఁగు, ఇప్ప, మాఱెడు, తుమ్మిక మొదలగు నడవిలోఁ బుట్టెడు నూఱులకొలఁదిచెట్లను జూచెను. అంతఁ గమలలోచనుఁడగు రాముఁడు చేరువనే వెంబడి వచ్చుచుండు శ్రీమంతుఁడగు దిట్టయైన లక్ష్మణునిజూచి, "లక్ష్మణా! వృక్షములు చిక్కనియాకులతో నొప్పారి యున్నవి. మృగములు, పక్షులు, వైరము లేక నెమ్మది గలిగియున్నవి. సుతీ

స్త్రీమునీంద్రుఁడుచెప్పినగుణుతులన్నియుఁ గానిపించుచున్న వి.పర బ్రహ్మను గన్న వాఁడైన మహర్షియొక్క యాశ్రమమిదియేయగును. పర్వతమును స్తంభింపఁ జేయుటచేత "అగస్త్యుఁడు" (అగ=పర్వతమును; స్త్యుఁడు= స్తంభింపఁజేసినవాఁడు) అని సార్థకనామము వహించిన యగస్త్య మునీంద్రుని యాశ్రమము చూపట్టుచున్నది. ఇది యలసినవారి యలయిక ం బోకార్చునదియు, విస్తారమగు హోమధూమముతోఁ గూడిన వన ములు గలదియు, నారచీరలవరుసలతోనలరారునదియు, నెమ్మదియైన మెక ములగుంపులుగలదియు, పలుతెఱఁగుల పులుగులకలకలముతోనిండినది యునైయున్నది. ఏమహాత్ముని తపఃప్రభావమునకు వెఱచి, రాక్షసు లీదక్షిణదిశవైపునకుఁ జూచినను అనుభవింపఁబూనరో, అట్టి యగస్త్య మహాముని యొక్క యాశ్రమస్థానమిది. పుణ్యకర్మములఁ జేయు నమ్మునీంద్రుఁ డీ దక్షిణదిశ నాక్రమించుకొన్నది మొదలు రక్కసులు వైరములేక, నెమ్మదితోనున్నారు. ఈ దక్షిణదిక్కు క్రూరపుఁబనులు సేయు రక్కసుల కడుగిడ నలవికాక సమర్థమై, యగస్త్యదిక్కని ముల్లో కములందును ప్రఖ్యాతి చెందియున్నది. (తొల్లి వింధ్యపర్వతము హిమ వంతముతోఁ బంతము వూని సూర్యుని మార్గము నడ్డగింప యత్నిం చెను. అప్పుడగస్త్యుఁడు దేవతల ప్రార్థనచేఁ దనశిష్యుఁ డగు వింధ్యుని కడకు రాఁగా, నతఁడు శిరస్సువంచి, గురువునకు మ్రొక్కెను. అప్పు డగస్తముసీంద్రుఁడు నీవెప్పటికి నిట్లుండుమని యానతిచ్చెను.) వింధ్య శైలము సూర్య మార్గము నడ్డగింపఁబూనియు నే ముసీంద్రుని యాన తిచేఁ బైకి లేవక యడఁగియున్నదో, అట్టి చిరకాలజీవియు, లోకప్రసిద్ధ మగు చరిత్రము గలవాఁడునునైన మునిపుంగవుని యాశ్రమమేయిది. ఇది సాధుజనసంసేవితమై చెన్నుమీఱియున్నది. ఈ మహర్షియెల్ల ప్పుడు లోకములచేఁ బూజింపఁబడినవాఁడు; సజ్జనులకు మేలొనరించుట యందు నిరతుఁడు. మన మచటికిఁబోయిన, మన కతఁడు మేలొనరింపఁ గలఁడు. సమర్థుడవు శాంతుఁడవునైన లక్ష్మణా! నే నియ్యాశ్రమమున నా ముసీంద్రునిఁ గొల్వఁబోయెదను. అచ్చట నుండి వనవాస మున మిగిలిన కాలమును బుచ్చెదను. లక్ష్మణా! యియ్యాశ్రమమున నాహారనియమముగలిగి తపస్సుచేయుచుండునట్టి యగస్త్యముసీంద్రుని

దేవ గంధర్వ సిద్ధ మహర్షు లనయము గొల్చుచుందురు. ఈయాశ్రమమున బొంకువాఁడును, కటికితనము గలవాఁడును, వంచకుఁడును, ఘాతకుఁడును విషయలోలుఁడును జీవింపఁడు. ఓలక్ష్మణా! యీమునిప్రభావమట్టిదై యుండు. ఇచ్చట దేవగంధర్వయక్షపన్నగగరుడాదులాహారము వర్జించి, పుణ్యము నొందఁగోరి తపస్సుచేయుచుందురు. మహాత్ములగు మహర్షు లిచ్చటఁ దపస్సు గావించి, ఫలమునొంది, మానుష దేహములను వదలి, దివ్యదేహములఁ దాల్చినవారలై, సూర్యుని మాడ్కిఁ దేజరిల్లు విమానములమీఁద నెక్కి స్వర్లోకమున కేఁగిరి. ఇచ్చటఁ దపస్సుచేసి దేవతలం బూజించువారికి వారు యక్షత్వము, దేవత్వము, సకలరాజ్యములు నొసఁగుచుందురు. లక్ష్మణా! మన మట్టి యగస్త్యాశ్రమమునకు వచ్చి చేరితిమి. నీవు ముందుగా నేఁగి, నే నిచ్చటికి సీతతోఁగూడ వచ్చియున్నాఁడ నని నివేదింపుమని లక్ష్మణునితోఁ జెప్పి పంపెను.

12-వ సర్గము

రాము: డగస్త్యాశ్రమము సొచ్చి యగస్త్యమునివలన నస్త్రములఁ బడయుట

శ్రీరామునితమ్ముఁడగు లక్ష్మణుఁ డగస్త్యాశ్రమము లోపలికిఁ జొచ్చి, యగస్త్యమునిశిష్యునిఁజూచి, యిట్లనెను. "దశరథుఁడను నొక నృపాలుఁడు గలఁడు. అతనికిఁ బెద్దకొడుకగు బలిమిగలవాఁడయిన రాముఁడు సీతతోఁగూడి, మునీంద్రునిఁ జూడవచ్చియున్నాఁడు. నే నతనికిఁ దమ్ముఁడను. నాపేరు లక్ష్మణుఁడందురు. నేను మాయన్న కితవు గోరువాఁడను. ఆతని కనుకూలుఁడను. భక్తుఁడను. ననుఁగూర్చి మీ రిదివఱకు వినియుండవచ్చును. మేము తండ్రియానతివలనఁ గడు ఘోర మైన యీ వనమునఁ బ్రవేశించితిమి. మేము చువ్వారము పూజ్యుఁడైన యగస్త్యమునీంద్రునిఁ జూడఁ గోరుచున్నాము. లోపలికిఁబోయి విన్న వింపుఁడు" అని లక్ష్మణుఁడు చెప్పిన మాటలను విని, యాతపోధనుఁడు గురువునగ్నిహోత్రశాలం జొచ్చెను.

అగస్త్యప్రియశిష్యుఁడగు నాముని యట్లగ్నిహోత్ర గృహము చొచ్చి, తపస్సుచేఁ బరులకుఁ జూడ నలవికాని యమ్మునీంద్రునికి రాముని రాకను వేగిరముగఁ దెలుపఁగోరినవాఁడై, చేతులు జోడించి

లక్ష్మణుఁడు చెప్పిన తెఱఁగున నిట్లనియె. "మహాత్మా! ఎవరో యిద్దఱు రాజపుత్రులు వచ్చియున్నారు. వారు రాముఁడు లక్ష్మణుఁడు ననుపేరులుగలవారఁట. వారు దశరథన్నృపాలుని పుత్రులఁట. వారిరువురును పెద్దవాఁడగు రాముని భార్యయగు సీతతోఁగూడ మనయాశ్రమము వాఁకిట నున్నారు. శత్రుసంహారులగు వారిద్దఱు భవద్దర్శనముసేసి, సేవ చేయ వచ్చియున్నారు. ఇఁక నీవిషయమునఁ జేయవలసిన కార్యము నానతిండు" అని గురువుతో శిష్యుఁడు చెప్పఁగా, మునీంద్రుడగు నగస్త్యుఁడు శిష్యునివలన రామలక్ష్మణులును, భాగ్యవతియగు సీతయు వచ్చియుండుటనువిని, "నా భాగ్యముచేతనే రాముఁ డిన్నియేండ్లకు నన్నుఁ జూడవచ్చెను. నేనును ఆరామునియాగమునమునే మనసున గోరుచుంటిని. సగౌరముగ పొమ్ము. రాముని, లక్ష్మణుని, సీతను లోనికిఁ బ్రవేశపెట్టుము. వారిని నాకడకుఁ దోడ్కొనిరమ్ము. ఏల యిదివఱకే వారిని లోపలికి రానీయ వైతివి?" అని ధర్మముల నెఱిఁగిన మహాత్ముఁ డగు నగస్త్యమునీంద్రుఁడు పలుకఁగా, శిష్యుఁడు 'నన్నే' యని చేతులు జోడించి, యభివాదనమొనర్చి, వెలుపలికివచ్చి, "లక్ష్మణా! యేఁడీ రాముఁడు? ఆతఁడు మునీంద్రునింజూడ రావచ్చును." అని పలికెను. అంత లక్ష్మణుఁడు శిష్యసమేతుఁడై యాశ్రమము వాఁకిటికివచ్చి రాముని, సీతను జూపెను. అంతట శిష్యుఁడును మర్యాదకుఁ దగినవాఁడును. అందఱిచేఁ జక్కఁగా గారవింపఁబడినవాఁడునైన రామునితో నగస్త్యమునీంద్రుఁడు చెప్పిన మాటల నెఱింగించి, మర్యాదతోడ రాముని లోపలికిఁ బ్రవేశవెట్టెను.

అట్లు రాముఁడు సీతాలక్ష్మణసమేతుఁడై లోపలఁ బ్రవేశించి, జంకుదీఱిన జింకలతోఁగూడిన యాశ్రమమున బ్రహ్మస్థానమును, అగ్ని స్థానమును, విష్ణువు నునికిపట్టును, ఇంద్ర, సూర్య, సోమ, భగ, కుబేర, ధాతృ, విధాతృ, వాయువుల వాసస్థానములను, ఆదిశేషుని యునికిని, మహాత్ముఁడగు ననంతుని యునికిని, గాయత్రీస్థానమును, వసువుల నెంకిని, మహాత్ముడగు పాశముదాల్చినవరుణునిమనికిని, కుమారుని యిరవును, జముని తావరమును జూచుచుఁ బోయెను. రాముని నెదురొక్కొనుటకై యగస్త్యమునీంద్రుఁడు శిష్యులతోఁగూడ నేతెంచుచుండెను. అంత

రాముఁడును తపముచే వెలుఁగుచున్న యా మునులకు ముందటవచ్చు నగస్త్యమునీంద్రునిఁ దిలకించి, సంపదను బెంపొనరించు లక్ష్మణుంజూచి, "లక్ష్మణా! ఇదిగో భగవంతుఁడగు నగస్త్యముని వచ్చుచున్నాఁడు. ఈతని తేజస్సుచూడ నితఁడు దపస్సులకు రాశి యనితోఁచెడి" అనుచు దాపునకేఁగి, సూర్యునిమాడ్కిఁ బ్రజ్వరిల్లు నమ్మునీంద్రుని పాదములఁ గడు సంతసముతోఁ బట్టుకొనెను. అట్లు మ్రొక్కి లేచి నిలఁబడి, రాముఁడు సీతాలక్ష్మణసమేతుఁడయి, చేతులు జోడించికొని నిలఁబడి యుండెను. అగస్త్యమునీంద్రుఁడును రాముని కాసనమిచ్చి పాద్య మొసఁగి, కుశలమరసి కూర్చుండుమనెను. అంతట మునీంద్రుఁడు వైశ్వదేవ మొనర్చి, యతిథుల కర్ఘ్యమిచ్చి, మర్యాద యొనర్చి, వారికి వాన ప్రస్థవిధానమునఁ బండ్లు దుంపలు మొదలగువానిచే నాహారము పెట్టెను.

అంతట ధర్మముల నెఱిఁగిన మునిశ్రేష్ఠుఁడును వారి కెదుటఁ గూర్చుండి, చేతులు జోడించికొని కూర్చుండియున్న ధర్మవేత్తయగు రాముని, లక్ష్మణునిఁ జూచి, "యో రామా! మనల నింత నేపు గాఁచి యుండునట్లు చేసె నని నీవు తలంతువేమో. వైశ్వదేవమొనర్చి, యావల నతిథుల కర్ఘ్యమొసఁగి, భోజనము పెట్టవలయును. అట్లు కాక, యొచ్చుతక్కువగా నాచరించు మునీంద్రుఁడు తప్పుసాక్ష్యము చెప్పువానిమాడ్కిఁ బరలోకమునఁ దన మాంసమునే తినును. లోకముల కన్నిటికిఁ బ్రభువవును, ధర్మముఁ దప్పనివాఁడవును, మహారథుఁడవును, మననముచేయఁ దగినవాఁడవును, బూజసేయఁ దగినవాఁడవును బ్రియాతిథివియునైన నీవు మాయాశ్రమమునకు వచ్చితివి. ఇట్టి నిన్ననేకవిధములుగా మర్యాదసేయవలయు"నని చెప్పి, పుష్పఫలమూలాదులచే నతనిం దనివితీర గారవించి వెండియు నిట్లనియె. "పురుషశ్రేష్ఠుఁడా! యీ స్వర్ణమణిభూషణాలంకృతమయిన దివ్యమగు గొప్ప ధనుస్సు విష్ణుదేవునిది. విశ్వకర్మచేఁ జేయఁబడినది. ఈ సూర్యునివలె వెలుఁగు దివ్యబాణమును బ్రహ్మదేవుఁ డొసంగెను. ఈ యమ్ముల పొదులు రెండును నిప్పువలె వెలుఁగు తఱుగని కఱకుటమ్ములతో నిండి యున్నవి. వీనిని దేవేంద్రుఁడొసఁగెను. బంగారంపు టొరతోఁగూడిన స్వర్ణాలంకృతమగు నీ కత్తినిగూడ దేవేంద్రుఁడే యొసఁగెను. రామా!

తొల్లి మహావిష్ణు వీ వింటితో గొప్ప రాక్షసులను బోరునందుఁ జంపి, దేవతలకు వెలుఁగుచున్న రాజ్యలక్ష్మి నొసఁగెను. శత్రువులగర్వమడఁచు రామా! దేవేంద్రుఁడు శత్రుజయముగోరి వజ్రాయుధము గైకొన్నచంద మున, నీవును ఈ వింటిని, రెండమ్ములపొదులను, బాణములను, ఖడ్గ మును గైకొనుము" అని చెప్పి భగవంతుఁడైన యగస్త్యుఁడు రామున కాశ్లేష్మములైన యాయుధములనెల్లనొసఁగి మఱల నిట్లనియె.

13- వ స ర్గ ము.

రాముఁడగస్త్యుని ప్రేరణవలనఁ బంచవటికిఁ బోవుట

"రామా! లక్ష్మణా! మీరు సీతతోఁగూడి నన్నుఁ జూడ నిచ్చటి కేతెంచితిరి గనుక, నేను మీ రాకకై మిక్కిలి యానంద మొందితిని. మీకు మేలయ్యెడు. మీరు మార్గాయాసముచే మిక్కిలి డస్సియున్నట్లు కనఁబడుచున్నది. జనకపుత్రియగు సీతయు దారియలసటఁ దీర్చుకొనఁ గోరుచున్నట్లున్నది. ఈ సీత తిన్ననిది. ఇడుమల ననుభవించి యెఱుఁగనిది. పెనిమిటిమీఁది మక్కువచే లెక్కలేని యపాయములతో నిండిన యడవి కేతెంచినది. రామా! యీసీత యిచ్చటఁ దన యలయికఁ దీర్చుకొననిమ్ము. ఈ సీత యరణ్యమున నిన్ను వెంబడించి వచ్చి, చేయ నలవికానిపని చేసినది. రఘునందనా! సీత లోకమునందలి యితరకాంతలను బోలినది కాదు. లోకాచారమెట్టిదనిన, చక్కని స్థితియం దున్నప్పుడు కాంతలు దమ భర్తల ననురాగముతోఁ జూతురు. చెడుస్థితియం దున్నప్పుడు భర్తలను విడనాడుదురు. బ్రహ్మసృష్టి మొదలు స్త్రీల స్వభావ మిట్టిదయై యున్నది. మగువలు మెఱుపువలె నిలుకడలేనివారు. ఆయు ధములమాడ్కి వాఁడిమిగలవారు. గరుడవాయువుల వేగమున బరుగిడు మనస్సుగలవారు. కావున నెంతటికార్యమునకైనను తెగిం తురు. మంచిచెడ్డల నరయఁజాలరు. రామా! నీభార్య పైఁజెప్పిన యవ గుణములు లేక, యరుంధతీదేవిమాడ్కిఁ గొనియాఁడదగు నడతగల్గి పాతివ్రత్యము నవలంబించునదియై యున్నది. శత్రుసంహారివగు రామా! యీప్రదేశమున నీవు సీతాలక్ష్మణులతోఁగూడ నుండుము. మీ యుని కిచే నీ వనముకూడ నొప్పాఱుచుండఁగలదు" అని చెప్పెను.

అమ్మునీంద్రుఁడిట్లు చెప్పిన మాటలను విన్నవాఁడై, చేతులు జోడించికొని యగ్నిమాడ్కి వెలుఁగుచున్న యగస్త్యమునీంద్రు నుద్దేశించి, సవినయముగా నిట్లనియెఁ: "మహాత్మా! నాగుణములకును, నాతమ్ముని గుణములకును, నాభార్యగుణములకును మెచ్చి మునిశ్రేష్ఠుల రగు తమరు సంతసించి వరముల ననుగ్రహించితిరి గనుక, నేను ధన్యుఁడనైతిని. నేను తమయనుగ్రహమునకుఁ బాత్రుఁడనైతిని. మఱి యేమనిన, నేను సుఖముగా నాశ్రమము నేర్పఱచుకొని యుండుటకుఁ దగినదియు, నీటివసతిగలదియు, పెక్కువనములతోఁ గూడినదియునైన యొక్కప్రదేశము నాకుఁ జెప్పుఁడు" అని రాముఁడు వినయపూర్వకముగా నగస్త్యముని నడిగెను.

ధీరుఁడును, ధర్మతత్పరుఁడునైన యగస్త్యుఁడు రాముని వాక్యమును విని, ముహూర్తకాలం బాలోచించి రాముని నుద్దేశించి, "ఓనాయనా! యిచ్చటికి రెండు యోజనముల దూరమునఁ బంచవటి యనునొక క్షేత్రమున్నది. అయ్యది విశేషజలఫలమూలసంపదగలిగి, పలుపులుఁగుల కునికిపట్టయి సొంపుమీఱియున్నది. రామా! సీతాలక్ష్మణులతో నీ వచ్చటికేఁగి, యునికిపట్టు నేర్పఱచికొని, పితృవాక్యపరిపాలనముఁ జేయుచుఁ గాలము వినోదముగాఁ గడపవచ్చును. రాఘవా! దశరథనృపాలు నియమించిన పదునాలుగేండ్లకాలముఁ జాలమట్టునకుఁ గడచినదాయెను. మిగిలినకాల మిచ్చటనే కడపుము. ఓ కాకుత్థ్సా! నీవచటనే ప్రతిజ్ఞ చెల్లించినవాఁడవై, యయోధ్యకుఁబోయి, పట్టాభిషిక్తుఁడవై సుఖముగ రాజ్యము నేలఁగలవు. రఘునందనా! తొల్లి యయాతి వలె దశరథనృపాలుఁడును జ్యేష్ఠపుత్రుఁడవగు నీచేఁ బ్రతిజ్ఞాసముద్రము నుండి దాఁటింపఁబడెనుగాన, ధన్యుఁ డయ్యెను. ఓ వ్యసనరహితుఁడా! తపోమహిమవలనను, దశరథునిపైనుండు ప్రేమమువలనను నీ వడవికి వచ్చిన వృత్తాంతము నెఱిఁగియే యున్నాను. నీ విచ్చట నునికిపట్టేర్పఱచుకొని నాతోడ తపోవనమునఁ నే యుండగోరియున్నావను నీ మనస్సునభిప్రాయమునుగూడ నా తపోమహిమచే నెఱింగితిని. కావునఁ నే "పంచవటికిఁ బొమ్ము" అని చెప్పుచున్నాను. అది సొబగైన వనప్రాంతము. ఆదేశము సర్వవిధములచేఁ బొగడఁదగియున్నది. అంతియకాక మిక్కిలి

సమీపముననే యున్నది. అది గోదావరీనదికిఁ జేరువనే యున్నది. ఆ ప్రదేశము సీతకాహ్లాదమును గలిగించును. అయ్యది బహు ఫలమూల సంపదగలిగి, పలుతెఱఁగులగు పక్షులగుంపుల కునికిపట్టయి జనసంచారములేని యేకాంతప్రదేశమై, పుణ్యప్రదమును, మనోహరమునై యున్నది. నీవును భార్యాసమేతుఁడవై యున్నావు. అందఱిని రక్షింపఁ జాలుదువు. మఱియు నీ వచ్చటినుండి తాపసుల నందఱిను బాలించుచుండఁగలవు. ఓ దిట్టఁడా! ఇదిగో యిప్పచెట్ల గొప్పతోఁపు గనఁబడుచున్నది. దీని కుత్తరముగాఁ బోయిన నొక మఱ్ఱిచెట్టు కనఁబడును. ఆ మఱ్ఱిచెట్టు కడకుఁబోయి, మిట్టయొక్కిన నొక పర్వతముయొక్క సమీపమున నెల్లప్పుడు పూఁచిన వనములతోఁగూడిన పంచవటియను ప్రసిద్ధమగు ప్రదేశము గనఁబడును" అని యగస్త్యమునీంద్రుఁడు రామునితోఁ జెప్పెను.

రాముఁ డగస్త్యునిచే నిట్లు నివాసయోగ్య ప్రదేశము నెఱిఁగినవాఁడై, లక్ష్మణసమేతుఁడగుచు, సత్యవాదియగు నమ్మహర్షిని బూజించి, పోయివచ్చెదనని సెలవుగైకొనెను. అంతట యుద్ధమునందుఁ బిఱికితనము లేనివారును రాజపుత్రులునైన రామలక్ష్మణు లిరువురును మునీంద్రుని యనుమతిం బడసి యతనిపాదములకు మ్రొక్కి యయ్యాశ్రమము వదలి, సీతను బిల్చుకొని, విండ్లనుదాల్చి యమ్ములపొదులను వీఁపునకుఁ గట్టికొని యగస్త్యమునీంద్రుఁడు చెప్పిన మార్గమునఁనే జాగ్రత్తతోఁ బంచవటి ప్రాంతమునకుఁ దఱిలినవారలైరి.

14-వ సర్గము.

జటాయువు స్వకీయ వృత్తాంతమును దెల్పుట

అంత రఘునందనుఁడు లక్ష్మణసమేతుఁడయి పంచవటికిఁ బోవుచు దారినడుమ గొప్పమేనుగల భీమవిక్రముఁడగు నొక్కగ్రద్ద మఱ్ఱిచెట్టునఁ గూర్చుండియుండుటను జూచి, యతఁడు పక్షిరూపముదాల్చిన రక్కసుఁడని తలఁచి నీ వెవ్వఁడవని యడిగెను. ఆ గృధ్రమును తిన్నని పలుకులతో వారి నిరువురిని సంతసపఱచువానివోడ్కిఁ గనఁబడుచు "నాయనలారా! నేను మీ తండ్రికిఁ జెలికాఁడను" అని చెప్పఁగా, రాఘవుఁడా గ్రద్దను తన తండ్రికిఁ జెలికాఁడని యెఱింగి యాతనిం బూజించి, యాతని

కులగోత్రములను బేరునుగూర్చి యడిగెను. అంత గృధ్ర మా రాముని పలుకులు విని, యా రామునకు సర్వభూతోత్పత్తిప్రకారమును, తన పేరు కులములను జెప్పఁదొడఁగెను.

"నిడుదచేతులుగల యో రాఘవా! పూర్వ మెందఱు ప్రజాపతులుండిరో వారినందఱిని మొదటినుండి చెప్పెద వినుము. ప్రజాపతులలోఁ గర్దముఁడు మొదటివాఁడు. అతనికిఁ బిమ్మటివాఁడు విక్రీతుఁడు; అతనికిఁ బిదప శేషుఁడు, వీర్యవంతుఁడైన బహు పుత్రులుగల సంశ్రయుఁడు; స్థాణువు, మరీచి, అత్రి, మహాబలుఁడగు క్రతువు, పులస్త్యుఁడు, అంగిరసుఁడు, ప్రచేతసుఁడు, పులహుఁడు, దక్షుఁడు, వివస్వంతుఁడు, అరిష్టనేమి యను నామాంతరముగల మహాకాంతిగల కాశ్యపుఁడును గ్రమముగాఁ బ్రజాపతులైరి. విస్తార యశస్సుగల యో రామా! దక్షప్రజాపతి కఱువదిమంది రూపవతులైన కీర్తిమతులగు కూఁతులుండిరి. వారిలో నెనమండుగురిని నదితి, దితి, దను, కాళిక, తామ్ర, క్రోధవశ, మనువు, అనలయనువారిని గాశ్యపుఁడు బెండ్లాడెను. అంతటఁ గాశ్యపుఁడు కన్యలనందఱిని జూచి, "మీ రందఱును ముల్లోకములకుఁ బ్రభువులగు నాతో సమానులగు కొడుకులను ప్రసవింపుఁ"డని చెప్పెను. మనుజశ్రేష్ఠా! శత్రుసంహారీ! అదితి, దితి, కాళికలు ముగ్గురే దీనికి సమ్మతించిరి. తక్కినవారందఱు సమ్మతింపరైరి. అదితి పన్నిద్దఱు భాస్కరులను, ఎనమండుగురు వసువులను, పదునొక్కరు రుద్రులను, ఇద్దఱశ్వినీదేవతలను గలిసి ముప్పదిముగ్గురను దేవతలను బుట్టించెను. దితియుఁ గీర్తిమంతులగు రాక్షసులను గనెను. వారలే దైత్యులనఁబడిరి. ఈ చతుస్సముద్ర వలయితమగు గిరికాననసహితమైన భూమండలమెల్ల వారి వశమునఁ జేయుండెను. దనువును హయగ్రీవుఁ డనునొకపుత్రునిఁగనెను. కాళికయు నరకకాలకు లనుపుత్రులం గనెను. తామ్రయుఁ గ్రౌంచి, భాసి, శ్యేని ధృతరాష్ట్రి, శుకి యను లోకప్రసిద్ధులైన యేవురుకన్యకలను గనెను. ఆ యైదుగురిలోఁ గ్రౌంచి యులూకములను, భాసి భాసములనెడి పక్షులను గనెను. శ్యేని డేగలను, తేజస్సుగల గృధ్రములను గనెను. ధృతరాష్ట్రి హంస రాజహంసలను బుట్టించెను. సిని మేలుగలుగుఁగాక. ఆ భామిని చక్రవాకములనుగూడఁ బుట్టించెను. కడఁ

గొట్టుదగు శుకి నతను బుట్టించెను. ఆ నతకు వినతపుట్టెను. రామా! క్రోధవశ మృగి, మృగమంద, హరి, భద్రమద, మతంగి, శార్దూలి, శ్వేత, సురభి, సకల శుభలక్షణవతియగు సురస, కద్రువ నను పదుగురు కొమా ర్తెలను గనెను. నరోత్తమా! మృగములన్నియు మృగికిఁ బుట్టినవారు. ఋక్షములు, చమరములు, సృమరములు మృగమందయొక్క కొడుకులు. హరికి సింగములును బలవంతములగు వానరములును బుట్టినని. నిరావతి యనుకూఁతురు భద్రమదకుఁ బుట్టెను. ఆ యిరావతియొక్క పుత్రుఁడే లోకనాథుఁడగు నైరావతమను మహాగజము. నరశ్రేష్ఠుఁడా! మాతం గములన్నియు మాతంగి బిడ్డలు. శార్దూలి కొండమచ్చులను, బులులను బుట్టించెను. శ్వేతకు దిగ్గజములు పుట్టినవి. రామా! సురభికి రోహిణి, గంధర్వియను నిర్వురు కూఁతులు పుట్టిరి. ఆ యిరువురిలో రోహిణికి గోవులును, గంధర్వికి గుఱ్ఱములును బుట్టినవి. సురసకు పెక్కుతలలుగల సర్పములును, కద్రువకు సామాన్యసర్పములునుజన్మించినవి. నరోత్తమా! మనువు బ్రాహ్మణక్షత్రియ వైశ్యశూద్రులను నాలుగువర్ణములవారగు కీర్తివంతులైన మానవులను గనెను. అనలకు వర్తులరూపముగల వృక్షములన్నియు జనించెను. వినత శుకికి మనుమరాలు. కద్రువ సుర సకుఁ జెలియలు. కద్రువకు వేయితలలు గలవాఁడై భూమిని మోయు చుండు నాదిశేషుఁడు జనించెను. వినతకు గరుడుఁడని యరుణుఁడునని యిరువురు పుత్రులు జన్మించిరి. యరుణునకు నేను పుత్రుఁడను. సంపాతి మాయన్న. నన్ను జటాయువందురు. నాతల్లిపేరు శ్యేని. ఓ శత్రు సంహారకా! నీవు కోరుదునేని, ఈ యరణ్యము చొఱనలవికాక, దుష్ట రాక్షసులకును, క్రూరమృగములకు నునికిపట్టయినది. కావున నీవును లక్ష్మణుఁడును వెలుపటఁ బోయినప్పుడు నీ నివాసముకడనుండి నేను సీతను గాఁచుచుండెదను" అని జటాయువు రామునితోఁ జెప్పెను. ధైర్యవంతుఁడగు రాముఁడును జటాయువును మన్ననసేసి మక్కువతోఁ గౌఁగిలించికొని, యతఁడు మాటిమాటికిఁ జెప్పిన తన తండ్రితోడి చెలిమిని గూర్చి యాలకించెను. అంతట రాముఁడు బలవంతుఁడయిన యా జటాయువును గూడఁ దీసికొనియే, సీతాలక్ష్మణ సమేతుఁడయి,

చిచ్చు మిడుతలను దహించుమాడ్కిఁ బగతురను దహింపఁ గోరిన వాఁడై పంచవటికిఁ బోయెను.

15-వ స ర్గ ము.

రామాదులు పంచవటిం జేరుట

అంతట రాముఁడు కూళమెకములతోఁ నిండినదయిన పంచవటి నేరి, తేజస్సుచే వెలుఁగుచుండు తమ్ముని లక్ష్మణునిం జూచి, "లక్ష్మణా! మన మగస్త్యమహర్షి చెప్పిన చోటికి వచ్చి చేరితిమి. నీవు నేర్పరివిగదా! ఈ యరణ్యమున నీదృష్టిని బాఱనిమ్ము. ఈ పంచవటి ప్రాంతము వూఁచిన వృక్షములుగల్గి చెన్నుమీఱియున్నది. ఈ యాశ్రమమున మనకు వసతికిఁ దగిన ప్రదేశమేది చూడుము. సీత కేది యిష్టమో, నీకును నాకును గూడ నేదియిష్టమో, యట్టి దాపున జలవసతిగలదియు, వనము యొక్క సొంపును, స్థలముయొక్క సొంపును గలదియునై సమిత్తులు, పుష్పములు, దర్భలు, నుదకము, సమీపమున దొరకునదిగ నుండు నొక ప్రదేశమును జూడుము" అని లక్ష్మణునితోఁ జెప్పెను.

లక్ష్మణుండును నన్నగారి పలుకులు విని చేతులు జోడించికొని, సీతయెదుటనే రాముం జూచి, "ఓ కాకుత్థ్సా! నీవిచ్చట నూఱేండ్లున్నను, నీవు చెప్పినపని చేయువాఁడనేకాని, యేపనిఁ జేయను స్వతంత్రుఁడను గాను. కావున నీవే రమ్యమగుప్రదేశముఁజూచి, "యిచ్చట నాశ్రమము నిర్మింపుమనియానతిమ్ము" అని చెప్పెను.

రాముఁడును గొప్ప మనస్సుగల లక్ష్మణుని మాటకుఁ గడు సంతసించినవాఁడై, తానే సకల సుగుణములతో నిండిన ప్రదేశము నరసి, యొక రమ్యమగు ప్రదేశమునఁ బర్ణశాలను నిర్మింపింపఁ దలఁచికొని, లక్ష్మణుని చేతులను దనచేతితోఁ బట్టుకొని, "లక్ష్మణా! యీ కనఁబడు ప్రదేశము పుష్పితములైన వృక్షములతోఁగూడి, మిట్ట పల్లములు లేక చదునై సొబగుమీఱియున్నది. ఇచ్చటనే శాస్త్రప్రకారముగ నాశ్రమమును నిర్మింపుము. సూర్యునిఁబోలె వెలుఁగు కమ్మని తామిగల పద్మములతో నిండినదై చెన్ను వహించెడి తామరకొలను గన్పట్టుచున్నది. పరబ్రహ్మనిష్ఠగల యగస్త్యమునీంద్రుఁడు చెప్పిన తెఱఁగుననే యీ గోదావరినది పుష్పితములగు వృక్షములతోఁగూడి, హంస, కారం

డవ చక్రవాక పక్షులచే వ్యాప్తమై మనోహరమైయున్నది. సౌమ్యుఁడ
వైన యో లక్ష్మణా! మృగములసమూహములు మెండుగఁగలవియు,
నెమళ్లకూఁతలతో నిండినవియు, పెక్కు గుహలుగలవియు, వికసించిన
చెట్లతోఁగూడినవియు, మహోన్నతములునునైన రమ్యములగు తిప్ప
లంతటను గనఁబడుచున్నవి. ప్రతిచోటను బంగారు, వెండి, రాగి
వన్నెలుగల కావిరాళ్లొడళ్ల కొఱసికొనుటచే నడవియేనుఁగులు గవా
క్షులుగల యట్లు వ్రాయఁబడిన గొప్ప గోడలమాడ్కిఁ దేజరిల్లుచున్నవి.
మద్ది, తాటి, కానుఁగు, ఖర్జూరము, పనస, మామిడి, ప్రబ్బలి, నెమ్మి,
పొగడ, అశోకము, బొట్టుగు, సంపంగి, చందనము, స్యందనము, కడప,
పర్ణాసము, కిత్తలి, చంద్ర, అశ్వకర్ణ, డూడుగు, జమ్మి, దిరిసెన మొదలైన
పుష్పఫలోపేతములగు తీఁగెల జొంపములతోఁగూడిన చెట్లతోఁగూడి,
పెక్కులగు పక్షి మృగముల కునికిపట్టయి యీ ప్రదేశము రమ్యమై
యున్నది. లక్ష్మణా! యీ జటాయువుతోఁగూడ నిచ్చటనుందము" అని
రాముఁడు చెప్పఁగా, శత్రుసంహారియగు లక్ష్మణుఁడును నచ్చట మంటిని
ద్రవ్వి గోడపెట్టి గట్టి వెదుటికూచములు నాఁటి, జమ్మిదుండలు గొట్టి
తెచ్చి పైనవేర్చి, గట్టి త్రాళ్ళతోఁగట్టి, దర్భలు తెల్లు కసవు ఆకులు
మొదలగువానితోఁ జక్కఁగాఁ గప్పి నేల మిట్టపల్లములు లేకుండు
నట్లు చదరముచేసి, రాముని నిమిత్తమై సొగసయిన యాశ్రమ మేర్ప
ఱచి, వేగిరముగా గోదావరీనదికిఁ బోయి, స్నానముచేసి, కమలములను,
పండ్లను కోసికొని మఱలివచ్చి శాస్త్రోక్తప్రకారము గృహదేవతలను
పూజించి, శాంతి యొనర్చి, రామునకుఁ దాను నిర్మించిన యా పర్ణ
శాలను జూపెను.

రాముఁడు లక్ష్మణునిచే నిర్మితమైన యందమగు నా యాశ్రమము
చూచి, సీతతోడఁ బర్ణశాలయందుఁ బ్రవేశించి, కడు నచ్చెరువందిన
వాఁడై, తన రెండుచేతులతో నా లక్ష్మణుని మిక్కిలి యనురాగముతో,
గట్టిగాఁ గౌఁగిలించి "లక్ష్మణా! నీవు చేసిన గొప్ప పనిని జూచి మిక్కిలి
సంతసించితిని. దీనికి బహుమానముగా నీ కీ కౌఁగిలింత యొసఁగితిని.
లక్ష్మణా! నీవు పరుల మనసు నెఱుఁగువాఁడవు, మేలు మఱవనివాఁడవు
ధర్మముల నెఱిఁగినవాఁడవు. ఇట్టి నీవు నేఁ జెప్పకయున్నను, నా మన

సునం దున్న యభిప్రాయముఁ గనిపెట్టి, యన్ని పనులను జేయుచు, ధర్మముఁ దప్పక నాకు శుశ్రూషచేయుచు, న న్నన్ని తెఱఁగులఁ గాపాడు చుండుటవలన, ధర్మాత్ముఁడగు నా తండ్రి మృతినొందక బ్రదికియున్నట్లే నే నెంచెదను" అని లక్ష్మణునితోఁ జెప్పెను. అంత ధర్మాత్ముఁడును, జితేంద్రియుఁడును, గాంతిచే వెలుఁగువాఁడునునైన రాముఁడు సీతా లక్ష్మణులచేఁ గొల్వఁబడుచు, మూలఫలయుక్తమగు నయ్యాశ్రమమున స్వర్గపత్తనమున దేవేంద్రుండునుంబోలె విహరించుచుండెను.

16-వ స ర్గ ము.

లక్ష్మణుఁడు రామునికి హేమంతర్తువు వర్ణించి చెప్పుట

మహాత్ముఁడగు రాఘవుఁడు పంచవటియందలి పర్ణశాలయందు నివసించుచుండఁగా, శరదృతువు గడచి హేమంతర్తువు వచ్చెను. ఆ రఘునందనుం డొకదినము వేఁకువను లేచి, మనోహరమగు గోదావరీ నదికి స్నానార్థము వెడలెను. శూరుఁడగు లక్ష్మణుఁడును సవినయుఁడై కలశముఁ జేతఁ బట్టుకొని, సీత వెంబడిఁ బోవుచు, రామునితో నిట్లనియె.

ప్రియములయినమాటలు పలుకు రామా! నీకుఁ బ్రియమైనదియు, సంవత్సరమున కంతటికిని శోభనుగల్గించునదియునైన రమ్యమగు హేమంతఋతువు సంప్రాప్తమైనది. జనుల యొడళ్లుమంచుచే బొరుసు రేగి యున్నవి. పుడమి పంటలచే వెలయుచున్నవి. జలములు దాఁకుటకు సాధ్యపడనివై యున్నవి. అగ్నిహోత్రుఁడు జనులకుఁ బ్రియమైయున్నాఁడు. (చలి కాచుకొనుటకు నిప్పుంచుకొనియున్నారు). సత్పురుషులు క్రొత్త ధాన్యములువచ్చినవెంటనే క్రొత్త యాగ్రయణ పూజలచేఁ బితృదేవతలను బూజించి, సకాలమున నాగ్రయణ యజ్ఞమును సల్పినవారలయి, పాపములేనివా రగుచు నొప్పుచున్నారు. గ్రామములన్నియు సకల వస్తువులతో నిండినవై, యావులపాడిదండిగఁ గలిగియున్నవి. రాజులును తమ పగతుర గెల్వఁగోరి యుద్ధయాత్రలకు వెడలుచున్నారు. సూర్యుఁడు యమునిచే రక్షితమగు దక్షిణదిక్కు నొందఁగనే, యుత్తరదిక్కు మొగమున బొట్టుపెట్టని యంగనమాడ్కిఁ బ్రకాశములేకయున్నది. హిమవత్పర్వతము స్వయముగా గడ్డకట్టిన మంచుతోఁ గూడినదైనను, ప్రకృతము దక్షిణాయనమునందు సూర్యుఁడు సైతము కడు

దూరమునఁ దిరుగుటచేతను, మంచు హెచ్చుగాఁ గురియుచుండుట చేతను "హిమవంత" మను సార్థకనామముగలదైయున్నది.

ఈ ఋతువునందు మధ్యాహ్నమున వెలుపటఁ దిరుగుట యింపుగానుండును. ఎండ సోఁకుడు దేహమునకు హాయిగానుండును. నీడయు నీరు నెంతమాత్రము గోరఁదగినవి కాక యుండును. ఈ ఋతువునందు సూర్యుఁడు వేఁడిమి లేకయున్నాఁడు. మంచుగురియు చున్నది. చలిగాలి వీఁచుచున్నది. అడవులం దుండువారు చలిమంచు లకు వెఱచి యడవులను విడుచుటచే నడవులు పాడుపడియున్నవి. ఎచ్చటను మంచు దట్టముగఁ గ్రమ్మి యే వస్తువును గానిపింప కున్నది. ఈ హిమవంతమునందు రాత్రులందు జనులు వెలుపటఁ బరుండ కున్నారు. పుష్యమాసము సమీపించి వచ్చినది. ఆకసమంతయు బూడిదరంగు గలిగియున్నది. చలి యొక్కువగ నున్నది. అట్టి రాత్రులు జాములుచాల నిడివిగలవియై యున్నవి. చంద్రునియొక్క చల్లని వెలుఁగు సూర్యునందుఁ జేరియున్నది. మఱియుఁ జంద్రమండలము మంచుచేఁ బొగవన్నెగలదయి యున్నది. నిట్టూర్పుచే మసఁకదగిలిన యద్దమువాఁడి చంద్రుఁడు వెలుఁగకయున్నాఁడు. వెన్నెలయు మంచుచేఁ గ్రమ్మఁబడి పున్నమలందుఁ బ్రకాశింపక, యెండకు వాడి నల్లపాటిన సీతవలెనెంతయు శోభింపకున్నది. స్వభావముచేఁ జల్లఁగసోఁకునదియు, నిప్పుడు మంచుచేఁ మిక్కిలి చల్లనై నదియు నైనందున రెండింతలు చల్లదనముగలిగి పడమటి గాలి వీఁచుచున్నది. సూర్యోదయమందు యవ గోధూమ ధాన్యముల పైరుగల యడవులు పొగమంచుగ్రమ్మి యింపుగా గానముసేయు క్రౌంచసారసపక్షుల ధ్వనులచే నెంతయుఁ బ్రకాశించుచున్నవి. బంగరు వన్నెగల పైరులు ఖర్జూరపుఁబూవులవంటి రూపుగలవై పొట్టలనిండ గింజలుపట్టి గొంచెము వంగినట్లుగ నుండుయొన్నులచే వెలుఁగుచున్నవి. మంచుగ్రమ్మి వ్యాపించుచున్న కిరణములుగలసూర్యుఁ డుదయించి, మీఁదికి చాలదూరమువచ్చినను చంద్రునివలెఁ గానవచ్చుచున్నాఁడు. ఎండ ప్రొద్దుటివేళ నించుక వేఁడి గలదియు, మధ్యాహ్నమున నింపగు సోఁకుడుగలిగి యెటుపు తెలుపుగలసినదియునై ప్రకాశించుచున్నది; అడవి ప్రదేశములు మంచుపడుటచేఁ గొంచెము తడిసిన పచ్చికపడియలు గలదై

యింపగు లే యొండతోఁ గూడి వెలయుచున్నవి. అడవియేనుఁగు మిక్కిలి దప్పిగొన్నదై, తేటయయి యింపగు చల్లని నీటిని దాఁకుచు, చల్లఁదనమున శోర్వజాలక నీటియం దుంచిన తొండమును వెనుకకుఁ దీయుచున్నది. ఈ నీటిపట్టు లగు పక్షులును కొలఁకుల చేరువఁ గూర్చుండియున్నను, చలికి వెఱచి పందలు యుద్ధరంగమునఁ జొఱఁజాల నట్లు నీట దిగకయున్నవి. అడవియందలి చెట్లగుంపులు నీటిమంచనెడు చీకటిచేఁ గ్రమ్మఁబడి, పైనుండి కురియు పొగమంచను నంధకారముచే కప్పఁబడిన పూవులు లేకుండుటంజేసి కన్నులు మూసికొని నిద్రించు చున్నట్లు కనఁబడుచున్నవి. ఇప్పుడు నదులందలి నీ రావిరిచేఁ గ్రమ్మఁబడి యున్నది. మంచు గ్రమ్మియుండుటవలన వానియందలి సారసపక్షులు కూఁతలనుబట్టి తెలియఁదగియున్నవి. గట్టులందలి యిసుక మంచుచేఁ దడిసియున్నది. మంచు పడుటచేతను, ఎండ చుఱుకుగాఁ గాయకుండుట చేతను, చల్లదనముచేతను మిక్కిలి లోఁతయిన కొలఁకులం దుండురుచి గల నీరుగూడ విషమువలెఁ ద్రాగ నర్హముగాకయున్నది. తామర కొలఁకులందలి కమలములు మంచుచేఁ బాడయి, ముదురుటచే రూపు నెడి, రాలిన కింజల్కములు, దిమ్మెలుఁ గలిగి, కాడమాత్రము మిగిలి నవిగా నుండుటచేఁ గొలకులు ప్రకాశము లేకయున్నవి.

ఈ వేళయందును, ధర్మస్వభావుఁడగు పురుషశ్రేష్ఠుఁడయిన భరతుఁడును విచారముతోఁగూడి, నీయందలి భక్తిచే నయోధ్యయందుఁ దపం బొనరించుచుండును. మఱియు నతఁడు రాజ్యమును, గౌరవమును నానావిధములగు ననేక భోగములను వదలి, తపసుచేయు వాఁడయి, కందమూల ఫలములను దినుచుఁ జల్లనైన నేలమీఁదఁ బరుండును. ఆ భరతుఁడు నీ వేళకు నిక్కువముగా స్నానమునకు వెడ లినవాఁడయి, జనులతోఁగూడ ననుదినమును సరయూనది కేఁగు చుండును. ఆతఁ డెక్కువ సుఖములతోఁ బెరిగినవాఁడు; సుకుమా రుఁడు; సుఖములకుఁ దగినవాఁడు. అట్టి భరతుఁ డెట్లు వేఁకువనే లేచి సరయూనదియందు మునుఁగుచున్నాఁడో! కమలదళములం బోలు కన్నులుగలవాఁడు, దిట్టరి, నల్లని మేనిఁడాలుగలవాఁడు, సన్నని నడుము గలవాఁడు, గొప్పవాఁడు, ధర్మజ్ఞుఁడు, సత్యము పలుకువాఁడు,

చెడ్డపనులఁ జేయుటకు లజ్జపడువాఁడు, ఇంద్రియముల గెల్చినవాఁడు, ఇంపుగా మాటాడువాఁడు, సుందరాకారుఁడు, నిడివిచేతులవాఁడు, పగ తురగొంగయు నైన యీ భరతుఁడు సకల భోగములను విడనాడి యన్ని తెఱఁగుల నిన్ననుసరించి యున్నవాఁడు. ధీరుఁడగు తమ్ముఁ డయిన భరతుఁడు వనమున నున్న నీవలెనే మునివేషముఁ దాల్చి తపస్సుచేయుచుండుటవలన ధన్యుఁ డయ్యెను. పురుషులు తండ్రి పోలి కలనుగాక తల్లిపోలికలనే యనుసరింతురని లోకమున వాడుకగలదు. ఈ లోకప్రవాదము భరతునివిషయమున విపరీతమయ్యెను. దశరథుఁడు మగఁడును, సాధువగుభరతుఁడు కుమారుఁడునునయిన యీతల్లి కైకేయి యట్టి క్రూరస్వభావముకలదగుట యెట్లు? అని లక్ష్మణుఁడు తన యన్నతోఁ జెప్పెను.

ధర్మము ననుసరించువాఁడయిన లక్ష్మణుఁ డిట్లు చెలిమితోఁబలుకఁగా, రాముఁడు తల్లియొక్క నింద నోర్వఁజాలనివాఁడయి, "నాయనా! నీ నడిమితల్లి నెప్పటికి దూరవలదు. దశరథ భరతులనుగూర్చియే యింత దూరమైనను మాటాడుము. నేను వనవాసము చేయవలసినదియని దృఢ ముగానిశ్చయించుకొన్నవాఁడనైనను, భరతునిఁ దలఁచుకొన్నప్పుడతని యందలి యనురాగముచే, మనస్సు చంచలమగుచున్నది. ఇష్టములును, మనోహారములును, మనస్సున కింపితములును, అమృతముం బోలినవియు, మనస్సునకు సంతోషజనకములునునైన భరతుని వాక్యముల నెల్లప్పుడు స్మరించుచునే యున్నాను. రఘునందనా! భరతుఁడును, శత్రుఘ్నుఁడును, నీవును, నేనును, మన మందఱు మెప్పుడు చేరఁగలము!" అని యిట్లు విల పించుచు గోదావరీనదికిఁబోయి యా నదియందు స్నానముచేసెను. అంతట సీతయు లక్ష్మణుఁడును స్నానమాచరించిరి. వారు ముప్పురును స్నాన మొనర్చి, దేవతలకును, బితృదేవతలకును నుదకముచేఁ దర్పణంబు గావించి,యుదయించుచున్న సూర్యున కుపస్థానము చేసి దేవతలను నుతిం చిరి. అప్పుడు స్నానమాచరించినవాఁడగు రాముఁడు, సీత ప్రక్కనఁ గూర్చుండియుండఁగా, లక్ష్మణుఁ డెదుట నిలిచియుండఁగా, నందికేశ్వరుఁ డెదుట నుండఁగా పర్వతరాజపుత్రితోఁగూడిన భగవంతుఁడగు శంకరుని చాడ్పున వెలయుచుండెను.

17-వ స ర్గ ము.

శూర్పణఖ రామునిం జూచి మోహించుట

రాముఁడును, సీతాలక్ష్మణులును స్నానముచేసి, గోదావరినుండి తమ యాశ్రమమునకుఁ బోయిరి. రామలక్ష్మణు లాశ్రమమునకుఁబోయి చేరినతర్వాతఁ బ్రాతర్గకాలమునఁ జేయవలసిన యనుష్ఠానములను దీర్చు కొని పర్ణశాలలోనికిఁ బోయిరి. అటుతర్వాత పర్ణశాలయందు సీతతోడఁ గూర్చుండి, చిత్రానక్షత్రముతోఁగూడిన చందురునివలె వెలుఁగుచున్న నిడుపుచేతులు గలవాఁడగు నా రాముఁడు మహాస్థులుచేయు మన్ననల వలన నానందము నొందుచుఁ దమ్మునితోడ నానావిధములయిన కథలను జెప్పుచుండెను.

రాముఁ డట్లు మిగుల నాసక్తితోఁ గథలుచెప్పుచుఁ గూర్చుండి యుండఁగా, నా ప్రదేశమున కొక్క రక్కసి తనంత వచ్చెను. అయ్యది రావణుని చెల్లెలు. శూర్పణఖ యనుపేరుగలది. ఆ శూర్పణఖ సింహము వంటి వెడద మోమ్ముగలవాఁడును, బలము గలచేతులవాఁడును, కమల ములంబోలు కన్నులు గలవాఁడును, మోకాళ్లవఱకునుండు చేతులుగల వాఁడును, వెలుఁగులు చిమ్ముచున్న మోముగలవాఁడును, చూడమిగుల సొంపుగనుండువాఁడును, నేనుఁగునడకవలె గంభీరమగు నడకగలవాఁ డును, జడలగుంపు దాల్చినవాఁడును, సుకుమారుఁడును, కడుబలవంతుఁ డును, రాజలక్షణములతోఁ గూడినవాఁడును, నల్లకలువమాడ్కి నల్లనైన వాఁడును, మన్మథుని కాంతింబోలు కాంతిగలవాఁడును, నింద్రునిఁబోలు వాఁడునునైన యా రామునిఁ జూచి, మోహించినదాయెను. శూర్ప ణఖ రామునిఁజూచి మోహించినను, రామునకును శూర్పణఖను సౌందర్యవిషయమున హస్తిసూకరతారతమ్యము గనుపట్టెను. రాముని మోము చిఱునవ్వుతోఁగూడియుండె. శూర్పణఖమోము చూడ నేవ గొలుపుచుండె. రామునినడుము గుండ్రనైయుండె. రక్కసినడుము పెద్దకడుపుగలదై యుండెను. రాముఁడు వెడదకన్నులవాఁడు; శూర్ప ణఖ వికృతంపుఁజూడ్కిలకన్నులు గలది. రాముని శిరోజములు మృదు వులు; శూర్పణఖ యెట్టిని శిరోజములు గలది. రాముఁడు చక్కనైన వాఁడు; శూర్పణఖ చక్కఁదనము లేనిది. రాముని కంఠధ్వని శ్రావ్య

మయినది; శూర్పణఖ బట్టెగొంతుగలది. రాముఁడు ప్రాయంపువాఁడు; రాక్షసి కడు ముసలిది. రాముఁడు చమత్కారముతోడ మాటాడువాఁడు; శూర్పణఖ గ్రామ్యోక్తు లాడునది. రాముఁడు న్యాయమందు నడచువాఁడు, శూర్పణఖ చెడునడతగలది. రాముఁ డందఱికిఁ బ్రియుఁడు; శూర్పణఖ చూచుటకు రోఁతపుట్టించునది. ఇట్టి సుగుణ విశిష్టుఁడయిన రాముని జూచి యట్టి దుర్గుణ విశిష్టురాలయిన శూర్పణఖ తన కతఁడు దొఱకువాఁడు కాఁడని తలంపక, తుంటవిలుకానిబారిం దవిలి, యా రామునితో నిట్లనియె.

"ఓరీ! నీవు జడదారివై బాణకార్ముకములను ధరించి, భార్యా సమేతుఁడవై రక్కసులు దిరిగెడి యీ ప్రదేశమునకు నెట్లేతెంచితివి? నీ వికృడికి వచ్చినపనియేమి? ఉన్నది యున్నట్లు చెప్పుము." అని శూర్పణఖ యడుగఁగఁ బగతుర మాడ్చునట్టి రాముఁడు కుచ్చితము లేనివాఁడగుటంజేసి, యంతయుఁ జెప్పఁ బూనెను. రామున కెప్పటికిని స్వాభావికముగానే బొంకులాడుట లేదు. అందును దపోవనమున నున్న వాఁడు; అంతియకాక యీఁడుదానితో మాటాడుచున్నాఁడు. కావున నతఁడు బొంకులాడునే? కావుననే రాముఁడు శూర్పణఖను జూచి, "ఓరక్కసీ! దేవేంద్రుని కెనవచ్చు మగఁటిమిగలదశరథుఁ డను నొక నృపుడుండెను. ఆతనికి నేఁ బెద్ద కొమరుండను. జనులు నన్ను రాముఁ డందురు. ఇతఁడు నా తమ్ముఁడు. లక్ష్మణుఁ డను పేరితో నితనిం బిల్తురు. ఇతఁడెల్లప్పుడు నన్ను వెంబడించియే యుండును. ఈపె నాభార్య; విదేహరాజుకూఁతురు; సీతయని పేరుగన్నది. నేను తల్లిదండ్రుల యానతికి లోఁబడి, వారు నన్నడవికిఁ బొమ్మనఁగాఁ దండ్రియాజ్ఞ నెఱవేర్చుట యను ధర్మము నడపఁగోరినవాఁడనై, వనవాసమునకై యీ యరణ్యమున కేఁగుదెంచితిని. నా సంగతి యిది. చెప్పితిని. ఇఁక నీ వెవతెవో; ఎక్కడనుండుదానవో? ఎవ్వరిదానవో చెప్పుము. ఇంత చక్కని రూపుగల నీవు రక్కసి వని నాకుఁ దోఁపలేదు. ఇక్కడికి నీ వెందులకు వచ్చితివో నిక్కముగఁ జెప్పుము." అని యడిగెను.

ఆ శూర్పణఖయు మన్మథపరవశయయి, "రామా! నా వాస్తవమయిన సంగతిని జెప్పెదను వినుము. నేను శూర్పణఖయను పేరుగల

A 46

రామలక్ష్మణులు శూర్పణఖను కురూపిం జేయుట—39

B 46

రక్కసిని. వలయు రూపముఁ దాల్చుదానను. నేను జనుల కందఱకు వెఱపు పుట్టించుచు నొంటరిగ నీ యడవియందుఁ దిరుగుచుందును. బలవంతుఁడును విశ్రవసుని పుత్రుఁడునునైన రావణుఁడను ప్రసిద్ధిగల రక్కసులజేఁడు నాకుఁ దోఁబుట్టువు. అతనిం గూర్చి నీవు వినియుండ వచ్చును. బలిష్ఠుఁడు, నిరంతరము నిద్దుర చెందువాఁడునైన కుంభకర్ణుఁడును, రాక్షసకృత్యములమాని, ధర్మమునందే యాస్థగలవాఁడగు విభీషణుఁడును నాతోఁబుట్టువులు. యుద్ధమునఁ బ్రసిద్ధిఁగన్న ఖరదూషణులును నాసోదరులు. రామా! నేను నిన్నుఁ జూచుటచే మావారి నెల్లరఁ బరిత్యజించి, పురుషశ్రేష్ఠుఁడవైన నిన్ను భర్తనుగా నొందఁ గోరితిని. నేను మహిమగలదానను, వలయు బలిమి నొందఁగలదానను; నీవు నాకుఁ బ్రియుఁడవుగమ్ము. ఈ సీతతో నేమిపని. దీనిని దఱుమఁ గొట్టుము. ఈ సీత రూపులేనిది. రోత పుట్టించునది. ఇదియెంత మాత్రము నీకుఁ దగదు. నేనే నీకుఁ దగిన భార్యను. నేనెంత యంద కత్తెనో చూడుము. కురూపిణియు, చెడ్డదియు, గయ్యాళియు, ప్రేలాడు బోజ్జగలదియునైన యీ మానుషజాతిస్త్రీని, నీ తమ్ముని భక్షించెదను. పిదపఁ గాంతుఁడా! మన మిరువురమును క్రీడాపర్వతముల శిఖరములందును, పలుకాననలను జూచుచు, దండకారణ్యములందు విహరించుచుందము." అని శూర్పణఖ చెప్పఁగా, రాముఁడు పకపక నవ్వి, తన చమత్కారము మెఱయ నా శూర్పణఖ కిట్లనియె.

18-వ స ర్గ ము.

రామలక్ష్మణులు శూర్పణఖను కురూపిణిం జేయుట

అంతట రాముఁడు చెఱకువిలుకాని త్రాటిచేఁ గట్టఁబడియున్న శూర్పణఖను జూచి, చిఱునవ్వు మోముగలవాఁడై స్పష్టములయిన తిన్నని పలుకులతో నిట్లనియె. "ఓ వూర్ధ్వకేశీ! నేను పెండిలి యయిన వాఁడను. ఈ సీతయె నాకుఁ బ్రియురాలు. మఱియు నీవంటి యుత్తమ కాంతలకు సవతిపో రోర్వరానిది. ఈ నా తమ్ముఁడు మంచి నడవడిగల వాఁడు. అందగాఁడు. కాంతిగలవాఁడు. పెండ్లాము లేనివాఁడు. మగటిమిగలవాఁడు. పూర్వము భార్యాసుఖ మెఱుఁగనివాఁడు. ప్రాయంపు వాఁడు. చూడ్కికింపయినవాఁడు; నీ రూపమునకుఁ దగిన ప్రియుఁ

దుగా: గలఁడు. ఓ విశాలాక్షీ! నీ వీ నాతమ్మునిఁ బెనిమిటినిగా వరింపుము. ఓ ఉత్తమకాంతా! అట్లొనర్చితివేని, నీవు సవతిపోరు లేక మేరు పర్వతమును సూర్యరశ్మి పొందినట్లు లక్ష్మణుని పొంది వెలయుచుందువు.

అని యిట్లు రాముఁడు పలుకఁగా, శూర్పణఖ మన్మథపరవశురాలై రామునింబాసి, వెంటనే లక్ష్మణుకడకు వచ్చి, "లక్ష్మణా! నేను నుత్తమకాంతను. ఈ నీరూపంబునకు నేను దగినదాఁనను. నీవు నాతోఁ గూడి యీ దండకారణ్యమునంతయుఁ దిరుగుదువు" అని చెప్పఁగా, మాటలందు నేర్పరియైన లక్ష్మణుండు నవ్వి శూర్పణఖతో నిట్లు తగిన రీతిని జెప్పెను. "కమలవర్ణముగల యంగము గలదానా! నీవేల పని వానికిఁ బ్రియురాల వగుటకుఁ గోరెదవు? నే నెల్లప్పుడు మాయన్న గారి పనివాఁడను. ఆతని కధీనుఁడను. నీవు నన్నుఁ బెండ్లాడితివేని నీవును దాసివై రాముఁడు చెప్పు పనులు చేయవలయు. విరివికన్నులదానా! కొఱఁతలేని కోర్కులు గలదానవు, సంతుష్టురాలవు, విమలరూపము దాల్చినదానవు నయిన నీవు సర్వాసమృద్ధుఁడయిన రామునకు చిన్న భార్యవుగమ్ము. ఈతఁడును రూపులేనిదియు, చెడ్డదియు, గడుసుదియు, బలిసిన బొజ్జగలదియునైన ముదుసలియగు నీ సీతను వదలి నిన్నే కొల్చుచుండును. గొప్ప పిఱుఁదులుగల దానవునైన యో శూర్పణఖా! యీ నీ మేటి రూపమును జూచినపిదప నిఁక మానుష కాంతలపై నెవఁడు మనసు పెట్టును!" అని లక్ష్మణుఁడు శూర్పణఖతో ననెను.

పరులను వెఱపించునదియు, పెరిగిన పొట్టగలదియునైన యా శూర్పణఖ తాను హేలన మన నెట్టిదో యెఱుఁగనిదై, యా లక్ష్మణు పలుకులు వాస్తవము లనియె తలఁచి, కామమునకు లోఁబడినదై, యాకుటింట సీతతోడఁ గూర్చుండియున్న, శత్రులకు లొంగని వాఁడును, శత్రుసంహారియునైన రామునికడ కేఁగుదెంచి, "కురూపిణియు నసతియు, కరాళయు, లావు నడుముగలదియునైన యీ ముదుసలి పెండ్లామును గట్టుకొని, నన్నేల సరకుసేయకున్నావు? ఇప్పుడే నీ యెదుటనే మానవకాంతయగు దీనిని భ్రింగెదను. ఆవల నేను సవతిపోరు లేక, నిర్భయముగా నీతోఁగూడి సంచరింతును" అని చెప్పుచుఁ గొఱవులం

బోలు చూడ్కులుగలదై, యొక్కువ యాగ్రహముతోఁ దోఁకచుక్క రోహిణిమీఁది కుఱుకునట్లు సీతమీఁది కుఱికెను.

మహాబలుఁడగు రాముఁడు కనలి, యపుపాశమో యనఁదగినదై సీతమీఁదికి వచ్చెడి యా శూర్పణఖను నివారించి, లక్ష్మణునితో నిట్లనెను. "సౌమిత్రీ! క్రూరులగు దుష్టులతోఁ బరియాచకము లాడరాదు. సాయనా! సీత భ్రదికియుండునట్లు చూచుకొనుము. పురుషోత్తమా! విరూపయు, చెడ్డదియు, నెక్కువ మదించినదియు, పెద్దకడుపుగలదియు నైన యీ రక్కసిని రూపు సెఱిచి పంపవలయును" అని రాముఁడు చెప్పఁగా మహాబలుఁడగు లక్ష్మణుఁడు రాముని సమక్షముననే కత్తి దూసి యా శూర్పణఖయొక్క ముక్కు చెవులం గోసెను.

అట్లు లక్ష్మణుఁడు ముక్కును చెవులను గోయఁగా, భయంకర స్వరూపముగల శూర్పణఖ వెట్టిగా నఱచి, వచ్చినదారిని పఱువిడి పోయెను. అట్లు పోవుచున్న వెఱపుఁగలిగించు వికృతంపు రూపు దాల్చిన యా రక్కసి నెత్తుటిచే నొడలంతయుఁ దడిసి, వర్షాకాల మేఘము మాడ్కి నానావిధములం గర్జనలు సల్పుచుండెను. వెఱపించు చూడ్కిగల యా శూర్పణఖ పలుతెఱఁగులుగా రక్తమును గార్చుచుఁ జేతులు పైకెత్తి యార్చుచు వనములోఁ బ్రవేశించెను. అట్లు ప్రవేశించి, విరూపిణిగఁ జేయఁబడిన యాశూర్పణఖ, రక్కసులగుంపుతోఁ గూడినవాఁడై జనస్థానమున నున్న భయంకరాకారుఁడగు తన తోఁబుట్టువగు ఖరునిఁ జూచి, దుఃఖమోహాములు పెనఁగొన, రక్తము వెల్లువయై పాఱ, నాకసమునుండి పడిన పిడుగువలెఁ గ్రిందఁబడి, తిన్నగలేచి, యా యరణ్యమునకు రామలక్ష్మణులు సీతతోఁగూడి వచ్చియుండుటయుఁ దన్ను ముక్కు చెవులుగోసి కురూపిణిం జేయుటయు మున్నుగాఁగల యన్ని వృత్తాంతములను దన తమ్మునితోఁ జెప్పెను.

19-వ సర్గము.

{ ఖరుఁడు శూర్పణఖయొక్క వృత్తాంతమువిని సైనికులను యుద్ధమునకుఁ బంపుట }

అంత ఖరుఁడట్లు దేహమంతయు శోణితార్ద్రమై, క్రిందఁబడి పొఱలుచున్నదియగు విరూపిణియైన తన యప్పను జూచి యిట్లనెను.

"ఓసీ! లెమ్ము. దుఃఖమును, తత్తరపాటును వీడుము. ఎవఁ డిట్లు నిన్ను వికృతరూపనుగాఁ జేసెను? స్పష్టముగాఁ జెప్పుము. ఎవఁడు తన కేమియు హానిచేయని, కోఱలనిండుగ విషముగలదగు నెదుటికివచ్చిన కృష్ణసర్పమును వేడుకగా వ్రేలితోఁ ద్రొక్కి పీడించుచున్నాఁడు? ఎవఁడు కాలపాశమును మెడయందు వైచికొని, యజ్ఞానముచే దానిని దెలియకున్నాఁడు? ఎవ్వఁడు నిన్నుఁ దాఁకి మిక్కిలి తీవ్రమైన విషమును గ్రాగినవాఁడు? బలపరాక్రమములుగలదానవు, స్వేచ్ఛమై తిరుగు దానవు, కామరూపము దాల్చుదానవునైన మృత్యుదేవతవంటి నీ కెవ్వఁ డిట్టి యపరాధము సేసెను? నిన్నిటులు విరూపనుగాఁ జేసినవాఁడు దేవ గంధర్వపిశాచములలోఁగాని, మహోత్సులగు మహర్షులలోఁగాని యెవ్వఁడు? లోకమున, వేయిగన్నులవాఁడు, పాకాసురుని గొంగయు నైన దేవేంద్రుఁడుతప్ప నీఁక నెవ్వఁడును నాకపకారము సేయఁ జాలఁడు. శూర్పణఖా! చెప్పుము. హంస ముదకమునఁ గలిసిన పాలును గ్రోలునట్లు, నే నిప్పుడు పరుల ప్రాణములఁ దీయునట్టి మార్గణము లేసి వాని ప్రాణములఁ గొనెదను. నే నాయపట్టులు దెగునట్లేసిన బాణమ్ములు దవిలి క్రిందఁబడిన యెవనిరక్తము నురుగులు గట్టుచుఁ గాఁకినప్పుడు పుడమి దేవి పానముచేయనున్నది? ఎవఁడు నాచే యుద్ధమునఁ జచ్చినప్పుడు, గ్రద్దలు మొదలగు పక్షులు సంతసముతోఁ గూడినవై యతని యొడలి నుండి మాంసమును పీకుకొని తినఁగలవు? నా కపకారము సేసి నన్ను రేపి, నాతోఁ గయ్యమునకు వచ్చిన యధముని దేవగంధర్వపిశాచ రాక్షసులలో నెవ్వరు నడ్డగింపఁజాలరు. తిన్నగా జ్ఞప్తికిఁ దెచ్చుకొని యే దుష్టుఁడు నీ కిట్టి యపకారము చేసెనో తెలియఁజెప్పుము" అని ఖరుఁడు శూర్పణఖ నడిగెను.

ఇట్లు మిక్కిలి క్రోధముతోనున్న ఖరుఁ డాడిన మాటలను విని, శూర్పణఖ గన్నీరు విడుచుచు నిట్లనియె. "ప్రాయంపువారు, సౌందర్యవంతులు, సుకుమారులు, బలిష్ఠులు, కమలములవలె వెడల్పయిన కన్నులుగలవారునై వల్కలాజినములను దాల్చి, ఫలములను దుంపలను దినుచు, జితేంద్రియులై తపము సేయుచు ధర్మరతులై యున్నవార లగు దశరథుని పుత్రులు రామలక్ష్మణు లనునన్నదమ్ములు వననము

నుండిరి. గంధర్వరాజుంబోలువారును, రాజచిహ్నములతోఁ గూడిన వారునునైన యా యిరువురు దేవతలో, మనుజులో యూహింపఁజాల కున్నాను. వా రిరువురికి నడుమ జవ్వనియు, చక్కనిదియు, తొడవు లన్నిఁటిని దాల్చినదియునైన సన్ననినడుముగల యొక చామ గూర్చుండి యుండఁగాఁ గంటిని. ఆ జవరాలినిమిత్తము వా రిరువురు గలిసి దిక్కు లేనిదానింబోలె నన్నిట్టి యవస్థ నొందించిరి. యుద్ధరంగమున మృతు లైన యా యన్నదమ్ములయొక్కయు, చెడ్డ నడతగలదియగు నయ్యతివ యొక్కయు రక్తముఁ గ్రోలుటకుఁ గోరుచున్నాను. ఇదియే నా మొదటి కోరిక. ఈకోరికి నీవలనఁ దీఱవలెను." అని శూర్పణఖ ఖరునితోఁ జెప్పెను.

ఇట్లు శూర్పణఖ పలుకఁగా; ఖరుఁడు కనలినవాఁడై, బలాఢ్యు లయి, జమునికెనవచ్చు పదునలుగురు రాక్షసులను బిలిచి, "ఇద్దఱు నరులు, శస్త్రాస్త్రములను దాల్చినవారలై, వల్కలకృష్ణాజినములను దాల్చి ప్రాయంపుటాలితోఁగూడ దండకారణ్యము చొచ్చియున్నారు. ఆ పురుషులను, ఆ స్త్రీని వధించి వారి రక్తముఁ దెండు. ఈ నా తోఁబుట్టువు వారి రక్త మానుటకుఁ గోరుచున్నది. మీరు స్వబలము చూపి, వేగముగా దీనికోర్కి నెఱవేర్పుఁడు." అని ఖరుఁడు రక్కసుల కానతిచ్చెను. ఇట్లు ఖరుని యానతిం బడసిన యా పదునలుగురు రాక్ష సులు గాలిచేఁ గొట్టుకొనిపోవు కాఱుమబ్బులం బోలినవారలై యా శూర్పణఖతోఁగూడి రాముని యాశ్రమమునకుఁ బోయిరి. అట్లు రేఁద్రిమ్మ రులు కఱకుటమ్ములం గలవారలయ్యు, మిక్కిలి వేఁడ్రమయిన తేజము గల యా రాముని, యడవియేనుఁగులు జ్వలించుచున్న కాఱుచిచ్చును మాడ్కి నేమియుఁ జేయజాలకపోయిరి.

20-వ స ర్గ ము.

ఖరుం డంపిన పదునలుగురు రక్కసులు మడియుట

అంత భయంకరాకారయగు శూర్పణఖ రాముని యాశ్రమము నకు వచ్చి రక్కసులకు రాముని, లక్ష్మణుని, సీతను జూపెను. ఆ రక్కసు లాకుటింటఁ సీతాలక్ష్మణులతోఁగూడఁ గూర్చుండియున్న బలవంతుఁడగు రామునిం జూచిరి. శ్రీమంతుఁడయిన రాముఁడును వచ్చిన రక్కసులను,

దమువలన భంగపడి పోయి వచ్చిన యాశూర్పణఖనుజూచి, తేజస్సుచే వెలుఁగొందుచున్న లక్ష్మణునితో "లక్ష్మణా! నీవు క్షణకాలము సీత చేరువనుండుము. ఈ శూర్పణఖతోఁగూడ వచ్చిన రక్కసులను జంపెదను." అని పలికెను. లక్ష్మణుఁడును, తన్నుఁదా నెఱిఁగిన రాముని యొక్క పలుకులు విని యట్లేయని చెప్పి యా ప్రకారముగా నుండెను.

ధర్మాత్ముఁడగు రాముఁడును బంగరునగిషీపని సేయఁబడిన వింటి నెక్కువెట్టి, యా రక్కసులను జూచి, "ఓ నక్తంచరులారా! మే మిరువురము దశరథుని పుత్రులము. రామలక్ష్మణు లనెడిపేరులు గలవారము. అన్నదమ్ములము. సీతను దోడ్కొని చొఱ నలవికాని యీ దండకారణ్యమునకు వచ్చితిమి. మేము కందమూల ఫలములను దినుచు జితేంద్రియులమై యీ దండకారణ్యమునఁ దపమునేయుచు స్వధర్మనిరతులమై వసించుచున్నారము. మావలన నేరికిని హింస లేదు. అట్లుండ మీరేల మమ్ముఁ దొందరపెట్టెదరు? పాపాత్ములరై మునుల కపకార మొనర్చుచుండు మిమ్ము నుగ్గునేయ మునీంద్రుల పనుపుచేత వింటిని, అమ్ములను జేతఁ బట్టి యిచ్చటికి వచ్చితిని. ఓ నిశాచరులారా! మీకుఁ బ్రాణముల మీఁది యాస గలదేని వెళ్లుఁడు. లేదేని, యిచ్చటనే యుండుఁడు. మిమ్ము జమునిప్రోలికిం బంపెదను.

ఆ రాముని పలుకు లాలకించి, శూలములు దాల్చినవారలైన బ్రహ్మహూతకులగు నా పదునలుగురు రక్కసులును గడు నలిగినవారలై, రాముని జూచి, "మహాబలవంతుఁడగు మా జ్యేఁడయిన ఖరునకుఁ గోపము పుట్టించితివిగాన, మా చే సంగరమున బాగుగ మర్దింపఁబడి, నీవే ప్రాణములను విడువఁగలవు. మేము పదునలుగురము. నీ వొక్కఁడవు. నీవు కలనియందు మాయెదుట నిలువనైనగలవే? ఇఁక నీ కెక్కడిది మాతోఁ బోరుచేయుశక్తి? రా. మే మేయునట్టి శూలపట్టిసపరిఘముల తాఁకుళ్ళఁ జేసి నీవు నొచ్చినవాఁడవై ప్రాణములను వీర్యధనుస్సులతోఁగూడ విడువఁగలవు" అని చెప్పి, యాపదునలుగురు రక్కసులును మిక్కిలి యాగ్రహముతోఁగూడి జయింప నలవికాని రామునిపైఁ బ్రసిద్ధములగు శూలముల నేసిరి. రాముఁడును నా రాక్షసు లేసిన పదునాలుగు శూలములను బంగరు పనిగల యన్ని బాణములచే నన్నింటిని దునుమాడెను.

తర్వాత మహా తేజముగల రాముఁడు పరమకుపితుఁడై సూర్యనింబోలి వెలుఁగుచున్న సానఁ బెట్టిన పదునాలుగు నారసములను పదునలుగురిపై నేసి, మఱల బాణములను సంధించిన రాక్షసులపై గుఱివెట్టి, దేవేం ద్రుఁడు వజ్రాయుధమునుబోలె నేనెసు. బంగరుపనిగలిగి, బంగరు ములులతో నొప్పుచున్న యా బాణములుమండుచు వేగముతోఁబోయి యా రక్కసుల ఱొమ్ములను భేదించి, నెత్తుటఁ దడిసినవై, పిడుగులం బోలె ధ్వనిచేయుచుఁ బుడమిలోనికిఁ గ్రుక్కుకొనిపోయెను. ఆ రక్క సులును ప్రక్కలైన ఱొమ్ములగలవారలై, నెత్తుటిచేఁ దడిసిన మేనితోఁ గూడి, రూపుమాసి, ప్రాణములఁ దొఱఁగి, మొదలు దెగిన చెట్లవలె నేలం గూలిరి. రక్కసియు గడు నలిగినదై, నేలంగూలిన రక్కసులను జూచి, మిక్కిలి యడలి, పెల్లుగా వెఱపించు నఱపుల నఱచుచు, మఱల గొప్ప నాదమునేయుచు, ఖరునికడ కేతెంచి, మఱల దుఃఖించుచు నెత్తురెండి పోవఁగా రసముగాఱుచుండు నందుగుచెట్టుమాడ్కి గ్రిందఁబడెను. అప్పుడు శూర్పణఖ వ్యసనపీడితయై, మోము వెలవెల పాఱఁగా మాటి మాటికిఁ బేరెలుఁగువెట్టి యేడ్చుచు గన్నీటిని విడిచెను. శూర్పణఖ రణ మున నిహతులైన రక్కసులను జూచి మఱలఁ బరుగిడివచ్చి యా రక్కసు లందఱు రణమున నిహతులైన సంగతినంతయు ఖరునకుఁ జెప్పెను.

21-వ స ర్గ ము.

శూర్పణఖ మఱల ఖరునితోఁ జెప్పి విలపించుట

ఆ ఖరుఁడును తమ చెఱుపు నిమిత్తము వచ్చి తన మ్రోలఁబడి విలపించుచున్న శూర్పణఖంజూచి "ఓ శూర్పణఖా! నీ నిమిత్త మిప్పుడే శూరు లగు నల్లరాక్షసులను బంపితినిగదా! మఱల నీ వేల యిట్లేడ్చుచున్నావు? ఆ రాక్షసులు నాకు భక్తులు. అనుఁగుఁజెలి కాండ్రు. అనయము నా మే లర్థయువారు. శత్రువుల వధించువారు గాని, శత్రువులకుఁ జంపనలవికానివారు. వారు నామాట చేయకుండు రనుట యొన్నఁడును లేదు. అట్లుండియు, నీవు "అయ్యో! నాథా!" యని యార్చుచు నెందు కిట్లు పుడమిపైఁ బొఱలుచున్నావు? ఏల యిట్లు విల పించెదవు? కారణము దెలియఁగోరుచున్నాఁడను. నీకు దిక్కుగా నే

నుండఁగా, నీవేల యిట్లు దిక్కులేనిదానివలె విలపించెదవు? లే లెమ్ము. వెఱవకుము. ఇప్పుడు వ్యసనము మానుము." అని చెప్పెను.

అంత నితరుల కెదిరింప నలవికాని యా రాక్షసకాంత ఖరుని యూఱడింపుమాటల నాలకించి కన్నీరు తుడిచికొని, తోఁబుట్టువగు ఖరుం జూచి, "నేను ముక్కుచెవులం గోలుపోయి, నెత్తుటిధారలం దడియుచు, నీకడ కేతేరఁగా నీవు ననూఱడించి, నా మనోరథసిద్ధికై రామలక్ష్మణులను జంపుటకొఱకుఁ బదునల్గురను రక్కసులను బంపితివి. వారు కుపితులయి శూలపట్టిసములను గైకొని రాముని పైఁ బోయి, యా రాముఁ డేయు మర్మభేదకములైన సాయకముల ధాటికోర్వలేక మడిసిరి. రాముఁ డొక్కఁడే మహాబలులగు రక్కసుల నందఱను క్షణములోపలనే చంపుటను జూచి నాకుఁ గడు వెఱపు పుట్టెను. కావున నేను మిక్కిలి యులికిపడి, మఱల నిన్ను శరణుచొచ్చితిని. దుఃఖపీడితనైన నా కన్నికడలను భయమే తోఁచుచున్నది. విచార మనెడి మొసళ్ళగల దియు, భయ మనెడియలలతో వెలయునదియునైన విస్తారమగు దుఃఖ సముద్రమున మునిఁగియుండు నన్నేల రక్షింపకున్నావు? పొలసుదిండు లైన నా వెంబడి వచ్చిన రక్కసులనందఱను రాముఁడు కఱకుటమ్ములనేసి కూల్చెను. ఓ ఖరుఁడా! నీకు నాయెడ జాలి గలదేని, ఆ రాక్షసుల మరణమునకుఁ జింతనొందితివేని, రామునితోఁ బోరు బలపరాక్రమములు నీకుఁ గలవేని, రక్కసుల గొంగయైన దండకారణ్యవాసియగు నా రఘురాముని బరిమార్పుము. నా పగతుఁడగు రాముని నిప్పుడు దెగటార్పవేని, నీ ముందటనే సిగ్గుమాలినదానినై ప్రాణములఁ దొఱఁగెదను. యోచించిచూడ, నీవు నేనలతోఁగూడి పోయినను, శూరుఁడగు రాముని ముందట నిలువఁజాలవని తలంచెదను. నీవు మనుష్యమాత్రులగు రామలక్ష్మణులను వధింపఁజాలనివాఁడవయ్యు, "నేను దిట్టరి" నని తలఁచుచు, వ్యర్థముగాఁ బరాక్రమము నీయెడ నారోపించుకొనుచున్నాఁడవు. కులమునకుఁ జెఱుపనచేఁటయైన యో ఖరుఁడా! రాముని తోఁ బోరు మగఁటిమిబలములు నీకుఁ గలవేని, దండకారణ్యమున నివసించు రాముని బరిమార్పుము. బలిమి యుడిగి, మగటిమిం జూపఁ జాలక యుండు నీ విచ్చట నుండుటేల? నీవు బందుగులతోఁ గూడ,

జనస్థానమువిడిచి పాఱిపోవ్ము. నీ విచ్చట నుండుట కేమా త్రమును తగవు. అటుగాదేని, నీవు రాముని తేజస్సునఁబడి వేగిరమె నశింతువు. దశరథాత్మజుఁడగు రాముఁడు గొప్పతేజస్సుగలవాఁడు. ఈతని తమ్ముఁడును మిక్కుటమగు మగతనము గలవాఁడు. ఆతఁడె నన్నిట్లు వికృత రూపనుగఁ జేసెను" అని యిట్లు చెప్పి, పెద్దబొజ్జగల యా రక్కసి పలు తెఱఁగుల వగచి, చేతులతోఁ గడుపుపైఁ బాదుకొని గొంతెత్తియేడ్చెను.

22-వ స ర్గ ము.

ఖరుఁడు రామునిమీఁదికిఁ బోవుట

ఇవ్విధమున శూర్పణఖ రాక్షసులనడుమఁ జేసిన యవమానము నోర్వఁజాలక, ఖరుఁడు మిక్కిలి తీవ్రముగా నిట్లనియె: "ఓ శూర్పణఖా! నీ వొనర్చిన యవమానమువలనఁ బుట్టిన కోపాగ్ని నుప్పొంగిన లవణ సముద్రము కైవడి సహింపఁజాలకయున్నాను. అల్పాయుష్కుఁడైన నరుఁడగు రామునిఁ బుగఁటిమింగూర్చి నే నెంతమాత్రము సరకు సేయను. ఆ రాముఁడు తా నొనర్చిన దుష్టకార్యములకు ఫలముగా నిప్పుడె ప్రాణములఁ గోలుపోవఁగలఁడు. కావున నీవింక నేడ్పును మానుము. ఈ తత్తరపాటేల? వీను రాముని వానితమ్మునిని జముని ప్రోలికిఁ బంపెదను. కలనియందు రాముని నే నిదిగో గొడ్డటితో నఱకెదను. నీ వా రాముని వెచ్చని నల్లఁ బీల్తువు." అని ఖరుఁడు చెప్పఁగా, శూర్పణఖ మొదట ఖరుని దూషించియున్నను, మఱల భూషించెను.

అంత ఖరుఁడు శూర్పణఖచే మొదట దూషితుఁడును, పిదప భూషితుఁడునై దూషణుఁడను సేనాధిపతిం జూచి, "నా యభిప్రాయము చొప్పున నడచుకొనువారును, వెఱపుగలిగించు వేగముగలవారును, యుద్ధములందు మఱిలనివారును, క్రొక్కాఱు మొగుళ్ల మెఱుంగుగల వారును, భీకరరూపులును, క్రూరకర్ములును, జనహింసయే విహారముగాఁ గలవారును, బలవంతులును, ఒర్వరాని ప్రతాపముగలవారును, పులులకుఁబోలె దర్పముగలవారును, వెడదమోములవారును, మహావీర్యశాలురును, మత్తులునైన పదునాలుగువేలమంది రక్కసులున్నారుగదా! వారి నందఱిని యుద్ధమునకు సన్నద్ధులఁ జేయుము. ఓరీ నాయనా! వేగిరమ నాకు తేరి నాయితముసేసి, విండ్లను నానావిధములగు చిత్రవర్ణము

లగు బ్రాణఖడ్గములను, వాఁడియైన పలుళ క్తులను దెచ్చి పెట్టుము. దురా
త్ముఁడగు రాముని వధార్థమై మహాబలులగు రాక్షసులముందట యుద్ధ
విశారదుండనగు నేఁ బోఁగోరుచున్నాను" అని చెప్పెను. ఖరుఁ డిట్లు
చెప్పుచుండఁగనే, దూషణుఁడు చిత్రవర్ణములగు మేటి వారువములు
పూన్చిన సూర్యనింబోలె వెలుఁగు గొప్ప తేరి నాయితపఱచి, "దేవా!
యానతిప్రకారము చేసితి" నని చెప్పెను.

పుటము వేసిన బంగారుతోఁజేసిన నగిషీపనిగలదియు, బంగరు
చక్రములును, వైడూర్యమణిమయమగు నొగయుఁ గలదియు, విశాల
మయినదియుఁ, జిత్రింపఁబడియుండు సువర్ణవర్ణములగు మత్స్య, పుష్ప,
ద్రుమ, శైల, చంద్ర, సూర్య, నక్షత్రములతోను, మంగళకరములగు
పక్షిసంఘములతోను, ధనుర్బాణ గదాయుధములతోను గూడినదియుఁ,
జిఱుగంటలతో విరాజిల్లుచున్నదియునై మేరుశిఖరము మాడ్కి నున్నత
మైనట్టి మేటి తత్తడులను బూన్చిన తేరి నెక్కెను. ఖరుఁడు రథా
రూఢుండగుటను జూచి, భీకరవిక్రములగు నక్తంచరు లందఱు నాఖరుని,
మహాబలుఁడగు దూషణునిఁ జుట్టుకొని నిలిచిరి. అంత ఖరుఁడు వెఱపు
గలిగింపునట్టి కవచములఁ దొడిఁగి యాయుధములను జేతఁ బూని, పడగ
లను బైకెత్తికొని యాయితులైయున్న రాక్షసులనెల్లరం జూచి,
వెడలుఁడని యానతిచ్చెను.

అంత నా రాక్షస సైన్యములు కూలముద్గరపట్టిసములను,
వాఁడిగొడ్డండ్రను, మెఱయుచున్న ఖడ్గచక్రతోమరములను,
ఘోరములగు గుదియలను, శక్తులను, పొడపుమీఱిన విండ్లను,
భయంకరములగు గదలను గత్తులను రోఁకళ్ళను దాల్చినవై ఖరునాజ్ఞ
వడసినవగుచు జనస్థానమునుండి వెడలి యౌర్వకాని మగతనముతోఁ
గూఁడి ముందు నడచుచుండఁగా, వారివెంబడి, ఖరుని రథము కొం
చెము తిన్నగాఁ బోవుచుండెను. అంత సారథి ఖరుని యభిప్రాయము
నెఱిఁగి స్వర్ణభూషణాలంకృతములగు పంచవన్నె కత్తలానులను వడిగాఁ
బోవ నిచ్చెను. అట్లు సూతునిచేఁ దోలఁబడిన, శత్రుసంహారియయిన
యాఖరుని వడిగాఁబోవు రథము సందడిచే దిక్కులును మూలలును
నిండినవయ్యెను. అంత మహాబలుండును, గొప్ప కంఠధ్వనితోఁ గూడిన

వాఁడునైన ఖరుఁడు పెంపొందిన యా గ్రహము గలవాఁడై పగతునిఁ జంపుటకై యమునివలెఁ దత్తరపడుచు, ముసురుపట్టి కాలవానగురియు ప్రలయకాలమేఘముచందమున గట్టిగా నార్చుచు సారథిని దొందరపఱిచినవాఁడయ్యెను.

23-వ స ర్గ ము.

ఖరునకు దుశ్శకునము లగుట

అట్లు ఖరుఁడు సేనతోడ వెడలి పోవుచుండఁగా, గర్దభము మాడ్కి ధూమ్రవర్ణముగలవైన గొప్ప మేఘము లమంగళకరమైన నెత్తుటివానఁ గురిసించెను. ఆ ఖరుని రథమునకుఁ గట్టిన వడిగల వాహువములు పువ్వులుచల్లిన పసుభూమియగు రాజమార్గమున నిష్కారణముగాఁ దడపఁబడినవి. సూర్యునిచుట్టును నడుము నల్లనిదియు, నంచులం దెల్లనిదియుఁ, గొఱవిని ద్రిప్పఁగా నేర్పడుచక్రమువలె గుండ్రనిదగుగుడి గట్టెను. అంత గొప్ప దేహాముగల కడు భీకరమైన యొక గ్రద్ద సువర్ణదండముగల యొత్తైన యా ఖరుని పెకెక్కము నెక్కి కూర్చుండెను. మాంసముఁ దిను మృగములును, పక్షులును జనస్థాన సమీపమునకు వచ్చి మిక్కిలి గట్టిగా నఱచినవి. వఱులు తూర్పుదెస చేరి, గొప్ప నాదముతోఁ గూడినవై రాక్షసుల కమంగళసూచకముగాఁ గూఁతలు వెట్టినవి. పగిలిన కొండలమాడ్కి నుండునవియు, భీకరములునైన మేఘములు నెత్తుటి చందమున నెఱ్ఱని నీటిని దట్టముగా వర్షించి, యాకాశమును గ్రమ్ముకొనినవి. విస్తారమగు చీకటి యంతటవట్టి ముగాఁ గ్రమ్ముకొని చూపఱికు వెఱఁగుపాటొదవించుచుండెను. దిక్కులును విదిక్కులును స్పష్టముగాఁగానరాకుండినవి. సంజవేళ కాకమునుపే రక్తవర్ణముగల సంజప్రొద్దు వచ్చినట్లుండెను. వెఱపించునట్టి మృగములును, పక్షులును భయమును దెల్పుచు ఖరునియెదుట నిలఁబడి యఱచెను. కంక జముక గృధ్రములు ఖరుని కశుభసూచకముగా నఱచినవి. యుద్ధమున నమంగళసూచకములు, నెల్లప్పుడు కీడుచేయునట్టి నక్కలు సేనల కెదురుగా మంటలు గ్రక్కునట్టి నోళ్లతోఁ గూఁతలువెట్టినవి. సూర్యుని దాపున నినుపగుదియింబోలు నల్లని మొండె మొక్కటి కానవచ్చెను. సర్వకాలముకాని కాలమునందు రాహువు సూర్యుని గ్రిం

గెను. గాలివడివడివగా వీచెను. సూర్యుఁడు కాంతి తఱఁగి యుండెను. పగటివూటనే రిక్కలు మిణుఁగుఱుబూచులమాడ్కి నుదయించినవి. తామరకొలఁకులందలి తామరపువ్వు లెండిపోయెను. చేఁపలును, పక్షులును కానరాకపోయినవి. అప్పుడు చెట్లనుండి పుష్పఫలములు జలజలరాలినవి. మబ్బునలె నరుణవర్ణమయినదుమ్ము గాలి కొట్టకయ లేచి పైకిఁ గ్రమ్ముకొనెను. అచ్చటి గోరువంకలు 'వీచి' 'కూచి' యని పరుసనఁగాఁ గూసినవి. జనులకు మహానిష్టమును సూచించు కొఱివులు భూమిపైఁ బడినవి. పుడమియంతయు పర్వతకాననసమేతమయి కంపించినది. రథారూఢుఁడై యఱచుచున్న మూఢుఁడైన ఖరునియొక్క యెడమచేయి యదరెను. మాట డగ్గుత్తికవడి తడఁబడఁ దొడఁగెను. అంతటను జూచుచుండు నా ఖరుని కన్నులనుండి కన్నీరు రాఁదొడఁగెను. తలయేఱు పుట్టెను. అయినను, ఖరుఁడవివేకముచే వెనుకకు మఱలఁ డయ్యెను.

ఖరుఁడు గగ్గురుపా టొదవించుసట్టి యా గొప్ప యవశకునములను జూచి, ఏకపక నవ్వుచు, రక్కసుల నందఱిం జూచి, "బలవంతుఁడు తన బలముపలన బలహీనులను సరకుసేయనట్లు, నేనును ఈ భయసూచకములగు గొప్ప యవశకునముల సరకుసేయను, నా వాఁడిబాణములచే నాకసమునుండి నక్షత్రములనైనఁ గ్రిందఁ ద్రోయఁగలను. నాకుఁ గోపము వచ్చెనేని, మరణదేవతకుఁ గూడ మరణమును గల్గింతును, బలగర్వితుఁడైన రాముని, వాని తమ్ముని లక్ష్మణుని నా వాఁడియమ్ములచేఁ జంపక నాకు మఱిలుట కపేక్ష లేదు. మాయక్క శూర్పణఖ వీరియువ్వురి రక్తముఁ గ్రోలి, సఫలమనోరథ యగుఁగాక! ఆ శూర్పణఖ నిమిత్తమెకదా యీ రామలక్ష్మణులఁ జంపఁబూనుట. నే నింతకు మున్నెప్పుడు యుద్ధమున నోటమి నొందినది లేదన్నసంగతి మీరెఱిఁగినదియేకదా. నేను గల్లలాడను. నేను కుపితుఁడనై మదించిన యైరావతమువీఁదఁ బోవునట్టి వజ్రాయుధధారియగు వేల్పుతేనినైనను కలనియందుఁ బడనేయఁగలను. అట్లుండ నీ యల్పులైన మనుజులు నా కెంతటి వారలు" అని చెప్పుచు గట్టిగా నఱచెను. ఆ ఖరుని యఱపును విని,

వానిగొప్ప సేన మృత్యుపాశములకు లోఁబడిన దగుటచే పరమానంద మొందెను.

అప్పుడు మహోత్సులగు దేవ, గంధర్వ, సిద్ధ, చారణులును, మహర్షులును యుద్ధమును జూడఁగోరినవారలై యచ్చటి కేతెంచిరి. ఆ పుణ్యాత్ములగు వారందఱు గూడి, "గో బ్రాహ్మణులకును, లోకహితముఁ గోరువారికిని మే లగునుగాక. చక్రపాణియగు విష్ణువు సంగరమున నసురవీరుల నందఱిని గెల్చినట్లు రాముఁడు పౌలస్త్యులగు రక్కసుల నందఱిని గెల్చును గాక" అని యొండొరులు చెప్పికొనిరి. విమానము లందున్న దేవతలును, మహర్షులును ఈ మాటను, నింక ననేక విషయ ములను మాటాడుచు నా సమరము చూడఁగోరి, యాయువుమూడిన యా రాక్షసుల సేనను జూచుచుండిరి.

ఖరుఁడును భీకరమగు సేనతోడఁగూడి, రథమును వేగిరముగాఁ దోలుకొనివచ్చెను. రాక్షసులును ఆ ఖరుని యుత్సాహముఁ జూచుచు మఱింత త్వరగా వెడలిరి. శ్యేనగామి, పృథుగ్రీవుఁడు, యజ్ఞశత్రువు, విహంగముఁడు, దుర్జయుఁడు, కరవీరాక్షుఁడు, పరుషుఁడు, కాలకార్ముకుఁడు, మేఘమాలి, మహామాలి, సర్పాస్యుఁడు, రుధిరాస్యుఁడు, మహా వీరులగు పండ్రెండుగురు సేనాధిపులు ఖరునిఁజుట్టియుండిరి. మహాకపాలుఁడు, స్థూలాక్షుఁడు, ప్రమాథి, త్రిశిరుఁడు ఈ నల్వురు సేనానాయకులును దూషణునిఁ జుట్టియుండిరి. ఆ రక్కసులసేన యుద్ధము సేయఁగోరి, మహావేగముతోఁగూడి, అంగారకాదిగ్రహమండలము చంద్రసూర్యులఁ బొదివినట్లు, ఆ రాజపుత్రులమీఁదికిఁ గవిసినదయ్యెను.

24-వ సర్గము.

రాముఁడు యుద్ధసన్నద్ధుఁడగుట

ఓర్వరాని కడిమిగల ఖరుఁడు తపోవనమునకు వచ్చుచుండఁగా, రామలక్ష్మణులును అట్టి యవశకునములనే చూచిరి. రాముఁడు కడు భీతిప్రదములును, జూపఱకు గగ్గురాపొ టొదవించునవియు, జనులకుఁ గీడుచేయునవియునైన యట్టియవశకునములను జూచి, లక్ష్మణునితట్టు దిరిగి, "నిడుదచేతులవాఁడా! సకలరాక్షస సంహారమునకై పుట్టిన సర్వ జంతు వినాశకములగు నీ యుత్పాతములను జూడుము. ఈ మేఘములు

గాడిదవలె ధూమ్రవర్ణములవై, గొప్ప యుఱుము లుఱుముచు, రక్తమును గురియుచు నాకసమునఁ దిరుగుచున్నవి. లక్ష్మణా! ఈ నాయమ్ములెల్లఁ గయ్యముఁగోరి, పొగరాజుచున్నవి. పసిఁడి వీఁపులుగల విండ్లు పోరునకుఁ గట్టాయితములై మిక్కిలి పొరలుచున్నవి. ఈ వనము లందుఁ దిరిగెడి పక్షుల కూఁతల నాలింపఁగా, మనకుఁ దొలుతటికి భయమును, బ్రాణహానియుఁ గూడఁ గలుగునేమో యని తోఁచుచున్నది. నాకు మాటి మాటి కీ చేయి యదరుచున్నది. దీనిం జూడఁ దప్పక గొప్ప కయ్యము జరుగఁగలదు. దీనికి సందియము లేదు. ఓ మొనకాఁడా! మనకు గెలుపును, పగతురకోటమియుఁ గలుగఁగలదు. నీ మోము వెలుఁగులుచిమ్ముచు, తేటయైనదియు నైనట్లు కాన్పించెడు. లక్ష్మణా! అనికిఁ బూనినవారి మోమున విన్న బోటు గన్పట్టెనేని, వారి కాయుస్సు క్షీణించును. రొదసేయుచుండు రాక్షసుల కోలాహలములును, క్రూర కృత్యములొనర్చు రాక్షసులు వాయించెడి భేరీవాద్యముల ధ్వ్రోఁతెలును వినఁబడుచున్నవి. తెలివికాఁడగు నరుఁ డాపదవచ్చునని మున్నెఱిఁగి నప్పుడు, తాను మేలుగోరునేని, ముందే యా యాపదరాకుండుటకుఁ దగు ప్రతిక్రియ సేయవలయు. కావున నీవు విలు దాల్చినవాఁడవై, బాణములఁ జేతఁ బట్టికొని, సీతను గూడఁదీసికొని, చెట్లచేఁ గ్రమ్మఁబడి, ప్రవేశింప నలవికాకయుండు నొక పర్వతగుహాలోనికిఁబొమ్ము. నీ వీ నామాట కడ్డముచెప్పవలదు. నా పాదములయాన. నీవు తాముసింపక పొమ్ము. నీవు వడిగలవాఁడవు; బలిమికాఁడవు. నీవె వీరినందఱిని జంపఁ గలుగుదువు. అయినను, నేనే రాక్షసులనందఱిని జంపఁ గోరుచున్నాను" అని చెప్పఁగా, లక్ష్మణుఁడు సీతను దోడ్కొని, బాణములను వింటిని గైకొని, ప్రవేశింప నలవికాని గవికిఁ బోయి చేరెను.

లక్ష్మణుఁడు సీతను దోడ్కొని గవికిఁ బోయి చేరినపదం పడి రాముఁడు "ఆహా! మంచి యుపాయము దోఁచినది" యని చెప్పి మేన బొందలము దొడిగెను. నిప్పుమాడ్కిఁ దేజరిల్లు నా బొందలము దొడిఁగిన యారాముఁడు చీకటియందుఁ బొగలేక మండుచున్న యగ్నిహోత్రుని పగిదిఁ వెలుఁగుచుండెను. అట్టి వీరుఁడగు రాముఁడు గొప్ప వింటిని చేతఁబట్టి బాణములం గైకొని,

విల్లెక్కువెట్టి నారి మ్రోతలచే దెసలెల్ల నిండించుచు జాగ్రత్తగల వాఁడయి యుండెను. అప్పుడు తేజస్సుతోఁగూడి యుద్ధభూమిముంగల నిలఁబడియున్న రామునిఁ జూచి, భూతములన్నియు వెఱపుచేఁ గలవర పడినవి. శ్రమలేకయే కార్యముల నొనర్చు రామునిసాటి లేనిరూపము కోపముచే రేఁగిన మహాత్ముఁడగు రుద్రునిరూపము బోలియుండెను. అంత మహాత్ములగు దేవ గంధర్వ సిద్ధ చారణులును లోకములందుండు బ్రహ్మర్షి శ్రేష్ఠులును, పావనంపుఁబనులు సేయువారునగు ఋషులును గలిసి, లోక ములకు మేలు గోరు గో బ్రాహ్మణులకు మే లగుఁగాక! చుట్టుఁగైదువు దాల్చిన వెన్నుఁడసురపుంగవులనెల్ల గెల్చిన చందమున రాముఁడు పులస్త్యవంశోద్భవులగు రేద్రిమ్మఱుల నందఱను బరిమార్చును గాక" అని చెప్పి మఱల నొండొరు లిట్లు చెప్పికొనిరి. "క్రూరపుఁబనులు చేయు రక్కసులు పదునాలుగువేవు రున్నారు. ధర్మాత్ముఁడగు రాముఁ డొక్క రుఁడె యీ తట్టున నున్నవాఁడు. ఈ కయ్య మెట్లు జరుగునో తెలియ రాదు." అని రాజర్షులు, సిద్ధచరణాదులు విమానవాసులగు దేవతలును మక్కువతోఁ గయ్యముఁ జూడఁగోరి యుండిరి.

ఇంతలో ఘోరములగు కవచములును దాల్చి యాయుధములను ధరించి, ఱెక్కెము లెత్తి గొప్ప రొద చేయుచు పచ్చెడి రక్కసుల సేన యంతటఁ గన్పట్టెను. ఆ రక్కసు లొనర్చు సింహనాదముల యొక్కయు, ఒండొరుల తోప్పులయొక్కయు, ధనుష్టంకారములయొక్కయు, పలు 7
మఱు సేయంబడు నావులింతలయొక్కయు, గొప్ప యఱపులయొక్కయు, సేనలు వాయించు దుందుభివాద్యములయొక్కయు, గొప్ప యలబల మా వనమునెల్ల నిండించిన దయ్యెను. ఆ వనమునఁ దిరుగు కూళ మెకములెల్ల నాశబ్దమునకు వెఱచి, వెనుకకు మఱలక నోరు తెఱవక పరుగిడినవాయెను. అట్టి మహాభయంకరమగు కడలింబోలునట్టి రక్కసులదండు నానావిధ ములగు నాయుధములను దాల్చినవై రాముని పైకిఁ గవిసెను. అనియందు మొన కాఁడగు రాముఁడు కయ్యమున కెదురుమొగమై వచ్చియున్న యా ఖరుని సేనను గలయంగనుఁగొని, భీకరమగు విల్లువంచి యమ్ములపొది నుండి యమ్ములఁ దీసి రేద్రిమ్మఱులనెల్లఁ బీచమడచుటకై యోర్వరాని కోపమును పూనినవాఁడై, ప్రళయ కాలానలముపగిదిఁ దేజరిల్లుచుఁ

గనలుటచేఁ జూపఱకుఁ జూడ నలవికాకయుండెను. అట్లు తేజముచే వెలుగుచుండు రామునిఁ జూచి వనదేవతలెల్ల వెఱపుచే దెసలకుఁ బాఱెను. కనలిన యా రామునిరూపము దక్షయాగమును ధ్వంసము చేయఁబూనిన పినాకహస్తుఁడగు రుద్రునిరూపము చాడ్పున వెలుఁగుచుండెను. అట్టి వెలుఁగుతోఁగూడి యనిమొనయందు నిల్చియున్న రామునిఁ జూచి, భూతము లన్నియు మూలమూలలకును బరుగెత్తెను. విండ్లతోను, తొడవులతోను, పడగలతోనుఁగూడి, యగ్నివలె మెఱయు కవచములఁ దొడిఁగియున్న యా పొలసుదిండ్లయొక్క సేనలు సూర్యోదయకాలమునందలి కాఱుమబ్బుల పిండువలేఁ నల్లగాఁ దోఁచెను.

25-వ సర్గము.

ఖరుని సైన్యములు రామునిచే మడియుట

ఖరుఁడు ముందు నడచు సైనికులతోఁగూడి రాముఁ డున్న యాశ్రమమున కేతెంచి, వింటిని దాల్చినవాఁడై కోపముతో నున్న శత్రుసంహారియగు రామునిఁ జూచి, తానును గొప్ప నాదముగల వింటిని, బాణములను గైకొని, రాముని కెదురుగా రథముఁ దోలుమని సారథితోఁ జెప్పెను. ఆ సారథియు గొప్పచేతులవాఁడగు రాముఁ డొక్కరుఁడె వింటిని విసరుచు నున్న ప్రదేశమునకే ఖరుని యరదమును బోవనిచ్చెను. అట్లు ఖరుఁడు రామునిపైకిఁ గవియుటంజూచి, శ్యేనగామి మొదలగు మంత్రులైన రేడ్రిమ్మరు లందఱు సింహనాదము చేయుచు నాతనిచుట్టు నుండిరి. ఆ పొలసుదిండులనడుమ నరదమునఁ గూర్చుండియున్న ఖరుఁడు నక్షత్రమధ్యమునన్నున్న యంగారకునిమాడ్కి దేజరిల్లుచుండెను. అంత ఖరుఁడు సమరమున సాటిలేని వీర్యముగల రాముని వేయిబాణములచే నొప్పించి, సింహనాదము సేసెను. అంత రాక్షసులందఱు కోపావిష్టులై, భీమముగు ధనుస్సు దాల్చిన దుర్జయుఁడగు రామునిపై గుదియలు, అడ్డకత్తులు, శూలములు, గదలు, గొడ్డండ్రు మున్నగు నానావిధాయుధములను బ్రయోగించి నొప్పించిరి. కాఱుమబ్బులంబోలు మైచాయగల మహాపరాక్రమవంతులగు రక్కసులందఱు రాముని వధింపఁగోరినవారలై, రథములను, గుఱ్ఱములను, పర్వతాగ్రములం బోలు నేనుఁగులను నా రామునిమీఁదికిఁ బరుగెత్తించి,

పెల్లుగా నార్చుచు, పర్వతముపై మేఘములు జడివాన గురిపించునట్లు, ? ఆ రాముని మీఁద నంపవాన గురిపించి, యాతనిని ముట్టడించిరి.

అంత రాముఁడును భయంకరరూపముఁ దాల్చిన రాక్షసగణములచేఁ జుట్టుఁబడినవాఁడై, సముద్రము దన కడకేతెంచు నదీప్రవాహములను గైకొనుచందమున, రక్కసులేయు బాణములను బ్రతిబాణము ? లచేఁ గైకొనుచువచ్చెను. రాముఁడు వెలుఁగుచుండు ననేక వజ్రములతోఁ గూడిన మహాపర్వతమువాఁడిక, రక్కసు లేయుబాణము ? లచేఁ దనమేను చిల్లులువడినను నొవ్వఁడయ్యెఁ. ఆ రాముఁ డట్టులు వా రేయుబాణముల తాఁకుడుచే మేనెల్ల నేర్పడిన గాయములనుండి కాఱిన నెత్తుటిచేఁ దడిసినవాఁడై సంజప్రొద్దునందలి మబ్బులచేఁ గ్రమ్మఁబడిన సూర్యుఁడునుంబోలె వెలుఁగుచుండెను. అప్పుడు దేవగంధర్వ సిద్ధచారణులును, పరమర్షులును వేనవేలరక్కసులచేఁ జుట్టుఁబడిన రామునిఁ జూచి వంత నొందిరి.

అంత రాముఁడు కడు నలిగి, వింటిని గుండ్రముగా వంచినవాఁడై, పరులచే నడ్డగింపరానివియు, ఓర్వఁగూడనివియు, యమపాశమునుం బోలినవియు, గుఱితప్పక పాఱునవియునైన వేలకొలఁది బాణముల నేసెను. రాముఁడు వేడ్కతోఁ బ్రయోగించిన యా బాణములు శత్రుసైన్యములలోఁ బ్రవేశించి, యముఁడు ప్రయోగించిన పాశముల చందమునఁ బెక్కురాక్షసుల ప్రాణములను దీసి, వారి దేహముల లోపల దూఱివచ్చి, నెత్తుటిచేఁ దడిసినవై, యంతరిక్షమునకెగసి, మండుచున్న యగ్నిహోత్రుని చందమునఁ దేజరిల్లుచుండినవి. అట్లు రాముఁడు మండలాకారముగానున్న తన వింటినుండి శత్రుప్రాణములఁ దీయు మిక్కిలి వాఁడియైన పెక్కు బాణముల నేసి, శత్రువులయొక్క విండ్లను, పెక్కెముల కొనలను, బొందళములను, దలలను, హస్తాభరణములతోఁ గూడిన బాహువులను, ఏనుఁగుతొండములంబోలు తొడలను వేలకొలఁది నటికెను. మఱియుఁ దేరులకుఁగట్టిన బసిండివాగెలు మున్నగు తొడవులుగల గుఱ్ఱములను, సారథులను, ఏనుఁగులను, మూఁపటీండ్రను, గుఱ్ఱములను, రౌతులను, కాలిబంటులను సంగరమునఁ బరిమార్చి, యమపురికిఁ బంపెను. ఇ ట్లెఱిఁగిన రాముఁడు ప్రయోగించు నానావిధ

ములగు కఱకుటమ్ములచేఁ గొట్టఁబడి యా తాఁకుళ్ళ ఘోర్వాఁజాలక, సైని కులు మిక్కిలి దీనముగా నఱచిరి. ఆయములను భేదించునట్టి రాముని వాఁడి బాణములచేఁ గొట్టఁబడిన యా రాక్షససైన్యము కాఱుచిచ్చుచేఁ గాల్పఁబడిన యెండుటడవివలెఁ సొంపుదఱిగి యుండెను. అప్పుడు మఱి కొంద ఱెక్కువ దిటవుగల మొనకాండ్రు రామునెదుటికిఁ బోయి, శూలములు, గుదియలు మొదలగు గొప్ప యాయుధముల నాతనిపైఁ జిమ్మిరి మహాబాహువగు రాముఁడు వారి బాణములను దన బాణము లచే నివారించి, మఱికొన్ని బాణములను బ్రయోగించి, రక్కసుల ప్రాణములను హరించి, శిరసులను ఛేదించెను. తలలుదెగి చిల్లులు పడిన కవచములతోఁ, దుత్తునియలైన విండ్లతో నానక్తంచరులు గరు త్మంతుని ఱెక్కల గాలికిఁ బెల్లగిలి కొట్టుకొనిపోవు చెట్లమాడ్కి నేల వ్రాలిరి. అచ్చటనున్న తక్కినవారందఱు రామబాణములచే నొచ్చిన వారలై, మిక్కిలి విచారమునొంది, శరణార్థులై యా ఖరుని శరణు చొచ్చిరి.

అంత దూషణుండు వారి నందఱి నోదార్చి మఱల వారిం దోడ్కొని మహాగ్రహముతో యముఁడు రుద్రునింబోలె రాముని నెదురొక్కనేను. ఆ రాక్షసులందఱు దూషణుని యాసరావలనఁ గొంత దిటవుదెచ్చికొని, ముద్గరచెట్లు, తాటిచెట్లు, ఱాలు, రప్ప లాయుధములుగఁ దాల్చినవారలై రామునిపైకి వచ్చిరి. బలవంతులగు రక్కసు లట్లు వచ్చి, శూలముద్గరములు చేతఁబట్టి, బాణములను, నానావిధాయుధము లను వర్షించుచు, నవి యయిపోఁగా, చెట్లవానను, ఱాలవానను గురి పించిరి. మఱల నిత్తెఱఁగున రామునకును ఆ రక్షస్సులకును వింతయై గగ్గురా్పటొందవించు ఘోరమైన యుద్ధము జరిగెను.

ఇత్తెఱఁగున నా రాక్షసులు మఱల రాముని ముట్టడించి యాయుధములు ధరించి బాణవర్షముగురియుచు, నానాదిక్కులు గ్రమ్మి యుండుటను జూచి రాముఁడు గొప్ప సింహనాదముచేసి కడు వెలిఁగెడి గాంధర్వాస్త్రమును రాక్షసులందుఁ బ్రయోగించెను. ఆట్లు రాముఁడు మండలీకృతమైన తన వింటినుండి విడుచు బాణములచేఁ బది దెసలను గప్పెను. రామబాణ పీడితులైన రాక్షసులు రాముఁ డమ్ములపొదుల

నుండి బాణములఁ గైకొనుటను, వింటియందుఁ జేర్చి యాకర్షించి
యేయుటను దెలియఁజాలరైరి. రామప్రయుక్తములై బాణము లనెడి
చీకటి సూర్యరశ్మి గన్పట్టకుండునట్లు చదలును గప్పెను. అప్పుడు
రాముఁ డా బాణములను నోటినుండి గ్రక్కునట్లు తోఁచెను. ఆ యుద్ధ
భూమియందు రాక్షసులలోఁ గొందఱు చంపఁబడియు, కొంద ఱూనక
పడియు, కొందఱు నశించియు, కొందఱు నఱుకఁబడియు, కొందఱు
చీల్చఁబడియు వేలకొలఁదిగా నచ్చటచ్చట నొక్కొక్కడిగాఁ బడుచును,
నొక్కొక్కడిగాఁ గూలుచును, ఒక్కొక్కడిగాఁ బరవశులగుచు నుండిరి.
అట్టి సమయమున నా యుద్ధభూమి తలపాగాలతోఁ గూడిన తలల
తోను, భుజకీర్తులతోఁగూడిన చేతులతోను, సకలభూషణములచేఁ
గైసేయఁబడిన తొడలతోను, పిక్కలతోను, పలుతెఱఁగులుగా విఱిగి
పడియున్న రథములతోను, నీల్గియున్న గజాశ్వములతోను, చామర
ములు, వీవనలు, గొడుగులు, నానావిధధ్వజములు మున్నగువాని
తోను, రాముని బాణములచేఁ ద్రుంపఁబడిన విచిత్రములగు శూల
ములు, గుదెలు, తునియలు సేయఁబడిన గదలు, ఈఁటెలు, గొడ్డళ్లు,
మొదలగువానితోను, పొడిసేయఁబడ్డ ఫాలతోను, వింత వింతలగు
శరములతోను నిండినదై చూపఱకు వెఱపుఁ గల్గించుచుండెను.

26-వ స ర్గ ము.

రాముఁడు దూషణాదులను జంపుట

నిడివిచేతులవాఁడగు దూషణుఁడును తనసేనలెల్ల రామునిచే
మడియుచుండుటంజూచి, భయంకరమయిన వడిగలవారును; పోరు
లందు మఱలనివారునునగు నైదువేల రక్కసులను రాముని
మీఁదికిఁ బోవ నాజ్ఞాపించెను. అంత వార్కి శూలములను, అడ్డకత్తులను,
కత్తులను, ఫాలను, చెట్లను, బాణములను, యవిచ్ఛిన్నముగాఁ
గురిపించిరి. న్యాయశీలుఁడగు రాముఁడును ప్రాణములను దీయునట్టి
యా గొప్ప ఫాలవానను, చెట్లవానను కఱకుటమ్ములచేఁ
బడఁగొట్టుచు, కన్నుమూసికొన్న యూఁబో లెంతవానన్నైనను సరకు
సేయనిచాడ్పున వారు గురిపించు శిలాప్రమవర్షములకోర్చియుండి,
సకల రాక్షసులను నిర్మూలముగాఁజేయ నత్యాగ్రహము నొందిన

వాఁడై, వేఁడిమిచే మండిపడువానిచాడ్పున నున్నవాఁడై, యా సేనల మీఁదను, దూషణునిమీఁదను పిడుగులనుబోలినబాణముల ననేకము ప్రయోగించెను.

అంతట శత్రువులను నొప్పించువాఁడును, సేనానాయకుఁడునగు దూషణుఁ డలిగినవాఁడై పిడుగులంబోలు బాణములచే నా రాముని దేహముఁ గప్పెను. పిమ్మట వడిగలవాఁడగు రాముఁడు కడు మండిపడి, యా దూషణుని వింటి నొక యర్ధచంద్రాకారబాణముచేతఁ ద్రుంచి, కలనియందు మఱి నాలు గమ్ము లేసి యాతని నాలుగు వారువమ్ములను ద్రుంచివైచెను. అట్లు రాముఁడు దూషణునితేరిగుఱ్ఱములను కఱకు టమ్ములచేఁ బడనేసి, యర్ధచంద్రబాణముచే దూషణునిసారథియొక్క శిరము ద్రుంచి, యంతటితోఁ బోక, దూషణుని మొమ్మును మూఁడు బాణములతోఁ గొట్టెను. దూషణుండు వింటిని, రథమును, సారథిని, గుఱ్ఱములను, కోలుపోయినవాఁడయి బంగరుపట్టలతోఁ జుట్టఁబడినదియు, పర్వతశిఖరముం బోలినదియు, ఇనుపమేకులు గొట్టబడినదియు, పగతుర క్రొవ్వునఁదడిసినదియు, పిడుగువలెను, వజ్రమువలెను కఠినమయినదియు శత్రువుల పురగోపురములను బగులఁగొట్టునదియునై చూపఱకు గగ్గురా్పటొదవించు గొప్ప యినుపగుదియ నెత్తుకొనెను. అట్లు కనికరములేని పనులొనర్చెడి రేద్రిమ్మరీఁడగు దూషణుఁడు కయ్యమునందు గొప్ప పామునుంబోలు గుదియను దాల్చి రామునిమీఁదికిఁ గవిసెను. రాఘవుఁడును దనమీఁదికి దుముకుచుండు నాదూషణునియొక్క భుజకీర్తులతోఁ గూడిన రెండు బాహువులను రెండు బాణములచేఁ ద్రుంచెను. దూషణుని బాహువులు నఱుకఁగా, చేతులు తెగిన యా దూషణుని చేతినుండి జాఱినగొప్పగుదియ యుత్పవమునకుఁ గడపట నింద్రాయుధము పడునట్లు, యుద్ధరంగమునఁ బడెను. దూషణుండును చేతులు రెండు దెగినవాఁడై, కొమ్ములువిఱిఁగిన దిట్టయగు గొప్ప యేనుఁగుకైవడి యుద్ధభూమియందుఁ బడెను. అనియందు రామునిచేఁ జంపఁబడిఁ దూషణుఁడు నేలం గూలుటం జూచి, భూతము లెల్లను రాముని "బలే బలే" యని శ్లాఘించినవి.

ఈ లోపల మహోకపాలుఁడు(=గొప్ప పుట్టెగలవాఁడు), స్థూలాక్షుఁడు(=మిడిగ్రుడ్లవాఁడు), మహాబలవంతుఁడగు ప్రమాథి (=సంహరించువాఁడు) అను నీ ముగ్గురు సైన్యాధిపులును మిగుల నలిగిన వారలై మృత్యుపాశముచేఁ గట్టఁబడినవారగుచు నొక్కుమ్మడి గాముని పైకి వచ్చిరి. మహోకపాలుఁ డనురాక్షసుఁడు గొప్పశూలమును, స్థూలాక్షుఁ డడ్డకత్తిని, ప్రమాథి గొడ్డలిని గైకొనియుండిరి. వెంటనే రాముఁడు తనమీఁదికివచ్చు నా రాక్షసులను జూచి, వాఁడికొనలు గల యమ్ములతో నింటికి వచ్చిన యతిథులకుంబోలె వారికి మర్యాద సేసెను. అట్లు వారిని రానిచ్చి, వాఁడిబాణములచే మహోకపాలుని తలను ద్రుంచెను. ప్రమాథిని లెక్కలేని బాణములచేఁ గొట్టెను. అంత వాఁడు గొప్పకొమ్మలు గలమ్రానిచందమునఁ గ్రిందఁబడెను. స్థూలాక్షుని కన్నులనిండుగ వాఁడియమ్ములనుగ్రుచ్చి, కన్నులు దెలియకుండున ట్లొనర్చెను. వెంటనే దూషణుని బంటుల నైదువేలమందిని నైదువేల బాణములేసి, యమపురికిఁ బంపెను.

ఇత్తెఱఁగున దూషణుఁడును, వాని యనుచరులగువారలును మృతి నొందుటను జూచి, ఖరుఁ డలుక గదురఁ గడు దిట్టలగు సేనాధ్యక్షులను జూచి, "దూషణుఁడు సపరివారముగఁ గలనియందు మడిసెను. ఇఁక మీరందఱు గలిసి, గొప్ప సేనతో నేఁగి, నీచుఁడగు రాముని తోఁ బోరుసేసి యన్నితెఱఁగులగు నమ్ములం బ్రయోగించి, యాతనిం బరిమార్పుఁడు" అని చెప్పి తానును గోపముతో రామునిమీఁదికిఁ బోయెను. శ్యేనగామి (=డేగవలె వడిగాఁ బోవువాఁడు), పృథుగ్రీవుఁడు (=గొప్పమెడ గలవాఁడు), యజ్ఞశత్రువు (=జన్నములకు గొంగ), విహంగముఁడు (=నింగిని బోవువాఁడు), దుర్జయుఁడు(=గెల్వ నలవికానివాఁడు), కరవీరాక్షుఁడు (=గన్నేరుపూవులవంటి కన్నులుగల వాఁడు), పరుషుఁడు (=గట్టివాఁడు), కాలకార్ముకుఁడు (=నల్లనివింటి వాఁడు), మేఘమాలి (=మేఘముమాడ్కిఁ బ్రకాశించువాఁడు), మహామాలి (=గొప్ప మాలికలను దాల్చినవాఁడు), సర్పాస్యుఁడు (=పాము వలె వెడదమోము గలవాఁడు) రుధిరాశనుఁడు (=నల్లగ్రావువాఁడు)

అను నీ పండ్రెండుగురు గొప్పవడిగలవారలగు సేనానాయకులును సేనాసమేతులై, వాఁడితూపుల నేయుచు రాముని మీఁది కుఱికిరి.

అప్పుడు రాముఁడంటరాని వేల్పుమాడ్కిఁ దేజరిల్లునయి యు, పసిఁడి యలంకారములుగలవియునగు బాణములం బ్రయోగించి యామిగిలిన సైన్యమును బరిమార్చెను. ఆ రామచంద్రుఁ డేయు బంగారములుకు లతోఁగూడిన యా బాణములు పొగతోఁగూడిన గాలినెచ్చెలిమంటల మాడ్కి వెలుఁగుచు, పిడుగులు గొప్ప చెట్లను గ్రిందఁద్రోయున ట్లా రక్కసుల నందఱును బడఁద్రోసెను. రాముఁ డొక్కొక్కఁ తడవ నూఁదేసి బాణములఁ బ్రయోగించి, నూఱ్వురు నూఱ్వురు రాక్షసుల నొక్కఁ పెట్టున వెయ్యేసి బాణములఁ బ్రయోగించి వేయివేయి రక్కసులను సంహరించి యుద్ధరంగమునఁ గూలిచెను. ఆ రేద్రిమ్మరులు రాముని బాణములచేఁ దూట్లుపడిన కవచములును, తొడవులునుగలిగి, విండ్లును? దుత్తునియలు కాఁగా, నెత్తురుకారుచుండఁ బుడమిం బడిరి. నెత్తుటఁ దడిసి, తలవెండ్రుకలు విరియఁబోసికొని పడియున్న యా రక్కసులతోఁ గూడిన సంగరస్థలమంతయు దర్భలుపఱచిన గొప్ప జన్నంపువేదికవలె నుండెను. క్షణములోపల రక్కసు లందఱు చచ్చిపడియుండుటచేఁ గడు భీకరమైయున్న యాయరణ్యము నంజుళ్ళచేతను, నెత్తుటిచేతను బురద యైనట్టులుండి, నరకలోకముతో సాటివచ్చుచుండెను. కడిఁదిమగలగు నాపదునాలుగువేవురురక్కసులను ఱింటరియుఁ గాలిబంటునైన మాన వుఁడగు రాముఁ డొక్కరుఁడు సంహరించెను. ఆ సేనకెల్ల మహారథుఁ డగు ఖరుఁడును, త్రిశిరసుఁడును, శత్రుసంహారియగు రాముఁడును మిగిలియుండిరి. లక్ష్మణాగ్రజుఁ డోర్వరాని బలిమిగల కడిఁది రాక్షసుల నందఱిని సంహరించెను. అట్లు గొప్పయుద్ధమునఁ దన గొప్ప సేనయెల్ల రామునిచేఁ జంపఁబడుటంజూచి, యప్పుడు ఖరుఁడు రథారూఢుఁడై వజ్రాయుధము దాల్చిన యింద్రునిమాడ్కి రాముని బట్టవచ్చెను.

27-వ సర్గము.

రాముఁడు త్రిశిరసునిఁ జంపుట

దళవాయియగు త్రిశిరసుఁడు (=మూఁడుతలలు గలవాఁడు) అను పేరుగల రక్కసుఁడు రాముని డీకొనఁబోవుచున్న ఖరునిముందటికి

వచ్చి యిట్లనియె! ఓ బలశాలీ! నీవు సాహసము మానుము. నాకానతిమ్ము. పోరునం దా నిడుదచేతులవాఁడగు రామునిఁ దెగటార్చెదను. నీవు చూడుము. రక్కసుల నందఱినిఁ జంపిన రాముని వధింతు నని యీ యాయుధము వూని సత్యప్రతిజ్ఞ నేసెదను. కయ్యమునందు నే నితనికి మృత్యుదేవతనో, లేక నా కితఁడు మృత్యుదేవత యో, నీవు ఱుణ కాలము జగడమునందుఁ బట్టుదల చాలించి, సాక్షివిగ నుండుము. రాముఁడు నాచేఁ జంపఁబడినవాఁడగునేని, నీవు సంతసముతో జనస్థాన మున కేఁగఁగలవు. లేక, నేను రాముని చే నిహతుఁడ నగుదునేని, నీవె రాముని తో యుద్ధము సేయుదువు" అని త్రిశిరసుఁడు చావునందలి తమితో ఖరుని వేఁడఁగా, ఖరుండును "పొమ్ము. రాముని తోఁ బోరుము." అని యనుజ్ఞ యొసఁగెను.

అంత త్రిశిరసుఁడు ముప్పొనలు గలపర్వతమువాఁడిఁ దేజ రిల్లుచు, మేటివారువములు గట్టినట్టిదయి, తళతళ మెఱియుచుండు తే రెక్కి రాముని మీఁదికిఁ దలపడెను. అట్లు రేగి యా త్రిశిరసుఁడు గొప్ప మబ్బువలె బాణము లనెడి నీటిధారలను గురిపించుచు, నీటియందుఁ దడిసిన దుందుభివాద్యముయొక్క మ్రోఁతతో సాటియైన గొప్ప సింహ నాదము సేసెను. రాముఁడును తనమీఁదికి వచ్చుచుండు త్రిశిరసునిఁ జూచి, వింటియందు వాఁడిబాణములను జోడించి యేయుచు నా త్రిశిర సునిఁ జేరఁదీసెను. అప్పు డా రామత్రిశిరసులకు మహాబలవంతములగు సింహగజములకుఁ బోలె గొప్ప పోరు నడచెను.

అంత త్రిశిరసుఁడు మూఁడుబాణముల రాముసినొసటఁ దగుల నేసెను. రాముఁడు యలుక గదురఁ వేగిరపాటుతోఁగూడి "ఆహా! యని మెనగాఁడవగు నీ బలిమి యెంతటి దనవచ్చును? నీ వేయు బాణములు నా నొసటఁ బుప్పములవలె మెత్తగాఁ దగిలినవి. నా వింటినారినుండి బాణములను బదులుపుచ్చుకొనుము." అని చెప్పి పూనికగలవాఁడై కోపముతో సర్పములఁ బోలు పదునాల్గు బాణముల నా త్రిశిరసుని మొమ్మునఁ నేసెను. పరాక్రమవంతుఁడగు రాముఁడు వంగినగణుపులు గల నాల్గు బాణములచే నా త్రిశిరసుని తేరిగుఱ్ఱములఁ బడనేసి, యిని మిది బాణములచే త్రిశిరసుని సారథిని రథమునుండి క్రిందికిం ద్రోచి

మఱియొక్క బాణముచే ఉన్నతమయిన ధ్వజమును ద్రుంచెను. అంత నా నిశాచరుండు సారథిం గోలుపోయి రణమునుండి దుముకుచుండఁగా, ఆతని ఱొమ్మునఁ బెక్కు బాణముల నేయఁగా, ఆ త్రిశిరసుఁడు మూర్ఛిల్లెను. మఱియు సాటిలేని ధైర్యము గలరాముఁడు వడిగల మూఁడువాఁడియమ్ములం బ్రయోగించి యా త్రిశిరసుని మూఁడుతలలఁ దెగనేసెను. అట్లు త్రిశిరసుఁడు రాము నమ్ములకు నొచ్చినవాఁడై, నెత్తురు గ్రక్కుచు, మున్ను క్రిందఁబడిన తన మూఁడు శిరసులతోఁ గూడ నేలఁ గూలెను. ఆ త్రిశిరసుఁడుగూడ మడియఁగా, మిగిలినవార లగు ఖరుని సేవకులైన రాక్షసు లందఱు బెబ్బులికి వెఱచిన జింకలవలె నచ్చట నిలువక నలుదెసలకుఁ బరుగిడిరి. ఖరుఁ డాగ్రహము గలవాఁడై, యట్లు పరుగిడుచుండు రాక్షసులను జూచి, రాహువు చంద్రునిఁ గబళింపఁబోవునట్లు, రామునిమీఁదికిఁ దానే వచ్చెను.

28-వ సర్గము.

ఖర రాముల యుద్ధము

దూషణ త్రిశిరసు లిరువురు సైతము యుద్ధమున మృతులగుటం జూచి రాముని పరాక్రమవిషయమున ఖరునకుఁ గొంత వెఱపు వుట్టెను. ఎక్కువ బలిమిగల ఖరుఁడు శత్రుల శౌర్యహాని రాక్షససేనయు, దూషణ త్రిశిరసులును నశించుటం జూచి, విచారగ్రస్తుఁడై, నముచి దేవేంద్రుని నెదురొక్కినట్లు, రాముని మీఁదికిఁ బోయెను. అట్లు పోయి వింటిని గట్టిగా నీడ్చి, నారి సారించి, తనధనుర్విద్యా పాండిత్యమేర్పడునట్లు కన? లిన పాములంబోలు నల్లత్రావుడులైన నానావిధాస్త్రముల నేయుచు, రథ మునను౦డియే పలుతెఱఁగుల యుద్ధ మొనర్చెను. మహారథుఁడగు రాముఁ డును వచ్చెడు ఖరునిఁ జూచి, మిణుఁగుఱులతోఁగూడిన యగ్నిహోత్రుని మాడ్కిఁ వెలిఁగెడి యౌర్వశాని బాణములను వింటియందుఁ జోడించి, మేఘుఁడు వర్షించి, వర్షధారలచే దిక్కులను విదిక్కులను నిండించు మాడ్క, బాణవర్షముచే నానాదిక్కులను నిండించెను. ఖరుఁడును రాముఁడును బ్రయోగించిన వాఁడియమ్ములచే నిండిన యాకాశమంత టను సందులేక నిండియుండెను. అట్లు ఖర రాము లొండొరుల వధము నందలి మచ్చరముచేఁ బోరుచుండునప్పుడు వారు ప్రయోగించిన బాణ

పరంపరచేఁ గప్పఁబడి సూర్య్యుండు వెలుంగకుండెను. అట్టి సమయమున, ఖరుండు, అంకుశములతో గొప్ప యేనుఁగును బొడుచునట్లు వాఁడి కొనలుగల నాళీకబాణములచేతను, కర్ణికారములగు బాణములచేతను, ఆ రామునిఁ గొట్టెను. వింటిని దాల్చినవాఁడై రథమునఁ గూర్చుండి యుద్ధసన్నద్ధుఁడైయున్న ఖరునిఁ జూచి పాశాయుధము దాల్చిన యముఁ డోయని సకలజనులును దలఁచిరి. రాముఁడు గడు బలిమిగలవాఁడును, మగతనము విడువనివాఁడునైయున్నను, ఖరుఁ డా రాముని సకల రాక్షససంహారముచే నలసియున్నట్లుగాఁ దలఁచెను.

రాముఁడు మాత్రము సింగమువాఁడ్కిఁ బెకివచ్చుచున్న వాఁడును, సింగముయొక్క నడకవంటి నడకగలవాఁడునైన ఖరుం జూచి, అల్పమృగము జూచిన మృగరాజువాఁడ్కి వెఱపునకుండెను. అంత ఖరుఁడు మిడుత యగ్నిహోత్రునిఁ జేరునట్లు, తనమృత్యుహేతువు రాముఁ డని యెఱుఁగక, సూర్య్యునిఁబోలు గొప్ప రథమును రాముని సమీపమునకుఁ బోనిచ్చెను. అట్లు బాఁపునకుఁ జేరి, ఖరుఁడు రామునకుఁ దనచేతి లాఘవమును జూపుచు, నమ్మహాధీరుఁడగు రాముని యొక్క బాణసహితమగు ధనుస్సును పిడికిటఁ గొట్టి, మఱియలిగినవాఁడై పిడుగులంబోలిన వెలుఁగుగల యేడు బాణములను రాముని బొందలము చిల్లులువడ నేసెను. సూర్య్యునిఁబోలె వెలుఁగునా రామునికవచము ఖరుఁడు ప్రయోగించిన చక్కని గణుపులుగల యేడుబాణములచేఁ గొట్టఁబడి, బ్రద్దలై క్రిందఁబడెను. అంత ఖరుఁడు సాటిలేని మైమెఱుఁగుగల రాముని మీఁద వేయిబాణములు ప్రయోగించి యాతనిని నొప్పించి, గొప్ప యఱ పఱచెను.

అంతట శత్రుసంహారకుఁడగు రాముఁడు ఖరుని బాణములచే నొడలెల్లనాఁటఁబడినవాఁడై, యిఁక నూరకుండఁ దగదని యాగ్రహము పూని, యుద్ధరంగమునందుఁ బొగలేని యగ్నిహోత్రునిమీఁడ్కిఁ దేజరిల్లుచు, ఖరుని ముగింపఁదలఁచి, యగస్త్యమునీంద్రుఁ డొసఁగిన గొప్ప నాదముగల విష్ణువుదైన గొప్ప వింటిని గొని యల్లె త్రాటితోఁ జేర్చి కట్టి ఖరునిపైకిఁ బోయెను. రాముఁ డట్లాగ్రహముతో ఖరునిఁ దాఁకి, సమరముసేసి, చక్కని గణుపులుగల పసిఁడిములుకులబాణములచేత

నా ఖరుని రెక్కెమును ద్రుంచెను. అప్పుడు రామునిచేఁ ద్రుంచఁబడిన ఖరునిపసిఁడిరెక్కెము వేల్పుల యానతిచేఁ బుడమికిఁ డిగ్గివచ్చిన సూర్యుఁడో యనునట్లు, ముక్కలు ముక్కలై నేలఁబడెను. అప్పు డాయపట్టుల నెఱిఁగిన ఖరుఁడు, గజము నంకుశములచేఁ బొడుచునట్లు, యుద్ధసమయమున రాముని నాలుగు బాణములచే నొప్పించెను. అంత విలుకాండ్రలో మేటియగు రాముఁడు బవరమున ఖరుఁ డేసిన పలు తెఱఁగులైన బాణములచే గాడముగ నాఁటబడినవాఁడై, రక్తము నందుఁ దడిసిన మేనితోఁగూడి, కడు మచ్చరము పూని, శ్రేష్ఠమగు వింటిని దాల్చి, యాఱుబాణములను జోడించి, యొక్కబాణమును దల మీఁదను, రెండు చేతులమీఁదను, తక్కిన మూఁడర్ధ చంద్రబాణము లను మొమ్మునను ప్రయోగించెను. అటుపిమ్మట గొప్ప వెలుఁగుగల దిట్టరియగు రాముఁడు ఖరుని సంహరింపఁదలఁచి, వెలుఁగులఁజేని కెన వచ్చెడి పదుమూఁడు బాణములను గైకొని యాఖరుని తేరి నొక బాణముచేతను, నాలుగు గుఱ్ఱములను నాలుగు బాణములచేతను, ఆఱవబాణముచే నా ఖరునిసారథిశిరస్సును, మఱి మూటిచే తేరి నొగను, మఱి రెండింటిచే తేరికంటిని, పండ్రెండవదానిచే బాణములు జోడించియున్న యా ఖరునివింటిని ద్రుంచి, వజ్రముంబోలు పదు మూడవ బాణము గైకొని, చిఱునవ్వు నవ్వుచు సంగరమున నాఖరునిఁ గొట్టెను. అప్పుడు ఖరుఁడు ధనుస్సువిఱిగి, యరదము లేక, గుఱ్ఱములను, సారథిని గోలుపోయి, పుడమికి దుమికి గదను చేతఁ బూని, నిలఁబడి యుండెను. మహారథుఁడగు రాముని యా వింత పనినిఁ జూచి, విమా నములయందుండు దేవతలును, మహర్షులును సంతోషభరితులై, చేతులు జోడించి యొక్కటిగాఁగూడి రామునిఁ బొగడిరి.

29-వ సర్గము.

రాముఁడు ఖరుని దూతి గదను విరచుట

మిక్కుటమగు వెలుఁగు గలరాముఁడు, రథముఁ గోలుపోయి, గదను జేతఁ దాల్చి పుడమిమీఁద నిల్చియున్న ఖరునిం జూచి మెత్తని నిమ్మారపు మాటలచేతను నిట్లని పలికెఁ: "ఓ ఖరుఁడా! నీకపార మయిన చతురంగబల మున్నప్పుడు, నీవు సకలలోకములకు ద్రోఁతను

పుట్టించునట్టి కడు భీకరములగు కార్యములు చేసితివి. భూతములకు వెఱపుఁ బుట్టించువాఁడును, క్రూరుఁడును, పాపంపుఁ బనులు చేయు వాఁడును ముల్లోకములకు జేఁడయినను సుఖముగా మనఁజాలఁడు. రే ద్రిష్మరీఁడా! లోకవిరుద్ధమైన పనిఁ జేయు కఠినుని జనులందఱు తమ కడకు వచ్చిన దుష్టసర్పమునుబోలెఁ జంపుదురు. లోభముచేఁగాని, మోహముచేఁగాని పాపంపుఁబనులు సేయువాఁడు తాను జేయు పాపపుఁ బనుల నెఱుఁగఁడేని, వాఁడు స్థానభ్రష్టుఁడై, వడగండ్లఁ దిన్న నలికండ్లపాముమాడ్కి నా పాపంపుఁబనులకు ఫలము నొందును. ఓ రక్కసుఁడా! దండకారణ్యమునఁ దపస్సుచేయుచు స్వధర్మములనుజరుపుకొను చున్న మహాత్ములగు ఋషులను హింసించి యేమి ఫలము నొందఁగలవు? గడుసుపనులు చేయుచు, లోకనిందలకుఁ బాత్రులైన క్రూరులు మొదలు చివికినచెట్లువలెఁ బెద్దకాలము కలిమినొంది మనఁజాలరు. ఆ యా ఋతువు వచ్చినప్పుడు చెట్లు ఆ ఋతువులకు సంబంధించిన పుష్పములను బొందునట్లు, జనులును అనుభవకాలము వచ్చినప్పుడు తా మొనర్చిన పాపపుంబనులకు ఫలము ననుభవింతురు. ఓ నక్తంచరుఁడా! విషము గలిపిన యన్నము దినువారు దాని ఫలమును వెంబడే యనుభవించునట్లు పాపపుఁగృత్యము లొనర్చువా రా పాపంపుఁబనులఫలమును వేగమే యనుభవింపఁగలరు. ఓర్వరాని పాపకార్యము చేయువారిని, జనులకుఁ గీడుసేయఁ గోరువారిని సంహరించు నిమిత్తము నన్ను దశరథుఁ డడవికిఁ బంపెను. పాములు పుట్టను జొచ్చి యావలికిఁ బోవున ట్లిప్పుడు నే నేయు బంగారు తొడవులు దాల్చిన బాణములు నిన్ను భేదించు కొని యావలికిఁ బోవును. ఈ దండకారణ్యమున సత్కార్యములను జేయుచున్న తాపసులను నీవు జంపితివి, నీవు బవరమున నాచేఁ జంపఁబడి సేనలతో వారివెంబడిఁ బోఁగలవు. నీ వింతకుమున్ను హింసించిన మహర్షు లందఱు విమానారూఢులైవచ్చి, యిప్పుడు నా బాణప్రయోగముచేఁ గయ్యమునఁ గూలి నరకమున నవస్థపడుచున్న నిన్నుఁ జూతురుగాక! కులహీనుఁడా! నీ విచ్చుచొప్పున నన్నుఁ గొట్టుము. నీచేత నైనంతప్రయత్నము సేయుము. ఇప్పుడు నీ తలను తాటిపండునుంబోలెఁ గ్రిందఁ ద్రోసెదను."

అని యిట్లు రాముఁడు చెప్పిన పలుకులు విని ఖరుఁ డలుకచే మైమఱచి, కన్ను లెఱ్ఱజేసి, పకపకనవ్వుచు, రాముని జూచి యిట్లనెను: "ఓ దశరథునికొడుకా! చివ్వయందు సామాన్యులగు కొందఱిని రక్కసు లను జంపి యేల యనర్హమైన యాత్మస్తుతిని చేసికొనుచున్నావు. మగ తనమొండె, బలిమియొండెఁగలవారగు పురుషులు తమపరాక్రమముచే గర్వించి, యేమీయుఁ జెప్పుకొనరు. లోకమున, రామా! నీ విప్పుడు పొగడుకొనునట్లు బలిమి లేనివారును, నీచులునగు క్షుత్రియాధములు వ్యర్థముగాఁ దమ్ముఁ దాము పొగడుకొందురు. బవరమున మృత్యువు డగ్గఱియున్నప్పుడు తనకుఁ దాను కొనియాడఁదగని సమయమున నే వీరుఁడు తనకులమును జెప్పికొని తన్నుఁదాఁ బొగడుకొనును? నీ విప్పుడు దన్నుఁ దాఁ బొగడుకొనుటచే, నీ చులకదనము బయటఁబడినది. బంగరువలె మండుచుండు దర్భలందలి నిప్పు ఇతరపదార్థముల దహింపఁ జాలక తనకుఁ దానే చల్లాఱిపోవును. ఆ చందముననే తన్ను దాఁ బొగడుకొనువాఁడు పరుల నేమియుఁ జేయఁజాలక తనకుఁదానే నశించును. గదను చేతఁ బట్టి, గైరికాదులగు కావిఱాలతోఁగూడిన పర్వతముమాడ్కిఁ గదలింప నలవికాక నీ యెదుట నిలఁబడియున్న నన్నుఁ జూడుము. నే నీ యొక గదతోనే పాశముదాల్చిన యమునివలె సమరమున నీ ప్రాణములను, ముల్లోకములవారి ప్రాణములను గూడ దీయఁగలను. నీతోఁ జెప్పవలసిన విషయము చాల నున్నది. అయినను నేను నీతో నా విషయముల మాట్లాడను. ప్రొద్దు గ్రుంకవచ్చినది, ఇప్పుడు మాటలు పెట్టుకున్నచో యుద్ధమునకు విఘ్నము గలుగును. ఈ పదునాలుగువేల రక్కసులను జంపితివిగదా! నిన్ను రూపుమాపి యీ రాక్షసుల కన్నీళ్లను దుడిచెను."

అని యిట్లు మేటి బాహుపురులు దాల్చిన ఖరుఁడు గడు నలిగిన వాఁడై పిడుగువలె మండుచున్న యా కడిఁది గదను గిరగిరఁద్రిప్పి రామునిపైకి విసరివైచెను. అట్లు ఖరుఁడు విసరివైచిన యా గొప్ప గద మండుచుఁ జెట్లను పొదలను బూదిసేయును; నా రాముని చేరువ కేతెంచెను. రాముఁడును ఆ మండుచు వచ్చుచున్న యమపాశముం బోలు నా గద నాకసమున నుండునప్పుడే బలుతూపులచేఁ దుత్తునియలు

చేసెను. రామునిచే నాకసమందే తుత్తునియలు సేయఁబడిన యీ గద మంత్రౌషధములచేఁ గట్టివేయఁబడిన పాముమాడ్కి నేలం జెదరి యన్నిదెసలఁ బడిన దాయెను.

30-వ స ర్గ ము.

రాముఁడు ఖరుం జంపుట

ధర్మమునందుఁ బ్రేముడి గలవాఁడగు రాముఁ డాగదను దన బాణములచేఁ దుత్తునియలు చేసి, చిఱునవ్వు నవ్వుచు ఖరుం జూచి, పట్టు దలతో నిట్లనియెఁ: "ఓరాక్షసాధమా! నీకుఁగలబలిమినంతయుఁ జూచితివి గదా! నాకంటె నెంతయో తక్కువ బలిమిగలవాఁడవయ్యు కారు లటిచెదవు. నీవుమాటలందు నేర్పరివికాని, పనియందేమియు నీకుపసలేనట్టున్నది. నీవుతప్పక నన్ను సంహరింతుననియెంచియున్న యీనీగద నా బాణముచేఁ దుత్తునియలు సేయఁబడి పుడమిం బడినది. ఇది నీ యాశను జెఱిచినది. మఱియు 'నిన్నుఁ జంపి, యీ రక్కసుల కన్నీటిని దుడిచెద' నని నీ వే మాటపలికితివో, ఇప్పు డా మాటయు వమ్మయిపోయెను. నీచుఁడవు, స్వల్పస్వభావము గలవాఁడవు; మోసపునడవడికలవాఁడవు, రక్కసుఁడవునైన నీ ప్రాణములను గరుత్తంతుఁ డమృతము నపహరించిన చందమున నపహరించెదను. ఇప్పుడు నా బాణములచేఁ జీల్చఁబడి తలదెగిన నీవు క్రిందఁబడి పొరలుచుండఁగా నీ దేహమునుండి నురుగులుకట్టి బుడబుడలతో వచ్చుచున్న నెత్తుటిని పుడమి పానముచేయఁగలదు. ఒడలంతయు దుమ్మంటుకొనఁగా చేతులు సడలిపడఁగా శ్రమపడి పొందిన యువతివలె భూమిని గాఢముగాఁ గౌఁగిలించుకొని నిద్రించఁగలవు. రాక్షసాధముఁడవైన నీవు దీర్ఘనిద్ర చెంది పరుండఁగా, శరణార్థులయిన మునుల కీదండకారణ్యములు శరణ్యములు కాఁగలవు. ఓ రక్కసుఁడా! నీ జనస్థానము నా యమ్ములచేఁ బాడుసేయఁబడినతర్వాత మునులందఱు నిర్భయులై యంతటఁ దిరుగుచుండఁగలరు. ఓ రాక్షసుఁడా! యితరులకు వెఱపుఁ గల్గించునట్టి రాక్షసాంగన లిప్పుడు తమ చుట్టాల నందఱిం గోలుపోయి, కన్నీరుమున్నీరయి కార వెఱపుచేఁ బరుగెత్తఁగలరు. తగిన కులమునఁ బుట్టి, యిట్టి దుష్టుఁడవగు నిన్నుఁ బెండ్లాడిన యంగన లిప్పుడు సుఖములు గోల్పోయి శోకరస మిట్టిదని యెఱింగినవారలగుదురు. ఓ క్రూరుఁడా!

నీచుఁడా! నీచస్వభావుఁడా! బ్రాహ్మణులను హింసించువాఁడా! బ్రాహ్మణులు నీకు భయపడుచు నగ్నియందు హవిస్సులను వేల్చుచున్నారు."

అని యిత్తెఱఁగున బవరమున మిక్కిలి కోపాడంబరముతోఁ బలుకుచున్న రాముని ఖరుఁడు రోషమువలనఁ గడుఁ బెద్దదైన ధ్వనితో బెదరింపఁబూని "నీకు నిక్కముగఁ గావరము పట్టియున్నది. కాఁబట్టియే నీవు భయపడవఁలసిన వేళలందును భయపడక, చావునకు లోఁబడి, చెప్పఁదగని మాటయనికూడ నెంచక నోరికి వచ్చినట్లెల్లఁ బ్రేలుచున్నావు. లోకమునఁ గాలపాశమునకుఁ గట్టుపడియున్న మానవు లాతీంద్రియములవ్యాపారములను మఱిచినవారై కార్యాకార్యముల నెఱుఁగకయుందురు" అని చెప్పి కనుబొమలు ముడివెట్టి, బలవంతుఁడగు నిశాచరుఁ డాయుధము కొఱ కన్ని దెసలం బరికించి, చేరువనున్న యొక గొప్పవ్రాఁకును జూచి, యాడుగఱచి, యా వ్రాఁకును బెఱికి, యిరుగేలం బైకెత్తి గర్జించి, "రామా! మడిసితివి" అని చెప్పుచు దానినెత్తి రాముని నెత్తినిఁ బడవేసెను.

అంతటఁ బ్రతాపవంతుఁడగు రాముఁ డచ్చెడు వ్రాఁకును బాణములచేఁ ద్రుంచి, కలనియందు ఖరునిఁ జంపుటకుఁ గడురోషముం బూనెను. అంతటఁ రాముఁడు కడఁగన్ను లెఱ్ఱనసేసి, చెమ్మటలుగాఱి ఖరునిపైన వేయి వాఁడి యమ్ములనేసెను. అంతట రాముని బాణములు నాటిన యా ఖరుని యొడలినుండి రక్తము నురుగులుగట్టుచు, ప్రస్రవణ పర్వతమునందలి సెలయేటి నీటిధారలవలె విశేషముగాఁ గాఱెను. సంగరమున ఖరుఁడు బాణములచేఁ డయ్యగట్లు కొట్టఁబడినను, మదించినవాఁడై నెత్తుటికంపుతో నా రామునిపైకి వేగిరముగాఁ బరుగెత్తెను. సకలాస్త్రవేత్తయగు రాముఁడు, నెత్తుటిచేఁ దప్పఁ దడిసి, మీఁదికి వచ్చుచుండు కోపాక్రాంతుఁడైన ఖరుని రక్తదుర్గంధము నోర్వఁజాలకయు, బాణము విడువ నవకాశముఁగోరి వడిగనొకయడుగు తొలఁగఁబెట్టి, యగ్నిహోత్రునిమాడ్కిఁ దేజరిల్లుచు రెండవ బ్రహ్మదండమునందగినట్టి దేవేంద్రదత్తమగునస్త్రమును వింటియందు సంధించి, ఖరునిపైఁ బ్రయోగించెను. రాముఁడు చెవివఱకు ధనుస్సునారి నీడ్చి, యేసిన యా యస్త్రము పిడుగుల్రోఁత వ్రాఁగుచుఁ బోయి యా ఖరుని యొమ్మునఁ బడెను. అంత

నా ఖరుఁడు రాముని బాణాగ్నికి మాఁడి, శ్వేతారణ్యమున రుద్రునిచేఁ గాల్పఁబడిన యమునిచందమునను, ఇంద్రునిచే వజ్రాయుధముచేఁ జంపఁబడిన వృత్రాసురునిమాడ్కియు, నురుఁగుచే సంహరింపఁబడిన నముచిపగిదియు, నూఱంచుల వాఁడికైదువుచేఁ గూలనడపఁబడిన బలాసురునికైవడియు నేలఁగూలి, ప్రాణములం దొఱఁగెను.

అంత రాజర్షిమహర్షు లందఱు గూడి యానందమునొంది, రాముని గారవించి, "రామా! యిక్కార్యము నిమిత్తమే, పురందరుఁడు, పాకశాసనుఁడు, గొప్ప వెలుఁగు గలవాఁడునైన దేవేంద్రుఁడు పున్నెముల నొసఁగు శరభంగాశ్రమమునకు వచ్చియుండెను. ఓ రాఘవా! పాపంపుఁబను లొనర్చు నీ క్రూరరాక్షసుల వధము నిమిత్తమే మహర్షులందఱు నిన్ను పాయముచే నిచ్చటికిఁ జేరునట్లొనర్చిరి. ఓ దశరథనందనా! మేము తలపెట్టిన యిక్కార్య మీడేరినదయ్యెను. ఇఁక మహర్షు లీ దండకయందలి యాశ్రమములందు స్వవిహితకృత్యముల నింపుగాఁ జేయఁగలరు" అని రాముని గొనియాడిరి. ఇంతలోపల దేవతలు చారణులతోఁగూడి, దుందుభివాద్యముల వాయించుచు, ఖరునివధమునకై యానందమును, పదునాలుగు వేలరక్కసులను రాముఁ డొక్కరుఁడు సంహరించెను! ఆహా! యీ రాముని విక్రమమెంత గొప్పది! యని యుచ్చెరువును గలవారలై పుష్పవర్షముఁ గురిపించి, యాహా! రాముఁ డొక్కరుఁడె యొకటిన్నరముహూర్తము లోపల సాహసంపుఁబనులు చేయునట్టి ఖరుఁడు దూషణుఁడు మున్నుగాఁగల పదునాలుగువేల రక్కసులను వాఁడిబాణము లేసి చంపెను. ఆహా! యీ రాముని మగఁటిమి వెన్నునిమగఁటిమింబోలె కానఁబడుచున్నాఁడు" అని తమలోఁ దాము చెప్పికొనుచుఁ దమతమ యిరవులకుఁ జనిరి.

ఈ లోపల వీరుఁడగు లక్ష్మణుఁడు సీతను బిలిచికొని, కొండగవినుండి వెలుపలికివచ్చి యానందముతోఁ దమ యాశ్రమము సొచ్చెను. అంత మొనగాఁడగు రాముఁడును జయముఁ గొంతినవాఁడై, మహర్షులచేఁ గొనియాడఁబడుచు, లక్ష్మణుఁ డెదురొడ్డిన పూజలు నిల్పుచుండ నా పూజల నందుకొనుచుఁ దపోవనముఁ జొచ్చెను. అప్పుడు చరుఁడనుఁ

SRI RANGAM MEMORIAL LIBRARY Acc. No. 1010 PRICE 30

బోలు మోముగల యా జానకి శత్రుసంహారియు, మహర్షుల కానంద దాయకుఁడునైన తన ప్రియునిఁ జూచి కడు నుప్పొంగి, రాక్షస సంఘమెల్ల మడియుటవలన నెక్కువ యానందము నొందినదియై, సంతుష్టులైన మహర్షులచే మన్ననచేయఁబడుచు, సర్వ రాక్షససంహార ముచే నిర్విచారుఁడైయున్న యా రాముని మాటిమాటికిఁ గౌఁగిలించి కొని సంతోషపడుచుండెను.

31-వ సర్గము.

అకంపనుఁడు జనస్థానవృత్తాంతము రావణునకు నెఱిఁగింపుట

అంత రావణచారుఁడగు నకంపనుఁ డటనుండివెడలి, వేగిరముగా లంకాపురముచేరి, రావణుం జూచి "ఓ ప్రభూ! జనస్థానమున నున్న యనేకులు రాక్షసులును, ఖరుఁడును మడిసిరి. ఎట్టకేలకు నేను దప్పించి కొని వచ్చితిని" అని చెప్పఁగా, పదితలలదిట్టరియగు రావణుఁడు మండి పడి కన్ను లెఱ్ఱనచేసి, తన చూడ్కిచేఁ, బరులను దహించునట్లు చుటి చుటఁ జూచుచు నిట్లనియె. "ఓ యకంపనా! చచ్చినవాఁ డెవ్వఁడు నా యందమయిన జనస్థానమును బాడుసేసెను? ఎవఁడు నా కపకారమొనర్చి సకలలోకములందును శరణునొందఁ గోరుచున్నాఁడు? ఇంద్రుఁడయినను, కుబేరుఁడయినను, యముఁడయినను, విష్ణువైనను నాకుఁ గీడొనర్చి, సౌఖ్యము నొందఁజాలఁడు. నేను యమునికిఁగూడ యముఁడను. అగ్నిని శైతము గాల్తును. మృత్యువునకుఁగూడ మరణముఁ గలిగింతును. నేనలుగుదునేని, నా వెలుఁగుచే సూర్యాగ్నులనుగూడ దహింపఁగలను. నా బలిమిచే వాయువును శైత మిట్టిటు కదలకుండునట్లు నిలుపఁగలను" అని రావణుఁడు చెప్పెను. అట్లుగ్రుఁడైయున్న రావణుం జూచి, యకంపనుఁడు చేతులు జోడించి, వెఱపుచేఁ గలిగిన డగ్గుత్తికతో రావణు నభయమొసఁగుమని యడిగెను. రావణుఁడును "నీ కభయమొసఁగితి" నని చెప్పఁగా, నయ్యకంపనుఁడు రావణునియందు నమ్మకముంచినవాఁడై జంకులేక నడచిన వృత్తాంతము నంతయు నెఱిఁగించెను.

చక్కని రూపముగలవాఁడును, ఆఁబోతుమూఁపురమునుంబోలు మూఁపురములు గలవాఁడును, గుండ్రని నిడుదచేతులు గలవాఁడును, ప్రాయంపువాఁడును నైన రాముఁ డను దశరథుని పుత్రుఁడు కలఁడు.

ఆ రాముఁడు మొనకాఁడు ; ఎక్కువ కీర్తిగలవాఁడు ; కాంతిమంతుఁడు; సాటిలేని బల విక్రమములు గలవాఁడు. అక్కటా! ఆ రాముఁడు ఖరుని, దూషణుని, మఱి యెల్ల రాక్షసులను సంహరించెను" అని యకంపనుఁడు చెప్పఁగా, రక్కసులఱేఁడగు రావణుఁడు గజేంద్రుని మాడ్కి నిట్టూర్పువిడిచి, "ఓ యకంపనా! యా రాముఁడు దేవేంద్రుని తోను, సకల దేవతలతోను గూడి జనస్థానమునకు వచ్చెనా యేమి! చెప్పుము." అని యడుగఁగా, అకంపనుఁడు రావణునికి మహానుభావుఁడయిన రాముని బలిమిని, మగఁటిమిని నెఱింగించెను.

"ఓ ప్రభూ! రాముఁడనఁగా సామాన్యుఁడుగాఁడు. విలుకాండ్రలో మేటి; దివ్యాస్త్రములకలిమిచే నుత్తముఁడయినవాఁడు. భవరమున వేల్పు లేనిం బోలువాఁడు. ఆ రామునకుఁ జేనగలవాఁడు, ఎఱ్ఱనిగన్నులవాఁడు, దుందుభిస్వనముఁబోలు కంఠధ్వనిగలవాఁడు, చందురునిఁబోలుమోము గలవాఁడునైన లక్ష్మణుఁడను తమ్ముఁ డొకఁడు గలఁడు. అగ్నిహోత్రునికి వాయువుచందమున, కాంతియుంటుఁ డగు రాజశ్రేష్ఠుఁడయిన రామునికి నా లక్ష్మణుఁడు బాసటయై యుండు. ఆ రాముఁ డొక్కఁడే జనస్థానమెల్ల వినాశము చేసెను. ఆ రాముని కొప్ప బలవంతులగు వేల్పులు దొడ్డపడలేదు. దీనికే సంశయమును లేదు. రాముఁ డేసిన పసిండిమునుకులుగల తొక్కలుగట్టిన బాణము లన్నియు నైదుతలల పాములై రక్కసుల నందఱిని సంహరించెను. వెఱపుచేఁ జిక్కినవారలై రక్కసు లే యే యాయుధములఁ బ్రయోగింపఁబూను దురో, రాముఁ డా యా యాయుధములను జేతఁ దాల్చి ముందునిల్చి యున్నట్లె చూచిరి. ఓ యనఘా! రాముఁ డిత్తెఱఁగున నీ జనస్థాన మంతయుఁ బాడుసేసెను" అని యకంపనుఁడు రావణునితోఁ జెప్పెను.

రావణుఁ డకంపనుని మాటలువిని; "రామలక్ష్మణులను సంహరించుటకై జనస్థానమునకుఁ బోయెదను." అని యనఁగా, అకంపనుఁడు రావణుం జూచి, "ఓప్రభూ! రాముని బలిమిమగతనములను వాస్తవముగాఁ జెప్పెద నాలకింపుము. కీర్తిగన్నవాఁడగు, రాముఁ డలుకతోఁ గూడిన నేరికిని నడ్డగింపరాని శౌర్యముఁగలవాఁడు. అతఁడు బాణప్రయోగముచే నిండుగాఁ బాఱుచున్న యేటియొక్క వేగము నాఁపఁ

గలఁడు. చంద్రనక్షత్ర గ్రహములతోఁగూడినయాకసమునైననునశింపఁ జేయఁగలఁడు. (వామనావతారము.) మహిమగల రాముఁడు క్రుంగిపోవుచున్న పుడమినైనఁ బైకి లేవనెత్తఁగలఁడు. (వరాహావతారము.) సముద్రముయొక్క చెల్లెలికట్టఁ దెగఁగొట్టి, లోకములను ముంచఁగలఁడు. సముద్రుని వేగమును, వాయువేగమును బాణప్రయోగముచేనాటంక పెట్టఁగలఁడు. మహాకీర్తి సంపన్నుఁడగు పురుషోత్తముఁడయినయా రాముఁడు తన మగతనముచే లోకములనెల్లఁ బరిమార్చి, మఱలఁ బునస్సృష్టి చేయఁగలఁడు. ఓరావణా! స్వర్గమును జయించుట పాపంపు జనులకు వీలుగానట్లు, రాముని గెల్చుట నీకుఁగాని, రాక్షసుల కంద ఱికిఁగాని వీలుఁగాదు. దేవదానవులుచేరి యొక్కఁడిగఁ బోయిననుఁ, ఆ రాముని సంహరింపఁ జాలరని తలంచెదను. అయిననుఁ, ఇది యారాముని వధించుటకైన యుపాయము. దీనిఁ జెప్పెద సావధానముగనాలకింపుము. ఆ రామునికి లోకమున నుత్తమురాలును, స్త్రీరత్నమును, సకలరత్నభూషణములను దాల్చినదియు, చక్కఁగాఁ దీఱినయంగములుగలదియుఁ, సన్ననినడుముగలదియునైన సీత యను నొక పత్ని గలదు. ఓ ప్రభూ! ఆ సీతకు దేవకాంత సాటిగాదు. గంధర్వప్రమద యైనగాదు. తెఱగంటియన్నువయు నీడుగాదు. అసురాంగనయుఁ బోలదు. ఇఁక మానవ భామలలో నామెకు సరియగువా రెక్కడఁగలరు? నీవు దండకారణ్యమునకుఁ బోయి, యా మహావనమున నున్న యా సీతను బలాత్కారముతోనెత్తికొనిరమ్ము. కామకుఁడయిన రాముఁ డా సీత నెడఁబాసి, ప్రియం బాసిన దుఃఖముచే జీవితము విడువఁగలఁడు" అని యకంపనుఁడు నెప్పఁగా, రాక్షసుల కధిపతియగు రావణుఁ డది మంచిదని యెంచి యకంపనునిఁ జూచి, "అకంపనా! మంచిది. నే నొక్కఁడనే సారథితోఁగూడ వెడలిపోయి, యాసీతను మహానందముతోఁదెచ్చెదను" అని చెప్పి యకంపనునిఁ బుచ్చెను.

అట్లు చెప్పి యకంపనునిఁ బంపి, రావణుఁ డరుణోదయమైన వెంటనే, నక్షత్రమండలముఁ దాఁకుచున్న ఖరములు పూన్చినట్టి సూర్యప్రకాశమగు నెత్తయిన యరదమునఁ గూర్చుండి, క్రొక్కాఱుమబ్బుల నడుమంబోవు చందురునిచందమునఁ దేజరిల్లుచు, తన కాంతిచే దెస లెల్ల

వెలుఁగఁజేయుచు, లంకనుండి వెడలి మారీచుని యాశ్రమమునకుఁ బోయెను. అంత మారీచుఁడు తన యేలిక కాసనమును, నర్ఘ్యపాద్యములను నొసఁగి, మానవులకు లభ్యములుగాని భక్ష్యభోజ్యములువెట్టి, యన్ని తెఱఁగులగు మర్యాదలు సల్పి, యర్థవంతములైన మాటలచే నిట్లనియెఁ: "ఓలోకాధిపతీ! రక్కసులఱేఁడా! క్షేమమేకదా. నీవింత వేగిరముగా వచ్చుటకుఁ గారణము దెలియకున్నది" అని మారీచుఁడనుటయు నెక్కువ తేజస్సుగలవాఁడును, మాటలయందు నేర్పరియున్నైన రావణుఁడు మారీచుని నుద్దేశించి, "నా తలారియైన ఖరుని, జనస్థానమునన్నున్న గెల్వ నలవి కాని రక్కసుల నందఱిని చిత్రచరిత్రుఁడగు రాముఁడు సంహారించెను. నే నాతని భార్యను దొంగిలఁ గోరుచున్నాను. నీవావిషయమునఁ దోడ్పాటుచేయవలయు" నని యడిగెను.

మారీచుఁడు రాక్షసాధిపుఁడగు రావణుని పలుకులు విని, రావణుం జూచి! "ఓ రావణా! నీకు హితశత్రు వెవ్వఁడు సీతను దెమ్మని చెప్పినాఁడు! ఏ వాఁడు నీచే నవమానపడి, నీ కల్మికై యసూయగొని యున్నాఁడు? సీత నిచ్చటికిఁ దోడితెమ్మని నీ కెవ్వఁడు నెప్పె? నాతోఁ జెప్పుము. ఎవఁడు రాక్షసులకొమ్మును విఱువఁగోరు చున్నాఁడు? ఎవఁడైనఁ గానిమ్ము. వాఁడు తప్పక శత్రువు. దాని కేమియు సందియము లేదు. అతఁడు నిన్నుఁ బామునోటఁ జేయి పెట్టించి కోఱలను పీకింపఁ గోరుచున్నాఁడు. ఎవఁ డేయుపాయము సేసి నిన్నిట్టి చెడ్డదారి కిడ్చినాఁడు? ఓ ప్రభూ! హాయిగా నిద్రించుచుండు నీ నెత్తిని నెవ్వఁ డడిచినాఁడు? ఓ రావణా! ఉత్తమవంశోత్పత్తి యనుతొంపముగలదియు, తేజస్సునెడి మదముగలదియు, చక్కఁగాఁదీఱిన బాహువులనెడు దంతములుగలదియు నైన రాముఁడనెడి మదపుటేనుఁగును గనులెత్తి పాఱఁజూచుటకైనను వీలుకాదు. అనిమొనయం దుండుట యనెడి కోపముచే నడుమును దాఁకుచున్న తోఁకగలదియు, నేర్పరులగు రక్కసు లనెడి మృగము లను సంహరించునదియు, బాణము లనెడి గోళ్ళ మున్న గాఁగల యవయవములు గలదియు, వాఁడియడిదము లనెడి కోఱలుగలదియునై నిద్రించుచున్న పురుషోత్తముఁడనెడి సింహమును నీవు లేపుట యుక్తము గాదు. ఓ రక్కసులఱేఁడా! విల్లనెడి మొసలిగలదియు, బాహుబలమనెడి

బురదగలదియు, బాణము లనెడి యలలవరుస గలదియు, కడు గొప్ప బవరము లనెడి ప్రవాహములు గలదియునై కడువెఱపుపుట్టించు రాముఁ డనెడి బిలమునోటఁ బడుట యెంతయు మంచిదికాదు. లంకాధీశుఁడవగు రక్కసులతోఁడా, నీవు కలకఁ దేఱుము. మనస్సు నందలికల వరమును బొందుము. నీవు నెమ్మదిగా లంకకుఁ బొమ్ము. ఎల్లప్పుడు నీవు నీ భార్యలతోఁగూడి విహరింపుము. అచ్చట వనములందు రాముఁడు భార్యతోఁగూడ సుఖముల ననుభవించును." అని మారీచుండు చెప్పఁగా, రావణుఁడు మఱలి లంకాపురికిఁబోయి రమ్యమగు రాచనగరు సొచ్చెను.

32- వ స ర్గ ము.

శూర్పణఖ రావణుపాలికిఁ జనుట

తర్వాత శూర్పణఖ వెగడొందించు మగతనము గలపదునాలుగు వేల రక్కసులను, ఖర దూషణ త్రిశిరసులను రాముఁ డొక్కరుఁడె వధించుట చూచి, గొప్ప మొయిలుచందమున గొప్ప కూఁతఁబెట్టి,యితరు లెవ్వారు చేయ నలవికానిదగు రాముని కార్యముఁ దలఁచికొని యచ్చెరు వంది, కడు వెతపాలయినదై రావణుఁ డేలెడి లంకాపురమున కేఁగెను.

అట్లు పోయి, విచ్చలవిడిగాఁ దిరుగుచున్నదియు, మహానుభావుం డగు రాముని మూలమున ముక్కు చెవులఁ గోల్పోయినదియునైన శూర్పణఖ పుష్పకవిమానముమీఁద బంగారుమయమగు మేలిమి పీట యందు మంత్రులతోఁగూడఁ గూర్చుండి, వేల్పులతోఁ గూర్చుండిన వేల్పుతేని చాడ్పునను, సూర్యునిం బోలెను, బంగారువేదియందు నేయి మెండుగఁ బోయుటచేఁ జక్కఁగా మండుచున్న యగ్నిహోత్రునిచంద మునను వెలుఁగువాఁడును,బవరమున దేవగంధర్వ పిశాచమహర్షులకును గెల్వ నలవికానివాఁడును, మొనకాఁడును, నోఁచి తెఱచికొన్న యముని మాడ్కిఁ దేజరిల్లువాఁడును, దేవాసురుల యుద్ధములందు వజ్రాయు ధమువలనఁ దగిలిన గాయములతోఁ గూడినవాఁడును, ఐరావతము కొమ్ముల పొడుపులచేఁ గాయలుగాచిన యొమ్ముగలవాఁడును, ఇరువది చేతులును, పదితలలును గలవాఁడును, అందమైన ఛత్రచామరములు మొదలగు పరికరములతోఁ గూడినవాఁడును, వెడదయొమ్ముగల వాఁడును, మగతనము గలవాఁడును, రాజచిహ్నములు ధరించిన

వాఁడును, నునుపయిన వైడూర్యములచే శోభిల్లు మొమ్ముగలవాఁడును, పుటముదీర్చిన బంగారుపోగులు ధరించినవాఁడును, గొప్ప చేతులు, తెల్లని మోమునుగలిగి, పర్వతమువాఁడి నెత్తినవాఁడును, వేల్పుల తోడి కయ్యములందు వెన్నుని బటవుఁగె దువుయెుక్క దెబ్బలతోను, మఱియుఁ దక్కిన యలుగులతోను, దెబ్బలుదిన్న వాఁడును; వేల్పుల యన్నివైదువుల దెబ్బలుతగిలిన యవయవములు గలవాఁడును, గలఁచ సాధ్యము గాని సముద్రములను గలఁతనొందించువాఁడును, వడిగాఁ బనులుచేయువాఁడును, పెద్ద కొండలనుగూడ నూఁగించి విడుచు వాఁడును, వేలుపులను హింసించువాఁడును, ధర్మములఁ బోఁగొట్టు వాఁడును, పరదారలను భంగపఱచువాఁడును, అస్త్రములనెల్లఁ బ్రయో గించువాఁడును, ఎల్లప్పుడు జన్నముల కాటంకము గల్గించువాఁడును, భోగవతీపురికిఁ బోయి వాసుకిని గెల్చి, తక్షకుని భార్యను దెచ్చిన వాఁడును, వెండికొండకేఁగి కుబేరుని గెల్చి, కోరినచోటికిఁ గొంపోయెడు పుష్పకవిమానముఁ బట్టి తెచ్చినవాఁడును, కుపితుఁడై చైత్రరథమనెడి యుద్యానమును, నళినియను సరస్సును, నందనవనము మొదలగు దేవతల యుద్యానవనములను కొలఁకులను బాడుచేయునట్టి దిట్టరియు, కొండకొమ్ముఁబోలె నున్నతుఁడయి మహోత్సులును, ఉదయించుచున్న వారును, శత్రుతాపనులును నగు చంద్రసూర్యులను తనభుజములతో నడ్డగించువాఁడును, ఉదయించుచున్న శత్రువుల నణఁచు మహోత్సులగు సూర్యచంద్రుల నణఁచు మొనకాఁడును, పదివేలేండ్లు కాఱడవియందుఁ దపస్సుచేసి, బ్రహ్మదేవునికిఁ దనతలలను గానుకఁ బెట్టినవాఁడును, నరులు దప్పఁ దక్కిన దేవ, దానవ, గంధర్వ, గరుడ, పిశాచ, పన్నగులవలనఁ జావు లేకుండునట్లు వరముఁ బడసినవాఁడును, యాగములందు ద్విజుల మంత్రములచేఁ బవిత్రమయి యాగశాలలయందు వేల్పబడెడు సోమరస మును పాడుచేయుంచు లావరియు, ముగింపునకు వచ్చిన జన్నమును బాడుసేయువాఁడును, కూళయు, బ్రహ్మఘాతకుఁడు, చెడునడతలు నడచు వాఁడును, బరుసనివాఁడు, దయమాలినవాఁడు, జనులకుఁ గీడుచేయుట యం దెక్కువ పట్టుదలగలవాఁడు, జనులనందఱి నేడ్పించువాఁడు, వెఱి పించు వాఁడు మేలిమి దువ్వాలువలం దొడవులం దాల్చినవాఁడు, వాడని

పూవులఁ దాల్చి వెలుఁగుచున్న వాఁడును, జమునికి జముఁడును, సింహా సనమున మంత్రిపరివృతుఁడై కూర్చున్న వాఁడును, పగతురగొంగయు, పౌలస్త్యవంశమునకు హాని దెచ్చినవాఁడును, మండుచున్న విఱివి కన్నులుగలవాఁడును నైన మహాసమర్థుఁడగు రావణుం జూచి, వెఱపు నవివేకమును బెనఁగొనఁ దన వికృతంపుమోము నా రావణునికిఁ జూపి, యతనితో నిట్లనియె.

33. వ స ర్గ ము.

శూర్పణఖ రాముని వృత్తాంత మెఱిఁగించుట

అంతట శూర్పణఖ వ్యసనముతోఁ గూడినదై, మంత్రులతోఁ గొల్వుకూటమునఁ గూర్చుండియున్న, లోకముల నేఁపించువాఁడయిన రావణుం జూచి మేర లేని యాగ్రహము పూని యిట్లనియె. "ఓ రావణా! మిక్కిలి మదించి, కామసుఖానుభవములందు మనసుఁ దూర్చినవాఁడవై, యడ్డులేక, వచ్చియుండు మహాపదను దెలియవలసినదానిని దెలియ కున్నావు. ప్రజలు, ఎల్లప్పుడు అనిత్యసుఖములందు మనస్సు చొప్పించిన వాఁడును, నిచ్చ వనుసరించిన నడువడిగలవాఁడును,లోభియునైన పుడమి జేనిని, కాటినిప్పానుంబోలె సరకుచేయరు. ఏ నృపాలుఁడు సమయ మునఁ జేయవలసిన పనులను జేయఁడో, యారాజా పనులనే కాక, రాజ్యమునుగూడఁ బోఁగొట్టుకొనును. వేఁగులను నియ మింపక, పరరాష్ట్రవృత్తాంతముల నెఱుఁగక స్త్రీసుఖములయందే తగులుగల్గియున్న నృపాలుని జనులు, ఏనుఁగులు దిగఁబడు దున్న భీతిచే నేటిబురదను జేరనట్లు, దామును జెడుదుమన్న భీతిచే దగ్గఱకుఁ జేరరు. ఏ నృపాలురు, జితేంద్రియులుగాక దేశమును గాపాడకయుందురో, వారు కడలియందలి కొండలవలెఁ బెంపుదఱిగి యుందురు. నీవు బలవంతులగు దేవ గంధర్వ దానవులతో మచ్చరము పూని, వేఁగులను నియమింపక, స్త్రీలయందుఁ దగులుగలిగి యున్నాఁ డవు. ఇఁక నిన్ను జనులు రాజని యెట్లు తలఁతురు? రాక్షసా! నీవు పిల్లతనముగలవాఁడవు; తెలివితక్కువవాఁడవు. కావునఁ దెలియవలసిన సంగతిఁ దెలిసికొనకయున్నావు. ఏ నృపాలురకు వేఁగులు, బొక్కసము, నీతియు స్వాధీనములుగావో, ఆ రాజులు సామాన్యజనులం బోలిన

వాడు. రాజులు దూరదేశములందు నడచునట్టి యన్ని విషయములను వేగులమూలమునఁ జూచుచుందురు గావున వారికిఁ దూరచరులు లని పేరు. నీవు జనస్థానమున నున్న స్వకీయజనం బెల్ల నిర్మూలమైనను దెలియకున్నావు గావున నీవు బుద్ధిహీనులయిన మంత్రులతోఁగూడిఁ వేగులను నియమించుకొనక యున్నావని తోఁచెడి. జనస్థానమున నున్న గడుసుపనులు సేయుపదునాలుగువేల రక్కసులును, ఖర దూషణులును, రామునిచే నొక్కనిచే నీల్గిరి. ఋషుల కభయం బొసఁగఁబడినది. దండకారణ్యవాసులకు క్షేమము గలిగింపఁబడెను. ఆశ్చర్యకరములగు పనులు సేయు రాముఁడు జనస్థానము నంతయుఁ బాడుసేసెను. రావణా! నీ దేశమునఁ బుట్టిన యాపదను దెలిసికొనకయున్నావు గావున నీవు లోభివి. ఏమఱినవాఁడవు. ఇతరులకు లోఁబడినవాఁడవు నని తెలియు చున్నది. కఠినుఁడును, నెంత మే లొనర్చినను గొంచెముగా నిచ్చు వాఁడును, జాగ్రత్తలేనివాఁడును, గరువముపట్టిన వాఁడును, పట్టిన మూర్ఖపుఁబట్టుదల విడువనివాఁడునైన రాజుకడకు జనులంద ఱిడుము వాటిల్లునప్పుడును పోఁజాలరు. ఎక్కువ యహంకారముగలవాఁడును, చేరఁదీయఁదగనివాఁడును, తన్నుఁ దా గొప్పగ నెంచినవాఁడును, కోప శీలుఁడునైన మానవేంద్రునిఁ దనబందుగులే చంపుదురు. ఏరాజు సమ యమునఁ బనులు చేయఁడో; ఆపదలందు వెఱవఁడో యట్టిరాజు వేగిర మే రాజ్యభ్రష్టుఁడై, పగలకుఁబాలై, గడ్డిపోఁచలతో సాటికాఁగలఁడు. ఎండుఁగొట్టెలవలనను బని యుండును. మంటిపెళ్ళలును బనికివచ్చును. వీథిదుమ్ముగూడ నొక్కసమయమున నక్కఱకు వచ్చును. అయినను, రాజ్యభ్రష్టులైన రాజులవలన నొక్క పనియు లేదు. కట్టివిడిచిన బట్ట వలెను, నలఁగిపోయిన పూవులదండలవలెను, రాజ్యము కోల్పోయిన నృపాలుఁడు కడు నేర్పరియయిననను బనికిరానివాఁడే. ఏ నృపాలుఁడు జాగ్రత్తగలిగి, యన్ని సంగతుల నెఱుఁగుచు, నింద్రియములెల్ల గెల్చి, నెనరుగలిగి, పుణ్యకార్యము లొనర్చుచున్నాఁడో, ఆ రాజు చిరకాలము సౌఖ్యములననుభవించుచున్నాఁడు. కన్నులు మూసికొనియున్ననుు, నీతి నేత్రములచే నన్నింటినెఱుంగుచుఁ దన కోపమునకును అనుగ్రహమున కును ఫలముఁ దెల్పునట్టి రాజు జనుల మన్ననలఁ బడయును, ఓ రావణా!

నీవు పైఁ జెప్పిన యీ గుణములు లేనివాఁడవు, బుద్ధిలేనివాఁడవు. కాఁబట్టియే నీవు వేఁగులవలన జనస్థానమున నడచిన మహావధము నెఱుఁగవైతివి. ఓ రావణా! పరులను దిరస్కరించి, విషయములందుఁ జిక్కి, దేశకాల విభాగతత్త్వము నెఱుఁగక, మంచి చెడ్డల నెఱుఁగుటకై బుద్ధిని జొప్పించక, రాజ్యముఁ గోల్పోయి, త్వరగా వినాశము నొందుదువు." అని యిట్లు శూర్పణఖ యెత్తి సూపిన తన దొసఁగులను రేద్రిమ్మరుల యొడయఁడు తన బుద్ధితోఁ జక్కఁగా యోచించి, కలిమి, బలిమి, గరువము వీనితోఁగూడి చిరకాలము యోచించెను.

34-వ సర్గము.

శూర్పణఖ సీత నపహరింప రావణునిఁ బురికొల్పుట

పదంపడి రావణుఁడు మంత్రులనడుమ శూర్పణఖ యాగ్రహముతోఁ బలికిన నిష్ఠురంపుమాటను విని, మిక్కిలి యలిగినవాఁడై, "ఓ శూర్పణఖా! ఆ రాముఁ డెవ్వఁడు? ఎట్టితేజస్సుగలవాఁడు? ఎట్టి రూపుగలవాఁడు? వాని మగటిమి యెంతమాత్రము? ఆతఁడు చొటి నలవికాని దండకారణ్యముల కేల వచ్చినాఁడు? ఖర దూషణ త్రిశిర సులంగూడ సంహరించిన యా రామున కేవి యాయుధములు? ఇవి యెల్ల నెఱిఁగింపుము" అనిశూర్పణఖ నడిగెను.

ఇట్లు రేద్రిమ్మరుల జేఁడగు రావణుఁ డడిగిన మాట లాలకించి, శూర్పణఖ యాగ్రహముచేఁ మఱచినదై, యప్పుడు రాముని యొక్క యథార్థస్థితిని దెలుపఁదొడఁగెను. "రాముఁడు దశరథమహారాజు యొక్క పుత్రుఁడు; నిడుద చేతులవాఁడు; విరివికన్నులవాఁడు; నారబట్టలను, కృష్ణాజినమును ధరించినవాఁడు; కమ్మనిల్తునికైనవచ్చు రూపముగలవాఁడు. ఆతఁడు ఇంద్రధనుస్సునుబోలు బంగరు కట్టు వింటిని చెవివఱకీడ్చి, యోర్వరానివిసదారులగు పాములమాడ్కిఁ దేజరిల్లు తూపులను బగతురపై నేయువాఁడు. ఆ రాముఁ డమ్ములపొదినుండి బాణములఁ గైకొనుటయు, వింటియందు జోడించి చెవివఱకు నారి నీడ్చి పగతురపై విడుచుటయు, నేను జూడఁజాలనైతిని. ఇంద్రుఁడు వడగండ్ల వానచేఁ జక్కని పైరును పోడుసేయునట్లు, రాముఁ డంపవాన గురిపించి నా దండును రూపుమాపుచుండఁగాఁ జూచుచుంటిని.

రాముఁ డొక్కఁడు పాదచారియై యొక్కటియునర ముహూర్తము లోపలఁ బదునాలుగువేల సైన్యములను, ఖరదూషణ త్రిశిరసులను సంహరించెను. ఋషుల కభయమొసఁగెను. దండకారణ్యవాసులకు క్షేమము గలిగించెను. ఆత్మజ్ఞానము గలవాఁడగుటంజేసి స్త్రీవధము కాకూడదని యెంచి, యెట్టకేలకు దొడ్డనేర్పరియగు రాముఁడు ననొక్కఁ డానిని మాత్రము ముక్కుచెవులు గోసి, పలుతెఱఁగులఁ బన్నపఱిచి విడిచిపెట్టెను.

ఈ రాముని తమ్ముఁడు లక్ష్మణుఁ డనుపేరు గలవాఁడు. రాము నితో సాటివచ్చు మగతనము గలవాఁడు; అనుఁగుఁజెలికాఁడు; మొన కాఁడు; తేజోవంతుఁడు; అత్యంతాగ్రహము గలవాఁడు; గెల్వనలవి కానివాఁడు; జయశీలుఁడు; బుద్ధిమంతుఁడు; చేవకాఁడు. ఆ లక్ష్మణుం డెల్లప్పుడు రామునికిఁ గుడిచేతివంటివాఁడును, వెలుపటఁ దిరుగు నసురు నైనవాఁడు. మఱియు నా రామునికి సీత యను ప్రియురాలు గలదు. ఆ సీత విరివికన్నులుగలది; పున్నమచందురునిఁబోలు మోముగలది. తన ప్రియునకు ధర్మపత్నియై యాతని కింపును మేలును గల్గించుటయందే యెల్లప్పు డాసగలది. ఆ సీత సొగసువెండ్రుకలుగలది; సొంపయిన ముక్కును, తొడలును గలది; రూపసి; సొగసుకత్తెయని ప్రసిద్ధి గన్నది. దండకారణ్యవాసినియగు వనదేవతయో, రెండవలక్ష్మియో యన వెలుఁగుచున్నది. అపరంజివంటి మేనిఁడాలుకలది; ఎఱ్ఱనియొత్తుగోళ్ళది. మంగళకరురాలు, గొప్ప పిఱుఁదులది; సన్నని కౌనుగలది. దేవ గంధర్వ యక్ష కిన్నరులలోపల నింతటి యందకత్తెను నేఁ జూచినదిలేదు. ఇఁక భూమి నెక్కడ నుండును? ఎవనికి సీత పెండ్లామగునో, వేడ్కతో నెవనినిఁ గౌఁగిలించునో, ఆ పురుషుఁడు వేల్పులతోనికంటె నన్నిలోకము లందు మున్నన వడయుచున్నాఁడు. ఆ సీత చక్కని రూపును, చక్కని నడతయుఁ గలిగి, భూమింగల యందకత్తెల నెల్లర మించినదై యున్నది. ఆ సీత నీకుఁ దగిన పెండ్లామగును. నీవును దానికిఁ దగిన పెనిమిటి వగుదువు. విఱివియైన కటిపురోభాగమును, బలిసిన స్తనములు, పిఱుఁదులుం గలదియు, చక్కని మోముగలదియునైన సీతను నీకుభార్యనుజేసి నేను కొని తేరఁ బ్రయత్నపడితిని. ఓ నిడుదచేతులవాఁడా! యందు

లకే క్రూరుఁడయిన లక్ష్మణుఁడు నన్నిట్లు కురూపింజేసి పంపెను. పున్నమ చందురునింబోలు మోముగల యా సీతను జూచితివేని యప్పుడే నీవు మన్మథబాణములకు లోఁబడిపోదువు. దానినిఁ బెండ్లాడ మనస్సుగల దేని, వేగిరముగా నా రాముని గెల్వఁ గుడికాలెత్తును. ఓ రక్కసుల యేలికా! క్రూరుఁడైన యా దండకారణ్యవాసియగు రామునిఁ దెగ టార్చి, యా రక్కసుల కందఱికిని బ్రీతియొనర్పుము. మఱియు మహా రథుని లక్ష్మణునిసైతము వాఁడియమ్ములచేఁ గూలనేసి, పెనిమిటిం బోఁగొట్టుకొన్న యా సీతనుగూడి, సకలసౌఖ్యముల ననుభవింపఁగలవు. రాక్షసరాజా! నీకు నామాట యుక్తమని తోఁచెనేని, సంశయము మాని, ప్రయత్న పడుము. లేదేని, నీ శక్తి గనుఁగొని, ఒచ్చెములేని యన్ని యంగములు గలదగు నా సీతను బలాత్కారముగా నీడ్చుకొని రమ్ము. రావణా! రాముఁడు వాఁడియమ్ములచేఁ బదునాలుగువేల రక్కసు లను' ఖరదూషణ త్రిశిరసులను ద్రుంచినాఁడన్న మాటవిని యిట్టు లూరకుండుట తగునే? నీ వెది యుక్తమో దానిని దామసింపక చేయుము" అని శూర్పణఖ రావణునిఁ బలుతెఱఁగులఁ బురికొల్పెను.

35-వ సర్గము.

రావణుఁడు మారీచాశ్రమమునకుఁ జనుట

పదంపడి, రావణుండు మేని కులుకు వుట్టించు శూర్పణఖ చెప్పిన యా మాటను విని, మంత్రులంగూడి చేయవలసినది యొదియని యాలో చించి, తగిననిర్ణయమునకువచ్చి, అందు మంచిచెబ్బరలను, బలాబలములను నిర్ధారణచేసి యీతీరున నాచరించవలెనని స్థిరబుద్ధితోనిశ్చయించి రమ్య మయిన గుట్టపు లాయమునకు నేరికిఁ దెలియకుండఁ బోయి, సారథిం బిలిచి తేరి నాయితముచేయు మని చెప్పెను. యా సారథి శీఘ్రము లోపల రావణుని కిష్టమైన తేరి నాయితపఱిచెను. అంతఁ గుఱేరునిత్తముఁ డగు రావణుఁడు బంగారు తొడవులతోఁ గైసేసిన దయ్యపుమోరలు గల గాడిదెలంగట్టి స్వేచ్ఛగాఁ బోయెడి మేఘమువలె నుతిమెడి తేరెక్కి సముద్రతీరమునకుఁ బయనమయ్యెను. ఇరువదిచేతులుఁ బది తలలుం గలవాఁడును వేల్పులదాయాదియు, ఋషులగొంగయునైన రావణుఁడు నునుపు వైడూర్యమువంటి మేనిచాయగలవాఁడై,

బంగారుచెవులపోగులు ధరించి, తెల్లని గొడుగును వింజామరలంగల వాఁడై, పదికొనలుగల పర్వతమువాఁడి వెలుఁగుచు, తన యిచ్చ వచ్చిన చోటికిఁ జను నరదమెక్కి, మెఱుపులతోను కొంగలతోను గూడిన యాకసమందలి మేఘమువాడ్పున వెలుఁగుచుండెను.

చేవకాఁడగు నా రావణుఁడు పలుతెఱఁగులగు పుష్ప ఫలములతోఁ గూడిన వేలకొలఁది చెట్లతోఁ గూడినదియు, చల్లని మంచినీటికాసర కొలఁకులతోను, జన్నంపుఁ దిన్నెలుగల వెడదలైన యాశ్రమములతోనుఁ గూడినదియు, అరటి, కంది, కెంకాయ, మద్ది, తాటి, కానుఁగు మొదలగు పూఁచిన చెట్లతోఁగూడి నదియు, వేలకొలఁది పన్నగ, గరుడ,గంధర్వ,కిన్నరులును, అయోనిజులు, బ్రహ్మయొక్క గోటినుండి పుట్టినవారు, కిరణములఁ ద్రావువారు, కఠినము నాహారనియమము గలవారు, మూషగోత్రులునగు వాలఖిల్యులు మున్నగువారల కునికిపట్టును, జితేంద్రియులగు సిద్ధ చారణులకు కెంకియు, దివ్యభూషణములను పుష్పమాలలను దాల్చియుండువారును, దివ్యరూపము ధరించినవారును, క్రీడారతి విధానముల నెఱిఁగినవారును నైన వేలకొలఁది యచ్చరలతో వెలుఁగుచున్నదియు, సౌదర్యవతులగు దేవకాంతలతోను, అమృతపుఁ దిండులగు దేవ సంఘములతోను గూడి యొప్పుచుండునదియు, హంస, సారస, క్రౌంచ, ప్లవము లనెడిపక్షుల యింపగు కూఁతలతోఁ గడు మ్రోగుచున్నదియు,వైడూర్యమణిమయంపు జాలుగలదియు, సముద్రపుఁ గాంతి ప్రసారముచే మనోహరముగఁ గనుపట్టునట్టిదియునైన సముద్రతీరమందలి వనములఁ జూచుచు నవ్వనము లందుఁ దెల్లనివి, వెడల్పయినవి, దివ్యములగు పువ్వులసరములచేఁ గైసేయఁబడినవి, వాద్యగాన ధ్వనులతో నిండినవియునైన తపోనిర్జిత లోకులగు మహానుభావులు స్వేచ్ఛగాఁ దిరుగు విమానములను, గంధర్వ్వ లను, అచ్చరలను, రసమును స్రవించు మొదలులుగల శ్రీగంధపుఁ జెట్ల యొక్కవనములను, ముక్కునకుఁ దనివిగలిగించు ఇంపయినవాసనగల అగరువృక్షములను తక్కోలజాతీవృక్షముల తోఁటలను, కానుఁగుపువ్వులను, మిరియపుఁబొదలను, గట్టులం దెందుచున్న ముక్కాలకాసులను, సంకులయు, పవడములయు కాసులను, బంగారు

వెండి కొండలను, చక్కని సెలయేళ్ళను, తేటలైన మడుగులను, ధన ధాన్యసమృద్ధి గలిగి, మేటియువిదలతోఁగూడి, గజాశ్వరథములతోఁ గ్రిక్కిరిసియున్న పత్తనములను అంతటను చదునయినునుపుఁదేరి యుండు నదియు, చల్లని పిల్లగాలులు వీఁచుచున్నదియు నయి స్వర్గపట్టణము బోలి యున్న సముద్రతీరమును జూచుచుఁబోయి యచ్చట నూఱుయోజన ముల దూరము నలుదెసలను గొమ్మలు వాఱినదియు, ఋషుల కాశ్రయ మయినదియునగు మేఘమునుఁబోలు నొక మఱ్ఱిచెట్టును జూచెను.

మునొక్కకల్పుడు కడు బలిమిగలవాఁడగు గరుత్మంతుఁ డొక పెద్ద యేనుఁగును,గొప్ప తాఁబేటిని తీసుకొనివచ్చి భక్షించునిమిత్తమయి, యా మఱ్ఱిచెట్టు కొమ్మమీఁదఁ బెట్టెను. ఆకులుమెండుగఁగల యాకొమ్మ యా బరువును దాళఁజాలక పెళపెళ విఱిగెను. ఆ కొమ్మయందుఁ జంద్రసూర్య కిరణము లాహారముగాఁ గలవారును, ధూమపానము చేయువారునగు వైఖానసులు, మాషులు, అయోనిజులు, వాలఖిల్యులు మున్నుగాఁగల యనేకమహర్షులు గూడి తపస్సు చేయుచుండిరి. విఱిఁగిన కొమ్మ క్రిందఁ బడిన నామహర్షుల కపాయముకలుగునని వెఱచి, గరుడి నూఱుయోజన ముల పొడవుగల యా శాఖను, ఏనుఁగును తాఁబేలిని ముక్కునఁ గఱచి కొని, వేగమునఁ దన తండ్రియానతిచొప్పున నాకొమ్మను హిమవత్పర్వత మునకుఁ గొనిపోయి యచ్చట విడిచి, యొంటికాలిమీఁద నిలిచి, యా యేనుఁగు తాఁబేళ్ళను దిని, బోయలదేశమును సంహరించి, వారిని క్రింగి, మహా మునుల నందఱను బోయలబాధనుండి తప్పించెను. నేర్పరియగు నాగరు త్మంతుఁ డటుగావించి మిక్కిలి యొక్కువ యానంద మొందినవాఁడై, యా వేడుకచే నినుమడించిన బలిమిగలవాఁడగుచు వేలుపులబువ్వను (అమృతమును) గొని రా నుత్సాహముపూని, స్వర్గమునకేఁగి, యింద్రుని గృహమున నినుపకిటికీలను నుగ్గుసేసి, రత్నపుటింటిని బడఁగొట్టి, యచ్చట దాఁచియుంచఁబడియుండిన యమృతమును దెచ్చెను. అట్టి గరుడునిచేఁ జేయఁబడిన గుఱుతుగలదియు, మహర్షుల కనుకిపట్టయినదియునైన, సుభద్ర మనుపేరఁ బరగు మఱ్ఱిచెట్టును కుబేరునితమ్ముఁడగు రావణుండు చూచెను.

అట్లు రావణుఁడు కడలి యావలిగట్టును జేరి, యేకతమై యింపు గులుకు పున్నెములొసఁగెడి వనమధ్యమున నొక్క యాశ్రమము చూచి, యచ్చట జడలుదాల్చి, నారబట్టలుగట్టి, యాహారనియమముతోఁ దపస్సు గావించుచున్న మారీచుఁ డను రక్కసునిఁ జూచెను. మారీచుండును వచ్చుచున్న రావణుని యోగక్షేమముల నరసి దనివినొందించి, యన్న పానములచే నాతనిని గారవించి యొక్కువయర్థముగల పలుకులతో "రాక్షసేశ్వరుఁడవగు నో రావణా! నీవింతకుమున్నె యిచ్చటనుండి వెళ్లితివిగదా? మఱల నెందు కింత వేగిరముగా నిచటి కేతెంచితివి." అని రావణు నడుగఁగా, నెక్కువ తేజస్సుగలవాఁడగు మాటలనేర్పరియైన రావణుఁడు వెండియు నిట్లనియె.

36-వ స ర్గ ము.

రావణుఁడు మారీచుని సహాయమునగోరుట

"నాయనా! మారీచా! నా మాటను వినుము. నేను గడు వెతల పాలయితిని. నొచ్చినవాఁడనగు నాకు నీవే దిక్కు. జనస్థానమున నాతమ్ముఁడు ఖరుఁడును, నిడుదచేతులవాఁడగు దూషణుఁడును, నాచెలియలగు శూర్పణఖయుఁ, బొలసుదిండియు, గొప్ప తేజస్వియగు త్రిశిరసుఁడును, వాఁడి మగలును, గుఱిగలవారును, రేఁద్రిమ్మరులునైన పెక్కువేల రక్కసులను దండకారణ్యమున ధర్మములనాచరించుచు మునులనుబాధించుచు నాయానతిచేఁ బ్రేముడి మీఱి వసించుచున్నారన్న సంగతి నీకుఁ దెలిసియున్నదికదా! ఖరునిమనసు ననువర్తించువారు, కడిఁదిపనులు చేయువారు, పూన్కిగలవారు, వడిగలవారునైన బదునాలుగువేవురు రక్కసులు,నచ్చటనున్నారు.ఇప్పుడుజనస్థానముననున్న ఖరుఁడుమున్నుగాఁ గల చేవకాండ్రగు రక్కసు లందఱు పలుతెఱఁగుల యాయుధములను దాల్చినవారై, యందఱుగూడి కట్టాయితులై, రాముని తోఁగయ్యము సేయఁబూనిరి. అని మొనయందు రాముఁడు కడు దోషము పూని, పరుసనిపలుకులం బలుకక వింటియందు బాణములఁగూర్చి,తన ధనుర్విద్యా పాండిత్యము మెఱయఁ జూపెను. ఓర్వరాని తేజస్సుగలవారగు పదునాలుగువేల రక్కసులను పాదచారియైన మానిసి యగు రాముఁడొక్కఁడే పదునుబాణములతోఁ గూల్చెను. యుద్ధరంగమున రాముఁడు

ఖరునిఁ జంపెను. దూషణునిఁ జంపెను; త్రిశిరసునిఁ జంపెను. దండ కారణ్యములవెఱపు దీర్పఁబడెను. తండ్రి యలుకతో రాజ్యమునుండి తఱుమఁగా, నడవికి వచ్చిన నిర్భాగ్యుఁడయిన క్షత్రియాధముఁడగు రాముని నేను వధించువాఁడను. చెడునడతయు, నెనరులేని యుక్కు మనస్సును, మొఱపెట్టుదలయుఁ గలవాఁడును, లోభియు, జితేంద్రి యుండును, ధర్మహీనుఁడును, పున్నెంపునడత లేనివాఁడును నైనందున, నా రాముఁడు మచ్చరము లేకయ, తన బలిమి నొక్కదానిని బ్రథా నముగాఁ దలఁచి, నా చెల్లెలిని ముక్కుచెవులను గోసి కురూపిణిం గావిం చెను. ఓ మారీచా! వేల్పుఁజేడియంబోలు నా రాముని ప్రియురాలిని జనస్థానమునుండి తీసికొని రాఁ గోరుచున్నాను. నీ వికార్యమునకుఁ బాసట సేయుము.

బలమికాఁడా! నీవును తమ్ములును బాసటయై నాప్రక్కన నుండఁగా, బవరమున వేల్పు లంద ఱెత్తివచ్చినను సరకుసేయను. ఓ రక్కసుఁడా! నీవు నేర్పరివి గావున నాకుఁ దోడ్పడుము. మగఁటిమి యందును, బవరమునను, గరువమునను నీతో నెనయగువాఁ డెవ్వఁడును లేఁడు. ఉపాయశాలివి; గొప్పవాఁడవు; శూరుఁడవు, సకలమాయలను లెస్సఁగాఁ దెలిసినవాఁడవు. నేను నీ కడకు వచ్చినకార్యమిది. నాకీ కార్యమునఁదోడుపడుటకయి నీవుచేయవలసిన దానినిచెప్పెదను వినుము.

కావున మారీచా! వెండినన్నె చుక్కలుగల పసిఁడిజింకవై, యా రాముని యాశ్రమమున సీతకుఁ జేరువ నడయాడుచుండుము. పసిఁడిజింకరూపుఁ దాల్చిన నిన్నుఁజూచి, తోడనే, తనప్రియునితోను, లక్ష్మణునితోను నామృగమును బట్టి తెమ్మని సీత యడుగును. అప్పుడు నిన్నుఁ బట్టుకొనుటకై, వారు నిన్ను వెంబడించి పోఁగా, నేనేకతమున నున్న యా సీతను, రాహువు చంద్రునికాంతినిబోలెఁ గష్టములేక యపహరించెదను. అటుపిదప రాముఁడు పెండ్లాము నెడఁబాసిన వెతచేఁ జిక్కుఁగా, నేను నిండుమనముతో నారాముని నిశ్శంకముగాఁ గొట్టెదను" అని రావణుఁడు సెప్పెను.

ఆ రావణుని వార్త విన్నతోడనే, మారీచుని మోము బెండు పాఱెను. అంత మారీచునికి వణుకును బుట్టెను. అట్లు మారీచుఁడు

వణఁకుచు నెండుపాఱిన పెదవులు దడపుకొనుచు, జెప్పవాల్పక చచ్చి నట్లున్న రోగివలె మిడిగ్రుడ్లతోఁ జూచుచుండె. ఆ మారీచుఁ డట్లాలో చించి, మనసున వెగడొందినవాఁడై, మహారణ్యమున రాముని మగఁ టిమి నెఱిఁగినవాఁ డగుటచేఁ గొంత యాలోచించి, చేతులు జోడించి, తనకును రావణునికిని మే లొనఁగూర్చునదియు, నిష్టమైనదినైన మాట లతో నిట్లనిపలికెను.

37-వ స ర్గ ము.

మారీచుఁడు రావణునికి హితము సెప్పుట

మాటలందు నేర్పరి,మహాప్రాజ్ఞుఁడునైన మారీచుండు రక్కసుల యేలికయొక్క పలుకులు విని, యాతనతో నిట్లనియె.

లోకమున నెల్లప్పు డింపుమాటలఁ బలుకువారు తఱుచుగాఁగలరు కాని, యింపు గాకున్నను మే లొదఁపుమాట యొక్కటి యేనిఁ జెప్పువాఁ డొకఁడైనను దొరకుట కడు నరుదు. అట్లు చెప్పువాఁడు దొరకినను, వినువాఁ డొకఁ డయినను దొరకుట దానికంటె మిక్కిలి యరుదు.

రావణా! నీవు వేఁగుల నుంపక, నిలుకడలేనివాఁడవై, రాముఁడు గొప్ప మగఁటిమిగలవాఁడనియు, గొప్ప గుణములు గలవాఁడనియు, వేల్పుల దొరను మున్నీటిజెలినిని బోలువాఁడనియుఁ దెలియకున్నాఁ డవు. నాయనా! లోకమున రక్కసుల కందఱకు మేలయ్యెడుఁగాక! రాముఁ డలిగి, లోకమును రక్కసులులేనిదిగాఁ జేయకుండునుగాక! నీ ప్రాణములఁ దీయుటకై జానకి పుట్టలేదుగదా! సీతనిమిత్తము నాకు వంత గలుగకుండునుగాక! అడ్డులేక యిచ్చకువచ్చిన చోటికెల్లఁ బోవు వాఁడవగు నిన్ను దొరగాఁ బడసిన లంకాపురము నీతోను, రక్కసు లందఱితోను గూడి రూపు మాయుదుగదా! ఇచ్చకువచ్చిన నడతగల వాఁడు, చెడుదారిఁ బోవువాఁడు, చెడుగులతో నాలోచన చేయు వాఁడు, చెడుతలంపుగలవాఁడునగు నొడయఁడు దనకును, బందుగుల కును, రాజ్యమునకును గీడు దెచ్చుకొనును.

రావణా! రాముని దండ్రి వెడలఁగొట్టలేదు. ఆతఁ డెప్పుడును మర్యాదలేనివాఁడు గాఁడు; ఆసగలవాఁడుకాఁడు; చెడునడవడి కల వాఁడుకాఁడు. క్షత్రియకులదూషకుఁడుకాఁడు. పున్నెపుఁగొన

ములు లేనివాఁడుకాఁడు. భూతములందుఁ గరుణలేనివాఁడుకాఁడు. ప్రాణు లన్నింటికి నహితము గోరువాఁడుకాఁడు, కైక సత్యముఁదప్పని తన పెనిమిటిం జూచి "రామున కరణ్యవాసమును దన కొడుకునకుఁ బట్టాభిషేకమును జేయు"మని వర మడిగెను. అట్లైయని, దశరథుఁడు కొమరునిఁ జూచి, యడవికిఁ బొమ్మని చెప్పెను. రాముఁడు కైకేయి యిష్టము నెఱవేర్చను దండ్రియగు దశరథుని మాట్టను జెల్లింపనుగోరి, రాజ్యమును, సుఖములను విడిచి యడవిం జొచ్చినవాఁడు. నాయనా! రాముఁడు కఠినుఁడు గాఁడు; తెల్విలేనివాఁడుగాఁడు; ఇంద్రియనిగ్రహము లేనివాఁడుగాఁడు. తప్పుడుమాటలను విని, రామునిపైఁడ బొంకును నీ వారోపించుట ధర్మముగాదు.

రాముఁడు రూపుదాల్చిన ధర్మ మనఁదగినవాఁడు; సాధువు, నిలుకడ యైన మగఁటిమిగలవాఁడు; దేవతలకు నూఱుజన్నములవేల్పువలె లోకమున కంతటికిఁ బ్రభువు. అట్టి రామునిచేఁ దనబలిమివలనఁ గాపాడఁబడుచుండు సీతను వెలుఁగులఁజేని వెలుఁగునుబోలె బలాత్కారముచేఁ గొంపోవఁ గోరుచున్నాఁడు. పోరునందుఁ దూపులనెడి మంటలును, విండ్లు గదయు ననెడి కట్టెలు గలిగి, యూర్వఁగూడనంత వెలుఁగుతో వెలుఁగుచున్న రాముఁ డను నగ్నియందు నీవు పోయి పడకుము. రావణా! నీవు రాజ్యమును, సుఖమును ప్రియములగు ప్రాణములను విడువకుండఁ గోరుదువేని, విల్లనెడు తెఱచిన వెలుఁగునోరుగలవాఁడును, బాణములనెడు మంటలు గలవాఁడును, ఓర్వరానివాఁడును, చాపమనెడి క్రాఁటిని దాల్చినవాఁడును, పగతురమొత్తమును నుగ్గుచేయు వాఁడును నయిన రాముఁడనెడు జమునిదగ్గఱకుఁ బోవుట యుక్తముగాదు. సీతను గాపాడునట్టి యా రాముని వెలుఁగట్టిదని యూహింపరానిది. కావున రావణా! నీ వట్టి రాముని వింటియాశ్రయము గలిగియున్న సీత నపహరింపఁజాలవు. సింగపుఁబొమ్మ గలయా పురుషోత్తమునికిఁ దనపత్ని ప్రాణములకంటె మిన్నయైనది. ఆ సీతయు నెల్లప్పుడు రామునే యనుసరించునది. తేజస్వియగు రాముని యధీనమైన యా నెన్నడుముగల సీతను వెలుఁగుచున్న యన్నింటిదిండికాని జోతినింబోలెఁ బట్టుకొన నెంతమాత్రము వీలుగాదు. రక్కసుల యొడయఁడా! నీ వీవమ్ము

ప్రయత్నముచేసి యేమి సాధించెదవు? ఓ రావణా! బవరమున రాముఁడు నిన్నుఁ బాఱఁజూచెనేని, యప్పుడ నీ యాయువు ముగియు. నీవు బ్రతుకును, ఇమ్ములను, నేరికిని బొంద నలవికాని రాజ్యమును నేండ్లుపూండ్లుగా ననుభవింపఁగోరుదువేని, రామునికిఁ జెఱుపుచేయకుము. కావున నీవు విభీషణుఁడు మున్ను గాఁగల నాయపుబుది గల మంత్రులతో నాలోచించి, యావలఁ కార్యమును స్వయముగా నిర్ణయించికొని, మంచి చెడ్డలను, బలాబలములను, తనబలిమిని, రాముని బలిమిని జక్కఁగాఁ బరికించి, మేలుకీళ్ళ నారసి, యావల యుక్తముగు దానిఁజేయుము. కోసలరాజపుత్రుఁడగు రామునితో నీవు రణమునఁ గలియఁబడుట యెంతయుఁ దగినపనికాదని తలఁచెదను. రాక్షసేశ్వరా! నే నింకను దేశకాలములకుఁ దగిన సమయోచితయుగు నొక మంచి మాట చెప్పెద నాలకింపుము." అని మారీచుఁడు రావణునితోఁ జెప్పెను.

38-వ సర్గము.

మారీచుఁడు రాముని పరాక్రమము రావణుని కెఱిఁగించుట

"మున్నొకప్పుడు, నేనును వేఱుయేనుఁగుల బలిమిగలవాఁడనై, కొండవలె నున్నతమయిన రూపముదాల్చి, కాఱుమొగులు మెఱుఁగు గలవాఁడనై, మేల్మి పసిఁడి యంటుపోగులను దాల్చి, బొమికిడికము ధరించి, గుదెదాల్పునై జనులకు వెఱపుగల్గించుచు, దండకారణ్యము నందలి తాపసుల నంజొళ్ళను మెక్కుచు నీ పుడమియెల్ల మొగటిమి మెఱయఁ దిరుగుచుంటిని.

అప్పుడు, ధర్మస్వభావుఁడగు విశ్వామిత్రుఁ డను మహాముని నాకు వెఱచి, తానే దశరథనరపాలునిపాలికిఁ జని, "యో పుడమి తేఁడా! రాముఁడు మెలఁకువతో నన్నుఁ బర్వకాలమునఁ గాపాడవలయు" అని యడుగఁగా ధర్మరతుఁడగు దశరథుఁడు మహాను భావుఁడగు సవ్విశ్వామిత్రునిఁ జూచి, "రాముఁడు పండ్రెండేండ్లు పసివాఁడు; మఱియు విలువిద్య నేరనివాఁడు. కావునఁ దమకు నొప్పుదల యేని, నాకడనున్న బలగముఁ దోడ్కొని నే నేతెంచెదను. ఓ మునిశ్రేష్ఠా! నేను చతురంగబలమును వెంటఁ గొనివచ్చి, మీరు కోరెడి రేర్చిమ్మరులగు పగతుర నందఱను బరిమార్చెదను" అని యనెను.

పుడమితేని యప్పలుకులు విని, యాతనింజూచి, "ఆరక్కసునిఁ జంప రాముఁడు దక్క మఱొక్కఁడు చాలఁడు. నీవును వేలుపులకుఁ గూడఁ గయ్యములందుఁ దొడ్పడువాఁడవే. అది యెట్టుఁగుదును. నీవొనర్చిన గొప్ప పనులు మున్లోకములందును బ్రసిద్ధికెక్కియున్నవి. అట్లున్నను, పగతురగొంగయైన యోన్నపాలుఁడా! నీ గొప్ప సేన నిచ్చటనే యుండ నిమ్ము. ఈ రాముఁడు పసివాఁడయ్యా, నా మారీచుని దెగటార్పఁ జాలి నంత నేర్పరియు, గొప్పవెలుఁగుగలవాఁడునై యున్నాఁడు. నేను రామునిఁ దోడ్కొనిపోయెద. పరంతపా! నీకు మేలయ్యెడు. పోయి వచ్చెద" మని చెప్పి, విశ్వామిత్రుఁడు కొమరుఁడగు రామునిఁ దోడ్కొని, కడువేడ్కతోఁ దన యాశ్రమమున కేఁగెను.

అప్పు డా విశ్వామిత్రుఁడు యజ్ఞమునకై దీక్ష వహించి యుండఁగా, రాముఁడు వింతయైనవింటిని జేతఁబట్టి నారిని మీటుచుఁ జేరువ నుండెను. అప్పుడు మీసములు మొదలగుయౌవనలక్షణము లేర్ప డనివాఁడును, కాంతిమంతుఁడును, తమ్మిదేకులవంటి కన్నుల వాఁడును, ఒంటిబట్ట గట్టినవాఁడును, విలుకాఁడును, జుట్టు కట్టుకొన్నవాఁడును నైన రాముఁడు దనవెలుఁగుచే దండకారణ్యమెల్ల వెలుఁగఁజేయుచు నుదయించిన బాలచంద్రునిపగిదిఁ దోఁచెను. అంత నేను మేఘమువంటి గొప్ప రూపును దాల్చి, పసిఁడిపోఁగులను వేసికొని, బ్రహ్మదేవునివలనఁ బడసిన వరప్రభావముచే బలిమియు గరువముంగలవాఁడనై, యా యాశ్రమమున కేతెంచి యాయుధమును జేతఁబూనితిని. నన్నుఁజూచి యా రాముఁడు తత్తరపాటునొందక, వింటికి నల్లెత్రాటిని గట్టెను. నేను రాముని జూచి యజ్ఞానముచే "నితఁడు పసివాఁడు. మనల నేమి చేయఁగలఁ"డని యతనిని సరకుసేయక, విశ్వామిత్రునియాగశాలకుఁ గడు వేగిరపాటుతోఁ బోయితిని. అప్పుడు రాముఁడు పగతురఁ దెగటార్చ నొక యమ్ము నేసెను. ఆ బాణవేగముచేఁ గొట్టఁబడి నూఱు యోజనములదవ్వున నున్న కడలియందుఁ బడితిని. ఓ నాయనా! చేవకాఁడగు రాముఁడు నాయొడఁ గరుణించి, నన్నుఁ జంపక కాపాడెను. నేను రామునిబాణవేగమునకు నెగిరి, సంద్రమునఁ బడి స్మృతిదప్పిన

వాఁడనైతిని. అట్లు నేను లోఁతగు సముద్రంపునీటియందుఁ బడి, చాలసేపటికి మెల్లగాఁ దెలివి తెచ్చుకొని, లంకాపురమువచ్చి చేరితిని.

ఇట్లు నే నప్పుడు విడువఁబడితిని. విలువిద్దె చక్కఁగాఁదెలిసిన వాఁడును, మంచిపనులు చేయువాఁడును నగు రాముఁడు నాకుఁ దోడ్పడినవారల నెల్లఁ బడనేనెను. కాఁబట్టి నేను వలదనుచున్నను, రాము నితోఁ బోరు సేయుదువేని, వేగిరమే నీ వోర్వరాని యాపద నొందఁగలవు. నీవు చెడుటయేకాక, భోగపరాయణులును, నిత్యోత్సవనిరతులును నగు రాక్షసులకుఁ గూడఁ జేటుతెచ్చినవాఁడ వగుదువు. మేడల చేతను, రాచనగళ్ళచేతను గ్రిక్కిఱిసియుండునదియు, పలుతెఱంగులయిన రత్నములచేఁ గైసేయఁబడినదియునైన లంకాపట్టణము సీత నిమిత్తము పాడైపోవుటను జూడఁగలవు. సత్పురుషులు దాము పాపములు సేయనివారలయినను పాపాత్ములచేరికవలనఁ బరులపాపములచేఁ బాములయునికిపట్టగు మడుగునందలి చేఁపలచాడ్పున నాశము నొందుదురని తలఁచెద. మేటిగందమునలందినవారును, మేలిమితొడవులఁ దాల్చినవారునునైన రాక్షసులందఱు నీ నిమిత్తమే యుద్ధరంగమునఁ జచ్చిపడియుండఁగా నీవు చూడఁగలవు. భార్యలను గోలుపోయియు, భార్యలతోఁగూడియు, దిక్కుమాలి పది దిక్కులకుఁ బాఱు హతశేషులయిన రక్కసులను జూడఁగలవు. బాణాగ్నివలనఁ బొడమినకుంటలోఁ దగులఁబడిపోవుచున్న యిండ్లుగల లంకాపురమును చూడఁగలవు. దీనికి సంశయములేదు. ఒకునిభార్యను జెఱచుటకంటె మహాపాతకము వేఱొకటిలేదు. ఓ సామీ! నీకు వేయిమంది ప్రియులున్నారుగదా! కావున నీవు నీ ప్రియురాండ్రయందుఁ దగులుగలిగి, నీ కులగౌరవ సంపదలను, నీ కిష్టములగు ప్రాణములను రక్షింపుము. నీవు అందకత్తెలగు ప్రియురాండ్రను, నెచ్చెలులను కూడి సకల సౌఖ్యముల ననుభవింపఁ గోరుదువేని, రామునికి విరోధము సేయకుము. నేను నీ మేలుగోరి సీతాపహరణము చేయవలదని చెప్పుచున్నాను. అట్లు నామాట వినక సీతను బలాత్కారముగాఁ దీసికొని వత్తువేని, సేనలను, బందుగులను గోల్పోయి రాముని బాణ ప్రయోగములవలనఁ బ్రాణములఁ దొఱఁగి జమునివీటికిఁ జనెదవనెను".

39-వ సర్గము.

మారీచుఁడు రావణునికి రాముని ప్రభావ మెఱిఁగించుట

ఆ రాముఁడు బాల్యమున నన్నెట్టకేలకు విడిచెను. మొన్న మొన్న జరిగిన యొకసంగతి చెప్పెద నాలకింపుము. మాతాడకవినుము. నేను రాముని చేత నప్పుడుతిన్న దెబ్బలచే బుద్ధిదెచ్చుకొనక, మెఱియు నాలుకయు, గొప్ప మేనును, వాఁడికోఱలునుగల గొప్పరూపమును దాల్చి, నావలె మృగరూపముఁదాల్చిన యిరువురు రక్కసులను దోడ్కొని, నంజుళ్ళను దినుచు దండకారణ్యమున సంచరించుచుంటిని. రావణా! అగ్నిహోత్రములచేరువను, పుణ్యతీర్థములతీరములందును, గొప్పవృక్షముల క్రిందనున్న పెక్కండ్రు మునులను హింసించుచు సంచరించుచుంటిని. దండకారణ్యమునందుఁ దమతమ నియమములను విడువక తపసుచేయుచుండు దాపసుల ననేకులఁ వధించి, వారి నల్లఁ ద్రావుచు, వారి నంజుళ్ళు రుచిచూచితిని. ఇట్లు తాపసుల మాంస ములఁదినుచు,క్రూరుఁడనై, కానలఁగనఁబడ్డమునులనెల్లను వెఱపించుచు, నల్లనానుటచే మత్తిలి, ఋషుల సత్కార్యములను జెఱచుచు, ధర్మము లను నడపుచుఁ దాపసుఁడైయున్న రాముఁడును, సీతయు మహారథుఁ డగు లక్ష్మణుఁడు నున్నచోటికిఁ బోయి చేరితిని.

వాఁడికొమ్ములుగల మృగ రూపమును దాల్చిన నేను బుద్ధిలేక, ముందు తిన్న దెబ్బలను దలఁచి, కసి తీర్చుకొనఁగోరి తపస్సుచేయుచు నాహారనియమము గలిగి, యన్ని ప్రాణులమేలు నేయఁ గంకణముగట్టి యున్న బలవంతుఁడగు రాముని సరకుసేయక, "యితఁడు మునుపు రాజ గృహమున నున్నప్పుడు బలిమిగలిగియుండె. ఇప్పుడరణ్యమున నాహా రము లేక తపస్సు చేయుచుఁ జిక్కియుండు నీరాముఁడు మనల నేమియుఁ జేయఁ జాలఁ" డను తలంపుతో నాతనిం జంపఁగోరి, కొమ్ములు నిక్కఁ బొడిచికొని యా రాముని పైకిఁ బోయితిని. అప్పుడు రాముఁడు వింటి నారిని బలిమికొలఁది నీడ్చి గరుడవాయు వేగము యొక్క శబ్దముఁబోలు శబ్దముగలవియు పగతుర నొప్పించునవియునైన మూఁడు వాఁడిబాణ ములనేసెను. నల్లద్రావుడులగు పిడుగులం బోలినట్టి, వంగిన గణుపులు గల, యామూఁడు తూపులొక్కుమ్మడిగా మామువ్వురిపైకి నేతెంచినవి.

తొల్లి రాముని పరాక్రమము నెఱిఁగినవాఁడను గనుక, రాముని బాణమును జూచి, వెఱచినవాఁడనై, వడిగా నావలికిఁ బరుగెత్తి, యా బాణమును దప్పించుకొంటిని. ఆ యిరువురు రక్కసులు మాత్రము వానిచే మడిసిరి.

ఎట్టకేలకు రాముని బాణమునుండి తప్పించుకొని, ప్రాణములను దక్కించుకొని, యిచ్చటికి వచ్చి, దుష్కృత్యములు మాని, నిలుకడగల మనస్సుతోఁ దపస్సు సేయుచున్నాను. ఏ చెట్టుపైపు చూచినను, నార బట్టలఁ గట్టి, జింకతోలు గప్పికొని, రాముఁడు వింటిని దాల్చి, పాశముఁ దాల్చిన జమునిమాడ్క నున్నట్లె నాకుఁ గనఁబడుచున్నాఁడు. రావణా! భయపడిన నాకంటికి వేలకొలఁది రాములు కనఁబడుచున్నారు. ఈ యరణ్యమెల్ల రామమయమయినట్లు తోఁచెడి. ఓ రాక్షసాధిపా! ఒంటరిగా నున్నప్పుడును రామునే చూచుచున్నాను. నేను నిద్రించునప్పుడు స్వప్నమందు రామునిఁ జూచితినేని, మై మఱచి, కలవరించుచున్నాను. రావణా! రామునికి వెఱచిన నాకు రత్నములు రథములు మొదలగు భోగము మొదటఁ గల పేరులన్నియు దిగులు పుట్టించుచున్నవి.

నే నతని ప్రభావము నెఱిఁగియున్నాను. నీ కతనితోడి కయ్యము తగదు. రఘునందనుఁడు బలిచక్రవర్తినైనను, నముచినైనను సంహరింపఁ గలఁడు. రావణా! నీవు రామునితోఁ బోరుచేయనైనను జేయుము, లేక యోర్పువహించి యుండనైన నుండుము. నీవు నన్నుఁ జూడఁగోరుదువేని, నాకడ రామునిఁగూర్చి ప్రస్తావింపకుము. లోకమున నెందఱో సాధులు, యోగ్యులుగను, ధర్మమునేయువారుగ నున్నను, ఒరుల తప్పి దములవలన బలముతోఁగూడ మడిసిరి. కావున రేద్రిష్టరీఁడా! యన్నియు విడిపించి తపస్సు సేయుచున్నను, నేను నీయపరాధము మూలమున నాశ మొందుదును. నీ కెది యుక్తమో దానిం జేసికొమ్ము. నేనేమో నీవెం బడిరాను. రాముఁడు గొప్ప వెలుఁగువాఁడు; బలిమికాఁడు; గొప్ప దిట్టరి. అట్టి రాముఁడు రాక్షసులకుజముఁడుగా కుండుఁగాక! మునుపు జనస్థానవాసియగు ఖరుఁడు శూర్పణఖనిమిత్తము రామునిమీఁదికిఁ జెల రేగి, వెనుకముందుచూడక సత్కార్య పరాయణుఁడగు రామునిచేత మడిసెను. ఈ విషయమున రాముని తప్పేమియున్నది? వాస్తవముగాఁ

జెప్పుము. బంధువుల మేలుగోరి నేఁ జెప్పిన హితవగు మాటను నీ వొప్పుకొనవేని, రాముఁడు బవరమున నేయు తీవ్ర బాణములచే నీవు సబంధుపరివారముగా మడియుదు"వని మారీచుఁడు రావణునితోఁ జెప్పెను.

40-వ సర్గము.

రావణుఁడు మారీచుని సువర్ణమృగమగు మనుట

మారీచుండు యుక్తియుక్తముగను శాంతముగ నెంతచెప్పినను, చావఁగోరినవాఁడు మందుపుచ్చుకొననిచందమున రావణుఁ డా మారీచుని మాటలను గైకొనఁ డయ్యె. అంత నా రావణుఁడు తన కితవు చెప్పినట్టి మారీచుం జూచి వినాశకాలము సమీపించినవాఁడయి యనుచితమైన మాటను పరుషముగా నిట్లు పలికెను.

మారీచా! నీ వనుచితమైన యర్థముగల యే మాటలు పలికితివో, ఆ మాటలు చౌటిచేనియందుఁ జల్లిన విత్తములమాడ్కి మిగులఁ బనికి రానివి. పాపాత్ముఁడు, మొఱకు మానవుఁడునైన రాముని తోడి కయ్యమొనర్పవలదని నీవు నీ మాటలచే నన్ను నిలుప నలవిగాదు. ఆ రాముఁడు చెలికాండ్రను, రాజ్యమును, తల్లిదండ్రులను విడిచి, యొక యాఁడుదాని యవివేకపు మాటను విని వెంటనే యడవికి వచ్చెను. అతఁడొక గొప్పవాఁడే "కెలనియందు ఖరుని ప్రాణములఁ దీసిన యా రాముని ప్రాణప్రియురాలగు సీతను నీసమక్షముననే యపహరింప వలయు" నని నేను మనమున గట్టి తీర్మానము చేసికొంటిని. ఆ నా తీర్మానమునుజరుగకుండఁజేయుట కింద్రాదిదేవతలను నసురులును జాలరు.

నే నీ కార్యనిశ్చయవిషయమై మేలుకీడులఁ జెప్పుమని కాని, ఉపాయాపాయములను జెప్పుమనికాని యడిగినచో నీ విట్లు చెప్పవలసినది. నేను నిన్నది యడుగలేదే! రాజసంపదను గోరు పండితుఁడగు మంత్రి తన్ను రాజడిగినప్పుడు, చేదోయి మోడ్చి, తనకుఁ దోచిన మాటను నృపాలుని కిష్టముగను, హితముగను, శుభకరముగను నుండునట్లు మెత్తదనముతోడను వినయముతోడను చెప్పవలయును.మారీచా! హితమయినను నవమానకరమయిన మాటను మానవంతుఁడయిన రాజు మెచ్చుకొనఁడు. యవమానార్హమైన ఓర్వరాని వెలుఁగుల.ధైర్యశాలు

రయిన నృపాలురు, అగ్ని గుణమగు వేఁడిమిని, ఇంద్రుని గుణమగు విక్ర మమును, చంద్రునిగుణమగు చల్లదనమును, వరుణునిగుణమగు ప్రసన్న తను, యమునిగుణమగు దండమును దాల్చియుందురు. కావున సర్వావ స్థలయందును నృపాలురను బూజింపను గారవింపను వలయు. నీవు ధర్మ స్వరూపము నెఱుఁగక, అజ్ఞానమునఁ బడినవాఁడవయి, నీకడకు వచ్చిన నన్నిట్లు పరుసని పలుకులు పలుకుట యుక్తముగాదుగదా. ఓ రాక్షసా! సీతాపహరణవిషయమున మంచిచెడ్డలనుగాని యుక్తాయుక్తములనుగాని నిన్నడుగలేదు. ఓ సాటిలేనిమగటిమిగలవాఁడా! నేనిప్పుడు నీకుఁ జెప్పి నది యిది. 'ఈ గొప్ప కార్యమునందు నీవు దోడ్పాటుచేయవలయునని, నీవు నాకుఁ తోడ్పడు విషయమునఁ జేయవలసిన పని యేది యనినఁ జెప్పెద వినుము.

మారీచా! నీవు వెండిచుక్కలు గల బంగారు జింకవై, యా రాముని యాశ్రమమున సీత కెదుటఁ దిరుగుచుండుము. నీవు సీతకు ఆశపుట్టించి విచ్చలవిడిగాఁ బోనగును. అప్పుడు మైథిలి యచ్చెరువంది నవై, పసిఁడిరూపు దాల్చిన మాయామృగమవగు నిన్నుఁ జూచి, రాముని తోఁ వేగిరముగాఁ దన కా మృగమును దెచ్చియిమ్మని యడుగును. అప్పుడు రాముఁడు నిన్ను వెంబడించి కొంతదవ్వేఁగినపదంపడి, "హా సీతా! హా లక్ష్మణా!" యని రాముఁడు పలికినట్లే పలుకుము. అప్పుడు సీత దిగులుపడి లక్ష్మణుఁ జూచిరమ్మని పంపును. అట్లు రాముఁడు లక్ష్మణుఁడును దవ్వున కేఁగఁగా, దేవేంద్రుఁడు శచీదేవినింబోలె, నేను సీత నెత్తికొని పోయెదను. ఓ మారీచా! యికార్యమిట్లు నెరవేర్చి నీవు పిమ్మట విచ్చల విడిగాఁ బొమ్ము. పూనికిగలవాఁడా! నీ వికార్యము నెఱవేర్తువేని, నారాజ్యమున సగమొసఁగుదును. ఈ కార్యసిద్ధికై చక్కనిదారినిబొమ్ము. అందమైన జింకరూపమును దాల్పుము. నేను నరదమెక్కి, నిన్ను వెంబ డించెదను. రాముని వంచించి యుద్ధమొనర్పక సీతను బడసి, పని నెఱ వేర్చుకొని, మఱల నీతోడ లంకకు రాఁగలను. ఓ మారీచా! నీ విప్పు డీ కార్యము సేయ నియ్యకొనవేని, నిన్నిప్పుడ రూపుమాపెదను. కావున నేను నిన్నుఁ దొందరపఱిచియైన నికార్యము సేయించు కొందును. రాజానుఁ బ్రతికూలుఁడగువాఁ డెప్పటికిని సుఖము నొందఁడు.

ఆ రామునికడ కేఁగినఁ జత్తునేమోయని నీకు సందియముగలదు. నాకు విరోధించిన నీ కిప్పుడే చచ్చుట నిజము. కావున నిదిమనసునఁ జక్కఁగా యోచించి యిది నీకు హితమో దానినిఁ జేయుము." అని రావణుఁడు మారీచునితోఁ జెప్పెను.

41-వ సర్గము.

మారీచుఁడు రావణుని నిష్ఠురోక్తులాడుట

రావణుండు మారీచుని కప్రియమైనమాటను ప్రభువుమాడ్కి నాన తీయఁగా, మారీచుఁడు రక్కసులదోరం జూచి, కటికపలుకుల నిట్లనియె: ఓ రేద్రిష్టరీఁడా! నీకును, నీ బిడ్డలకు, నీ మంత్రులకుఁ జేటుదెచ్చెడి యిక్కార్యము నే పాపాత్ముఁ డుపదేశించెను. ఏ పాపాత్ముఁడు నీవు సుఖముగా నుండఁ జూడలేకున్నాఁడు. ఎవఁడు నీకు మరణద్వారము నుపాయముతోఁ జూపినవాఁడు. బలిమిలేని రాక్షసులే నీ పగతురు. ఇది నిజము. నీవు బలవంతునిచేతఁ జిక్కి నశించుచుండఁగా, వారు చూడఁగోరియున్నారు. రావణా! నీవు స్వకీయాపరాధముచే నశించు చుండఁగాఁ జూడఁగోరు నెవ్వఁడు నీ కీడుకోరి, నీ కీ చెడుబుద్ధి నుప దేశించెను.

నీవు చెడుమార్గమునఁ బోవుచున్నను, నీమంత్రులు ని న్నిన్ని విధములఁ జెడుమార్గమునుండి త్రిప్పకున్నారుగదా! అట్టి మంత్రులను వధింపవలయును. వీల వారిని వధింపకున్నావు? సత్పురుషులగు మంత్రులు, చెడ్డదారిం జొచ్చి విచ్చలవిడిగాఁ బ్రవర్తించు రాజు నన్ని యుపాయములచే నాఁపవలయు. నిన్ను నీ మంత్రు లేల యాఁపుదల చేయకున్నారు? జయశీలురలో శ్రేష్ఠుఁడా! మంత్రులు రాజానుగ్ర హాముపలన ధర్మార్థకామములను బొందుదురు. రాజుసుగుణుఁడు గాక దుర్గుణుఁడగునేని నిదియొల్ల విపరీతమగు మంత్రుల కేమియు ఫలము గలుగనేరదు.

గెల్చువారలలోపల మేటీ! ధర్మజయములు రెండును రాజుల వలననే నిలువవలయును. కావున నన్ని సమయములందును రాజు లను మంత్రులు గాపాడవలయును. నిశాచరా! కనికరములేని రాజును, జనుల యభిప్రాయములకు విరుద్ధముగా నడచు రాజును,

జితేంద్రియుఁడుగాని రాజును రాజ్యము నేలఁజాలఁడు. సారథ్యము చేయఁజేతరాని సారథిచేఁ దోలఁబడు వడిగల గుఱ్ఱములు మిట్టిపల్లములై యుండు భూమియందు వడిగాఁ బోవుచుఁ దడఁబడి సారథితోఁగూడఁ గూలునట్లు, చెడ్డయాలోచనలు చెప్పునట్టి మంత్రులు తమ యిష్టప్రకారము నడచు నృపాలునితోఁగూడ నశింతురు. లోకమునఁ బెక్కండ్రు సాధులు తాము యోగ్యులైనను, ధర్మమును నడుపువారయినను, ఒరుల దోసఁగులవలన సపరివారముగా నశింతురు. రావణా! జనుల కసమ్మతుఁడును, ఉగ్రుఁడునైన రాజుచేఁ బాలింపఁబడుచుండు జనులు నక్కచేఁ గాపాడఁబడుచుండు గొఱ్ఱెలమాడ్కి సుఖముల నొందఁజాలరు.

రావణా! చెడ్డబుద్ధిగలవాఁడవు, ఇంద్రియముల గెల్వనివాఁడవు, కఠినుఁడవునైన నీపరిపాలనమం దుండు రాక్షసు లందఱు నశింతురు. కాకతాళీయన్యాయముగా, నాకీ కడిఁదియిడుమువచ్చెను. దీనికి వంత నొందుటేల? నీవు సపరివారముగఁ దప్పక నశింతువు కావున నీవు కావలె నని యింత యాపద దెచ్చుకొంటివనియె విచారపడవలసియున్నది. రాముఁడు నన్నుఁ జంపి, వేగిరమె నిన్నును జంపఁగలఁడు. నే నీ శత్రువగు రాముని చేఁ జచ్చి కృతార్థుఁడ నయ్యెదను. నీచేఁ జచ్చుటకంటెఁ బరాత్పరుఁడగు రాముని చేఁ జచ్చుట పలుతెఱఁగుల మేలు. రాముని చూచిన మాత్రమునఁనే నేను చచ్చితి నని యెంచుకొనుము. నీవును సీత నపహరించి, పుత్రమిత్రబంధుజనసమేతముగాఁ జచ్చెదవని తలంపుము. నీవు నాతోడఁగూడఁ బోయి, సీతను దెత్తువేని, నీవు నుండవు. నేను నుండను. ఈ లంక యుండదు, రాక్షసులు నుండరు. రేద్రిష్టరీఁడా! నీ మేలుగోరి, నే నాటంక పెట్టుచున్నాను. నీవు నా మాటలను వినకున్నావు. లోకమునఁ జావు సమీపించియుండునపు డల్పాయువు లగు మానవులు తమ మేలరయు చెలికాండ్రు సెప్పెడి యితవు పలుకులు వాలింపఁజాలరు." అని మారీచుఁడు రావణునితోఁ జెప్పెను.

42-వ సర్గము.

మారీచుఁడు మాయామృగమగుట

మారీచుఁడు రావణునితో నీ ప్రకారము చెప్పి యంత విన్న దనము నొందినవాఁడై, రావణునికి వెఱచి, "అక్లే పోవుదము" అని

చెప్పి మఱల నిట్లనియెఁ: "రావణా! వధమును గోరి శస్త్రములను ధను ర్బాణ ఖడ్గములను దాల్చియున్న రాముని కంటఁ బడితిని. నా ప్రాణ ములు పోయినవే. రాము నెదిరించినవాఁడు ప్రాణములు గోల్పోక వచ్చినవాఁడు లేఁడు. యమదండముచేఁ గొట్టువడిన నీకు సరియగు వాఁడను నేనున్నాను. నీ విట్లు మొండిపట్టు పట్టియుండఁగా, నే నిఁక నేమి చేయఁ జాలుదును? ఇదిగో పోయెదను. నిశాచరా! నీకు మేల యొయ్యెడుగాక" అని మారీచుఁడు రావణునితోఁ జెప్పెను.

అంత రావణుఁడు మారీచుని మాటలకు మిగులహర్షించిన వాఁడయి బిగ్గగౌఁగిలించు కొని యిట్లు పలికెను. "ఈ శౌర్యముతోఁ గూడిన మాట నా మనసు ననుసరించియే మాటాడితివి. ఓరీ! ఇప్పుడు నీవు మారీచుఁడ వయితివి. ఇంతకు మున్నెవ్వఁడవో రక్కసుఁడవుగా నుంటివి. రతనముల యలంకారములచే సింగారింపఁబడిన పిశాచము వంటి మోముగల వేసడములు పూన్చిన యీ తేరు నాతోడ నెక్కుము. నీవు సీతను వంచించి, నీ యిచ్చవచ్చిన చొప్పునఁ బొమ్ము. నిర్జనమగు నా వనమున నున్న యా సీతను నేను బలాత్కారముగాఁ గొంపోయె దను" అని రావణుఁడు మారీచునిఁ దట్టియిచ్చెను. అంతట రావణ మారీచులు పుష్పకవిమానముం బోలు నరదమెక్కి, యాశ్రమము నుండి వేగముగాఁ దఱిలి, దారినడుమఁ బత్తనములను, వనములను, నదులను, రాజ్యములను, జిన్న నగరములను జూచుచు, దండకారణ్యము చేరి, యా యరణ్యమున రాముని యాశ్రమముచూచిరి. రావణుఁడు పసిండి యలంకారములచేఁ గైసేయఁబడియున్న యా యరదమునుండి దిగి, మారీచుని చేయిఁబట్టికొని "అనుఁగుఁజెలికాఁడా! యరఁటిచెట్లతో నిండియున్న యిదియే యా రాముని యాశ్రమము. మన మిచ్చటి కేపని నిమిత్తము వచ్చితిమో, జాగుసేయక యాపనిఁ జేయుము" అని మారీ చునితోఁ జెప్పెను.

ఆ మారీచుఁడు రావణుని మాటలు విని, చూపఱి కింపుగులుకు నట్టి జింకరూపును దాల్చి యా రాముని యాశ్రమము చేరువఁ దిరుగు చుండెను. ఆ మృగరూపధారియగు మారీచుఁ డింద్రనీలములంబోలు కొమ్ముల కొనలును, కొంత భాగము తెల్లగను, మఱికొంత భాగము

నల్లగను నుండుటవలనఁ జెండామరపూవుయొక్కయు, నల్లకలువ యొక్కయుఁ గాంతింబోలు కాంతిగల మోమును, ఇంద్రనీలమణులయు, కలువలయుఁ గాంతింబోలు కాంతిగల చెవులును, కొంచె మెత్తయిన మెడయు, ఇంద్రనీలపు తునుకంబోలు పెదవియు, మొల్లలు, చందురుఁడు, వజ్రములు వీనికాంతింబోలు కాంతిగల బొజ్జయు, ఇప్పపూలంబోలు ప్రక్కలును, తామరపూవుల కింజల్కములవంటి యితరాంగములును, వైడూర్యమణి కాంతిగలవగు గిట్టలును, సన్నని పిక్కలును, చక్కని కీళ్ళచేరికలును, నింద్రాయుధముం బోలు పైభాగముగల తోఁకయు నున్నని వన్నెయుఁ గలిగి నవరత్నములచే నలంకరింపఁ బడినవాఁడై యుండెను. ఆ మారీచుఁడు క్షణములోపల మిాఁదఁ జెప్పఁబడిన యవయవములతోఁ గూడినదియు, సొబగయినదియు, చూడఁదగినదియు నానావర్ణములుగలదియునైన జింకరూపముఁ దాల్చి, యా రమ్యమగు వనమును, రామాశ్రమమును దేజరిల్లఁజేయుచు, సీతాదేవిని వంచించు నిమిత్తము, పచ్చికపడియలం దంతట సంచరించుచుండెను. ఆ మారీచుఁడు, వెండి వన్నెగల చుక్కలచేఁ జిత్రవర్ణముగలిగి, చూపఱి కానందమును గలిగించు మృగమై, చెట్లయందలి చిగుళ్ళనుగోసి, నమలుచుఁ దిరుగుచుండెను. మారీచుఁడు కమలకింజల్కముల మాడ్కిఁ జిత్రవర్ణముగల వీఁపుతోఁగూడిన మృగరూపముఁ దాల్చి, రాముని యాశ్రమము చేరువ నున్న కదళీగృహమును, కొండగోఁగులవనమును దాఁటి, సీతాదేవి చూడఁదగిన స్థానమునఁ దిరుగుచుండెను. ఆ మారీచుఁడు మేటి జింకరూపముఁ దాల్చి, యచ్చటఁ దిరుగుచుండి మఱియొ నావలికిఁ బోయి, మఱియొ వచ్చి, సంచరించుచు, మఱియొ నావలికిఁ బోయి, ముహూర్తకాలముండి, మఱియొ వడిగా నేతెంచుచు, నిట్టు పలుమాఱు వచ్చుచుఁబోవుచునుండెను. ఆమారీచుఁడు మృగరూపముతో నట్లు విహరించుచు, నొక్కచోటఁ గొంతసేపు గూర్చుండును. మఱియొ లేచి, యాశ్రమమువాఁకిటికివచ్చి, జింకల గుంపులను జేరఁజూచును. మఱియొ నాజింకలచే వెంబడింపఁబడుచు, సీతకంటికిఁ గనఁబడవలెనని కోరి, మఱియొ మఱియొను ఆ మృగరూపధారియగు మారీచుఁడు గుంద్రముగాఁ జుట్టుచుండును. అడవియందుఁ దిరిగెడు తక్కిన మృగము లన్నియు వింతయగు నమ్మా

రీచుసిఁ జూచి దగ్గఱకుఁ జేరవచ్చి, మూచూచి, యది మృగముగా దొక్క రాక్షసుఁడని తెలిసికొని, నలుదెసలకుం బఱచుచుండె. మెకముల వేఁటయం దాసగలవాఁ డయినను, మారీచుఁడు దన రూపు గప్పిపుచ్చు కొనఁగోరి, తన నిక్కంపురూపుఁ దెలియకుండుటకై, యా యడవిమృగ ములను దాఁకియుఁ దినకయుండెను.

అంత నా సమయముననే సొగసు కన్నులుగల సీత పూలు కోయఁ గోరి యా చెట్లకడ కేతెంచెను. మద్యపానముచేతఁ బోలె నెఱ్ఱనైన కన్నులును, సొగసుమోమునం గలదైన యా సీత, కొండగోఁగులు, అశోకములు, మామిడి మొదలగు చెట్లలోఁ బూవులఁగోయుచుఁ దిరుగు చుండెను. అడవులం దునికికిఁ దగనిదగు సన్నని దంతములును, నెఱ్ఱని మోవియుఁగలదగు నా సీత రత్నములు, ముత్యాలు మొదలగువాని కాంతిగల యంగములతోఁ గూడియున్నదియు, వెండి వన్నెగల చుక్కలు గలదియునైన యా మృగము నాశ్చర్యముచేఁ గన్నులు బాగుగాఁ దెఱచి కొని, ప్రేముడితోఁగూడఁ జూచెను. మాయామృగరూపధారియగు మారీచుఁడు రాముని పత్నియగు సీతను జూచి, యా వనము మొఱంత వెలుఁగునట్లు చేయుచుఁ దిరుగుచుండెను. అన్నిరకములరతనములచే నైసేయఁబడియుండునట్టిదియు, నింతకుమున్నెప్పుడు చూడఁబడనిదియు నైన యా మృగమును జూచి, సీత యొక్కువ యాశ్చర్యము నొందెను.

43-వ సర్గము.

సీత మాయామృగమును గోరుట

గొప్పపిఱుఁదులదియుఁ, బచ్చెము లేని యంగములుగలదియు, పుటము వేయఁబడిన బంగరువంటి మేనిడాలు గలదియునైన సీత పువ్వులు గోయుచు బంగారు వెండి వన్నెగల ప్రక్కలుగలదియగు నా మాయా మృగమును బాగుగాఁ జూచి, యుప్పొంగి, తన ప్రియుని, ఆయుధము దాల్చిన లక్ష్మణునిఁ బిలిచెను. సీత యట్లు పిలువఁగా, పురుషశ్రేష్ఠులగు రాములక్ష్మణు లచ్చటికి వచ్చి యప్పు డా మృగమును జూచిరి. లక్ష్మణుఁ డా మృగమును జూచి, సందియపడుచు, రామునిఁ జూచి, "అన్నా! యీ మృగము మారీచుఁడను రాక్షసుఁడనియె తలఁచెదను. పాపాత్ముఁడు, క్రూరరూపుఁడునగు నీ మారీచుఁ డిట్టికుచ్చితంపు మెకపురూపును దాల్చి,



సీత మాయామృగంబును గోరుట—90

V. R. NARAYANA RAO LIBRARY
Acc. No.
A106

B106

వేఁటకై వచ్చిన పెక్కు రాచఁగొమరులం జంపెను. పురుషో త్తమా! ఈ జిత్తులమారియగు నీమారీచుని మాయయే, డాలుగల్గినదై, గంధర్వ పురమువం బోలు జింకరూపముగా మాఱినది. ఓ లోకనా థా! రాఘవ! రత్నములవలేఁ బలు రంగులు గల్గియున్న యిట్టి మృగము లోకమున నెచ్చటను లేదు. ఇది మాయయే కాని వేఱుకాదు. సందియము వలదు."

అని యిట్లు చెప్పుచుండు లక్ష్మణుని మాట కడ్డుపడి, చిఱునవ్వు మోమునగల యా సీత యా జింకతోలురంగునకు బేలుపోయి సంతసించి నదై, తన ప్రియుని జూచి "ఆర్యపుత్రా! యీ యొప్పులకుప్పయగు జింక నా మనము నపహరించుచున్నది. నిడుదచేతులవాఁడా! యీజింకను దెమ్ము. ఇది మన కాటలాడుటకుఁ బనికివచ్చును. ఈ మన యాశ్ర మమున నింపు గులుకు చూడ్కి, రూపము గలవియు, మునస్సున కాహ్లా దము పుట్టించునవియునైన పెక్కు జింకలు, పెద్దచమరమృగములు, ఎలుఁగుబంట్లు, పొడలజింకలు, కోఁతులు, అడవిమనుష్యులు దిరుగు చున్నారు. ఈ మృగశ్రేష్ఠ మెంత వెలుఁగును, ఓర్పును, మేనిచాయయుఁ గలిగియున్నదో, యంతటి వెలుఁగు మొదలగు గొనములచే మెఱియు నొక్క మెకమునైనను నేను జూచినది లేదు. ఈ మెకము పలురంగులచే మెఱియు నంగములుగలిగి, రత్నములచుక్కలతోఁ గూడినది యగుచు, పున్నమ చందురునిఁబోలె నీ వనమెల్ల వెలుఁగఁ జేయుచున్నది. ఆహా! దీని రూపేమి! ఆహా! దీని చాయ యేమి! దీని కంఠస్వరమును, దీని యంగములసొంపు నొప్పారుచున్నవి. వింతలైన యంగములుగలదై యబ్బురము గలిగించు నీ జింక నా యుల్లమును జూఱగొనుచున్నది. ఈ మెకమును ప్రాణములతోఁగూడఁ బట్టుకొని వత్తువేని, యద్భుతమైన యీ మృగము మన కచ్చెరువు గలిగించును. మనము వనవాసము ముగించి, యయోధ్యకుఁ బోవునపుడు దీనిఁ గూడఁ దీసికొని పోవుదు మేని, ఈ మృగమంతిపురమునకు శోభాయమానమై యుండును. ఈమృగ రూపమును జూచిన, భరతునకును, ఆర్యపుత్రునకును (నీకును), అత్త లకును, నాకును దప్పక సంతసం బొదవును. నరపుంగవా! ఇది ప్రాణ ముతోఁగూడఁ దమచేతఁ బిక్కదేని, దీని యందమైన చర్మము నాకుఁ

బనికివచ్చును. నీవు చంపి తెచ్చిన యీ మెకముయొక్క బంగారుమయపు చర్మమును దర్భాసనముపై బఱచికొని కూరుచుండెదను. ఆఁడువా రిట్లు కావలసినది కోరుట మిక్కిలి భయంకరమైనది. ఈ విధమున జూచినది యెల్లఁ గోరుట వారికి సరికాదు. అయినను, ఈ మృగమును జూచిన తోడనే నాకు మిక్కిలి యాస గలిగినది." అని తన ప్రియుఁడగు రాము సీతోఁ జెప్పెను. పసిఁడిరూపును, శ్రేష్ఠములయిన రత్నకుయములగు కొమ్ములునుగలదియు, లేఁతసూర్యునిఁబోలు కాంతిగలదియు, వెండివన్నె మచ్చలుగల దగుటచే నక్షత్రములతోఁగూడిన యాకాశముమాడ్కి వెలుఁగుచున్నదియునైన యా మృగరూపమును జూచి, రాముని మనస్సు గూడ నచ్చెరువు నొందినదాయెను.

సీత యిట్లనుఁగునఁ జెప్పిన మాటను విని, యచ్చెరువు గలిగించు నా మెకమును జూచి, యా రూపమున కాసపడి, దానికి సీతయొక్క పురికోలును దొడ్డవడుటకు సంతసించి, లక్ష్మణునితో నిట్లనియె: "లక్ష్మణా! సీత కీమృగముపై నుండెడిప్రేమను జూడుము. ఇట్టి సొగసయిన రూపుగల మృగ మీ యరణ్యమున నెచ్చటను లేదు. సౌమిత్రీ! ఇట్టి మృగ మింద్రునిదగు నందవనమునందును లేదు; కుబేరునిదగు చైత్ర రథోద్యానమునందును లేదు. ఇఁకఁ బుడమియం దెక్కడ నుండును? ఎదురుదిరిగినవియు, చక్కఁగాఁ బోవునవియునైన రోమముల వరుసలును, వెండిబొట్లును ఈ మృగశరీరమును బొంది యెంతయు వింతఁ గొల్పుచుఁ జేజరిల్లుచున్నవి. లక్ష్మణా! యీ మెక మాపులించునపుడు చూడుము. దీనిమోమునుండి వెడలెడి నిప్పుమంటవలెఁ బ్రకాశించు నాలుక మబ్బునుండి పుట్టిన మెఱపుమాడ్కిఁ దళదళ మెఱయుచున్నది. ఇంద్రనీల మణిమయమగు గిన్నెవంటి యాకారమును, సంకువును, ముత్తెపుఁజిప్పలను బోలిన వెల్లని కడుపును గలదియై, వర్ణింపఁ దరముగాక యున్న యీ మృగమెవనిమనసును లాగదు? ఓ నేర్పరీ! బంగారు వన్నెగలిగి, రత్నములు పొదివినట్లుండు నీ మృగరూపమును జూచిన నేవారి కాశ్చర్యము పుట్టదు? లక్ష్మణా! విలుకాండ్రగు రాజులు వేఁటకు వచ్చినప్పుడు మాంసమునిమిత్తమయినను, వేడుకకైనను మృగములను జంపుదురు. వేఁటాడుటవలనఁ బేటి రౌతనములు, బంగారమును గలిగియుండు ప్రజేశ

ములండుఁ బలునిధులు సులభముగా దొఱకును. యే అందని యర్థమును గోరువాఁడు విచారణ సేయక దానిని బడయుటకై పయత్నపడునో, అర్థ శాస్త్రము నెఱిఁగినవారును, అర్థసంపాదన సమర్థులును నగువారు దానినే సంపాద్యవస్తువునుగాఁ జెప్పెదరు. నెన్నడుముగల సీత యీ మేటి మెకముయొక్క మేలిమి చర్మమునందు నాతోడఁ గూర్చుండఁ గోరు చున్నది. ఎక్కువ రోమములుగల కదలీ, ప్రియకి, ప్రవేణి, అనుమృగముల తోలును, మేకతోలును దాఁకుటకు దీనియంత మెత్తగా నుండఁజాలవని తలచెదను. కాంతిగల యీ మృగమును, ఆకాశమున వెలుఁగు మృగ శీర్షనక్షత్రరూపముగు మృగమును ఈ భూమృగ నక్షత్రమృగములు రెండును శ్రేష్ఠము లని యెంచెదను. అట్లుకాక, లక్ష్మణా! నీవు చెప్పిన చొప్పున నిది మారీచుని మాయ యగునేని, దీని వధము తప్పక సేయ వలసినది. క్రూరుఁడును, బుద్ధి నేరనివాఁడునునైన యీ మారీచుఁడు వనమునఁ దిరుగుచుఁ బెక్కండ్రుమునులం గాఱియపెట్టును. వేఁటకు వచ్చిన విలుకాండ్రగు పెక్కండ్రు రాజులనుగూడఁ జంపియున్నాఁడు. కావున వీనినిఁ దప్పక వధింపవలయును.

తొల్లి యీ యరణ్యమున వాతాపియను రాక్షసుఁడు మహర్షు లను బ్రాహ్మణుల నందఱను మోసపుచ్చి, వారి యుదరమునఁ జేరి, ఆడు కంచరగాడిదె యీనునపుడు దాని గర్భము దానిని జంపునట్లు, బ్రాహ్మ ణుల పొట్టను జీల్చి వెలుపటికి వచ్చి వారిని జంపుచుండెను. ఆ వాతాపి బవ్వుకాల మిట్లుండి యొకప్పు డాశ్చేదపోమహిమతోఁ గూడిన యగస్త్యమునీంద్రునిఁ బిలిచి యతని యుదరమునఁ బ్రవేశించి, యతని కాహారమయ్యెను. వాతాపి భోజనాంతమున నెప్పటివలెఁ బనిచేయఁ బోవ్రుచుండఁగా, నగస్త్యమునీంద్రుఁడు వాతాపిని గూర్చి, "వాతాపీ! భూలోకమున నిది పాపమని యెంచక నీ ప్రభావమువలనఁ బెక్కండ్రు బ్రాహ్మణశ్రేష్ఠులను జంపితివి. ఇట్టి పాపాత్ముఁడవగు నీవు బ్రతికియుండుట సరిగాదు. కావున నా యుదరమున జీర్ణమగుము." అని యీ వాతా పినిఁ దన యుదరముననే జీర్ణింపఁ జేసెను. లక్ష్మణా! ధర్మమునందు నిలు కడ గలవాఁడను, ఇంద్రియ నిగ్రహము గలవాఁడను నైన నాయంతటి వానిని మాఱిన యీ మారీచుఁడుగూడ వాతాపివలె నాశమొందును

గాక! వాతాపి అగస్త్యుని డగ్గఱి హతుఁడైనయట్లు, ఈ మారీచుఁడును నాకడకు వచ్చి నాచే హతుఁడగునుగాక! నీ విచ్చటఁ గవచముఁ దొడుగుము; జాగరూకుఁడవై సీతను గాపాడుము. రఘునందనా! మనకార్య మెల్ల నీ విడయం దున్నది. కావున మన మీసీతను జాగ్రతతోఁ గాపాడవలయు. నే నీమృగమునుబట్టి తే నైనను తెచ్చెదను; లేక చంపనైనను జంపెదను. మృగమును దేర నేను వడిగా నిదుగో పోవు చున్నాను. మృగచర్మమునం దీ సీతకుఁ గల యాశను జూడుము. మనకు దీని చర్మము గావలయును. కావున దీనిని జంపి చర్మమును మాత్రము తెచ్చెదను. ఇఁక నీ మృగముండదు. నీ వాశ్రమమున జాగ్రతతోఁ సీతను గాపాడుచుండవలయును. ఈ మృగమును నే నిదిగో యొక్క యమ్ముచేఁ బడనేసి, దీని చర్మమును దీసికొని వేగిరమె వచ్చెదను. లక్ష్మణా! నీవు కడు నేర్పరియు, చేవకాఁడును, బుద్ధిమంతుడునునైన జటాయువును దోడుగాఁ బెట్టికొని, యన్నిదెసలందును జూచుచు బ్రతి నిమిషము నన్నివిధముల మెలఁకువ గలిగి యీ సీతను గాపాడు చుండుము." అని రాముఁడు లక్ష్మణునితోఁ జెప్పి పయనమాయెను.

41-వ సర్గము.

రాముఁడు మాయామృగమును సంహరించుట

ఎక్కువ తేజస్సును, మితిమీఱిన మగఁటిమియుఁ గలవాఁడగు రఘునందనుఁడయిన రాముఁ డట్లు తమ్ముని కానతిచ్చి, పసిఁడిపిడిగల కత్తిని, మూఁడువంపులుగల శార్ఙ్గమను తన భూషణమగు వింటిని రెండమ్ముల పొదులను గైకొని పయనమాయెను. అట్లు పయనమై వచ్చు చుండు రాజేంద్రునిఁ జూచి యాతనిని వంచింప నెంచినవాఁడయి యా మృగరూపుండగు మారీచుఁడు వెఱపుచేఁ గొంతతడవు కనఁబడఁడయ్యె. మఱలఁ గొంతసేపటికిఁ గనఁబడెను. ఆ వెంటనే రాముఁడు కత్తిని మొల యందుఁ గట్టి వింటిని చేతఁబట్టికొని మృగ మున్న చోటికిఁ బరుగెత్తెను. అప్పుడు మారీచుఁడు మృగరూపముతో ముందట వెలుఁగుచున్నట్లు కనఁబడును; మహావనమున రాముఁడు వింటిని జేతఁ దాల్చి తనమీఁదికి బాణము వేయవచ్చుటను జూచి యా బాణము తనకుఁ దగులకుండునట్లు

దాఁటిపోవును. రాముఁ డూరకయున్నప్పుడు సమీపమునకు వచ్చి చేతికిఁ జిక్కునట్లు, ఆతని కాసను గలిగించును. బాణమెత్తినప్పుడు, వెఱచి చెదరి, తడఁబడుచు నాకసమున కెగిరి, పింజెమబ్బులచేఁ గప్పఁబడిన శరదృతువునందలి చందురునిమండలమునకైవడిఁ గొన్ని వనప్రదేశములందుఁ గనఁబడుచును, కొన్ని వనప్రదేశములందుఁ గనఁబడకయు, ఒక నిమిషమున దగ్గఱ నున్నట్లును, మఱుసటి నిమిషమున దవ్వున నున్నట్లును మాటిమాటికి గనఁబడుచు నుండెను. మృగరూపము దాల్చిన మారీచుఁ డిట్లు రామునికిఁ గనఁబడియుఁ గనఁబడకయు నా రాముని నాతనియాశ్రమమునుండి కడు దవ్వున కీడ్చుకొనిపోయెను.

రాముఁ డా మృగమురొక్క చేష్టకుఁ గనలినవాఁడయినను, దానిరూపలావణ్యమునకు మోహించి, పరవశత్వము నొందినవాఁడయ్యెను. తరువాత రాముఁడు బ్రమసి యేమియుఁ జేయక గొంతతడ వొక చెట్టు నీడను నిలఁబడెను. ఆ మృగరూపము దాల్చిన మారీచుఁడు రాముని వెఱ్ఱినిజేసి, మృగములతోఁ గూడ నతనికిఁ జేరువ నున్నట్లు కనబడెను. అప్పుడు రాముఁడు పట్టుకొనరాఁగా మఱిలఁ బరుగెత్తెను. అంత రాముఁడు బాణమేయు నన్నవెఱపుతో మఱిలఁ గనఁబడఁడయ్యెను. మఱిలఁ గొంతసేపటికి దవ్వున చెట్లగుంపునుండి మృగరూపుండగు నమ్మారీచుఁడు వెలుపటికి వచ్చుచుండుటను జూచి, శత్రుసంహారియుఁ దేజస్వియు నగు రాముఁడు మఱిలఁ గోపమునొంది వానిసిఁ జంపఁబూనినవాఁడై, సూర్యరశ్మి బోలె వెలుఁగుచున్నదియు, మంటలు గ్రక్కుచున్నదియు, బ్రహ్మనిర్మితమునునైన దివ్యాస్త్రమును గట్టినింటి యందుజోడించి, బలిమికొలఁదిఁ జెనివఱకు నీడ్చి, పామువలె బుసకొట్టుచున్న యా మృగముపై నేసెను.

పిడుగుంబోలిన యా యురిదితూపు మొదట నా మృగరూపము యొక్కశరీరమును భేదించి వెంటనే యా మారీచుని ఱొమ్మును బగల్చెను. బాణముచే నట్లుగొట్టఁబడిన యా మారీచుఁడు తాటిచెట్టంత యెత్తున కెగిరి, భయంకరముగనార్చి కొనయూఁపిరితోఁ బుడమిం గూలి, కుచ్చితంపు మేను దొఱఁగుచు, "సీత లక్ష్మణు నెట్లు పంపును? రావణుండెఁ బ్లోకతమున సీత నెత్తికొని పోవు" నని యోచించి, రావణుని

మాటను జ్ఞప్తికిఁ దెచ్చికొన్న వాఁడై, యా రాముఁ డేసిన సాటిలేని బాణము తన యాయవుఁబట్టున నాటుటచేత మృగరూపము విడిచి, వింతగొలుపు బాహుపురులు మొదలగు నన్ని పసిఁడి రతనాల సొమ్ము లను ధరించిన గొప్ప కోఱలుగల గొప్ప రక్కసుని రూపునుదాల్చి, రావ ణుఁడు చెప్పిన సమయ మిదియని యెంచి "హా! సీతా! హా! లక్ష్మణా!" యని రాముఁ డఱచినట్లుగా ప్రాణములు విడిచినవాఁ డయ్యెను.

అట్లు మారీచుఁడు నేలఁగూలి భయంకరమైన రూపముగల వాఁడై, నెత్తుటఁ దడిసిన మేనితోఁ బుడమిపైఁ దన్నుకొనుచుండుటను జూచి, రాముఁడు లక్ష్మణుని మాటను జ్ఞప్తికిఁ దెచ్చుకొనుచు, సీతను మనసునఁ దలఁచి, "ఇది మారీచుని మాయ యని లక్ష్మణుఁడు మొద టనే చెప్పినాఁడు. అది యట్లే యాయెను. మఱి యిప్పు డీమారీ చుఁడు రక్కసుఁడు నాచేఁ గొట్టఁబడి, "హా! సీతా! హా! లక్ష్మణా!" యని నాగొంతువంటి గొంతుతో నఱచి, ప్రాణములను దొఱఁగెను. ఈ యఱపును విని సీత యెట్లగునో, దొడ్డ భుజములుగలవాఁడగు లక్ష్మణుఁ డెట్టి యవస్థ నొందునో" అని కొంత వగచి పులకలెత్తిన మేనితోఁ గూడినవాఁడై, యా మారీచునిఁ జంపినను, వాని యఱపును విని సైపరాని వెతను, వెఱపును బొంది, మఱియొక జింకను బడనేసి, దాని మాంసమును గైకొని, జనస్థానమునకు వేగముగ మఱలినవాఁ డయ్యెను.

45-వ సర్గము.

సీత లక్ష్మణునిఁ గూడఁ బంపుట

సీత చేరువ కాననయందుండి విన్న దన ప్రియునికంఠస్వరము వంటి కంఠస్వరము నాలకించి, లక్ష్మణునితో నిట్లనియె: "లక్ష్మణా! పొమ్ము. రాముని సంగతిఁ గనుఁగొనుము. మిక్కిలి నొచ్చినవాఁడై పెల్లుగా నార్చిన యా రాముని యార్పు వినఁబడినది. అది మొదలు నా ప్రాణ ములు తల్లడిల్లుచున్నవి. నా మనసు నిలువకున్నది. చేరువ వనమున నార్చుచున్న నీ యన్నను రక్షింపుము. సింహాములనడుమఁ జిక్కిన యెద్దుమాడ్కి, రక్కసుల వనమునఁ జిక్కి, శరణుఁ గోరుచున్న నీ యన్న కడకు వేగ నేఁగుము" అని సీత చెప్పెను. సీత యట్లు చెప్పినను, లక్ష్మ

ణుఁడు తన యన్న యానతిని జ్ఞప్తికిఁ దెచ్చుకొని, యా ప్రకారము పోవకయుండెను.

తర్వాత నా జానకి, లక్ష్మణుఁడట్లుండుటను గాంచి, కనలినదై, "యో లక్ష్మణా! నీవు మాయన్నకుఁ బ్రీతి స్నేహితునివలె నటించు శత్రువుగాఁ దోచుచున్నావు. అట్లు గాకున్న నిట్టి యవస్థయందును గూడ నీ వన్నకు సహాయముచేయఁబోవకుందువే? నీవు నాయందలి యిచ్ఛచేతనే నీ యన్న యిడుమలం బడుచున్నను నుపేక్షించుచున్నావు. నా మీఁది యాసచేతనే నీవు రామునకుఁదోడ్పడఁ బోవకున్నావు. ఇది నిక్కము. రాముఁ డిట్లిడుములం బడుట నీకు సమ్మతమని యెంచెదను. నీ కన్న యం దనురాగము బొత్తిగా లేదు. కావుననే గొప్ప కాంతిగల రామునిఁ జూడక, నెమ్మదితో నున్నాఁడవు. నీ వేరామునిఁ నిమిత్తమిచ్చటికి వచ్చితివో యా రాముఁడు ప్రాణాపాయము నొందినతర్వాత, నిచ్చట నేఁ జేయవలసిన పని యేదియున్నది? కావున నీవు నాకుఁ దోడుగా నిచ్చట నుండఁ బనిలేదు" అని లక్ష్మణునితో నిష్ఠురముగాఁ బలికెను.

ఈ ప్రకారము పలుకుచుఁ గన్నీటిచేఁ దడిసి యాఁడుజింక వలె వెఱపుచే వణఁకుచున్న సీతను జూచి, "ఓ దేవీ! నీ పెనిమిటి పన్న గాసుర గంధర్వ దేవ మానుష రాక్షసులలో నొక్కరిచేతను గెల్వ నలవియగువాఁడు గాఁడు. ఓ దేవీ! యింద్రుని కెనవచ్చువాఁడగు నీ మగనిని గెల్వఁగల యాతఁడు దేవతలు, ఘోర దానవులు, రాక్షసులు, గంధర్వులు, కిన్నరులు, నరులు, పక్షులు, పిశాచులు, పన్నగులు, మృగములు మున్నగువారిలో నెవ్వఁడును లేఁడు. కయ్యమున రాముఁడు సంహరింప నలవికానివాఁడు. కావున నా రామునిఁగూర్చి నీ విట్లు పలుకుట తగదు. రాముఁడు లేనప్పుడీ గొప్పవనమున నిన్నొంటరిగా విడిచి పోవఁజాలను. ముల్లోకములవారు దేవేంద్రాదిదేవతలతోఁ గూడ నొక్కపెట్టునఁ బూనికతో వచ్చి తను బల మెల్లఁ జూపినను, నెంతటి బలవంతులకైనను రాముని నెదిరింప నలనికాదు. నీ మనము గుదుటఁబడును గాక! ఈ వ్యసనమును మానుము. నీ మగఁడా మృగశ్రేష్ఠమును జంపి వేగిరమె వచ్చును. ఇది యా రాముని కంఠస్వరము

గాదు. ఎవఁడో మాయచే నిట్లు లఱచెను. ఆ మారీచుని మాయ గంధర్వనగరముఁ బోలినది. ఓవై దేహీ! మహాత్ముఁడగు రాముఁడు నిన్ను రాయొడ నిల్లడవెట్టెను. అట్టి ని న్నా రామునికడ నప్పగించక, యొంట రిగా నిచ్చట విడిచిపోవ నాకుఁ దెగువలేదు. ఖరుని చావువలన నిచ్చటి రక్కసు లందఱు జనస్థానవధమునాఁటి నుండి మనపైఁ గంటుగలిగియు న్నారు. ఓ వై దేహీ! యిమ్మహావనముననున్న రాక్షసులందఱు పరహిం సయే విహారముగాఁగలవారలై, మనకు భయముగలుగునట్లు పలు తెఱఁగు లయిన కూఁతలఁ గూయుచుందురు. కావున వానిని నీవు సరకుసేయకు" మని బదులు సెప్పెను.

లక్ష్మణుఁ డిట్లు పలుకఁగా, సీత యలుకగదురఁ గన్ను లెఱ్ఱనచేసి, నిక్కముపల్కుచుండు లక్ష్మణుఁ జూచి, "ఓ చేయరాని పనులఁ జేయఁ బూనినవాఁడా! ఘాతకుఁడా! వంశమునకుఁ జెఱుపనచేటగైనవాఁడా! రామునికి గొప్ప యాపద గలుగుట నీ కిష్టమునియే నే నెంచెదను. కావు ననే రాముఁ డాపదయం దుండఁగా నిట్టి మాటలు ప్రేలుచున్నావు. లక్ష్మణా! నీ కిట్టి పాపపుఁ దలం పుండుట యొకొ్క వింతగాదు. పయికి మంచివారివలె నటించు క్రూరులైన నీవంటి దాయాదులం దిట్టి తలం పుండుట సాజమే. నీవు పరమదుష్టుఁడవు. నాపయిఁ గన్నువైచి వేస దారివై నీవు స్వయముగానో, లేక భరతుని ప్రేరణవలననో యొంటరిగా నొంటరియైన రాముని వెంబడించి వచ్చుచున్నావు. ఓ సుమిత్రకొడుకా! నీకోర్కిగాని, భరతునికోర్కిగాని యీడేఱదు సుమా! నల్లకలువంబోలు మేనిచాయగలవాఁడును, తమ్ముకంటియునైన రాముని భర్తనుగాఁ బొందినపిదప, మఱియొక నీచునిఁ గోరుదునే! లక్ష్మణా! నీవు చూచు చుండఁగానే నేను ప్రాణములఁ దొఱఁగెదను. దీనికి సందియము లేదు. రామునిఁ బాసి నే నొక్క క్షణమైన నీ భూతలమున బ్రతికియుండఁ జాలను." అని లక్ష్మణుఁ గూర్చి కడుఁ బరుషముగఁ జెప్పెను.

ఇట్లు సీత కర్ణకఠోరముగాఁ జెప్పిన మాటను విని, యొడలఁ బులక లెగయ జితేంద్రియుఁడగు లక్ష్మణుఁడు చేతులు మోడ్చి, యిట్లనియె. "ఓ వై దేహీ! నీవు నాకు దేవతవు; పూజ్యురాలవు; కావున నీకు నేను బదులుసెప్ప నొల్లను. ఓ మైథిలీ! ఇట్టి యయోగ్యపు మాటలాడుట స్త్రీల

కొక వింతగాదు. లోకములం దంతటను స్త్రీలకిట్టి స్వభావమే కానఁబడు చున్నది. స్త్రీలు న్యాయముదప్పినవారు; చపలలు; క్రూరలు; పగ గలి గించువారు. జనకరాజుకూఁతురా! నీ వాడినట్టి మాటల నోర్వఁజాలను. అవి గాఁచిన నారసములమాడ్కి- నా రెండుచెవులను జొట్టుమని కాల్చు చున్నవి. న్యాయవాదివైన ననుఁగూర్చి నీవెట్టి యన్యాయపుమాటలు మాటాడితివో, యా మాటలను వనమున నున్న వనదేవత లందఱు సాక్షులై విందురుగాక! నీవు, అన్నమాటయందు నిల్చియున్న నా విష యమున నిట్లు సందియపడుచున్నావు గాన, నీవు నిందితురాలవగుదువు గాక! స్త్రీలు స్వాభావికముగా దుష్ట లన్నమాట పెద్ద లందఱు చెప్పి యున్నారు. సొగసుమోమునగలదానా! రాముఁడుండుచోటికిఁ బోయెద. నీకు మేలగునుగాక! వెడఁదకన్నులదానా! వనదేవత లందఱు నిన్నుఁ గాపాడుదురుగాక! ఘోరములైన యవశకునము లెన్నియో తోఁచు చున్నవి. మఱల వచ్చి నీవు రామునితోఁ గూడియుండఁగాఁ జూతునో చూడనో. ఓ వైదేహీ! ఓ జానకీ యీ సంగతి నే నెఱుఁగకున్నాను" అని లక్ష్మణుఁడు సీతకుఁ జెప్పెను.

జనకరాజుకూఁతురు రోదనముచేయుచు, లక్ష్మణుఁడు చెప్పిన మాటవిని, కన్నీరు దొఱఁగుచు ముందుకంటె గడుసుమాటఁ జెప్పఁ బూని, "ఓ లక్ష్మణా! నేను రాముని విడిచి యొక నిమిషమైనను జీవింపఁ జాలఁ గాన గోదావరినదియందుఁ బడెదను; ఉరియైన వేసికొనెదను; కొండచరినుండి పడి దేహమున్నైనను విడిచెదను. తీవ్రము కాలకూట విషమున్నైనను త్రింగెదను. అగ్నినైనను జొత్తును కాని, రామునికంటె నితరపురుషునిఁ గాలితోనైనను దాఁకను" అని యిట్లులు లక్ష్మణుని నింపించి, దుఃఖముతోఁ గూడినదై, యిరుచేతులతోఁ గడుపుమోఁద బాఁదుకొనెను. అట్లు దుఃఖితయై యేడ్చుచుండు విరివిన్నులగు సీతను జూచి సౌమిత్రి యూఱడించెను. అయినను సీత తనమఱఁదితో దానికిమోఁద నొకమాటనైనఁ బలుకదాయెను. అంతట దిట్టయగు లక్ష్మ ణుఁడు సీత కభివాదనము గావించి, మఱులఁ గోపము తగ్గుటకుఁ జేతులు జోడించి, యొక్కతడవ త్రొక్కి, పలుమాఱు సీతను జూచుచునే, రాముని చేరువకుఁ బయనమయ్యెను.

46- వ స ర్గ ము.

రావణుఁడు సీతను సమీపించుట

లక్ష్మణుఁడు సీత యాడిన పరుసని మాటలు విని యాగ్రహము నొందినవాఁడై, యామెను గాపాడుటయం దెక్కువ యాస్థ నుంచక, వెంబడే రాముసికడకుఁ దఱలినవాఁ డయ్యెను. అంతఁ బదితలలరక్కసుఁడు, లక్ష్మణుఁడు గూడ నరణ్యమునకుఁ బోవుటచేత నిదే సమయమని తలఁచి, కపటసన్న్యాసిరూపముఁ దాల్చి, సన్నని కాషాయవస్త్రము గట్టుకొని, జుట్టుగలవాఁడై గొడుగును బట్టి, పావుఁకోళ్ళను దొడిగి, దండమునకుఁ గమండలువును దగిలించి యెడమబుజముమీఁద నుంచికొని, చంద్రసూర్యులు లేనియట్టి సంధ్యను కటికిచీకటి గ్రమ్ముకొనున ట్లున్నదమ్ములగు రామలక్ష్మణు లిరువురు దగ్గఱలేని యా సీతను సమీపించెను. మిక్కిలి క్రూరుఁడయిన యా రావణుఁడు, చంద్రునెడఁ బాసియుండు రోహిణి నంగారకుఁడు చూచుమాడ్కిఁ గీర్తిమతియు, బాలయునగు సీతను జూచినవాఁ డయ్యెను.

అట్టి భయంకరపరాక్రమమును గార్య్యములునుగల యా రావణుని జూచి, జనస్థానమున నున్న చెట్టు లన్నియు నిశ్చలములయ్యెను. గాలి వీవదయ్యెఁ. వేగముగాఁ బాఱు గోదావరీనదియు నెట్టనికన్నులతోఁ జూచుచున్న యా రావణునికి వెఱచి, మెల్లగాఁ బోవుట కారంభించెను. రాముం డెప్పుడు దగ్గఱ లేకయుండునా యని కాచియుండిన దుష్టరూపుఁ డగు రావణుం డదే సమయ మని యెంచి, సౌమ్య మగు సన్న్యాసిరూపము దాల్చి, కసవుచేఁ గప్పఁబడిన బావిమాడ్కిఁ దన కపటరూపముఁ గప్పిపెట్టుకొని, యందమగు పలు వరుసయుఁ బెదవియుఁ గలదియు, పున్నమచందురునిఁబోలు మోముగలదియు, తమ్మిఱేకులవంటి కన్నులుగలదియు, పచ్చని పట్టుబట్ట గట్టుకొన్నదియునై కన్నీరు విడుచుచుఁ బర్ణశాలయందుఁ గూర్చుండియున్న యందకత్తెయగు పతివ్రత యయిన రాముని ధర్మపత్నిని వైదేహిని, శనైశ్చరుఁడు చిత్రను చూచినట్లు చూచి, దగ్గఱకుఁ బోయి నిలిచి, మన్మథునితూపులబారిఁ దవిలి, వేదాధ్యయనముఁ జేయువాఁడై యేకతమున నున్న సీతతో సవినయముగ మాటలాడనెంచి, కమలమును దాల్పని లక్ష్మీదేవియో యనఁదగి

యున్నయు త్తమకాంతయగు తేజరిల్లుచున్న మేనుగల సీత నివ్విధమునఁ బొగడఁ దొడఁగెను.

పసిఁడిచాయవంటి మేనిఁడాలుగలదానా! పట్టుపీతాంబరము గట్టిన దానా! కమలములం బోలు మోము, కన్నులు, చేతులుం గలదానవగు టంజేసి, పూవులఁదాల్చిన తామరతీఁగ చందమునఁ దనరుచున్న నీ వెవ తెవు? సొగసుమోమును గొప్ప పిఱుఁదులు గలదానా! నీవెవ్వ తెవు? హ్రీ దేవివా? కీర్తిదేవతవా? శ్రీదేవివా? మంగళకరురాలగు లక్ష్మీదేవివా? ఐశ్వర్యదేవతవా? రతీదేవివా? స్వతంత్రు రాలవయిన ఋతియొవ్వత వేని యగుదువా? నీ పల్వారుస, పెచ్చుతక్కువలు లేక సమముగాను, కొనలుగలవియు, సన్ననివియు, తెల్లనివియునై యున్నవి. నీ కన్నులు వెడఁదలై తేటదనము గలిగి, యొట్టని కొలుకులును, నల్లని గ్రుడ్డును గలవియై యున్నవి. నీ కటిపురోభాగము బలిసి విఱివిగలదియై యున్నది. తొడ లేనుఁగుతొండములం బోలియున్నవి. ఈ నీ పాలిండ్లు బలిసినవి, గుండ్రనివి, కదిసినవి, కొంచెము కదలునవి, బలిసిన యొత్తయిన మొనలు గలవి, సొగసైనవి, కోరఁదగినవి, మణిహారములుగలవియునై, తాటి పండ్లను బోలియున్నవి. సొంపుచిఱునవ్వుదానా! అందమయిన పల్వారు పదానా! విఱివికన్నులదానా! సొగసుదానా! ఓ కాంతా! నది ప్రవా హము గట్టును హరించునట్లు నీవు చక్కదనముచే నా మనమును జూఱి కొనుచున్నావు. మఱియు నీవు పిడికిటి కణఁగు నెన్నడుమును, నెరికురు లును, నొండొంటితోఁ గదిసియున్న స్తనములుం గలిగియున్నావు. నీవు దేవాంగనవు గావు; గంధర్వప్రమదవు గావు; యక్షకాంతవుగావు; కిన్నరభామినివిగావు. ఇట్టి రూపుగల కాంతను బుడమిని నే నింతకు మున్నెచ్చటను జూచినది లేదు. లోకోత్తరమయిన నీ రూపమును, నీ మార్దవమును, నీ జవ్వనమును, నొంటరిగాఁ గానయం దునికియు, నా మనసునకు వెట్టితనమును గలిగించుచున్నవి. కావున నిక్కడినుండి తఱలుము. నీకు మేలగునుగాక! నీ విచ్చటనుండఁ బగవు. ఈయది కామరూపముగల ఘోరరాక్షసుల కునికిపట్టు. చక్కని రాచనగ్ల యందును, సమృద్ధములయి నెత్తావిగలిగియున్న పత్తనపుఁదోఁటల యందును సంచరించుట నీకుఁ దగినయది. నల్లనిగన్నులు గలదో

సొగసుదానా! నీవు దాల్చు పూవులదండలును, నీవు భుజించు పదార్థములును, నీ కట్టువలువయు సరోత్తమములనియు, నీతోఁగూడిన ప్రియుఁడు ధన్యుఁడనియుఁ దలఁచెదను. అందమయిన మోమును గొప్ప పిఱుఁదులును గలదానా! నీవు దేవకాంతవలెఁ దోఁచుచున్నావు. నీవు రుద్రులకు సంబంధించినదానవా? మరుత్తులకు సంబంధించినదానవా? వసువులకు సంబంధించినదానవా? నీవెవ్వఁతవు? ఇచటికి గంధర్వులుగాని, దేవతలుగాని, కిన్నరులుగాని రారు. ఇది రాక్షసుల కునికిపట్టు. నీ విచటి కెట్లు వచ్చితివి? ఇట్టియడవియందుఁ గోఁతులు, సింహములు, చిఱుత పులులు, పులులు,ఎలుఁగుబంటులు, బెబ్బులులు, రాపులుఁగులు మొదలగు ననేక ఘాతుకజంతువు లున్నయవి. వానిని జూచి నీవెట్లు వెఱవకున్నావు. సొంపయినమోమునుదానా! యీ కాఱడవియందు వడిగలవగు భయంకరములైన మదపుటేనుఁగులకు నీవొక్కతెవుగ నుండియు నెట్లు, వెఱవకున్నావు? ఓ చక్కనిదానా! నీ వెవతెవు? ఎవ్వరిదానవు? ఎచ్చటినుండి వచ్చితివి? ఏ కారణముచేత రాక్షససేవితములగు నీ భయం కరదండకారణ్యమునం దొంటిమెయిఁజరించుచున్నదానవు? అని రావ ణుఁడు సీత నడిగెను.

ఇట్లు కపటసన్యాసిరూపధారి యయినదురాత్ముఁడగు రావణుఁ డడుగఁగా, పతివ్రతయగు సీత యతనిని తన హితవుగోరెడి వాస్తవ సన్యాసిగా నెంచి, మొదట నతనికిఁ బీఁటవేసి, కాళ్ళు గడిగి, సామాన్య వేషముదాల్చిన యతనిని బ్రాహ్మణునిగా నెంచి, "పక్వాన్నము సిద్ధ మయ్యె" నని చెప్పి, బ్రాహ్మణసన్యాసిరూపముతోఁ గాషాయ కమండలువులను దాల్చినందున,దుష్టుం డని యూహింప నలవికాకయున్న వాఁడును, దుష్టకార్యము చేయనిమిత్తమే వచ్చినవాఁడునైన యా రావణుని నుద్దేశించి, "ఓ ద్విజోత్తమా! యిదిగో యాసనము. దీనిపైఁ గూర్చుండుము. ఇదిగో కాళ్ళకు నీళ్ళు. నీనిమిత్త మీ వనమందు లభ్యము లగు వస్తువులను శ్రద్ధతో సిద్ధము సేసితిని. వీనిని భుజింపుము" అని ద్విజులకుం జెప్పినట్లే చెప్పెను. అంత రావణుఁడు తన్నుఁగూర్చి, కపటము నెఱుఁగక నోటినిండుగ మాటాడుచున్న రాజపత్నియగు సీతను బాఱఁజూచి, తన చేటుకై, యా సీతను బలిమితో నపహరించుటయందు

గట్టిమనసు నుంచినవాఁడయ్యెను. అప్పుడు సీత వేఁటకుఁ బోయియున్న సుందరుఁడగు తనపతిని, లక్ష్మణు నెదురుచూచియు, పచ్చనైన యాకాలు కానలను జూచెనే కాని, రామలక్ష్మణులను గనుఁగొన దాయెను.

47-వ సర్గము.

రావణుఁడు తన వాస్తవరూపము దెలుపుట

తన్నుపహరింపఁగోరి కపటసన్న్యాసిరూపము దాల్చివచ్చిన రావణుఁడిట్లనుగఁగా, సీత తన వృత్తాంతము నిట్లెఱిఁగునఁ జెప్పఁ దొడఁగి, యంతకు మునుపు తనలోఁదా నిట్లాలోచించెను. "ఇతఁడు ద్విజుఁడు; ఆగంతకుఁడు; ఇతఁ డడిగినదానికి బదులు సెప్పనేని, నన్ను శపించును" అని యిట్లు సీత యించుకయాలోచించి, యా బూటకపుఁ బరివ్రాజకునితో నిట్లనెను.

"ద్విజశ్రేష్ఠుఁడా! నేను మహానుభావుఁడయిన మిథిలాపురీశుఁడగు జనకమహారాజుకూఁతురును. నావేరు సీతయందురు. నీకు మేలగుగాక! నేను రాముని భార్యను. నే నిక్ష్వాకువంశపువారి యింట సర్వకామ ములసమృద్ధి గలదానినై మానుషభోగముల నన్నింటి ననుభవించుచుఁ బండ్రెండేండ్లుంటిని. అంత దశరథమహారాజు పదుమూఁడవయేట రాము నికిఁ బట్టాభిషేకము చేయుటకై తన మంత్రులతోడ నాలోచించి నిశ్చ యించి, రాముని బట్టాభిషేకమునకు వలయు ప్రయత్నము సేయు చుండఁగా, మాయత్తలలో నొక్కతెయగు నాకైకేయి యను నామె నా మామకడ కేఁగి, "నేను మీ కొసర్చినమేలునకు బదులుగా నాకు ముందొసఁగిన రెండువరముల నిప్పుడిండు. వానిలో నొక్కటి రాముని నరణ్యమునకుఁ బంపుట, మఱియొక్కటి భరతునికిఁ బట్టాభిషేకము చేయుట. ఈ రెండువరములను మీరు నా కొసఁగవలయు. అట్లు కాక రామునికిఁ బట్టాభిషేకము చేయుదురేని, నేను కూడు గుడువను. నీరు ద్రావను. నిద్దుర పోను. నే నిప్పుడె ప్రాణముల విడుతును" అని మాట తప్పనివాఁడును, రాజశ్రేష్ఠుఁడునైన భర్తయగు దశరథనృపాలుని యాచించెను. అట్లు క్రూరముగాఁ బలుకుచుండు కైకేయిని మానము లొసఁగునట్టి మా మామగా రెన్నియో విలువగలవస్తువుల నిచ్చి యా వరములను గోరవలదని బ్రతిమాలినుగాని, యా కైకేయి తాను పట్టినపట్టు వదలదాయెను. నా పెనిమిటి గొప్ప తేజస్సు గల

SVRAM MEMORIAL LIBRARY
S.V. ORIENTAL RESEARCH INSTITUTE
Acc. No.

వాఁడు. ఇరువది యైదేండ్లప్రాయపువాఁడు. నేను బుట్టి పదునెనిమి దేండ్లాయెను. నా ప్రియుఁడు లోకమున రాముఁడని వాసికెక్కిన వాఁడు; సుగుణములు గలవాఁడు; సత్యము పలుకువాఁడు;నిష్కపటుఁడు; విరివికన్నులవాఁడు; నిడుదచేతులవాఁడు; అన్ని జంతువులమే లరయు వాఁడు. ఆ గొప్పవెలుఁగుగల రాముని తండ్రియగు దశరథుఁడు మరుని బారిం దవిలి, కైకయిష్టము నీడేర్పఁగోరి యట్టి సుగుణములుగల రాము నికిఁ బట్టాభిషేక మొనర్పఁడయ్యె.

దశరథనరేంద్రుఁడు కైకేయి వరమడుగుటకు మునుపు నా మగ నిని బట్టాభిషేకమునకు రమ్మని చెప్పి పంచియుండెను గాన, నా మగఁడు తండ్రికడకుఁ బోఁగా, నప్పుడు కైక నా మగనిం జూచి, "రాఘవా! నిష్కంటకము గు రాజ్యము భరతుని కీయవలసినట్లును నీవు పదు నాలుగేండ్లు వనవాస మొనర్పవలసినట్లును నీతండ్రి నాకు వర మొసఁగెను గాన నీవు వనమున కేఁగి, తండ్రి నసత్యమను ఋణము నుండి యుద్ధరింపుము" అనెను. దేనివలనను వెఱపులేనివాఁడును, దృఢ వ్రతుఁడునునైన నా మగండు కైకేయితో నట్లేయని యా ప్రకారమే యడవికిఁ దఱలెను. ఓ బ్రాహ్మణా! "ఈయవలయు, తీసికొనఁ గూడదు." అనునదియే యా రామునికి శాశ్వతమయిన నియమము. బవరమునఁ బగతురఁ బరిమార్చునట్టి చేవకాఁడగు రామునికి సవతితల్లికొడుకగు పురు షోత్తముఁడగు లక్ష్మణుఁడను పేరుగల తమ్ముఁ డతనికి బాసటయై యుండును. రాముఁడు నాతోఁగూడ వనమునకు వచ్చునప్పుడు, స్వధర్మ మున నడచువాఁడును, నియమము గలవాఁడును నైనలక్ష్మణుఁడు వింటినిఁ గొని మమ్ము వెంబడించెను. అంత ధర్మము నెడతెగక చేయు వాఁడు నింద్రియాశ లేనివాఁడు నైనందున రాముఁడు రాజ్యమునందుఁ గోరిక విడిచి, తండ్రిమాట జరుపుటయె ముఖ్యకార్యముగా నెంచి, జడ లను దాల్చి, మునిరూపము ధరించి, తమ్ముని నన్నును దోడ్కొని యీ దండకారణ్యమున కేతెంచెను. మేము ముగ్గురము కైకనిమిత్తము రాజ్యము గోల్పోయి, యీ గొప్ప యడవియందు బలిమి మెఱయఁ దిరుగుచున్నారము. కొంత తడ విచ్చట నుండి యలఁత దీర్చుకొనుము. నా మగఁడు జింకలు, ఉడుములు, అడవిపందులు మొదలగువానిని జంపి,

బహువిధములగు మాంసములను, మఱియు వన్యములయిన కందమూల ఫలాదులను గొనివచ్చును. ఓ బ్రాహ్మణుఁడా! నా సంగతిఁ దెలిపితిని. ఇఁక నీ పేరును, నీ గోత్రమును, నీ కులమును జెప్పి నీ వొంటరిగా నేల యిట్లు వనములఁ గ్రుమ్మఱుచున్నావో ? వాస్తవము తెలుపుము" అని సీత రావణు నడిగెను.

ఇట్లు రామునిపత్నియగు సీత యడుగఁగా, బలిమికాఁడగు రక్కసుల జేఁడయిన రావణుఁడు తీవ్రమయిన బదులు సెప్పెను. "ఓ సీతా! నేను దేవాసుర పన్నగులతోఁగూడిన లోకములను వెఱపించినవాఁడను. రావణుఁ డను పేరుగల రాక్షసాధిపతిని. ఓసి చక్కనిదానా! పసిఁడి మేని ఛాయతో పట్టుబట్ట గట్టిన నిన్నుఁ జూచినపదంపడి నేను నా భార్యలవలన నానందము నొందకున్నాను. నేనచ్చటచ్చటనుండి తెచ్చియున్న సుందర కాంత లనేకులలో నీవు నాకుఁ బట్టపుదేవి వగుము. నలుదెసల సాగర ముచేఁ జుట్టఁబడిన లంక యను నా గొప్పపట్టణము సముద్రమధ్యమున నొకకొండపయి నున్నది. ఓసీతా! యచ్చట నాతోఁ గూడి విహరింతువు రమ్ము. అచ్చటికి వచ్చిన పిదప మఱల నీ వరణ్యమున నుండుట కిష్టపడవు. ఓ సీతా! నీవు నాకు భార్యవగుదువేని, సకల భూషణములను దాల్చిన యయిదువేల పనికత్తెలు నికుఁ బరిచర్య సేయుచుందురు" అని రావణుఁడు సీతతోఁ జెప్పెను.

ఒచ్చెములేని యంగములుగల జానకి రావణుని యా మాటల కలిగినదై, యూరక్కసుని సరకుసేయక యిట్లనియె. "గొప్ప పర్వతము మాడ్కిఁ గదలింప నలవికానివాఁడును, గొప్ప కడలిమాడ్క దాఁట నలవినానివాఁడును, నింద్రుని కెనయగువాఁడునైన రాముని భర్తనుగాఁ బొందినదానను.శుభలక్షణము లన్నింటితోఁ గూడినవాఁడును,మఱ్ఱిచెట్టు వలెఁ జుట్టు పరివారము గలవాఁడును, నాడినమాట తప్పనివాఁడును, గొప్ప కల్మిగలవాఁడునునైన రాముని ననుసరించిన మహాపతివ్రతను. నిడుదచేతులవాఁడును, వెడఁదయొమ్ము గలవాఁడును, సింహమువంటి నడకతోఁ బోవువాఁడును, నరశ్రేష్ఠుఁడును, సింహమువంటివాఁడునునైన రామునిఁ బెండ్లాడిన మహాపతివ్రతను. పున్నమచందురుసిబోలు మోము గలవాఁడును, రాజకుమారుఁడును, నింద్రియముల గెల్చినవాఁడును

విస్తారమయిన కీర్తి గలవాఁడును, ధైర్యవంతుఁడునైన రామునికి భార్యను. నేను మహా పతివ్రతను. నక్క యాఁడు సింగమును గోరునట్లు నీవు పడయసాధ్యము కాని నన్నుఁ గోరుచున్నాఁడవు. సూర్యరశ్మి తాఁక ననువుపడనట్లు నన్ను నీవు దాఁకుటకైనను ననువుపడదు. రాముని పత్నినైన నన్నుఁ గోరుటవలన మరణకాలమునసమీపించిన నీవు బంగరు చెట్టులను బెక్కుంటిని జూచుచున్నావు. (చావు సమీపించియున్న వానికి పసిఁడిచెట్టు లగపడునని ప్రసిద్ధి.) ఆఁకలికొన్నదై మృగములఁ జూచి వేగముగాఁ బఱతెంచెడి బలిమిగల సింహాముయొక్కయు, పాముయొక్కయు నోటినుండి కోరలఁ దీయగోరుచున్నావు. నీవుమందరమను పర్వతము నొంటిచేతితో నెత్తఁ బూనుచున్నావు. కాలకూటవిషము ద్రాగి, సేమముతో నుండఁ గోరుచున్నావు. రాముని ప్రియభార్యనైన నన్నుఁ గొంపోవఁ గోరుచున్న నీవు సూదితోఁ గంటిని బొడుచుకొనుచున్నావు. కత్తిని నాలుకతో నాకుచున్నావు. రాముని ప్రియపత్నినైన నన్ను దొంగిలింపఁ గోరునట్టి నీవు మెడకు బండను గట్టికొని సముద్రమును దాఁటఁ సూర్యచంద్రులను జేతులతోఁ బట్టుకొనఁ గోరుచున్నావు. మంచినడత గలిగి రాముని ప్రియురాలనైన నన్నపహరింపఁగోరి, మండుచున్న నిప్పును గుడ్డలోఁ గట్టుకొనఁ గోరుచున్నావు. రామునకుఁదగిన భార్యను గోరునట్టి నీవుకుశూలములమొనలమీఁద నడచి పోఁగోరుచున్నావు. అడవియందలి సింగమునకు నక్కకు నెంత వారగలదో, చిన్న యూటకును మున్నీటికిని నెంత వార గలదో; మంచి సారాయమునకును కడుగుసీళ్ళకును నెంత వార గలదో యంతటి వార రామునకు నీకునుగలదు. బంగారమునకును, సీసమునకు నెంత వారయు, మంచి గందమునకును నడుసునకును నెంత వారయు, నేనుఁ గునకుఁ బిల్లికి నెంతవారయు, గరుడునికిని గాకికి నెంత వారయు, నీరు కాకికి నెమలికి నెంత తారతమ్యమును, సారసపక్షికి గ్రద్దకును నెంత భేదమును నున్నదో, అంత వార రామునకును నీకు నున్నది. ఒకవేళ నీవు నన్ను నిర్బంధించి యెత్తికొనిపోయినను, దేవేంద్రున కెనవచ్చు ప్రభావముగల యా రాముఁడు వింటి నమ్ములను దాల్చి నిలఁబడియుండు నప్పు డీఁగ బియ్యపుఁదునుకయని వజ్రపుఁదునుకను మ్రింగి, తనకు

హాని దెచ్చుకొన్న చందమున, నన్నపహరించిన నీ ప్రాణములకే కీడు దెచ్చుకొందువు." ఇట్లౌటఁగునఁ జెడుతలంపులేని యా సీత గడు ధైర్యముతో నా రక్కసుల తెనితోఁ జెప్పి, గాలిచే నెగురఁగొట్టఁబడిన యనఁటిచెట్టుమాడ్కి కోపాతిశయముచే వణఁకు శరీరముగలదాయెను. అట్లు వణఁకుచుండు సీతను జూచి, యమునిఁబోలు ప్రభావముగల యా రావణుఁడు సీతను వెఱపించుటకై, తన కులగోత్రములను బల్మిని, పేరును గూర్చి చెప్పఁ దొడఁగెను.

48-వ సర్గము.

రావణుఁడు తనపరాక్రమము సీత కెఱిఁగించుట

సీత యిట్లౌటఁగున మాటాడుచుండఁగా, రావణుఁడు మండిపడి, నొసట బొమ్ముముడి వెట్టి, యా సీతతో వినరాని పలుకుల నిట్లు పలికెను. "ఓ గొప్పదానా! నేను కుబేరునకు సవతితల్లి కొడుకను. తమ్ముఁడను. రావణుం డనుపేరుగలవాఁడను. నీకు మేలయ్యెడుఁగాక. నేను పదితలల వాఁడను. ప్రతాపవంతుఁడను. మృత్యువునకు జనులువెఱచి దిశలకుఁ బాఱిపోవుచందమున, దేవ గంధర్వ పన్నగ పిశాచాదులు నాకువెఱచి మూలమూలకుఁ బాఱిపోవుదురు. తొల్లి యొకప్పుడు నా సవతితల్లికొడుకగు కుబేరుఁ డొక్కతూరి యొక్క కారణముచేత నాతోఁ గయ్యమునకుఁ బూని, నాతోఁ బోరలేక యోడిపోయెను. ఆ కుబేరుఁడు నాకువెఱచి సకలసంపదలతో నిండిన తన నగరము లంకను బాసి, శివుని కెంకియైన పర్వతశ్రేష్ఠమగు కైలాసమునన్నవాఁడు. ఓ సుందరీ! నే నాకసమున సంచరించునట్టి యిచ్చువచ్చిన చోటికేఁగు పుష్పక విమానము, నేను కుబేరునిఁ బరాక్రమముచే జయించి, లాగికొన్నదే. ఓ మైథిలీ! నేను కోపముచేఁ గన్ను లెఱ్ఱనచేయుదునేని, వేలుపులతేఁడు మున్నుగాఁగల దేవతలందఱు నా మోమును జూచినంతటఁ బాఱిపోవుదురు. నే నుండుచోట వాయువు వెఱపుచే గట్టిగా వీవఁడు. నా భయమువలన వేఁడి వెలుఁగులుచిమ్ము సూర్యుఁడు చల్లనివెలుఁగులు గలవాఁడగును. మఱియు నేనుండుచోటఁ జెట్లుయం దాకులు గదలక మొదలక యుండును. నదులందు నీరు తిన్నగాఁ బాఱుచుండును. ఓ సీతా! నా పట్టణము లంకాపురము. అయ్యది మిక్కిలి చెన్నువిఱాజీ,

దక్కినంపుఁ గడలినడుమ భయంకరులగు రక్కసులతో నిండినదై దేవేంద్రుని యమరావతిం బోలె మెఱయుచుండును. ఆ లంకాపురము తెల్లని ప్రాకారముచేఁ జుట్టఁబడినది. అందలి మేడలు బంగారుమయము లైనవి. వైడూర్యమణిమయము లగు పురద్వారములుగలవు. లంకయందు గుఱ్ఱములు, నేనుఁగులు నరదములుఁ గ్రిక్కిఱిసియుండును. ఎల్లప్పుడు మంగళవాద్యములు మ్రోఁగుచుండును. ఋతువులందును పుష్పఫలాదులతోఁ గూడిన వృక్షములుగల తోఁటలు శోభిల్లుచుండును. ఓ మంచి మనసుగలదానవగు రాజపుత్రీ! నీ వచ్చట నాతోఁ గూడియుంటివేని, నీ వింక మానవకాంతలను దలంపవు. ఉత్తమకాంతా! నీ వచ్చట నాతోఁ గూడి మనుజలోకమునందలి సుఖములను, దేవలోకమునందలి సుఖములను బొందుచు, నల్వాయుష్కుఁడై న మానవుఁ డగు రామునిఁ దలంప నేరవు. దశరథుఁడు తన ముద్దుల కుమారునికిఁ బట్టముగట్టి, పరాక్రమహీనుఁ డనుకారణముచేఁ బెద్ద కొడుకైనను రాముని నడవికిఁ బంపెను. విధివిక్కులదానా! రాజ్యము కొల్పోయినవాఁడును, జ్ఞానము లేనివాఁడును, మునిరూపముదాల్చినవాఁడును జాలినొందఁదగినవాఁడు నైన రామునిచే నీకేమి సౌఖ్యము గలదు? రాక్షసుల కెల్ల దొరనైన నేను మరుని తూపులచే నాఁటఁబడి, నీ పైఁ దమిచే స్వయముగా నేతెంచితిని. ఇట్టి నన్ను నీవు నిరాకరించుట తగదు. తొల్లి యూర్వశి యను నచ్చర తన్నుఁ గోరివచ్చిన పురూరవునిఁ గాలితోఁ దన్ని, యీవల పరితాపము నొందినట్లు, ఓ వెఱపరీ! నన్నిప్పుడు రాముని భయముచేఁ దిరస్కరించి, యీవల గొప్ప యాదరవు పోఁగొట్టుకొంటినే యని పరితపింపఁగలవు. ఓ యుత్తమకాంతా! మానిసియగు రాముఁడు యుద్ధమున నా యొకవ్రేలితో సరికాఁడు. ఓ సీతా! రాముని కెఱవక నీయదృష్టముచే నీకడ కేఁగుదెంచిన నన్నుఁ బొందుము." అని రావణుఁడు సీతను వేఁడుకొనెను.

రావణుఁ డిట్లు పలుకఁగా, సీత యీ పలుకులు విని, మిక్కిలి యలిగి, కన్ను లెఱ్ఱనచేసి యేకతమున నా రావణుం జూచి కడు నిష్ఠురముగా నిట్లనియె. "సకలలోకవిభుఁడగు కుబేరుని నీ యన్నయని చెప్పికొని యీ యకార్యము చేయఁ గోరుచున్నావు? ఓ రావణా! చెడు

మదిగలవాఁడవు, నింద్రియనిగ్రహము లేనివాఁడవు, కఠినుఁడవునైన నిన్ను రాజునుగాఁ బడసిన రాక్షసు లందఱు తప్పక నశింతురు. సాటిలేని రూపముగలదియు వజ్రాయుధధారియగు దేవేంద్రునికి భార్యయునైన శచీదేవి నపహరించి, ప్రాణములతో నుండవచ్చునుగాని, రాముని భార్యనైన ననున్నఁజెఱచి, నీవమృతమునఁ ద్రావినను, నీకుఁ జేటుగలుగును." అని సీత రావణునితోఁ గడు పరుసదనము దోచునట్లు పలికిన దాయెను.

49- వ స ర్గ ము.

రావణుఁడు సీత నెత్తికొని పోవుట

మగఁటిమిగల రావణుఁడు సీత పలుకులు విని, యొకచేతితో మఱి యొక చేతినిఁదట్టి, తన యాకారముపెంచి, సీతను గూర్చి, మఱింత కఠిన ముగా నిట్లనెను. "ఓసీ వెఱ్ఱిదానా! నీవు నా బలిమిని, మగఁటిమిని విన్నది లేదు కాఁబోలు! ఆకాశమున నుండి రెండుచేతులతోఁ బుడమినెత్తఁ గలను. సముద్రము నంతయుఁ బీల్తును. కలనియందు మృత్యువుంగూడఁ జంపుదును. వాఁడిబాణములనేసి సూర్యుని నిలుపుదును. పుడమిని బ్రద్దలుసేయుదును. ఓసీ వెఱ్ఱిదానా! కోరినరూపు దాల్చువాఁడను, కోరి రూపు దాల్చువాఁడను, కోరినది యిచ్చువాఁడనునైన ననున్ను నీ పెని మిటినిగాఁ జూడుము" అని రావణుఁడు సీతతో ననెను.

ఇవ్విధమునఁ బలుకుచుండు కోపపరుఁడైన యా రావణుని యొక్కకన్నులు సూర్యాగ్నులం బోలినవై, నడుము నెట్టగను చుట్టు పచ్చగ నుండినవాయెను. అంత రావణుఁడు తిన్ననిదియు, మన్నన సేయఁబడునదియునైన యా సన్యాసిరూపమువిడిచి, యమునిరూపము బోలు స్వస్వరూపము దాల్చినవాఁడయ్యెను. అప్పుడు రావణుఁడు సౌందర్యవంతుఁడును, కుందనపుఁబోఁగులు దాల్చినవాఁడును, క్రొక్కాఁటి మబ్బుచాయగల మేనివాఁడును, పదితలలవాఁడును నై, వింటిని, యమ్ములను గైకొని, యొక్కవ కోపము పూని, కడు నెట్టని కన్నులుగలవాఁడయి యుండెను. గొప్ప మేనుగలవాఁడగు రావణుండు తన కపటంపుయతిరూపును బాసి, నిజరూపముకొంది, యొట్టినికన్ను లును, నల్లని మేనిడాలును గలవాఁడై, యొట్టినిబట్టఁ గట్టి, స్త్రీలలోఁ శ్రేష్ఠురాలయిన సీతముందట నిలఁబడెను.

అట్లు రావణుఁడు నిలఁబడి, నల్లని కొనవెండ్రుకలు గలదియు, మేటివస్త్రాభరణములను ధరించినదియు నైనందున, వే వెలుఁగు మెఱుఁగు కైవడి మెఱయుచున్న సీతను గూర్చి, "సొగసుపిఱుఁదులు గలదానా! నీవు ముల్లోకములందు వినుతికెక్కిన మగనిని గోదురువేని, నన్నుఁ బొందుము. నేను నీకుఁ దగిన ప్రియుఁడను. ఓ మంగళకరి! పెద్ద కాలము నీవు నన్నుఁ బ్రియునిగాఁ బడయుము. నేను నీకుఁ గొసి యాడఁదగిన భర్తను. నీవు నన్నుఁ బెండ్లాడుదువేని, నీ కెన్నటికి నెట్టి కీడు సేయనేచేయను. మానవుఁడగు రాముని యందుఁ దలంపు మాని, నాయందుఁ దలఁపు పెట్టుము. నీ వొక్కటియుఁ దెలియనిదానవైనను, నన్నియుఁ దెలిసిన నేర్పుకత్తెనని తలఁచుచున్నావు. నీవు మూఢురాలవు. రాజ్యముఁ గోల్పోయినవాఁడును, కార్యసిద్ధిఁ బడయని వాఁడును, నల్పాయువునైన రాముని యం దేగొప్పగుణము లున్న వని యాతని ప్రేమయుంచియున్నావు? బుద్ధిహీనుఁడయిన యీ రాముఁ డొక యాఁడుదానిమాట విని, రాజ్యమును, హితులను విడిచి ఘోర మృగము లుండెడి యీ యడవియందుఁ దిరుగుచున్నాఁడు. వానిమీఁది తలంపు మానుము.

ఇట్లని ప్రియములు పలుకఁదగినదియు, తాను ప్రియములే పలుకు నదియునైన సీతతోఁ జెప్పికడు చెడ్డబుద్ధిగలవాఁడగు రావణుఁడు మనునివలపుచే మైమఱచినవాఁడై, యాకాశమున బుధుఁడు రోహిణిని బట్టునట్లు, తమ్మికంటియగు సీతను సమీపించి, యొడమచేతితో నాసీత తలవెండ్రుకలను కుడిచేతితో నామెతొడలను బట్టుకొనెను. మృత్యువుం బోలువాఁడును, పదునైనగోఱలు గలవాఁడును నిడుదచేతులవాఁడును, పర్వతసదృశుఁడునునైన రావణునిఘోరరూపమును జూచి, వనదేవత లెల్ల వెఱపుచే నలుకెలఁకులకుఁ బాఱిపోయిరి. అంత మాయారూప మును, దివ్యమును, వేసడములు పుట్టించినదియు, కఠోరధ్వనిగలదియు, పసిఁడిచక్రములు గలదియునైన రావణుని గొప్పయరద మతని ముందట వచ్చి నిలిచెను. అంత రావణుఁడు గొప్ప గొంతుచేసి గడుసు మాటలతో నా వైదేహిని బెదరించుచుఁ దన తొడమీఁద నుండి యెత్తి యరదమునఁ గూర్చుండఁ బెట్టెను. అట్లు రావణుఁ డెత్తి యరద

మునఁ గూర్చుండఁ బెట్టఁగా, పతివ్రతయని ఖ్యాతిగాంచిన సీత కడు నారాటమునొంది, యడవియందు దవ్వునకుఁ బోయియున్న రామునిఁ గూర్చి, "రామా! రామా!" యని యూఁ రెచ్చెను. అంత పచ్చవిల్తునిబారిం బడిన రావణుఁడు తనయందుఁ గోర్కి లేక, నాగకాంతవలెఁ బొలిచు చున్న యా సీతనట్లు తేరిమీఁదఁ గూర్చుండఁ బెట్టికొని పై కెగిరినవాఁ డయ్యెను.

అంత సీతాదేవి రావణునిచే నట్లు బలాత్కారముగాఁ గొంపోవఁ బడుచుండఁగా, కల్లుద్రావినవానికైవడియు, మదిచెడినదానిమాడ్కియుఁ గడునొచ్చినదై, యీ క్రిందితెఱఁగున మిగుల నార్వఁ దొడఁగెను. "పెద్దలమనసుఁ గరఁగించువాఁడవగు నిడుదచేతులుగల యో లక్ష్మణా! యీ దుష్టుఁడగు రావణుఁడు నన్నెత్తికొనిపోవుచున్నాఁడు. నీకుఁ దెలియలేదా? ప్రాణమును, సౌఖ్యమును, ధనములను కేవల ధర్మము నిమిత్తము విడుచునట్టివాఁడవగు రామా! నన్నన్యాయముగా నీ రావ ణుండెత్తికొనిపోవుచున్నాఁడే. నీవేల చూడకయున్నావు? శత్రుసంహారి వైన యో రామా! నీవు దుష్టులను శిక్షించువాఁడవని పేరొందిన వాఁడవుగదా! అట్లుండఁగా, నీ పాపాత్ముఁడగు రావణు నేల శిక్షింప కున్నావు?"అని రామలక్ష్మణులం బిలిచి, యాక్రోశించి "లోకమునఁ జెడు పనికి ఫలము వెంటనే యనుభవింపవలయును. పైర్లు పండుటకుఁ గాలము తోడుపడునట్టు లీ విషయమునఁ గాలముగూడఁ దోడ్పడినట్లున్నది. ఓ రావణా! నీవుమృత్యువు చే ప్రేరణనేయఁబడినవాఁడవై,యీయకార్యము చేసితివి కావున, నీవు ప్రాణాపదకు మూలమైన ఘోరమగు వంతను రామునివలనఁ బొందుదువు." అని రావణుని దూఱి, "ధర్మకాముఁడును కీర్తిమంతుఁడునైన రామునిపత్నియగు మహాపతివ్రత నయిన నన్నీ దుష్టుండు రావణుఁడు గొనిపోవుచున్నాఁడు. గావున నైకేయి బందు గులతోడఁగూడి యిప్పుడు తనకోరిక తీరినది కాఁగలదు. ఆహా! యేమి వింత" యని కైకేయిందూఱి, వనవృక్షముల వైపు చూచి, "జనస్థాన మునవున్న పూఁచిన కొండగోఁగుచెట్టులారా! ఇదె చెప్పుచున్నాను; నన్ను రావణుఁ డెత్తికొని పోవుచున్నాఁడని రాముఁ డిక్కడికి వచ్చిన వెంటనే చెప్పుఁడు" అని చెప్పి ప్రస్రవణ పర్వతముం జూచి, "ముంచి

పువ్వులుగల శిఖరములగలదానవగు నో ప్రస్రవణపర్వతమా! నీకు మ్రొక్కెదను. నన్ను రావణుఁ డెత్తికొని పోవుచున్నాఁడని రామునితో వేగిరముగఁ జెప్పుము." అని చెప్పి, బెగ్గురులయు, రాయంచలయు, గుంపులతోఁగూడిన గోదావరిం జూచి, "ఓ నదీదేవతా! నీకు మ్రొక్కెదను. రావణుఁడు సీత నెత్తికొని పోవుచున్నాఁడని రామునితో వచ్చినవెంటనే చెప్పుము" అని చెప్పి, "బహు వృక్షములుగల వనమునందలి వనదేవతలారా! మీ కెల్లరకు మ్రొక్కెదను. రావణుఁడు నన్నెత్తికొని పోయినాఁడని మీ రందఱు రామునితోఁ జెప్పుదురుగాక!" యని వనదేవతలతోఁ జెప్పి, "యీవనమునందలి మృగపక్షులారా! మిమ్మందఱను శరణు చొచ్చెదను. రావణుండు నీ ప్రాణములకంటె మిన్నయైన సీతను బలాత్కారముగాఁ గొనిపోయెనేని చెప్పుఁడు. యముఁడు ననుఁ బరలోకమునకుఁ గొనిపోయినను, నిడుదచేతులవాఁడగు రాముఁడు ననుఁ దెలిసికొనినఁ దనమగటిమిచేఁ దెచ్చుకొనఁగలఁడు" అని యివ్విధమునఁ బలుతెఱఁగులైన జాలిమాటలు పలికి విరివికన్నులుగల సీతాదేవి మిక్కిలి వ్యసనముతోఁ బలవించుచుఁ జెట్టుమీఁదఁ గూర్చుండియున్న జటాయువు జూచెను. రావణునిచేతఁ జిక్కియున్న యా సీత భయముతో వంతచేసినయిన డగ్గుత్తికతోఁ గూడి, దలయెత్తి యా జటాయువుం దేఱిపాఱఁ జూచి గొల్లున నేడ్చి, "ఓ జటాయూ! పాపంపుబనులుచేయు నీ రావణుఁడు దిక్కులేనిదానింబోలె ననుఁ గొనిపోవుచున్నాఁడు. చూడుము. ఈతఁడు బలవంతుఁడు; జయశీలుఁడు; ఆయుధములు గలవాఁడు; బుద్ధిలేనివాఁడు; కనికరములేనివాఁడు. వీనితోఁబోరి యితని నివారింప నీకు నలవిగాదు. రామలక్ష్మణులు వచ్చినతోడనే, వారి కిచ్చట నడచిన సంగతి యున్నదియున్నట్లు నివేదింపుము.", అని జటాయువుతోఁ జెప్పిన దయ్యెను.

50-వ సర్గము.

జటాయువు రావణుని నెదుర్కొనుట

అంతటఁ జెట్టుకొమ్మమీఁద నిద్రించుచుండిన జటాయుఁ వా సీత యార్పును విని, తటాలున లేచి, రావణునిఁ జూచి, వెంటనే యాతని తేరియందుఁ గూర్చుండియున్న సీతను జూచెను.అట్లు చూచి, కొండకొనం

బోలువాఁడును, వాఁడిముక్కుఁగలవాఁడును, డాలుగలవాఁడునునైన పక్షులదొరయగు జటాయువు చెట్టుమీఁదఁగూర్చుండి, నెమ్మనిపలుకులతో రావణున కిట్లనియె,

"ఓ పవితలలవాఁడా! నేను పెద్దలనడవడియం దున్నవాఁడను. ఆడిన మాటను దప్పనివాఁడను. కడు బలిమిగలవాఁడను. గ్రద్దలకు ఱేఁడను. నన్ను జటాయు వందురు. నామాట వినుము. దశరథుని పుత్రుఁడగు రాముఁడు లోకములకెల్లఁ బ్రభువు. వేల్పుఱేనిని, మున్నీటి ఱేనిని బోలినవాఁడు. జనుల మేలొనర్పుటయం దాసగలవాఁడు. నీ వెత్తుకొని పోఁగోరిన యీయయు త్తమాంగనయగు సీత యాలోకనాయకుఁ డగు రాముని ధర్మపత్ని.మహాపతివ్రత యని ఖ్యాతిగన్నది.ఓచేవకాఁడా! న్యాయ పరిపాలకుఁడగు ఱేఁ డొరులస్త్రీలను దాఁకునే. రాజు స్త్రీల నేమఱుపాటులేక రక్షింపవలయును. అట్లుండగా, నీవిట్టి యకృత్యము సేయుట సరికాదు. పరస్త్రీ స్పర్శకును చెడుగార్యమునుండి నీ నీచపుఁ దలంపును మఱలింపుము. ఇతరులు నిందించునట్టి యకార్యము నెప్పు డును ధీరుఁడు చేయరాదు. తన భార్యల నెట్లో, యొరులభార్యల నట్లే చూచుకొనవలయును. ఓపుల స్త్యునిపుత్రుఁడా! యోగ్యులగు పెద్దలు శాస్త్ర విరుద్ధములగు ధర్మమునుగాని, యర్థమునుగాని కామమునుగాని కోరరు. కావున స్వధర్మమును విడువఁ గూడదు. రాజు ధర్మార్థ కామము లనెడి పురుషార్థమునకు నుత్తమనిధియైనవాఁడు. రాజు మంచిధర్మము నాచరించినచో, జనులు నట్టి ధర్మము నాచరింతురు. రాజు పాపపుఁబను లొనర్చిన, జనులును బాపకార్యము లొనరింతురు. ధర్మా ధర్మములు రాజునధీనములయియున్నవి. రాక్షసులమేటీ! నీవు పాపస్వభా వము గలవాఁడవు. నిలుకడలేనివాఁడవు.ఇట్టి నీవు చెడుకార్యములను జేయువాఁడు విమానమునొందిన కైవడినెట్లు కలిమినొందితివి.ఓ రావణా! యెవని కేగుణము పుట్టుకతో వచ్చెనో,యా గుణమును నివారింప నేరికిని శక్యముగాదు. పాపాత్ముల యిండ్లయందుఁ గల్మి చిరకాలముండనేరదు. కావున నీవు వేగిరమే చెడిపోవఁగలవు. చేవకాఁడగు ధర్మపరుఁడయిన రాముఁ డెప్పుడైన నీకుఁగాని, నీ దేశమునకుఁ గాని, నీ వీటికిఁగాని, చెఱుపుగావించియున్నాఁడే? అట్లుండ, నిరపరాధియైన యా రాముని కేల

నీ వపరాధమొనరించెదవు? శూర్పణఖ ముక్కుచెవులను గోయలేదా, ఖరదూషణాదులం జంపలేదా యనిన, శూర్పణఖయొక్క చెడ్డతలంపున కిష్టపడక వారు దానిముక్కుచెవులం గోసిపంపిరి. ఆ శూర్పణఖకుఁ గాను, జనస్థాననివాసియగు ఖరుఁడు రాఁగా, సత్కృత్యములనాచరించు రాముఁ డాఖరునిఁ జంపెను. ఈ విషయమున రాముని తప్పేమి యున్నది? యోచించి వాస్తవము నెఱుఁగుము. ఈకారణమున లోక ములకుఁ బ్రభువగు రాముని భార్య నపహరించుట నీకు సరికాదు. ఇంద్రుని వజ్రాయుధము వృత్రాసురునిఁ జంపినట్లు, రాముఁ డగ్నిప్రాయ మయిన తన నేత్రముతో నిన్నుఁ గాల్చకుండునుగాక! కోఅలనిండుగా విషముగల పామును గొంగున మూటగట్టికొని యది తెలియకున్నావు. మెడకుఁ దగులుకొనియున్న జమునిపాశమును జూడకున్నావు. మను ష్యుఁడు తనకు బాధను గలిగించునంతబలువు మోయరాదు. జీర్ణమయి యూకోగ్యమును గలిగించునంత యన్నమునే దినవలయును. వీపనిఁ జేసిన, పున్నెములేదో, పేరు లేదో, పొగడ్త గలుగదో, మీఁదు మిక్కిలి యొంటికి బడలికయుఁ గలుగునో యట్టి కార్యము నెవఁడు చేయును? రావణా! నేను బుట్టి నావంశపారంపర్యముగా వచ్చిన గృధ్ర రాజ్యమును బాగుగ నేలుచుండఁగా, నా కఱువదివేలయేండ్లు గడచినవి. నేను ముసలివాఁడను. నీవు ప్రాయపువాఁడవు, విలుకాఁడవు, నమ్మలు దాల్చినవాఁడవు, చొక్కా దొడిగినవాఁడవు, తేరుమీఁదఁ గూర్చుండి యున్నాఁడవు. అయినను, నీవు సీతను గొని నేమముతో నేఁగఁజాలవు. ఊహలతోఁ గూడిన కారణములను జెప్పి, స్థిరమయిన శ్రుతివాక్యము నిరర్థకము చేయుటకు నెట్లు సాధ్యముకాదో, అట్లు నేను చూచు చుండఁగా, నీ వీ సీతను బలాత్కారముగఁ గొనిపోవుటకు సాధ్యము కాదు. రావణా! నీవు వాఁడిమగఁడవేని, క్షణకాల ముండి పోరు సేయుము. తొల్లి రామునిచే నిహతుఁడై ఖరుఁడు నేలఁబడినట్లు, నీవును నాచేఁ బరిమార్పఁబడి, నేలఁ గూలుదువు. నారబట్టలదారియగు రాముఁడు నిన్ను సమరమున వేగిరమే వధింపఁగలఁడు, అతఁడు మును పెందఱినో దైత్యదానవులను బలుమాఱు సంహరించినట్టివాఁడు. రాచకొమరులగు రామలక్ష్మణులు కడు దవ్వేఁగియున్నారు. వారిని వేగ నేను దోడ్కొని

A 130

జటాయువు రావణునితో బోరాట—110

B130

రాఁజాలను. ఓరీ, నీచుఁడా! నీవు వారికి వెఱచి, వేగిరమే నశింతువు. దీనికి సంశయము లేదు. నేను బ్రతికియుండఁగా తమ్మికంటియగు నందకత్తె యయిన యీ రామునియనుఁగుదేవిని సీతను నీవు గొంపోవఁజాలవు. నా ప్రాణములఁ గోల్పోయి యయినను, నమ్మకూడ్తుఁడగు రామునికిని, యతని తండ్రియగు దశరథునికిని బ్రియముఁ జేసి తీరవలయు. రాతిరి డ్రిమ్మరీఁడా! రావణా! పదితలలవాఁడా! ఉండు ముండుము. నీతో నా శక్తికొలఁది కయ్యము సేసెదను. నీవు నాతోఁ గయ్యముసేయక పోఁజాలవు. తొడిమనుండి పండును గ్రిందఁద్రోయునట్లు, ఈ మేటి యరదమునుండి నిన్నుఁ గ్రిందికిఁ ద్రోసెదను"అని జటాయువు రావణుని బెదరించినవాఁ డయ్యెను.

51-వ సర్గము.

జటాయువు రావణునితోఁ బోరుట

జటాయు విత్తెఱఁగున నార్యమ్ముఁ దప్పని పలుకులం బలుకఁగా, మేలిమికుండలములను దాల్చినవాఁడును, రాక్షసులకు జేఁదునైన రావణుఁడు జటాయు వన్నమాటల కోర్వక కడు నలిగినవాఁడై, యగ్ని వలెఁ దేజరిల్లు తన యిరువది కన్నుల చూపుల నా పక్షిజేనిపై నిగిడించుచు నాతనిమీఁదికిఁ గవిసెను.

ఆకసమున వాయువుచే నెగురఁ గొట్టఁబడిన రెండు మేఘముల మాడ్కియు; తెక్కలుగల మాల్యవంతము లను రెండు గొప్ప గట్టుల పగిదియు నా కాఱుకానయం దా జటాయురావణాసురులు చూపరకు వెఱఁగుపుట్టించు దొమ్మి బవరమునేయఁ దొడఁగిరి.

అప్పుడు బలిమిగల రావణుఁడు వాఁడికొనలు గల నాళీకబాణములను, మహాఘోరములగు నంకుశపు మొనలుగల బాణములను గ్రద్దల జేఁడగు జటాయువుమీఁదఁ గురిపింపఁగా, నాపులుఁగులజేఁడగు జటాయువు కయ్యమున రావణుఁ డేసిన యన్ని యస్త్రములను సహించి, తన వాఁడికాలిగోళ్ళతో నా రావణుని మేను ఱక్కఁ, [illegible]ంటినిండుగఁ బలుగాయములను జేసెను. అంతట గొప్ప వీర్యముగల పదితలలవాఁడగు రావణుఁడు కనలి, తన పగతునిఁ బరిమార్పఁ గోరినవాఁడై సూటిగాఁ బోవునవియు, నోర్వరానివియు, నుక్కుమొనలు గలవియునై, యము

దండములం బోలెడి పది గడుసు తూపులను గైకొని వింటియందు జోడించి, చెనివఱకు నీడ్చి, యా జటాయువుపై వేసెను.

మహాతేజుండైన పులుఁగులదొర యగు నా జటాయువు రావణుని యురదమునఁ గన్నీరు విడుచుచుఁ గూర్చుండియున్న సీతను గాంచి, యా రాక్షసేశ్వరుఁ డేసిన పదియమ్ములను సరకుసేయక, యాతనిపైకిఁ గవిసి, ముత్యాలతోను, రత్నములతోను గూడిన సశరమయిన వింటిని తనకాళ్లతోఁ ద్రుంచినవాఁ డయ్యెను. అంత రావణుఁడు పెంపొందిన యాగ్రహముతో, మఱియొక వింటిని గొని, నూఱేసియు, వేయేసియు బాణములను జటాయువుమీఁదఁ గురిపింపఁగా, నా పక్కుల దొరయగు జటాయువు సమరమున రావణుఁ డేసిన బాణములచేఁ గ్రమ్మఁబడి, గూఁటియం దుండు పక్షికైవడిఁ గానంబడెను. మహాప్రతాపుఁడగు జటాయువు రావణుని శరజాలములను దన తెక్కతో నెగురఁ దన్ని, కాళ్లతో నాతనివింటిని విఱుగఁదన్ని, యగ్నివలెఁ దేజరిల్లు నాతని కవచమును దన తెక్కల గాలిచే నెగురఁ గొట్టెను. అనియందు మొన కాఁడగు జటాయు వంతటితోఁ బోక, బంగారు మయిమఱువులు దొడిఁగినవియు, దయ్యంపుమోరగలవియు, వడిగాఁ బరుగెత్తునవియు నైన యా రావణుని రథమునకుఁ గట్టిన బలిసిన ఖరములను నుగ్గునేసి, రత్నమయములగు పసిఁడి తొడవులతోఁ గైసేయఁబడినదియు, నిచ్చ వచ్చిన చోటికిఁ బోవునదియు, నగ్నివలెఁ దేజరిల్లునదియు నగు నా రావణుని మేటి యురదమును, నొగనుగూడ విఱిచెను. పున్నమ చందురుని మాడ్కిఁ దేజరిల్లు ఛత్రమును, వింజామరములను, వానిఁ బట్టుకొనియుండు రక్కసులతోఁగూడఁ గూలనేసెను. ఎక్కువ బలమును, డాలునుం గలవాఁడగు పక్షీంద్రుఁడయిన జటాయు వంతటితోఁ జాలింపక యా రావణుని సారథియొక్క శిరమును ముక్కుతోఁ ద్రుంచెను. అంతట రావణుఁడు ధనుస్సును బోఁగొట్టికొని, తేరు లేక, తేరి గుఱ్ఱములను, సారథిని గోల్పోయి, సీతను దన తొడమీఁద నుంచి కొని క్రిందఁబడెను. అట్లు భగ్నవాహనుఁడై రావణుఁడు బుడమిని గూలుటను జూచి, సకల భూతములును జటాయువును "బలే బలే" యని గొనియాడిరి.

రావణుఁడు జటాయువును ముదిమిచే నలసియున్న వానినిగా నెఱిఁగి, సీతను గైకొని సంతసముచే మఱలఁ బైకెగిరెను. అట్లు సీతను దొడమీఁద నుంచుకొని యానందముతో నెగురుచుండు రావణుం జూచి, గ్రద్దలఱేఁడగు జటాయువు పైకెగిరి, యా రావణు నెదురు తాఁకి, యతని నడ్డగించి యతనితో నిట్లనియె. "బుద్ధి హీనుఁడవగు ఓ రావణా! వజ్రాయుధమువలెఁ దగులు బాణము లేయు రాముని భార్యయగు నీ సీతను దొంగిలించుకొని పోవుచున్నావు. నీ విక్కార్యము చేయుట రాక్షసుల యందఱి చేటుకొఱకే. దప్పిగొన్నవాఁడు నీరు ద్రావునట్లు, నీవు సీతాపహరణమనెడు విషమును ద్రావుచున్నావు. ఈ విషపానము నిన్నుమాత్రమేకాక, నీయొక్క చెలులను, చుట్టాలను, మంత్రిపరివారములను గూడ సంహరించును.

మూఢు లగువారు తమ రొనర్చు కార్యములకు ఫలమును తెలియఁగల జ్ఞానములేక, నీవు నశించునట్లులె వేగ నశింతురు. ఓ రావణా! నీవు యమపాశముచేఁ గట్టఁబడియున్నావు. ఒక చేప నంజుడునం దాసతో గాలమును మ్రింగి, దానినుండి తప్పించుకొనఁ జాలనట్లు, నీవు కాలపాశమునకుఁ గట్టువడి యెందుఁ బోయినను దాని నుండి తప్పించుకొనఁజాలవు. రావణా! పగతురకు లొంగనివారగు ककुत्स्थవంశోద్భవులైన రామలక్ష్మణులు నీ వీ ప్రకారముగా నీ యాశ్రమమునఁ జేసిన యవమానమును సైరింపఁజాలరు. ఓ రావణా! నీవు పిఱికివై, లోకనింద్యమైన యీ పనిని చేసితివి, ఇది దొంగలపనికాని, మగతనముగలవారి తీరుగాదు. రావణా! నీవు మగవాఁడవేని, ఋణము నిలఁబడి యుద్ధముచేయుము. నీవును మృతినొంది తమ్ముఁడగు ఖరుని మాఁడ్కి నేలపైఁ బరుండఁగలవు. పురుషుఁడు తనకు జేటు కాలము డగ్గఱియున్నప్పు డెట్టి పనిని చేయునో, నీవ్రాయ స్వామినికై యట్టి న్యాయవిరుద్ధముగు కార్యము నొనర్చుచున్నావు. రావణా! ఏది వరకము గలిగించునో యట్టి కార్యమును త్రికాలజ్ఞుఁడును, త్రిలోకాధిశుఁడును, తనంతటఁ బుట్టినవాఁడును నైన బ్రహ్మదేవుఁడయినను జేయఁజాలడు.

VIRLA LIBRARY

అని వాఁడిమగఁడగు జటాయువు రావణునితో మంచిమాటలం బలికి, కడువేగముగా నారావణుని వీఁపుమీఁదఁబడి, మూవటీఁడు, పైన నెక్కి కూర్చుండి, దుష్టగజము నంకుశముతోఁ బొడుచునట్లు, తన గోళ్ళతో నారావణునివీఁపుమీఁద నంతట అక్కెను. మఱియు, నా జటాయువు గోళ్లు, తెక్కలు, ముక్కు నాయుధములుగాఁగలవాఁడై, తనముక్కుతో వీఁపునుఱికి, కాలివ్రేళ్ళతో నాతనిజుట్టును బెఱికి వైచెను. ఇట్లు రావణుఁడు మాటిమాటికి జటాయువుపెట్టు పలుతెఱఁగు లైన బాధలను బొందుచుఁ గోపముచే నదురుచున్న పెదవులుగల వాఁడై, పెల్లుగా వణఁకి, సీతను దనయొడమతొడమీఁదఁ గూర్చుండఁ బెట్టికొని, మేర మీఱిన కోపముతోఁ దన యటిచేతితో నా జటాయు వును బాఁదెను. శత్రుసంహారియయిన పక్షులఱేఁడగు జటాయు వప్పుడా రావణునిమీఁదికిఁ గవిసి, యాతని యొడమ వైపున నుండెడి పదిచేతులను దెగనేసెను. వెంటనే, విసపుమంటలగుమితోఁగూడిన పాములు పుట్ట నుండి వెడలునట్లు, చేతులుదెగిన పంక్తికంధరుని దేహమునుండి పది చేతులు పుట్టినవయ్యెను.

అంతటఁ బదితలలవాఁడగు రావణుఁడు కోపముచే నా సీతను గ్రిందవిడిచి, యా జటాయువును పిడికిళ్లఁ గాళ్ళఁ గ్రుమ్మెను. అప్పుడు సాటిలేని మగఁటిమిగల యా రాక్షసాధిపతగాధిపులకుఁ గొంతసేపు యుద్ధము జరిగెను. అంత రావణుఁ డట్లు రాముని నిమిత్తమయి పోరు చేయుచున్న యాజటాయువుయొక్క తెక్కలను, ప్రక్కలను, కాళ్ళను కత్తితో నఱికివైచెను. అట్లు గడుసుపనులు నేయు రావణుఁడు జటా యువుయొక్క తెక్కలను నఱికఁగా నంత జటాయువు కోపయుక్తుఁడై నేలఁ గూలె. అంత సీత నేలఁబడి నెత్తుటఁ దడిసియున్న యా జటా యువును జూచి, కడువగపుతోఁ జుట్టముకడ కేఁగునట్లు లా జటాయువు కడ కేఁగెను. అప్పుడు నల్లని మబ్బువలె మెఱయు దేహముగలవాఁడును, మిక్కిలి తెల్లనిమోమ్ముగలవాఁడును, నెక్కువ మగఁటిమిగలవాఁడును. బుడమిని గూలుటచేఁ జల్లారిన మంటలుగల యగ్నివలెనున్న వాఁడను నగు జటాయువును రావణుఁడు జూచెను. తర్వాత నప్పుడు చందురునిఁ బోలు మోమునుగల జనకరాజపుత్రియగు సీత రావణునిచే బలిమి మెఱయ

నుగ్గుసేయఁబడి, తెక్కలుదెగి నేలఁ గూలిన యా జటాయువును మఁఱల మఁఱల గట్టిగాఁ గౌఁగిలించికొని రోదనము సేసినదాయెను.

52-వ స ర్గ ము.

రావణుఁడు సీత నెత్తుకొనిపోవుట

రాక్షసాధిపుఁడయిన రావణుఁడు రాముని యాశ్రమము చేరువఁ గొనయూఁపిరితో నేలమీఁదఁబడి పొరలుచున్న జటాయువును జూచు చుండెను. అప్పుడు పున్నమచందురునిఁబోలు మోముగల సీతాదేవి రావణునిచేఁ గూల్పఁబడిన జటాయువుం జూచి, కడు వెతచే నొచ్చినదై, యతనిని గౌఁగిలించి యిట్లు విలపించెను. "కన్ను లదరుట మొదలగు గుఱుతులును, పక్షులకూఁతలును మానవుల మేలుకీళ్ళను సూచించు చుండును. ఓ రామా! నీ కిప్పుడు సంభవించియుండు గొప్ప యాపదఁ దెలియకున్నావుగదా" అని రాముని గూర్చి తలపోసి, "యీ మృగ ములు, పక్షులు నా వృత్తాంతము రాముని కెఱిఁగించుటకై పరువిడు చున్నవి. దీనికి సంశయము లేదు. నన్నుఁ గాపాడవచ్చిన యీ జటా యువు నా దురదృష్టవశమునఁ బాపకర్ముఁడగు రావణునిచేఁ జావమోదఁ బడి నేలమీఁదఁ బరుండియున్నాఁడు. కాకుత్స్థా! లక్ష్మణా! మీరు నన్నిపుడుగావుఁడు." అని వినువారియొదుట నఱచినట్లుగా నార్చి, కడు వెఱపుతో నేడ్చుచుండెను.

రక్కసులజోడయిన రావణుఁడు నలఁగిన సొమ్ములను వలువయుఁ గలిగి, యనాథవలెఁ బలవించుచున్న సీత యొద్దకుఁ బోయెను. అప్పుడు సీత రావణునిఁ జూచి, తీఁగవలె నల్లలాడుచు నడవియందలి గొప్ప చెట్లులను గౌఁగిలించుకొని, "రామరామ" యని మొఱయిడుచుండెను. అట్లు రాము నెడఁబాసి, యొంటరిగా వనముననున్న సీతను జమునిమాడ్కి వెఱపుపుట్టించువాఁడయిన రావణుఁడు తన ప్రాణముల పోకకై కేశములందుఁ బట్టుకొన్నవాఁడయ్యెను. రావణుఁడట్లు సీతను బట్టు కొనఁగా స్థావర జంగమాత్మకమగు ప్రపంచమెల్ల తనమట్టమీఱిన దయి, కాఱుచీకటిచే నలముకొనఁబడెను. గ్రహీవపడయ్యె. సూర్యుఁడు వెలుఁగులేనివాఁడయ్యె. సర్వోత్తముఁడగు బ్రహ్మదేవుఁడు దీనురాల యిన సీతను రావణుఁడు పట్టినాఁడన్న సంగతి దివ్యదృష్టిచే నెఱిఁగిన

వాఁడై, కార్య మిఁకఁ జేతనని తలఁచినవాఁ డయ్యెను. దండకారణ్యమున నుండు మహర్షులందఱు రావణుండు సీతను దాఁకినందుకు వ్యసనమును, రావణునకుఁ బ్రయత్నము లేకయే పరదారస్పర్శమువలనఁ గలిగిన చేటునకును సంతోషమునుఁ జెందిరి.

అంతట రాక్షసాధిపుఁడగు రావణుఁ డట్టులు "రామ! రామా!" యనియు, "లక్ష్మణా!" యనియు మొఱఁబెట్టుచుండు సీత నెత్తికొని తఱలినవాఁడయ్యెను. పుటము వేసిన బంగారువన్నెగల మేనుగలదై, యారాజపుత్రియగు సీత యాకసమునఁ బోవునప్పుడు నల్లని మేనిడాలు గల రావణుఁడు తళతళ మెఱయు మెఱపువలె మెఱయుచుండెను. కట్టినపచ్చని పట్టుచీర యొగురుచున్న యా సీతనెత్తికొని పోవుచున్న కాఱుచిచ్చుచే మండుచున్న పర్వతముమాడ్కిఁ బెల్లుఁదేజరిల్లుచుండెను. ఎఱ్ఱని చక్కదనముగలదగు సీతయొక్క శిరసునుండి నెత్తావిగల చెండామరపూవులతేకులు రావణునిచుట్టును రాలినవయ్యెను. గాలికెగిరిన యా సీతయొక్క పసిఁడిచాయగల మేలిమి పుట్టము మధ్యాహ్నకాలమున సూర్యునికాంతిచే నెట్టనైన యాకసముమాడ్కిఁ బ్రకాశించుచుండెను. ఆకాశమున రావణునితొడమిదఁ గూర్చుండి యేఁగుచున్న యా సీతయొక్క చక్కని ముక్కుగల మోము రాముని యెడఁబాటుచేఁ గాడలేని తామరపుష్పమువలె వాడుపాటి మెఱుఁగులేకయుండెను. చక్కని నొసలుగలదియు, నల్లనైన ముంగురులు గలదియు, వికసించిన కమలమువలెనున్నదియు, నొచ్చెములు లేనిదియు, తెల్లనివి, నిర్మలములు, కాంతిమంతములునైన పండ్లతో నొప్పునదియు, నేడ్చుచున్నదియు, తుడువఁబడని కన్నీరుకలదియు, చందురునివలెఁ జూడసింపయినదియు, చక్కని ముక్కును, నెట్టనిపెదవియుంగలదియు, పసిఁడివన్నెగలదియునై, యాకసమున నల్లని రావణుని తొడమిదఁ గూర్చుండియున్న యా సీత మోము క్రొక్కారుమొయిలుం దొలఁగించికొని యుదయించిన చంద్రబింబమో యనఁదగియుండెను. రావణునిచే బెదరుపెట్టఁబడిన యా సీతయొక్క మోము రాముఁడు లేమింజేసి, పగటిపూట నుదయించిన చంద్రునిపగిదిఁ బ్రకాశహీనమై యుండెను. స్వర్ణచ్ఛాయగల యా సీత దేహకాంతి నల్లని రావణుసితొడయందుఁ గూర్చుండియున్నందున,

నింద్రనీలమణిం బొందిన బంగారునొడ్డాణమువలె శోభిల్లుచుండెను. మఱియు బంగరుడాలుగలదియు బంగారుసొమ్ములఁ ధాల్చినదియు, కమలమువాడ్కిఁ బచ్చనిదియునైన సీత రావణునిఁ జేరి, మేఘమునుఁ జొచ్చిన మెఱుఁగుకైవడి మెఱయుచుండెను. ఆ రావణుఁడును ఘల్లుఘల్లుమని మ్రోఁగుచున్న బంగారుతొడవుగల సీతతోఁ గూడి యుండుటచే నుఱుములు మెఱుములతోఁ గూడిన మేఘము మాడ్కిఁ దేజరిల్లుచుండెను. రావణుఁడు గొంపోవుచున్న యా సీత యొక్క శిరసునుండి జాఱిన పూవులు క్రిందఁబడి, రావణుఁడు పోయెడి వేగముచే మఱిలఁ బైకిలేచి యున్నతమగు మేరుపర్వతము చుట్టును నిర్మలమగు నక్షత్రమాల చుట్టుకొనియున్న కైవడి నా రావణునిఁ జుట్టుకొనియుండెను. ఆ సీత కాలినుండి జాఱిన రతనములు పొడివిన కాలియండె గల్లుమని మ్రోగుచు, మెఱుఁపులగుంపుమాడ్కి వెలుఁగుచుఁ గ్రిందఁబడినదాయెను. చిగురుఁబోడియగు నా సీత నల్లనిమేని డాలుగల రావణుని శరీరమున నుండుటంజేసి, యా రావణుఁడు పసిఁడి మోకుతోఁ గట్టిన యేనుఁగుచందమునఁ బ్రకాశించెను. కుబేరుని తమ్ముఁడగు రావణుఁ డాకాశమందు తోఁకచుక్కవలెఁ దన పేని డాలుచే మెఱయుచున్న సీతను గొని యాకాశమార్గమునఁ బోవుచుండెను. అగ్ని వలెఁ దేజరిల్లెడి యా సీతయొక్క తొడవులన్నియు నా మెయ్యొంటి నుండి జాఱి, పుణ్యక్షీయము నొందిన రిక్కలకైవడి మ్రోయుచు నేలం బడినవాయెను. మఱియు నాసీతవక్షస్థ్సలమునుండి జాఱిన చంద్రుని వలెఁ దెల్లనై వెలుఁగు ముత్యాలహారము పుడమిపైఁ బడుచు నాకాశమునుండి భూలోకమునకు జాఱుచున్న గంగానదివోలెఁ దెల్లనై మెఱయుచుండెను.వృక్షము లా రావణుం డేఁగు వేగమునఁ గడు వడిగా వీచుచున్నకొమ్మలు గలవియు, సకల పక్షిగణములతోఁ గూడినవియునగు వృక్షములు "సీతా! వెఱవకుము" అని చెప్పుచున్నట్లు తోఁచుచుండెను. తామరకొలఁకులెల్లఁ వాడినకమలములుగలవియు, వెఱచిన చేఁపలు మున్నగు జలచరములతోఁ గూడినవియునై మృతినొందిన చెలినిగూర్చి విచారపడినట్లు, సీతనుగూర్చి విచారపడుచుండెను. ఆ వసమునందు సింహ వ్యాఘ్రాది మృగములు, పక్షులు నన్ని దెసల

నుండివచ్చి యేకమయి రావణుని మీఁది కోపముచే నా రావణుని నీడ
ననుసరించి సీతను వెంబడించి పరుగెత్తినవాయెను. పర్వతములును
రావణుఁ డెత్తికొని పోవుచున్న సీతను గని నెలయేళ్ళనెడి కన్నీటితోఁ
గూడి, శిఖరము లనెడి చేతులను బైకెత్తికొని రోదనము సేయుచున్న వో
యనునట్లు తోఁచెను. సూర్యుఁడును రావణుఁడు సీత నపహరించికొని
పోవుటం జూచి, కాంతిగలవాఁడయినను, ధైర్యం బేది, కాంతిహీనుఁడై
వెల్లనై యుండెను. "ఈ రావణుఁడు రామునిభార్యయగు సీతను గొని
పోవుచున్నాఁడు. ఇక్కాలమున ధర్మ మెక్కడిది? సత్య మెక్కడిది?
చక్కని పాఁ టెక్కడిది?" అని సకల భూతములు గుంపులుగూడి
దుఃఖించుచుండినవాయెను. చిన్న జింకపిల్ల లెల్లను మిక్కిలి వెఱచి,
మోమున విన్న దనముతో, రావణునిచేఁ గొంపోవఁబడుచున్న సీతను
మోరలెత్తి చూచి, కన్నీటిచేఁ జెదరినచూడ్కి గలవియై, రోదన మొన
రించెను. అవ్వీథమున "రామా! లక్ష్మణా!" అని యింపుగా
నార్చుచున్నదియు, భూతలమునఁ బలుమాఱు చూచుచున్నదియు,
దుఃఖించుచున్నదియు, రోదనము చేయుచున్నదియునైన సీతను జూచి
వనదేవతలెల్ల దుఃఖముచే గడగడ వడఁకిన వయ్యెను. అత్తెఱంగునఁ
జిక్కుపడిన వెండ్రుకలను, చెడిపోయిన బొట్టును గలదైన మహాపతి
వ్రతయగు సీతను రావణుఁడు దనచేటునకై కొంపోవుచునే యుండెను.
అంతటఁ జిఱునవ్వు మోమునఁగలదియు, సన్నని పల్వరుసగలదియునైన
యా సీత బంధుగులకు దూరమయి రామలక్ష్మణులను జూడఁగానక
మోమున విన్నఁదనము దోఁపఁ గడు వెఱపునొందినదాయెను.

౬౩-వ సర్గము.

సీత రావణుని దూలనాడుట

అవ్వీథమునఁ దన్నుఁ గైకొని యాకసమున కెగిరి పోవుచున్న
రావణునిఁ జూచి, జనకరాజపుత్రియగు సీత మిగుల వెఱచి యంగ
లార్చుచు నెక్కడు కలఁతనొంది, కోప రోదనములచేఁ గన్ను లెఱ్ఱి
పాఱఁగా, జటిఫట్టునట్టు లేడ్చుచు, మిడిగ్రుడ్డువాఁడయిన రావణుని
నిట్టెఱఁగున దూలనాడెను.

నీచుఁడవగు రావణా! ఏకతముననున్న నన్నెవ్వరు లేనప్పుడు దొంగిలించుకొని పోవుచున్నాఁడవె. ఇది నీకు సిగ్గుగాఁదోఁపలేదుగదా! ఓ చెడ్డతలంపుగలవాఁడా! నీవు నన్నుహరింపఁగోరి రామునికి వెఱచి, యతని సమక్షమున నన్ను దొంగిలింప వీలుగాదని యెంచి, యొక్క మాయామృగమును గల్పించి, దానిమూలమున నా భర్తను దగ్గఱి లేకుండునట్లు చేసితివి. ఈ జటాయువు పండుముసలివాఁడు. నా మామకు నెచ్చెలి. ఆ ప్రేమచే నన్నుఁ గాపాడవచ్చిన యీ జటాయువును గ్రిందఁ ద్రోసితివి. రాక్షసాధమా! యుద్ధమున నేను శూరుఁడనను దన పేరు వెల్లడిపఱచి, నన్ను గెల్వక, దొంగతనముతో నన్నుఁ గొంపోవుచున్నాఁడవు! ఆహా! నీ పరాక్రమమెంత గొప్పది యనవచ్చును! నీ వొరుని భార్యను దాని మగఁడులేనియప్పుడు దొంగిలించికొనిపోవుచు, లోక మునకెల్ల నింద్యమయిన యింత పనిని చేయుచున్నా మని నీ కా వంత యైనను సిగ్గుదోఁపలేదుగద!

ఓ రావణా! నేను శూరుఁడనను తలఁపుతో నీ విపు డొనర్చినట్టి కుచ్చితంపుఁబనిని ప్రపంచమం దుండు సజ్జను లెల్ల నీచకార్యమనియు, నమ్మించి గొంతుకోయు పనియనియు, నెంతయు ధర్మవిరుద్ధమనియుఁ జెప్పుకొందురు. నీచుఁడా! నీ వింతకుముందు నీ బలపరాక్రమములం గూర్చి పొగడుకొంటివికదా. ఛీ! ఛీ! నీ బలపరాక్రమములు గాలిపోవును గాక! ఛీ! కొలమునకు దూరుదెచ్చునట్టి నీ నడత బూదియగునుగాక! నీ విట్లు పరుగెత్తిన నేమి చేయ నగును? కొంతదడ వుండుము. నీవు ప్రాణ ములతోఁ బోలేవు. నేనలతోఁ గూడి వచ్చినను, నా రాజపుత్రులకంటఁ బడినపదంపడి క్షీణమైనను ప్రతికియుండఁజాలవు. అడవియందు మండుచున్న కాఱుచిచ్చుయొక్క సెగను బత్తులు సైరింపఁజాలన ట్లా రామలక్ష్మణుల యస్త్రులతాఁకుడును నీ వెట్టకేలకు సైరింపఁ జాలవు. నీవు లెస్సగా యోఁచించి నీకు హితవు గల్గించు పనిఁ జేయుము. బాగుగ యోచించి, యిప్పుడు నన్ను విడువుము. నీ వట్లు నన్ను విడువవేని, నామగండు నన్నపహరించిన నీపైఁ గడు నలిగి తమ్ముని బాసటగాఁ గొని నిన్ను రూపుమాపఁ బ్రయత్నించును. ఓ నీచుఁడా! నీ వే తలంపుతో నన్ను బలాత్కారముతో నపహరింపఁ బూనితివో, ఆ నీ ప్రయత్నము

వ్యర్థము కాఁగలదు. నేను దేవతుల్యుఁడగు నా ప్రియునిఁ జూడక శత్రువుచేతఁ జిక్కి చిరకాలము ప్రాణములతో నుండజాలను.

చావువేళ దాపున నుండునపుడు మానవుఁడు నీచపుఁ బనులనే చేయునట్లు నీవును చేటుకాలము సమీపించియుండుటచే నీకు హితవగు దానినిగాని, మేలుగావించుదానిని గాని యొఱుంగకున్నావు. ఇది నిజము. చావసున్నవారి కందఱికిని బథ్యమగునది రుచింపదు. వెఱపు గలుగుచోటఁ గూడ వెఱవకున్నావు గావున నీకుఁ బసిఁడి వన్నెగల చెట్టులు పెల్లుగాఁ గనఁబడుచున్నవి. నీవు నీ మెడకుఁ దగిలియున్న కాల పాశమును దెలియఁజాలకున్నావు. ఓ రావణా! రక్తప్రవాహము పాఱు వైతరణినదియు, భీకరమైన యసిపత్రవనమును నీకంటికిఁ గనఁబడుచుండు నట్లున్నది. అపరంజివన్నెగల పూవులతోఁ గూడినదియు, వైడూర్య మణిమయములగు నాకులు గలదియు, నినుముతోఁ జేసిన ముండ్లతో నిండి నదియునైన తీక్ష్ణముగు శాల్మలీవృక్షమును శీఘ్రమునఁ జూడఁగలవు. కని కరము లేని నీ విప్పుడు మహానుభావుఁడగు రాముని కింతటి యపకార మొనర్చి, విసము వ్రావినవానికైవడిఁ జాలకాలము ప్రాణములతో మనఁజాలవు. రావణా! నీ వొక్కరికిని విప్ప నలవికాని యమపాశము నకుఁ గట్టువడియున్నావు. నీవిట్టి స్థితియందు మహాత్ముఁడగు నా మగనిని దప్పించుకొని యెందుఁ బోయి, సుఖము నొందగలవు. రావణా! మహా వనమునఁ బదునాలుగువేల రక్కసులను, దమ్మునిబాసట లేక, యొక్క నిమిసమఁలోపలఁ బరిమార్చిన చేవకాఁడును, విలువిద్దె నెఱిఁగిన వాఁడును మొనకాఁడును నైన రాముఁ డెట్లు తన ప్రియపత్నిని గొని పోయిన నిన్ను వాఁడితూపులఁ బ్రయోగించి చంపకుండును?" అని ఇవి మొదలగు పరుషవచనములచే రావణుఁ దూరుచు, సీత రావణుని తొడమీఁదఁ గూర్చుండి రావణుని యాకారమును జూచుటచే వెఱపును, రాముని నెడఁబాసినందుకై వ్యసనమును బొందినదాయెను. అట్లు సీత మిక్కిలి నొచ్చినదై, యేడ్పుతో, జాలిపుట్టునట్లును బలుతెఱఁగులఁ బలుకుచు, గడగడవణఁకుచు నిట్టటు పొరలుచున్నను బాపాత్ముఁడగు రావణుఁడు ఆ సీతయొక్క విలాపమును గమనింపక, యామె నెత్తుకొని పోవుచునె యుండెను.

54-వ స ర్గ ము.

రావణుఁడు సీతతోడ లంకఁ జేరుట

రావణుఁడు సీత నెత్తుకొనిపోవుచుండఁగా, నా సీత యే రక్షకుని గానక పోవుచు నొక పర్వతశిఖరమునందుఁ గూర్చుండియున్న యేవురు వానరశ్రేష్ఠులను జూచి రామునకు వీరు తన సంగతిఁ దెలిపినఁ దెలుపుదు రని యెంచి, తన యుత్తరీయమున మేలి యాభరణముల నెల్ల మూట గట్టి, యా ముల్లె నా వానరుల నడుమఁ బడనేసెను. సీత యిట్లీవ్విధ ముగాఁ దన సొమ్ములను దన యుత్తరీయమున మూటఁగట్టి వానరుల నడుమ నేయుటను రావణుఁడు ప్రయాణత్వరంబట్టి గమనింపఁడయ్యెఁ. ఆ పర్వతాగ్రమున నున్న పచ్చనికన్నులవారగు నా వానరశ్రేష్ఠులీ ముల్లె యెవరిదని తల లెత్తిచూచి, రోదనముచేయుచుఁ బోవుచున్న యా సీతను గాంచిరి.

ఆ కాఁకసేశ్వరుఁడగు రావణుఁడును, విలపించుచుండు సీత నెత్తి కొని పంపాసరస్సునుదాఁటి లంకవైపును జూచుచు నోర్వరాని విసము గలదియు, వాఁడికోరలు గలదియునైన పామునుంబోలె దన చావునకుఁ గారణమైయున్న యా సీతను దన తొడమీఁద నుంచుకొని యొక్కఁడు సంతసముతోఁగూడి పోవుచుండెను. ఆ రావణుఁడు వింటినుండి వెడలిన యమ్ముపగిదిఁ గడువేగముతో దారినడుమనున్న వననదీ పర్వతసరస్సులను దాఁటి, గొప్పమొసళ్లు మొదలగు జలచరముల కునికిపట్టును, వరుణునికి కొంకియు; తఱుఁగని నీరుగలదియునైన యేటిమగనిని(సముద్రమును) జేరి, ఢానిని వేగముగ దాఁటెను. సీత రావణునిచేఁ గొంపోవఁబడుచుండు నప్పుడు కడలియుఁ దత్తరపాటువలన నలలులేకయుఁ, గదలక యుండు చేఁపలు, మొసళ్ళు మొదలగు జంతువులతోఁ గూడియుండెను. అప్పు డాకసమునఁ దిరుగుచుండు చారణులును, సిద్ధులును "రావణు డింతటితో ముగిసినవాఁ" డని యొండొరులు చెప్పుకొనిరి.

రావణుఁడు రూపమెత్తివచ్చిన తన మృత్యుదేవతయో యనఁదగి నదియు,వంతచేఁగుందుచున్నదియునైన సీతను గైకొని, చక్కఁగాఁ దీర్చిన గొప్ప రాజబాటలతోఁగూడిన రాజమార్గముఁ బొంది, గొప్ప ప్రహరీలతోఁ గూడిన తన యంతఃపురమునకుఁ జొచ్చెను. శోక మోహాము

లతోఁ గూడియున్న యా సీతను మయుఁ డసురమాయనుబోలె నచ్చట నుంచి, వెఱపుఁగలిగించు చూపు-లుగల రాక్షసాంగనలను బిలిచి, నా యుత్తరువు లేక పురుషుఁడుగాని, స్త్రీగాని సీతను జూడఁ బోఁగూడదు. ఈ సీత గోరిన రత్నహిరణ్మయభూషణములను, మేటి దువ్వాలువలను, నిది కోరినవానినెల్ల నా యానతి యయినట్లే యిండు. మీలోపల నెవ్వఁ డె యయినను, దెలిసియో, తెలియకయో, యేమాత్ర మయిన నీ సీత కింపుగాని పలుకులఁ బలుకునేని, దానికి మరణము దప్పదు."

అని మిగులఁ బరాక్రమశాలియైన రావణుఁ డిట్లు రాక్షసకాంతల కానతిచ్చి, యంతిపురమునుండి వెలుపలికివచ్చి, యిఁక చేయవలసిన పని యేమి యని యాలోచించినవాఁడై నంజుడుదిండులైన గడుసరులగు నెనమండ్రు రక్కసులను బిలిచి, వరప్రభావమున గర్వించినవాఁడై, యా రాక్షసవీరులం జూచి వారి బలపరాక్రమములఁ బొగడి యుబ్బించి, యిట్లనెను. "మీరలు సకలాయుధములను ధరించి, మునుపు ఖరుఁడుండి నదియై యిప్పుడు పాడువడియున్న జనస్థానమునకుఁ గడువేగిరముగాఁ బోయి, రాక్షసులందఱు మడియుటచేఁ బాడువడియుండు నా జనస్థానము చేరి యచ్చట వెఱపురూని మీ బలశౌర్యములను గనఁబఱచుచు నుండుఁడు. మునుపు నేను జనస్థానముననుంచియున్న సేనలతోడను, వారి సేనాధిపులగు ఖరదూషణులతోడను రాముఁడు యుద్ధముచేసి, వారిని వాఁడిబాణములచే రూపురూపెను. ఆ విషయమున నా కోర్వ రామిచేఁ గల్గినకోపము ధైర్యమును మించిపోవుచున్నది. నా కిప్పుడు దేహమువీఁది ప్రజ్ఞ దప్పియున్నది. ఆ రాముని విషయమునను గొప్ప పగ గలిగినది. ఆ రాముని యుద్ధమునఁ జంపి, నాపగ దీర్చుకొనఁ గోరుచున్నాను. ఆపని చేయనిది నిద్దురపట్టదు. ఖరదూషణులను బరిమార్చిన యా రాముని బవరమునఁ దెగటార్చి, పెన్నిధిగన్న వేదవోలె సుఖము నొందెదను. మీరు జనస్థానమున నుండుచు, రాముని నిక్కంపుస్థితి నరయుచు నాకప్పుడప్పుడు తెలుపుచుండవలయు. మీ రందఱు మార్గమున బవళ్ళు జాగ్రత్తతో నేఁగవలయు. రాముని వధమునుగూర్చి ప్రయత్నముచేయుచుండవలయు. మీరు పలుమఱు యుద్ధరంగమునఁ జూపిన

మీ బలిమి నెఱిఁగియుఁ గ్నాఁడను, కావున నీ జన్మస్థానమునకు మిమ్ముఁ బంపితిని" అని యిట్లు రావణుఁడు రాక్షసులకోఁ జెప్పెను. అంత నా రాక్షసు లెనమండ్రు రావణుని ప్రార్థన కుబ్బి, యాతని మహాకార్యమును శిరసావహించి, రావణునికి మ్రొక్కి, యొంటులకుఁ గానరానివారై, జనస్థాన ముడువైపునకు నంద ఱొక్కటిగాఁ గూడి పోయిరి. రావణుఁడును సీతను జూచి, "సీతను బడసితినిగదా" యని యుప్పొంగి, రామునికోడ నణఁపరాని పగపూని, యవివేకమునఁలన "మనకార్యసిద్ధి యయ్యెఁగదా" యని సంతుష్టాంతరంగుఁ డాయెను.

55-వ సర్గము.

రావణుఁడు సీతను మోహించి నిర్బంధించుట

రావణుఁ డిట్లనముండఁగను రాక్షసులను జనస్థానమునకుఁ బంపి, మూఁఘుఁ డగుటవలనఁ దనకార్యకుంతటికో నెఱవేరెనని తలఁచెను. అంత రక్కసుల దొరయగు రావణుఁడు మరుని యస్త్రులచే నాఁటఁబడి, సీతను జూడఁగోరి, చక్కని యంతిపురము సొచ్చి రాక్షసస్త్రీల నడుమ వగపాలై యున్న సీతనుజూచెను. కండ్లనిండ నీరువెట్టికొని, దీనురాలయి, వగ పనుబరువుచే నొచ్చియున్నదియు, తుపాను వీచుటచే నల్లకల్లోలమై కడలియందు మునిఁగిపోవుచున్న నావ వైవడియు, జింకలగుంపునుండి తప్పిపోయి, వేఁపుల గుమిచేఁ జుట్టఁబడియుండు నాఁడుజింకచందమునను దుఃఖముచే మయిమఱచి స్వాధీనత తప్పియున్నదియు, తలనంచుకొని కన్నీరు విడుచుచున్నదియునైన సీతను రావణుఁడు సమీపించి, యామె కిష్టములేక వలదని చెప్పుచున్నను వినక యామెను బలాత్కారముతోఁ దీసికొని యనేకములగు మేడలతోను, రాజగృహములతోను నొప్పు నదియు, పెక్కువేల జనరాండ్రు గలదియు, పెంపుమ పక్షులతోఁ గూడి నదియు, స్ఫటికములు, వజ్రములు, వైడూర్యములు మున్నగు నవరత్నములుచెక్కిన దంతపుని, బంగారువి, వెండివియుఁ జూడ నింపయి యుండునవియునైన స్తంభములతోఁ గూడినదియు నగు తన గృహమును జూపెను. గొప్ప భేరీవాద్యమువలెనెక్కు సముయమున మ్రోఁగునదియు, బంగారుమయమయిన వెలుపలిఁగిలి గలదియునైన చిత్రములగు స్వర్ణసోపానములవరుసను సీతనుగూడఁ దీసికొని యొక్కెను. ఆ మెట్ల

వరుసయందున్న దంతపుని, వెండివియునైన కిటికీలను, మేడలవరుసల యందున్న పసిఁడికిటికీలను సీతకుఁజూపెను. మఱియుఁ దననగరున నన్ని దెసల వింతవింతలైయుండు నన్ని భూభాగములంజూచి, యచ్చటఁ బలుతెగల వృక్షములతోఁ గూడిన నడబావులను, తామరకొలఁకులను జూపించెను. సీత మాత్రము రావణుఁడు తనగృహమున నెన్నివేఁడుకలను జూపినను, తలవంచుకొని వానిని గన్నెత్తియైనను జూడక వగచుచునే యుండెను.

ఈ తెఱఁగునఁ బాపాత్ముఁడగు రావణుఁడు తన మేటి గృహము నెల్లఁ జూపించి, సీత కాశగలిగింపఁగోరి యిట్లనియెను. "ఓ సీతా! నాకడ ముప్పదిరెండుకోట్లకడిఁది మగలగు రక్కసు లున్నారు. ముదుసలులు బాలురనుగాక దక్కినవారి కొక్కొక్కరికి వేయిమంది పనివాండ్రున్నారు. నేను వారికెల్లఁ బ్రభువను. ఓ సీతా! నా కుండు రాజ్యమెల్లను, నా ప్రాణములను నీ కప్పగించెదను. నీవు నాకుఁ బ్రాణములకంటె మిన్నయైనదానవు. ప్రియురాలగు ఓ సీతా! నీవు నాకుభార్యవగుదువేని, ఈ యంతఃపురమున నున్న వేలకొలఁదిగనుండు నా ప్రియురాండ్ర కందఱికి యజమానురాలవైయుందువు. ఓ సీతా! వేఱు యోచన చేయకుము. నా హిత వాక్యము వినుము. మదనుని బాణములం దపించుచున్న నన్ననుగ్రహింపుము. నీ వెవరికి వెఱవఁ బనిలేదు. ఈ లంకాపురము నూఱుయోజనములవెడల్పుగలదై, సముద్రమునడుమ నున్నది. ఇంద్రునితోఁగూడిన సురలును, నసురులును, ఈలంకను జొఱఁ జాలరు. ఓ సీతా! పరాక్రమున నాకు సాటియగువాఁడు స్వర్గాది లోకములలో దేవతలయందుఁగాని, యక్షులయందుఁగాని, గంధర్వుల యందుఁగాని, పక్షులయందుఁగాని, యొక్కఁడును లేఁడు. రాజ్యముఁ గోల్పోయి, దేవురించుచు నడవికివచ్చి తపస్సుచేయుచుండువాఁడును, పరాక్రమహీనుఁడును, నల్పాయుష్కుఁడునైన రాముని మీఁది మక్కువ వీడుము. అతనివలన నీకేమి సౌఖ్యముగలదు? నీవు నా పట్టపుదేవి పదవియం దభిషిక్తురాలవుకమ్ము. నేను నీకుఁ దగినవాఁడను. యౌవనము శాశ్వతమయినదికాదు. నాతో రమింపుము. రాముని మఱచి నన్ను వలఁపుము. లంకకు రావలెనని మనస్సునైనఁ దలఁప నతనికిశక్తిలేదు. ఆకాశ

మునఁ గడువడిగ వీఁచెడు గాలినిగట్టుట సాధ్యముకాదు. చక్కఁగా నెఱియుచున్న యగ్నియొక్కయుంటను బట్టుట యసాధ్యము. నాచేతిలోఁ జిక్కియున్న నిన్నుఁ గొనిపోవఁగల పరాక్రమవంతుఁడు మూఁడులోకములను గానరాఁడు. నీ వీలంకయందుండి యీగొప్పరాజ్యమును బాలింపుము. నావంటిరాక్షసులు, దేవతలు, చరాచరములగు జీవకోటులు నీచెప్పుచేఁతలలోనుందురు. నీవు పట్టాభిషిక్తురాలవై మోదముతో నాతోఁ రమియింపుము. తొంటిబాములన నీ వొనర్చిన దుష్కృతమునకు ఫలముగా నింతకాలము వనవాసఖేద మనుభవించితివి. నీ పురాకృత సుకృతమునకు ఫలముగా నిచ్చట సౌఖ్యముల ననుభవింపుము. ఓ మైథిలీ! ఇచ్చట మేటివాసనగల నానావిధములగు పూలదండలును, శ్రేష్ఠములగు భూషణములు నున్నవి. వీనిని ధరించి, నాతోఁగూడి సకలసుఖములం దేలుము. ఓసి చక్కని పిఱుఁదులదానా! సూర్యుని మాడ్కిఁ దేజరిల్లు నా యన్నయగు కుబేరునిదగు విమానమును నే నతనిని మదీయ భుజబలముచే జయించి తెచ్చితిని. ఓ సీతా! సొగసైన యీ విమానోత్తమమున నాతోఁ గూర్చుండి, కోరినచోటికిఁ బోవుచుఁ గోరెడి సౌఖ్యమనుభవింపుము. సొగసుమోముదానా! ఇంపగు చూడ్కిగలదియు, తామరపువ్వును బోలినదియునైన నీ తేట మోము వ్యసనముచే వాడి, కన్నీటితోఁగూడి మిక్కిలి ప్రకాశము లేకయున్నది."

అని యిట్లు రావణుఁడు పలుకఁగా, పతివ్రతయైన సీతాదేవి, చంద్రునిఁబోలు తన మోమును పైఁటకొంగుతోఁ గప్పి పెట్టికొని, కన్నీళ్ళు విడిచినదాయెను. ఇవ్విధమున వగలపాలై, ధైర్యము విడిచి రామునే చింతించుచుండు సీతను జూచి, చెడ్డవాఁడును, రక్కసుల శ్రేఁడునైన రావణుఁడు మఱల నిట్లనియె. "ఓ వైదేహీ! నిష్ఫలములగు ధర్మహాని గలుగునేమోయని యోచింపఁ బనిలేదు. నీవిప్పుడు చేసికొనఁ బోవు లౌకిక సంబంధము ధర్మశాస్త్రవిహితమేకాని వేఱుకాదు. ఈ సుందరములగు నీ పాదములకుఁ బలుమాఱు నా పదితలలతో మ్రొక్కుచున్నాను. నాపై వెంటనే యనుగ్రహము నేయుము. నీకు నేను విధేయుఁడను; పనివాఁడను నయ్యెదను. మన్మథుని బాణములకుఁ దాళజాలక, యింత నీచపుఁ బలుకులఁ బలికితిని. రావణుఁ డింకనుము మీ

NEHRU MEMORIAL LIBRARY & P. V. NARASIMHA RAO Acc.

మగువకును జేయి మోడ్చి యిట్లనుఁగఁడు." అని యిట్లు పంక్తికంధరుఁడు సీతతోఁ జెప్పి, మృత్యుపాశమునకు లోఁబడినవాఁడై, "నాదే యీ సీత" అని తలంచుచుండెను.

56-వ సర్గము.

రావణుఁడు సీత నశోకవనమున నుంచుట

రావణుఁ డిట్లు పలుకఁగా, వగపుచేఁ జిక్కియున్న సీతయు రావణునికి వెఱవక, పరపురుషులతో మాటాడుట పతివ్రతలకు యుక్తము గాదు గావునఁ దనకును రావణునకును నడుమ నొక కసవుపోఁచ ద్రుంచివైచి, యా రావణునితో నిట్లనియె; "ధర్మమునకుఁ గట్టువంటి వాఁడును, నిలుకడగలవాఁడును, ఆడినమాట తప్పనివాఁడునైన దశరథుఁడను నొక రాజుండెను. ఆతనికొమరుఁడే రాముఁడు. ఆ రాముఁడు ధర్మాత్ముఁడు; ముల్లోకములందు వాసికెక్కినవాఁడు; నిడుదచేతుల వాఁడు; విఱివికన్నులవాఁడు; రాముఁడే నాకు భర్త. రాముఁడే నాకు దైవము. సింగపుమూఁపురమువంబోలు మూఁపురముగలవాఁడును, ఎక్కువకాంతిగలవాఁడునైన, యిక్ష్వాకువువంశమునఁ బుట్టినట్టి నా మగఁడు తనతమ్మునితోడంగూడి వచ్చి నీ యుసురు దీయఁగలఁడు. ఓ రావణా! అట్టి నా మగని యెదుట నీవు నన్ను బలాత్కారముతోఁ దెచ్చియుంచువేని, నీవు ఖరునిమాడ్కిఁ బోరఁ జంపఁబడి జనస్థానమునే పరుండియుందువు. ఓ రావణా! నీకడనుండు నీ రాక్షసులందఱు భయంకరమైన రూపముగలవారనియు, చేవకాండ్రనియుఁ జెప్పితివే, వీరందఱు గరుడనిజూచిన పాములమాడ్కి, రాముని జూచినంతఁ బరాక్రమము లేనివారగుదురు. గంగానదియందలి యలలు గట్టులను గోయునట్లు, ఆ రామునివింటిశరనుండి విడువఁబడ్డ పయిడిపనిగల వాసికెక్కిన యమ్ము లీ రాక్షసుల శరీరములను నుగ్గుసేయఁగలవు. రావణా! సురాసురులకు నీవు వధ్యుఁడవు గాకయుండవచ్చును. రామునితో నింత గొప్ప మచ్చరము పూనితివి. ఇఁక నీవు ప్రాణములతోనుండఁగా రాముని చేతులలోనుండి తప్పించుకొనఁజాలవు. ఇఁక మిగిలియున్న నీ జీవితకాలమును బలిమిగల రాముఁడే నాశము చేయు

వాఁడు. యూప స్తంభమునకుఁ గట్టిన పశువునకువలెనే నీ కింకఁ బ్రా ణ ములమీఁది యాస యుండుట నిరుపయోగము. ఓ రావణా! రాముఁడు గట్టలుకతోఁ గూడిన చూడ్కితో నిన్నుఁ జూచునేని, నీవు వెంబడే మలమలమాడి బన్నము నొందఁగలవు. రాముఁడు చంద్రుని నింగినుండి క్రిందఁద్రోయును; రూపుమాపఁజాలును; సముద్రము నింకింపఁజాలును. అట్టి రాముఁడు సీత నిచ్చటినుండి విడిపించుకొని పోవఁజాలఁడే? నీ వాయుస్సులేనివాఁడవు; కాంతి పోఁగొట్టుకొన్న వాఁడవు; బలిమి యుడిగినవాఁడవు; ఇంద్రియముల పాటవముఁ దప్పిన వాఁడవు. ఓరావణా! యిట్టి నీ వొనర్చిన కార్యమువలన లంకాపురము వైధవ్యము నొందఁగలదు. ఓ రావణా! నీవు పెనిమిటికిఁడనుండి నన్నెడఁ బాపితివి గావున, నీవు మేలుఁ బొందఁజాలవు. మహాతేజుఁడు, దైవ బలము గలవాఁడు, భీతిలేనివాఁడునైన నా మగఁడు మగఁటిమిఁ బూని జనసంచారము లేని వనమున వెఱపుమాని యున్నవాఁడు. ఆతఁడు పోరునకు వచ్చి, నీపై వాఁడియమ్ములు నేసి, నీ యంగములం దుండు మద బల శౌర్య గర్వములను దొలఁగింపఁగలఁడు. జంతువులకుఁ గీడు మూఁడునప్పుడు, వారు కాలప్రేరితులై మంచి చెడ్డల నరయఁజాలరు. రాక్షసాధమా! నీవు నన్నెప్పు డవమానించితివో, యప్పుడే నీకును, నీ రాక్షసులకును, నీ యంతఃపురాంగనలకును జేటు వాటిల్లెను. యాగ శాలయొక్క వడుమ నుండునదియు, స్రుక్స్రువాద్యోపకరణములతోఁ గూడినదియు, బ్రాహ్మణుల వేదఘోషములచేఁ బావనమునైన యజ్ఞవేదిని జండాలుఁడు కాలితోఁ ద్రొక్క సాధ్యముకానియట్లు, రాక్షసాధమా! ధర్మనిరతుఁడయిన రాముని యొక్క ధర్మపత్ని నగు పతివ్రతనైన నన్నుఁ దాఁకుటకుఁ బాపాత్ముఁడవయిన నీకెంతమాత్రము సాధ్యముగాదు. తామర పువ్వులనడుమ రాయంచతోఁ గూడి యెల్లప్పుడు కేళి సల్పుచున్న యొక యాఁడురాయంచ కసవుగాదములలోనుండు నీరుకాకినిఁ దలయెత్తియైనఁ జూచునే? నీవు తాఁకిన మాత్రముననే స్మృతిఁదప్పిన యీ నా శరీర మును గట్టనైనను గట్టుము; తిననైనను దినుము. ఓరీ రక్కసుఁడా! యీ శరీరమువిమోఁడఁగాని, ప్రాణములవిమోఁదఁగాని యాశ లేదు. సీత ?

చెడ్డది యను లోకనిందను నేను సైరింపఁజాలను." అని సీత రావణునిఁ గూర్చి పరుషముగాఁబలికి యూరకే నొక్కమాటనేనిఁ బలుకదాయెను.

వినువారలకు గగ్గుర్వా టొదవించు సీతయొక్క సైరింపరాని మాటలు విని, రావణుఁడు సీత కులుకుపుట్టించు మాటల నిట్లనెను. "ఓ భామినీ! నామాట వినుము. నీ కిదిమొదలు పండ్రెండు నెలలు గడువొసఁగితిని. అందమయిన నగవు గలదానా! యీ గడువులోపల నీవు నన్నుఁ బ్రియునిగాఁ గోరవేని, నిన్నావల వంటవారు సద్దికూటికై ముక్కలు ముక్కలుగాఁ గోసి వండుదురు" అని శత్రుసంహారియగు రావణుఁడు సీతతో పలికి, కట్టలుక గదుర రాక్షసకాంతలం జూచి, యిట్లనియెఁ: "నంజుడుదిండులును, నల్లగ్రావ్వుడులును, వెఱపుచూపరులు నైన వికారరూపముగల యీ రక్కసులారా! మీ రీ సీతయొక్క పొంగు నార్పుఁడు." అని చెప్పఁగా, ఘోరరూపలగు రాక్షసకాంత లందఱు చేతులు జోడించికొని, యీ సీతను జుట్టుముట్టిరి.

అంత వెఱపు పుట్టించు చూడ్కిగల రావణుఁడు పుడమి గడగడ లాడి బ్రద్దలగునట్లు కాలితోఁ దట్టుచు, నా రాక్షసకాంతలనుజూచి, "మీ రీ సీత నశోకవనమునకుఁ గొనిపొండు. అచ్చట మీ రీ సీతను గాచియుండి, నయ భయములుసూపి, యడవియాఁడేనుఁగును వశపఱచు కైవడి దీనిని వశపఱపుఁడు" అని యానతీయఁగా, నా రక్కసిచాన లందఱు రావణునియానతి వడసి యెల్లప్పుడు నన్నిపండ్లతో నిండినదియు, పలుతెఱఁగులపుష్పములతో నుండునదియు, నెడతెగని మదముతోఁ గూడిన పక్షులచే శోభిల్లునదియునైన యశోకవనమున కా సీతను దోడ్కొనిపోయిరి. ఆ సీతయు రాక్షసుల వశము నొంది, వెతలఁ గుందుచున్నదై, యాఁడుపులుల నడుమఁ జిక్కిన లేడికైవడి తీరని వ్యసనమున మునిఁగి, త్రాటఁ గట్టిన బిఱికిలేడి చందమున నింపు దక్కయుండెను. అంతియకాక, వికృతంపు మోరలును గన్నులునుగల యా రక్కసిచెలువలు పలుతెఱఁగుల బెదరింపఁగా, సీత వారి బెదరులకుఁ జాలఁ గుంది, తన పతియు దైవమునైన రామునే తలంచుచు, వెఱపు నను వంతయందును నలిగి, మయిమఱపు నొందినదాయెను.

57-వ స ర్గ ము.

రాముఁడు మారీచుని వధించి మఱలి లక్ష్మణుం గాంచుట

సీతసంగతి లంకయం దిట్లుండఁగా, దండకారణ్యమున రాముఁడు మెకమురూపుతోఁ దిరుగువాఁడును, ఇచ్చకెక్కిన రూపు దాల్చువాఁడునునైన మారీచునిఁ జంపి, వేగిరముగాఁ దన యాశ్రమమునకుఁ 11
దఱలెను. అట్లు రాముఁడు సీతను జూచుటకై తత్తరపడుచు నేతెంచుచుండఁగా, నతనికి వెనుకప్రక్క నొక్క నక్క వెఱపుపుట్టించు కూఁత కూసెను. రాముఁడు గగ్గురుపాటొందవించు నా నక్క కూఁతను విని, దానికూఁతయొక్క ఫలము నెఱిఁగినవాఁడగుటచేఁ గడు వెఱపు నొంది, యిట్లని చింతింపఁ దొడఁగెను. "నా వెనుకప్రక్క నక్క కూయుచున్నది. ఇయ్యది యశుభము. సీత రాక్షసులచేఁ దినఁబడక నేమముతో నుండునా? మృగరూపము దాల్చిన మారీచుఁడు నావలెనే "హా! లక్ష్మణా! అక్కటా! సీతా!" యని యఱవఁగా, లక్ష్మణుఁ డా యఱపు విని, సీతను విడిచి, యా సీత పంపఁగా నాకడకు వచ్చియుండ వచ్చును. రాక్షసులందఱు గుమిగూడి సీతపథము చేయఁగోరిరి. దీనికి సందియము లేదు. ఈకార్యము నిమిత్తమే మారీచుఁడు పయిఁడిజింకయై నన్నాశ్రమమునుండి చాలదూరమునకుఁ గొనిపోయెను. ఇతఁడు మృగముగాదని యెంచి నేను బాణము నేయఁగా, నా బాణముచేఁ గొట్టఁబడి, యూరక చావక "అక్కటా! లక్ష్మణా! చచ్చితి"నని నా గొంతువంటి గొంతుతోఁ గూసెను. మహావనమున నొంటిగానున్న లక్ష్మణుఁడును సీతయు నేమముతో నుందురా? జనస్థానయుద్ధమునకుఁగానే, రాక్షసులతోఁ బగ తెచ్చుకొంటిని. నాకుఁ బెక్కుదారుణములగు నపశకునములు గన్పట్టుచున్నవి" అని యిత్తెఱఁగున రాముఁడు వఱిఁడు 12
నఱుపునకును, మారీచుఁడు మృగరూపమెత్తి తన్నుఁ జాల దవ్వునకుఁ గొనిపోవుటకును, ఆతఁడు తనవలెఁ గూఁత వెట్టుటకును పలుతెఱఁగులఁ జింతించుచు జనస్థానమునకు వచ్చుచుండెను.

దీనమైనమనస్సుగల మృగములును, పక్షులును దైన్యముతోఁ గూడియున్న రామునికి నప్రదక్షిణము గావించి, మిక్కిలి భయంకరముగా నార్చిన వాయెను. రాముఁడును నా యవశకునములను జూచి,

కడు వేగిరముగా నడచుచు, సీతాలక్ష్మణులనే తలపోయుచు, జనస్థాన మందలి తన యాశ్రమమునకు వచ్చుచుండెను. అట్లు వచ్చుచుఁ దన యెదుట విన్నఁబాటుతో వచ్చుచున్న లక్ష్మణుం జూచెను. అంత దిగులు పడి వగలం గుందుచున్న లక్ష్మణుఁడు తనవలెఁ గుందుచున్న రాముని చేరువకు వచ్చెను. అప్పుడు పెద్దవాఁడగు రాముఁడు రాక్షసులుండ్రెడి నిర్జనవనమున సీతను వదలి వచ్చిన లక్ష్మణుఁ బెక్కు తెఱఁగుల దూఱఁ గోరి, లక్ష్మణుని కుడిచేయి పట్టుకొని, మధురముగను దుఃఖకరముగను నుండు పరుసని మాటల నిట్లు చెప్పెను. "లక్ష్మణా! నీ వొంటరిగా సీతను విడిచి, యిక్కడికి వచ్చితివే. ఇది యెంత యకార్యము. ఈ యరణ్యమున సీత యొంటరిగా నుండఁజాలునే? మన కిది క్షేమంకరమగునే. నాకుఁ జెడుశకునములే పెక్కుగా నగుచున్నవి. కావున జనస్థానవాసులగు రాక్షసులు సీతను జంపియైన నుందురు. తినియైన నుందురు. పురుషోత్తముఁడవయిన యో లక్ష్మణా! జనకరాజ పుత్రియగు సీత ప్రాణములతో నుండఁగా మనము చూడఁగలమే! ఈ మృగసంఘములును, నక్కలును భయంకరముగాఁ గూయుచున్నవి. పక్షులును వెలుతురుగల దిక్కునకుఁ జేరి, భీకరముగాఁ గూయుచున్నవి. బలిమికాఁడా! రాచకొమరితయగు సీత నేమముతో నుండునే? ఈ మృగరూపుఁడగు రాక్షసుఁడు నన్ను వంచించి, కడు దవ్వునకుఁ బోయి, కడు ప్రయాసముచేఁ గొట్టఁబడి, మృతినొందుచు రాక్షసుఁ డయ్యెను. లక్ష్మణా! నామనస్సు సంతసముఁ దక్కియున్నది. నా యెడమకన్నదురుచున్నది. లక్ష్మణా! సీతను రాక్షసు లపహరించిరో, లేక తినిరో, లేక నడిదారియందుఁ గొనిపోవుచున్నారో. ఇది నిస్సంశయము. అని లక్ష్మణు నడిగినవాఁ డయ్యెను.

58-వ సర్గము.

రాముఁడు లక్ష్మణుని సీత వృత్తాంతం బడుగుట

ధర్మాత్ముఁడయిన దశరథపుత్రుఁడగు రాముఁడు నిర్జనమగు కాటి డవియందు సీతను విడిచివచ్చిన లక్ష్మణుంజూచి యిట్లనియె. "ఓ లక్ష్మణా! దండకారణ్యమునకు వెడలిన న న్నే సీత వెంబడించి వచ్చినదో, నీ విప్పు డా సీతను విడిచివచ్చితివే? సీత యెక్కడనున్నది? రాజ్యమును గొల్పోయి దీనుఁడనయి యడవులకుఁ దరలిన న న్నే సీత వెంబడించి నా

యిడుములందు నాకుఁ దోడ్పడుచుండినదో సన్నని నడుముగల యా సీత యెక్కడ నున్నది? వీరుఁడా! ఏ సీతను బాసి యొక్క ముహూర్త మైనను జీవింప నుత్సహింపనో యట్టి ప్రాణములకు బాసటయయిన దేవాంగనంబోలు సీత యెచ్చట నున్నది? బంగరువన్నెగల యా జనక పుత్రియగు సీతను బాసి యింద్రపదవినైనను గోరను; సామ్రాజ్యపదవి నైనను గోరను. ఓ నాయనా! నాకుఁ బ్రాణములకంటె మిన్నయైన సీత బ్రతికియున్నదా? నా వనవాసము వ్యర్థముగాదుగదా! ఓ సౌమిత్రీ! నేను సీత నెడఁబాసి యుండఁజాలక యరణ్యమున మృతినొందఁగా, నీవు మఱలి యయోధ్యకేఁగఁగా, కైకేయి నిన్నుఁ గని, సఫలమనో రథయై సౌఖ్యముతో నుండఁగలదా? కొడుకుగలదై రాజ్యమును బొంది, కోరిన కోరిక సాధించుటచే ధన్యురాలై యున్న కైకేయికిఁ గొడుకును దారపోసికొన్నదై దుఃఖపడుచునుండు నా తల్లి యడఁకు వతోఁ గొల్వుకత్తెగాకుండునా? లక్ష్మణా! వై దేహి బ్రతికియున్నదేని, నే నాశ్రమమునకు మఱలివచ్చిదనుఁ, చక్కని నడవడిగల యాసీత మృతి నొందియుండునేని, నేను ప్రాణములను దొఱఁగెదను. మఱలివచ్చిన ననుఁ జూచి సీత చిఱునగవు మోమువోఁ బలుకరింపదేని, నేను నశింపఁ గలను. లక్ష్మణా! సీత బ్రతికియున్నదా లేదా? చెప్పుము. నీ వేమఱు పాటుతో నుండఁగా, దీనురాలగు సీతను రక్కసులు భక్షించిరో? మెత్తనిదియు, పసిదియు, నెల్లప్పుడు దుఃఖ మన నెట్టిదో యెఱుఁగనిదియునైన సీత ననన్నెడఁబాసి, మనమునఁ గల గుండువడి కుందుచున్నదేమో? ఇది నిక్కముగా నుండవచ్చును. ఆ కుచ్చితుఁడగు చెడుమడిగలవాఁడయిన రక్కసుఁడు మృతినొందు నప్పు డూరక చావక "లక్ష్మణా" యని యార్చెను. ఆ సద్దు వినఁ గానే నీకును వెఱపు పుట్టియుండనోపును. లేక, సీతయే నా స్వరముఁ బోలు స్వరము విన్నదై, దిగులుపడి నిన్నంపఁగా, నీవు నన్నుఁ జూడ వచ్చితివని తలఁచెదను. వీది యెట్లున్నను, నీవు వనమున నొంటిగా సీతను విడిచివచ్చి గొప్ప చేటు దెచ్చితివి. ఎప్పుడు సందుదొరకునా యని కాచియుండు మోసకాండ్రగు రక్కసులు మనకుఁ గీ డొనర్ప సందు దొరకెను. మాంసభక్షులగు రాక్షసులందఱు ఖరునివధము మొదలుకొని

మనపైఁ గంటుగలిగియున్నారు గావునఁ గనికరము లేని యీ రక్కసులు తప్పక సీతను జంపి తినియుందురు. దీనికి సంశయము లేదు. శత్రు సూదనా! అక్కటా! నే నీ సీతావియోగ చింతాసముద్రమున నన్ని తెఱఁగుల మునిఁగితిని. ఇఁక నేనేమి సేయఁగలను? నా యదృష్టమింతియ కాఁబోలు!" అని యుత్తమాంగనయగు సీతను గూర్చియే తల పోయుచు, లక్ష్మణసమేతుఁడై వేగిరముగా జనస్థానమునకు వచ్చి నొచ్చిన రూపుగలవాఁడగు తమ్మునిదూఱుచు దప్పితోను, నాఁకటితోను, బడలిక తోను గూడి నిట్టూర్పు నిగిడించుచు, వెదవులెండి, గొంతెండుకొని పోవుచుండఁగా, విన్నదనము మోమునఁ దోఁపఁ దన యాశ్రమ ప్రాంతము సొచ్చి, యది యుత్తదిగా నుండుటను జూచి, తన యాశ్ర మమునఁ జొచ్చి, యిచ్చట సీతం గానక, కొన్ని యాటపట్టులం జూచి యచ్చటను గానక, నేను తలఁచినట్లె యిది యాయె' నని మేన గగ్గు ర్పాటు పుట్టఁగాఁ గళవళపాటొందినవాఁ డయ్యెను.

59-వ సర్గము.

లక్ష్మణుఁడు తన రాకకుఁ గారణ మెఱిఁగించుట

అంతట రఘువంశమునకు సంతోషము గావించువాఁడయిన రాముఁ డాశ్రమమునుండి వచ్చినవాఁడును, వ్యసనపీడితుఁడునైన లక్ష్మణుఁ జూచి, యాశ్రమమునకుఁ బోవునంతలోపల వెండియు నిట్లనియె. "ఓ లక్ష్మణా! నేను నిన్ను నమ్మి నిర్జనవనమున సీతను విడిచిరాఁగా, నీ వట్టి సీత నేల విడిచి యిచ్చటికి వచ్చితివి? లక్ష్మణా! నీ వన్ని యెఱిఁగి యున్నవాఁడవయ్యు, సీతను విడిచివచ్చుట చూడఁగా నేదియొ గొప్ప కీడు మూఁడినట్లు తోఁచుచున్నది. ఎడమకన్నును, ఎడమచేయియు మొమ్మును నదురుచున్నవి."

ఇట్లు రాముఁ డడుగఁగా, చక్కని లక్షణములుగల లక్ష్మణుండు మిక్కిలి యెక్కువ వగతోఁ గూడినవాఁడై, దుఃఖపడుచుండు రాముని జూచి యిట్లు బదులు చెప్పఁదొడఁగెను. "ఓ యన్నా! నేను స్వాయ ముగాఁ గావలెనని యా సీతను విడిచి రాలేదు. ఆ సీతయె యోర్వరాని మాటలాడి నన్నుఁ బురికొల్పఁగా నే నిచటికివచ్చితిని. తమ గొంతు చప్పుడువలెనే "హా లక్ష్మణా! హా సీతా! నన్నుఁ గాపాడుము" అని

యఱచిన యార్పు సీతచెవిం బడెను. ఆమె యా నొచ్చిన చప్పుడు విని, వెఱపుచేఁ దత్తరపడుచుఁ బో పొమ్మని నాతోఁ జెప్పెను. అట్లామె నన్నుఁ బొమ్ము పొమ్మని తొందఱపఱుపఁగా, నే నామె పలుకునిని, నేను నీయందు నమ్మికపుట్టించు మాటల నిట్లంటిని: "రామున కాపదగల్గించు వంతటి శూరుఁడగు రక్కసుఁ డొక్కరుఁడును లేఁడు. ఆ కూఁత యెవ్వఁడో రక్కసుఁడు కూసినది. అది రాముని గొంతుకాదు. నీ భ్రాంతి దమము. మఱియు ముల్లోకములను రక్షింపఁజాలినట్టి మాయన్న లోకాపవాదముఁ దెచ్చునదియు, ఆపదయందు స్త్రీనిగూర్చి "సీతా! కాపాడు" మనుటచే మిక్కిలి యగౌరవముఁ గలిగించునదియునైన యిట్టిమాట పలుకునే! ఓ మంగళకరురాలా! యేదియోకారణముబట్టి యొక్క రాక్షసుఁడు రాముని గొంతువంటి గొంతుతో "కాపాడు కాపాడుము" అనుమాటను జెప్పెను. "లక్ష్మణా! కాపాడుము" అనుటయుఁ గూడ నొక వింత ధ్వనితో వినఁబడినది. కావున నిది యొక్క రాక్షసుని కార్యముగాని నిజముగా రాముఁ డఱచినట్లు నాకుఁ దోఁపలేదు. నీవు సామాన్య స్త్రీవలె నిట్టి సందియము పెట్టుకొనకుము. నీవు విన్న బాటు నొందినది చాలును. వగమాని కుదుటఁ బడుము. రాముని రణమున గెల్వఁజాలినవాఁడు ముల్లోకములందును బుట్టినవాఁడు లేఁడు. ఇఁక మీఁదఁ బుట్టనుబోఁడు. దేవేంద్రుఁడు సకల దేవతలంగూడి యొత్తివచ్చినను రాముని గెల్వఁజాలఁడు" అని నేను సమాధానపఱుపఁగా, మనసునందు వివేచించు శక్తిలేనిదై, కన్నీరువిడుచుచు నోర్వరాని యా మాట చెప్పెను; "ఓ లక్ష్మణా! నీ వన్న రూపుమాసినచో నన్నుఁ బొందవచ్చునని నాయొడ మిగుల నాశపడినావు. ఇది చెఱుపుఁదెచ్చునది. నీవు నన్నెన్నటికిఁ బొందఁజాలవు. భరతుఁడును నీవును గలిసి యాలోచించి కొని, వానిమాటమీఁద నీవురాముని వెంబడించివచ్చితివి. అట్లుగాకున్న నీ ప్రకారము మొఱపెట్టుకొనుచున్న రామునికిఁ దోడునేయఁ బోకుండువే? లక్ష్మణా! నా నిమిత్తము కపటంపువేసము దాల్చివచ్చుచున్న శత్రువవు నీవు. రాముఁ డెప్పుడు లేకయుండునా యెప్పుడు మనకు సందు దొఱకునాయని యాలోచించుచుంటివి. కావుననే రామునికిఁ దోడ్పడఁ బోవకున్నావు." ఇట్లు సీత చెప్పఁగా, కోపముచేఁ బెదవులదుర, వేగిర

పాటుతోఁ గూడినవాఁడనై, యాశ్రమమునుండి వెడలివచ్చితిని. ఇదియ వాస్తవమైన సంగతి." తర్వాతఁ దమ చిత్తమని చెప్పి యూరకుండెను.

ఇట్లు లక్ష్మణుఁడు చెప్పిన సమాధానము విని, రాముఁడు వెతచేఁ గడుఁ గుందినవాఁడై, యిట్లనియె ఓ సాయసా! యేది యెట్లున్నను, నీవు సీతను విడిచి వచ్చినది సరిగాదు. అది గొప్పతప్పిదము. నేను రాక్షసులను సంహరించుటయందుఁ జాలినవాఁడనని యెఱిఁగియుండియు, సీత యాడిన నిష్ఠురంపు మాటల కిట్లు నీవు రాఁదగునే. సీత కోపముతోఁ జెప్పిన మాట విని వచ్చితి ననుచున్నాఁడవే! ఇది నాకెంతయు సమ్మతముగాఁ దోఁపలేదు. లక్ష్మణా! నీవు సీతయాడిన మాటల కోర్వలేక, కోపము నొంది, నా యానతిని మీఱితివి. ఇట్లు నీ వొనర్చుట గొప్ప తప్పు. మృగరూపముఁ దాల్చి నన్నాశ్రమమునుండి చాల దవ్వునకుఁ గొని పోయిన రాక్షసుఁడు, నేను వింటియందు జోడించి, వేడుకగా నేసిన బాణముచేఁ గొట్టఁబడినవాఁడై, మృగశరీరమువిడిచి బాహుపురులు తొడిగిన రాక్షసరూపము ధరియించెను. వాఁడు నాచే నేయఁబడ్డి బాణముచేఁ గొట్టఁబడి, నొచ్చిన గొంతు వెట్టి, కడుదవ్వునకు బాగుగ వినవచ్చు నీ పలుకు పలికి ప్రాణములఁ దొఱఁగెను. ఆ కడు వెఱపు పుట్టించు మాటను విని సీతను వదలి యిచ్చటి కేతెంచితివి. ఇది బాగున్నది!" యని రాముఁడు లక్ష్మణు నిందించెను.

60-వ సర్గము.

రాముఁడు సీతను వెదకుట

అవ్విధమున వేగిరముగా నాశ్రమమున కేతెంచుచున్న యా రామునికి నెడమ కంటికింది భాగ మదరెను; అడుగులు తడఁబడెను. మేన వణుకు పుట్టెను. అట్లు రాముఁడు తనకుఁ గలిగిన యపశకునములను దలఁచి, లక్ష్మణునిఁ బలుమారు 'సీతకు నేమమా'యని యడుగుచు, సీతను జూచుటయందలి మక్కువగలవాఁడై, త్వరపడుచు నేతెంచి, శూన్యమై యుండు నాశ్రమమును జూచి, కడు వెతచేఁ గుందినవాఁడయ్యెను. రఘు నందనుఁడు త్వరపాటుచే వెట్టివానికైవడి నెగిరిపడుచుఁ బర్ణశాల చుట్టుపట్టుల నచ్చటచ్చటఁ గలయంజూచి, పిదపఁ బర్ణశాలను డగ్గఱి హేమంతర్తువునందుఁ బాడుపడిన తామరతీవచందమున వెలుఁగులేక

యున్నదియు, వాడుపాటినపూవులును మృగపక్షులును గలదియు, వన దేవతల కాఁపుదల లేనిదియు, సొబగు దక్కి పాడుపడియున్నదియు, నచ్చటచ్చట విజీవిగా వెదచల్లఁబడిన దర్భలు, కృష్ణాజినములు, ఆసన ములు, చాపలుగలదియునైన తన యునికిపట్టగు పర్ణశాలను జూచి పలుమా ఱిటని చింతింపఁదొడఁగెను.

"లక్ష్మణా! సీత గనఁబడ లేదు. సీతను రాక్షసు లెత్తికొనిపోయిరో, సీతకాఁటుకానం జూచి గుండె లవిసి మృతినొందెనో, నష్టమయ్యెనో, రాక్షసులే మ్రింగిరో, రక్కసులకు వెఱచి, పొదలలో డాఁగియున్నదో, అడవిం దిరుగఁబోయినదో, పువ్వులు గోయఁబోయినదో, పండ్లు తేఁ బోయినదో, స్నానమునకై తామరకొలనికిఁ బోయినదో, నీటిని దెచ్చుట కేటికిఁ బోయెనో యని చెప్పుచు రాముండు ప్రయత్నముతో వెదకినను కానయందు సీతను గానఁ డయ్యెను. అంత రాముఁడు కన్నీ టిచే నెఱ్ఱిపాటిన కన్నులుగలవాఁడయి, చెట్టునుండి చెట్టునకును, గుట్టనుండి గుట్టకును, నదినుండి నదికిని బరుగెత్తుచు వెతచే వెఱ్ఱివాని కైవడిఁ గానఁబడుచుండెను. అట్లు రాముఁడు శోకసాగరమున మునిఁగిన వాఁడై వనమునందలి వృక్షములం జూచి యిట్లు విలపించెను: "ఓకదంబవృక్షమా! కదంబపుష్పములందుఁ బ్రీతిగల నా యనుఁగుఁజెలిని జూచితివా? చక్కని మోముగల సీతను నీ వెఱుఁగుదువేని చెప్పుము. ఓ బిల్వవృక్షమా! బిల్వఫలములంబోలు స్తనములుగలదియు, పచ్చని దువ్వలువగట్టినదియు, నున్నని చిగురుం బోలినదియునైన సీతను నీవు చూచియుందువేని చెప్పుము. ఓ అర్జునవృక్షమా! నీయందుఁ బ్రేముడి గలదగు జానకి బ్రతికియున్నదా లేదా చెప్పుము. ఈ కకుభవృక్షము పూవులు, చిగుళ్ళనుగలదై, పండ్లు కాయలతోఁగూడి వెలయుచున్నది. ఈ కకుభవృక్షముంబోలు తొడలుగల సీత నీ కకుభవృక్షము తప్పక యెఱిఁగియుండును. ఈ తిలక వృక్షరాజము తుమ్మెదలనాదములతోఁ గూడియున్నది కావున నీ తిలకవృక్షమునకుఁ దనయం దెక్కువ ప్రేమగల సీతసంగతి దెలిసియుండవచ్చును. విరహుల శోకమును బోఁగొట్టు నశోకవృక్షమా! మనమున వెతచేఁ గుందుచున్న నాకుఁ బ్రియు రాలిం జూపి, నన్ను నీ వేరుగలవానినిఁ జేయుము. (నీవేరు అశో

కము గనుక నన్ను నశోకుని (శోకము లేనివానిని) జేయుము) ఓ తాడి చెట్టా! మాగిన తాడిపండుంబోలు స్తనములుగలదగు సీతను జూచితివా? నీకు నాయెడఁ గరుణ గలదేనియా మగువ యొచ్చట నున్నది తెలుపుము. నేరెడు చెట్టా! నేరెడుపండువంటి మేని నునుపుగల ప్రియురాలగు సీతను జూచియుందువేని, నా కా సంగతి జంకుపడకుండఁ దెలుపుము. ఓకొండగోఁగు చెట్టా! ఆహా! నీ విప్పుడుచక్కనిపూవులచే మెఱయు చున్నావు కొండగోఁగు పుష్పములం దెక్కువమక్కువగల పతివ్రతయగు నాప్రియురాలయిన సీతను జూచియుందువేని, నాకా సంగతిఁ జెప్పుము" అని యిత్తెఱఁగున రాముఁడు కంటికిఁ గనఁబడిన మామిడి, ప్రబ్బలి, పనస, గోరింట, చంద్ర, దానిమ్మ, అనాస మొదలగు చెట్లను, మల్లె, మొల్ల, జాజి, సంపంగి, మొదలగు తీఁగెలను "నీవు చూచితివా! నీవు చూచితివా" యని యడుగుచు వెళ్ళివానికైవడి వనమునఁ దిరుగు చుండెను.

రాముఁ డిట్లు సీతనుగూర్చి చెట్ల నడిగి, ఆవల నవ్వనమున నున్న మృగపక్షులంగూర్చి యడుగఁదొడఁగెను; " ఓ జింకా! జింకకన్నులం బోలు కన్నులుగల సీతను జూచితివా? లేడివలెఁ జూచునది గావున లేళ్ళగుంపులతోఁ గూడియుండవచ్చును. ఓగజమా! నీతొండముంబోలు తొడలుగలసీతనునీవు చూచియుందువేని, నాకుఁ జెప్పుము.ఓగజేంద్రమా! నీ కా సీతనుగూర్చి తెలిసియుండవచ్చునని తలఁచెదను. ఓ శార్దూలమా! చందురునిఁబోలు మోముగల సీతను జూచియుందువేని, నాకుఁ బ్రేమతోఁ జెప్పుము. నీవు భీతినొందవలదు." ఇట్లు మృగముల నడిగి, పిమ్మట సీత నెదుటఁజూచినట్లు భ్రమించి, "ఓ తమ్మికంటీ! నెచ్చెలీ! యేల దూరమునకుఁ బరుగెత్తుచున్నావు? చెట్లమఱుగుననుండి యేల నీవు నాతో మాటాడకున్నావు? ఉత్తమకాంతా! నిలునిలుము. నాపై నీకుఁ గరుణలేదే? నీ వెక్కువ వేళాకోళమునకుఁ బోవుదానవుగావే. అట్లుం డియు నీవేల నన్నుఁ బరికింపకున్నావు. మేలిమివన్నెగలదానా! నీ పచ్చని పట్టుచీరయొ నిన్నుఁ బట్టియిచ్చుచున్నది. నీవు పరుగిడుచున్నను, నాకంటికిఁ గనఁబడుచునే యున్నావు, నాయెడ నీకుఁ బ్రేమగలదేని నిలువుము" అని యిట్లు విలపించి, పిదప నిది భ్రమయొకాని సీత నిజముగాఁ గనఁబడ

లేదని యొఱిఁగినవాఁడై, "ఆచిఱునగవు మోమునగల సీత యిక్కడ లేనే లేదు. ఎవరో దుష్టు లా సీతను వధించిరి. ఇది నిక్కువము. అట్లు గాదేని, యిట్లు తల్లడపాటు నొందుచున్న నన్నుఁ జూచి సీత యుపే క్షించియుండునే? పొలసుదిండులగు రక్కసులందఱు గలిసి, నేను లేకుం డుటను గని, యంగము లెల్ల విఱిచి, పంచికొని తినియుందురు. దీనికి సంది యము లేదు. సన్నని పల్వరుసయు కెమ్మోవియు, చక్కని ముక్కును, పున్నమచందురుంబోలు మోమునంగలదియు, బంగారు కమ్మలు దాల్చి నదియు నయిన సీతను రాక్షసులు నులుముఁగా, నా సీత మోమున మెఱుఁగు లేనిదై యుండవచ్చును. సంపంగిపూవు వన్నెగలదియు, కంఠ హారముచేఁ గైసేయఁబడినదియునైన యా సీతయొక్క మెడను ఆపె వలదని యేడ్చుచున్నను, రాక్షసులు నులిమి స్రుంగివేసియుందురు. నిజము. ఆసీతయొక్క ముద్దుటుంగరములు, కడియములు, వంకీలు మొద లగు తొడవులుగల చివురుటాకులంబోలు తనచేతుల గొనలను విదిలించు చుండఁగాఁ, గ్రూరులగు రక్కసులు వానిని బట్టితినియుందురు. నిక్కము. రాక్షసులు దినునిమి త్తమే నేను సీతను విడిచిపోతినో? పెక్కుచుట్టాలు గల దైన మగువనయినను దారి నడచునప్పుడు తోడివారి నెడఁబాసిన దానిని మృగములు దినుచందమున రక్కసులు సీతను దినియుందురు. అక్కటా! నిడుదచేతులుగల యో లక్ష్మణా! నా ప్రియురాలి నెక్కడ నైనఁ జూచితివే! అక్కటా! చెలీ! ఓ సీతా! నీ వెచ్చటనున్నావు." అని యివ్విధమున రాముఁడు పలవించుచు నొక వనముననుండి మఱొక్క వనమునకుఁ బోవుచు నొక్కొకచోట సీతను జూచినట్లు భ్రమించి యచ్చటికిఁ బరుగెత్తుచు, మోహముచేఁ జెట్లు, మృగములు మున్నగువానిని సీతను గూర్చి యడుగుచుఁ దిరుగుచుండెను. ఇ ట్లెఱిఁగిన రాముఁడు సీతను వెదకుటయందుఁ బట్టుదలగలవాఁడై, వెట్టివానికై వడి, వనములు, నదులు, పర్వతములు, సెలయేళ్లు, కాన నములు దిరుగుచుండెను. అట్లు రాముఁడు గొప్ప వనమున నంతట వెదకియు, సీతను గానమిచే, మఱిలఁ దన కాంతాన్వేషణమున నెక్కువ వూనికగలవాఁ డయ్యెను.

61-వ సర్గము.

రాముఁడు సీతను గానక విలపించుట

దశరథుని పుత్రుఁడగు రాముఁడు జనశూన్యమైన యాశ్రమమును, వీకత మయియుండు పర్ణశాలను పాడయిన యాసనములను జూచి, సీత నచ్చటఁ గానక యంతటఁ గలయంజూచి, యటిచి తన యిరు గేలును మోఁదికిఁ బెట్టికొని, యాగ్రుచు లక్ష్మణునిఁ జూచి యిట్లనియెఁ. "లక్ష్మణా! సీత యెక్కడ? ఎచ్చటికిఁ బోయినది? ఎవఁడైన నెత్తికొని పోయెనో! లేక నాప్రియురాలి నెవఁడైనఁ దినెనో! ఓ సీతా! చెట్టుమటు గున డాఁగి నన్ను వేళాకోళము పట్టింపఁగోరుచున్నావటే. ఈ నవ్వు టాలపని యిఁకఁ జాలింపుము. కడు నొచ్చియుండు నన్నింకను నొప్పింపక నాకడఁ జేరుము. ఓ సీతా! నీయెడఁ బ్రేముడిగల యే జింకపిల్లలతో నీ వాడుకొనుచుందువో, ఆయవి యిప్పుడు నిన్నుఁబాసి, కండ్లనిండఁ గన్నీ రుంచికొన, వగచుచున్నవి. ఓ లక్ష్మణా! నేను సీతనుబాసి ప్రాణ ములతోడ నుండఁజాలను. సీతను గానని గొప్ప వ్యసనమును దాళఁ జాలక నేను మృతినొంది పరలోకమున కేగఁగా, నచ్చట నాతండ్రి దశ రథమహారాజు నన్నుఁ జూచి, "రామా! నీకుఁ బదునాలుగేం డ్లరణ్య వాసము సేయ నానతీయఁగా, నీ వచ్చి పదునాలుగేండ్లు వనవాసము సేసెదనని పలికి, యా గడువు తీరకమునుపే, నాకడకు వచ్చితివిగదా! నీవు స్వేచ్ఛకుఁ దగినట్లు నడుచుకొనువాఁడవు; చెడ్డవాఁడవు; బొంకు లాడువాఁడవు. ఛీ,ఛీ!" యని నన్ను నిందించును. చక్కని పిఱుఁదులును, సన్నని నడుమును గల దానవగు ఓ సీతా! కీర్తి చెడ్డ మానవుని విడుచు చందమునఁ బరవశుఁడనై, దుఃఖాగ్ని చేమలమలమాడుచు, ధైర్యమేది, విఫలుఁనోరథుఁడనైయున్న నన్ను నీ యరణ్యమున విడిచి, యెచ్చటికిఁ బోవుచున్నావు? నిన్నెడఁబాసి యుండఁజాలను. ప్రాణముల విడిచెదను." ఇట్లని రాముఁడు సీతను జూడవలెనన్న మక్కువతో వెతలచేఁ గుందుచు విలపించినను, సీతను మాత్రము గానఁడయ్యెను.

దశరథతనూభవుఁడు సీతను గానక, యడుసున దిగఁబడినయేనుఁగు కైవడి మిక్కిలి యవస్థపడుచుండుటను లక్ష్మణుఁడు చూచి, యా రాము నికి దుఃఖోపశమనము సేయఁగోరి, యతనితో నిట్లనియెఁ: "నిడుదచేతుల

వాఁడివగఁడా! దిగులుపడకుము. నాతోఁగూడ సీతను వెదకఁ బ్రయత్నపడుము. ఈ యరణ్యము పెక్కు గపులతో వెలయుచున్నది. ఇవ్వానమున నే మూలలో మనము వెదకితిమి? అడవియందుఁ దిరుగుటకును, నీటియందు మునుఁగుటకును సీతకుఁ జాల యపేక్ష గలదు. కావున సీత యడవియందు సంచారము చేయనైనఁ బోయి యుండవచ్చును. పుష్పించిన తామరకొలనియందుఁ జలకమాడనైనఁ బోయి యుండవచ్చును. జలజంతువులతోఁ గూడి యింపుగులుకు చెట్టులచే నలరారుచుండు నదికి స్నానార్థమై పోయి యుండవచ్చును. పురుషశ్రేష్ఠా, సీత కొంతసేపు మనల నుడుకాడింపఁగోరియో, జడిపింపఁగోరియో యడవియం దెచ్చటనైన డాగియుండవచ్చును. కాంతిమంతుఁడా! మన మిరువురము తడవు సేయక యా సీతను వెదకుటకుఁ బ్రయత్నింతము. కాకుత్థ్సా! నీవు కావలయునందువేని, యాజానకిని వనమునం దెల్లచోటులను వెదకెదము. నీవు వనమున విచారము మానుము.

అని యిట్లు లక్ష్మణుఁడు ప్రేమతోఁ బలికి యూఱడింపఁగా, రాముఁడు లక్ష్మణునిఁ దోడు గైకొని, సీతను వెదక నారంభించెను. అట్లు రాముఁడును లక్ష్మణుఁడును కానలు కొండలు, నదులు, కొలఁకులు, ఆ పర్వతమునందలి చరియలు, గవులు, కోనలు, కొమ్ములు మొదలగు తావులందు వెదకియు సీతను గాంచరైరి. రాముఁడు పర్వతమంతయు నారసియు, సీతంగానక "లక్ష్మణా! యరణమెల్ల వెదకితిమి. మంగళకరురాలగు సీతను గానరైతిని" అని లక్ష్మణునితో ననఁగా, వెండియు దండకారణ్యమెల్లఁ దిరుగుచు, లక్ష్మణుఁడు విచారము నొందుచు, తేజస్సుచే వెలుఁగుచున్న యన్నను గూర్చి యిట్లనియె. "వివేకవంతుఁడా! విష్ణువు బలిచక్రవర్తినణఁగఁద్రొక్కి యీ భువనమునిబడసినట్లు, జనకరాజపుత్రికయగు సీతను బొందఁగలవు."

అని యిట్లు లక్ష్మణుఁడు మంచిమనస్సుతోఁబల్కినను, రాముఁడు వ్యసనముచే ససిచెడిన మనస్సుగలవాఁడై, లక్ష్మణునిం జూచి, "మహా సమర్థుఁడా! వనమెల్ల బాగుగా వెదకితిమి. పూఁచిన తామర పువ్వులుగల తామరకొలఁకులనెల్ల వెదకితిమి. ఈ పర్వతమునందలి గుహలయందును, సెలయేళ్ళయందును వెదకితిమి. ప్రాణములకన్న మిన్నయైన

సీతను గానకయున్నాను" అని యిట్లు పలికి, సీతను గోలుపోయిన వ్యస నముచేఁ జిక్కినవాఁడై, ధైర్యమువిడిచి, చింతతోఁగూడి క్షణకాలము స్మృతిఁ దప్పియుండెను. అట్లు రాముఁడు వెతయను నిప్పునెగకు మూడి, చిక్కిన యంగములు గలవాఁడై, తెలివిదప్పి, చెయువులుమాని, యాతురుఁడై, దీనుఁడగుచు నొక్కచోటఁ గూర్చుండి, కన్నీరు విడు చుచు, పెద్దయుంబ్రొద్దు వేఁడినిట్టూర్పు నిగిడించి, "అయ్యో! చెలీ! యెందుఁ బోయితి" వని డగ్గుత్తికతో నార్చెను. అంతట ధర్మజ్ఞుఁడయిన రామునననుఁగుఁదమ్ముఁడగు లక్ష్మణుఁడు చేతులు జోడించి, పలుతెఱఁగుల రాముని నూఱడించెను. లక్ష్మణుఁ డట్లూరడింపుమాటలు పల్కఁజున్నను, రాముఁడు తన యనుఁగుఁజెలియగు సీతను మాటిమాటికి నార్చుచునే యుండెను.

62-వ సర్గము.

రాముఁడు సీతను గానక విలపించుట

ధర్మాత్ముఁడును, నిడుదచేతులవాఁడును, తమ్మికంటియున్నైన రాముఁడు మరుని తూపులచేఁ గొట్టువడిన మనస్సుగలవాఁడై, సీతను గానకయున్నను, మన్మథునిబారిం దవిలినవాఁ డగుటచే సీత నెదుటఁ జూచినట్లు భ్రమసి, విలాపముచేనైన డగ్గుత్తికతో నిట్లు సీత నుద్దేశించి, "ఓ చెలీ! నీవు పుష్పములందుఁ బ్రీతిగలదానవు గావున, నా శోకము వృద్ధియగునట్లు నీ వశోకవృక్షమునొక్క కొమ్మలమఱుఁగున నున్నావే. ఓ దేవీ! అరఁటికంబములంబోలు నీ తొడలను నరఁటికంబముల వెనుక మఱచికొన్నను, నా కవి కనఁబడుచునే యున్నవి. నీవు వానిని నాకుఁ గనఁబడకుండ దాఁచుకొనఁ జాలవు. ఓసీ తేఁటికంకరురాలా! నీవు హేళ నమునకై కొండగోఁగువనమునఁ దిరుగుచున్నావు. ఓ దేవీ! నీ పరి హాసము చాలింపుము. ఇది నాకు మిక్కిలి బాధ గలిగించుచున్నది. ఓ ప్రియురాలా! నేను బడలికతో నొచ్చుచుండఁగా, నిప్పుడా నీకు నాతోడి పరియాచకము? ఈ పరిహాసము బాగుగనుండలేదు. అంతియ కాక, ప్రియురాలా! నీవు పరియాచకముచేయు స్వభావముగలదానవని నే నెఱుఁగుదు. అయినను, తపోవనములందుఁ బరిహాసముచేయుట యుచితముగాదు. వెడఁదకన్నులదానా! రమ్ము. నీపర్ణశాల పాడుపడి

యున్నది" అని యిట్లు విలపించియు, సీతనుగానక, యిది మోహమేకాని నిజముగా సీత యిచ్చట లేదని యొఱిఁగినవాఁడై, లక్ష్మణుం జూచి యిట్లనియె:

"లక్ష్మణా! రాక్షసు లెవ్వరైన సీతను గొంపోయిరో, భక్షిం చిరో యుండవలెను. ఇది నిక్కువము. అట్లు గాకున్న నే నింత తహ తహపడుచున్నను సీత రాకయుండునే? సీత రాక్షసులచే మ్రింగఁబడి యుండునని యీ వనమునందలి మెకములెల్లఁ గన్నీరు విడుచుచుఁ దెల్పుచున్నట్లున్నవి. ఓ సుందరాంగీ! పతివ్రతా! నీ వెందుఁ బోయితివి. నీ నాశముచేఁ గై కేయియొక్క కోర్కి యీడేఱఁగలదు. సీతతోడ నయోధ్యనుండి వచ్చి, సీతను దారపోసికొని యుత్తదియగు నంతిపుర మున కెట్లు పోఁగలను? లోకులందఱు నన్నుఁ బరాక్రమములేనివాఁ డనియు, దయమాలినవాఁ డనియు నిందింతురుగదా! ఒకరందు రననేల? ఇప్పుడు సీతాపహరణముచే నా పిఱికిదనము బయటఁబడినదికాదా. నేను వనవాసము ముగించి యయోధ్యకు వచ్చినపిదప, జనకమహారాజు "సీత క్షేమముగా నున్నదా?" యని యడిగిన నేనేమి బదులు చెప్పఁగలను? నేను తలయెత్తి చూడనుగూడఁ జాలను. విదేహనృపాలుఁడు సీత లేకుండవచ్చిన నన్నుఁ జూచి, కుమార్తెయందలి ప్రేమముచేఁ గుంది మూర్ఛ నొందఁగలఁడు. నేను భరతుఁ డేలేడి యయోధ్యాపురమునకే రాఁజాలను. సీతను బాసి నేను స్వర్గము తటస్థించినను, నా కది శూన్య ముగాఁ గన్పట్టును. లక్ష్మణా! నీవు నన్నిట వదలి, సొగసయిన యయోధ్యాపురమునకుఁ బొమ్ము. సీతనుబాసి నే నొక్క నిమిషమైనను బ్రతుకఁజాలను. నీవు భరతుని గట్టిగఁ గౌఁగిలించుకొని, నీవే పుడమి నేలుమని రాముఁడు చెప్పెనని నామాటగాఁ జెప్పుము. నా తల్లులగు కై కేయి సుమిత్రా కౌసల్యలకు నాకు మాఱుగా వందనము లర్పింపుము. అందును నాతల్లియగు కౌసల్య చెప్పినపని చేయుచుఁ బ్రయత్న పూర్వ కముగా శుశ్రూషచేయుచుండుము. శత్రుసంహారకా! సీతయు నేను నడవియందే నాశ మొందిన తెఱఁగు సవిస్తరముగా మాతల్లికిఁ జెప్పవలసి నది"యని రాముఁడు లక్ష్మణునితోఁ జెప్పెను. ఇట్లు రాముఁడు సీతను బాసి, వనమున మిక్కిలి దీనుఁడై విలపించుచుండ, లక్ష్మణుఁడును వెఱి

పుచే మోము వెల్లఁబాఱి, మనమున విచారపడి మిక్కిలి నొచ్చినవాఁడయ్యెను.

63-వ సర్గము.

రాముఁడు సీతను గానక చింతించుట

రాజపుత్రుఁడగు రాముఁడు ప్రియురాలిని బాసి, వగపాలై, వివేకములేక, కడు నొచ్చిన రూపుగలవాఁడై, తమ్మునికిఁగూడ వ్యసనము గలిగించుచు మఱుల నాఁపరాని యంగలార్పు నొందినవాఁడయ్యెను. అట్లు రాముఁడు మితి మీఱిన వంత యనుకడలియందు మునిఁగినవాఁడై, తన నెన్నఁగకుఁ దగినట్టి వేఁడి నిట్టూర్పు నిగిడించి పలవింపుచుఁ దనవలెనె చింతపాలయియున్న లక్ష్మణునిఁ గూర్చి, విచారంపుఁ బలుకుల నిట్లనియె:

"లక్ష్మణా! పాపకర్మములు చేసినవాఁడు నావంటివాఁడు మఱొక్కఁడు పుడమియందు లేఁడనియె తలంచెదను. విచారముమీఁద విచార మొకటివెంబడి మఱొక్కటిగా నా మనమును, నా హృదయమును బగులఁదీయుచు వచ్చుచున్నవి. తొంటిబాముల నేను కావలెనని పలుమాఱు పాపకార్యములను చేసియుంటిని. ఇది నిజము. వాని కన్నిటి కిప్పుడనుభవింపవలసిన కాలమువచ్చినది. కావుననే యిత్తెఱఁగున నా కొక్కవిపత్తుమీఁద నొక విపత్తు వచ్చుచునే యున్నది. రాజ్యము కోల్పోవుట, తనవారినుండియెడఁబాయుట, తండ్రి మృతుఁడగుట తల్లిని బాసియుండుట వీని నెల్లఁ దలఁచుకొన్నచో నా శోకప్రవాహము వఱదయై పాఱుచున్నది. లక్ష్మణా! యీ వ్యసనమెల్లను నిర్జనమగు వనము నొందుటచే నణఁగియుండెను. అయినను, ఇప్పుడు సీత యెడఁబాటువలన నా వెతయంతయుఁ గట్టులు వేయుటచే నిప్పు బగ్గున మండునట్లు మఱిలఁ బెల్లగిలెను. వెఱిపరియగు నాప్రియకాంత, యొక్కరాక్షసుఁడు బలాత్కారముగాఁ బట్టుకొనఁగాఁ బై కెగిరి, వెట్టికూఁత కూసి, భయముచే వణఁకుచుఁ బెల్లుగ రోదనము సేసియుండును.

చూచుట కింపయిన నెత్తావిగల యొట్టని చందనము వ్రాఁతకు నిరంతరముఁ దగిన నా ప్రియకాంతయొక్క బటువుగుబ్బ లిప్పుడు నెత్తుటఁ దడిసి మెఱయకుండును. దీనికి సందియముండదు. తిన్నగను

విడివిడిగను నాణెముగను మాటాడునట్టిదియు, వంకర ముంగురులుగల దియునైన యా సీతమోము ముందు ప్రకాశముగలదైనను; ఇప్పుడు రాక్షసులవశమునఁ జిక్కి రాహువు నోటఁబడిన చందురునికైవడి నిక్కముగఁ బ్రకాశింపకుండును. ముత్తైపుసరులు దాల్చుట కెల్లప్పుడు తగినదియైన పతివ్రతయగు నా ప్రియురాలికంఠమును నల్లరాక్షసుడు నైన రక్కసులు నిర్జనస్థలమునఁ బ్రుంచినెత్తురు ద్రావియుందురు. దానికి సందియము లేదు. వెడఁదలగు చక్కని కన్నులు గలనా ప్రాణనాయిక నన్నెడఁబాసి యేకతరుగు వనమున రాక్షసులు వచ్చి చేపట్టి యీడ్చు చుండఁగా దిగులుపడిన యాఁడుజింకవలెఁ బెడబొబ్బ యిడియుండును. లక్ష్మణా! గొప్ప నడవడిగలదియు, లేనగవుమోము గలదియునైన సీత మునుపు నాతోడ నీ రాతిమోఁదఁ గూర్చుండి, నీతోడఁ బెక్కుపరి యాచకంపుమాట లాడెనుగదా! నదులలో శ్రేష్ఠమయిన యీ గోదావరీనది నా ప్రియకు సతతము సమ్మతమయినది. ఒకవేళ సీత యక్కడికిఁ బోయియుండునని యొంచెదననిన, సీత యెప్పుడు నొంటరిగా నెచ్చటికిఁ బోదుగదా! తమ్మివంటి మోముగలదియు, తమ్మితేకువలె వెడఁదలైన కన్నులుగలదియునైన సీత తామరపువ్వులఁ గోసికొన రాఁబోయినదా? యనిన, నదియు సరిగాదు. ఆ సీత నన్నుఁ బాసి, యెప్పుడును తామరపువ్వులం గోయఁబోవదు. పూవులు కాయలు గల వృక్షములగుంపుతోఁ గూడినదియు పెక్కుతెఱఁగులైన పక్షుల గుంపులచే వెలయునదియునైన యరణ్యమునొంపుఁ జూడఁబోయి యుండవచ్చుననిన నదియు సరిగాదు. ఆ సీత పిఱికిదిగనుక నొంటరిగా నడవికిఁ బోయియుండదు. ఓ సూర్యుఁడా! లోకుల మంచిచెడ్డల నరయువాఁడా! జను లాడెడి సత్యాసత్య వాక్యములకు సాక్షియైన వాఁడా! నాచెలి యెక్కడి కేఁగినది? లేక యెవ రెత్తుకొని పోయిరి. వగలపాలయియున్న నా కా సంగతి విస్తరించి చెప్పుము. ఓ వాయు దేవుఁడా! లోకము లన్నిటియందును నీకుఁ దెలియనిది యొక్కటియు లేదు. కావున పతివ్రతయైన నా ప్రియురాలిని రక్కసులచే నెత్తికొని పోఁబడినదో, లేక చనిపోయినదో, లేక దారియం దెచ్చటనైన నున్నదో నాకు నిక్కముఁ దెలుపుము."

అని యిట్లైఱుగున దుఃఖపరవశుఁడై, తెలివిదప్పి విలపించుచు నుండు నా రాముని జూచి, ధైర్యవంతుఁడగు లక్ష్మణుఁడు న్యాయ మార్గమున నుండువాఁడై, "ఓ పూజ్యుఁడా! శోకము వీడుము. ధైర్యము నవలంబింపుము. సీతను వెదకుటయం దుత్సాహము కలవాఁడవుకమ్ము. లోకమునఁ బూనికిగలవా రెంతటికార్యమునందు నోటమి నొందరు" అని సముచితముగాఁ బలికినను, రఘువంశ ప్రకాశకుండయిన రాముఁడు ధైర్యమేది యొక్కువ పౌరుషము మెఱయఁ జెప్పిన లక్ష్మణునిమాటను సరకుసేయక, మఱియు మిక్కిలిగ విచారపడుచునే యుండెను.

64-వ సర్గము.

రామలక్ష్మణులు సీతను వెదకుట

అంతట విచారపరుఁడైన రాముఁడు లక్ష్మణుం జూచి, "లక్ష్మణా! సీత తామరపువ్వులు కోసి తెచ్చుటకై గోదావరీనదికిఁ బోయినదేమో, నీవు వేగిరముగా గోదావరికిఁ బోయి సంగతిఁ దెలిసికొనుము" అని చెప్పఁగా, శత్రుయోధులం బరిమార్చువాఁడును వేగముగ నడుచు వాఁడును నయిన లక్ష్మణుఁడు రామునాజ్ఞ కొని, మనోహరమైన గోదావరీనదికిఁ బోయి, యొక్కొక్క రేవునను వెదకి చూచియు సీతను గాంచఁడయ్యెను. అంత లక్ష్మణుఁడు మఱలివచ్చి "నేను గోదావరియం దన్ని రేవులను వెదకితిని. ఆ సీత కనఁబడలేదు. గొంతెత్తి పిలిచితిని. ఆమె మాఱుపలుకలేదు. పరులశ్రమతీర్చునట్టి వై దేహి, ఏ దేశమునకుఁ బోయినదో, ఎచ్చటనున్నదో, నా కా ప్రదేశము తెలియలేదు." అని రామునితోఁ జెప్పెను. అంత రాముఁడు దీనుఁడై దుఃఖమూర్ఛితుఁడై తానే గోదావరీనదికిఁ బోయి, "సీత యెక్కడ" అని గోదావరి నడిగెను. అట్లు రాముఁ డడుగఁగా, సకల భూతములును వథార్హుఁడయిన రావణుఁడు సీత నపహరించెనని చెప్పలేక, "మా నిమిత్తము నీవు రామునితో సీతసంగతిఁ దెలుపు"మని గోదావరీదేవితోఁ జెప్పినను, ఆ గోదావరియు దురాత్ముఁడయిన రావణుని కలరూపును, జేతలను దలంచి, వానికి వెఱచి రామునికి సీతసంగతిఁ దెలుపదయ్యెను.

(c 169)

సీతను గానమిచేఁ జిక్కియున్న రాముఁడు గోదావరినది యూరకుండుటచే సీతవిషయమున నిరాశచేసికొన్నవాఁడై, లక్ష్మణుం జూచి, "ఓ నాయనా! యీ గోదావరి నా పలుకులకు బదులుసెప్పక యున్నది. లక్ష్మణా! నేను వనమునుండి మఱలి యయోధ్యకేఁగినప్పుడు సీతతండ్రి యగు జనకుఁడు, "సీత యొక్కడ" నని యడిగిన నేమి చెప్పుదును. మాతల్లి "నాకోడ లెచ్చట" నని యడిగినచో నే నప్రియము నెట్లు పలుకుదును. రాజ్యము గోల్పోయి యడవులకేతెంచి, యడవిలోని యాకలములం దినుచుండు నాకుఁ గలిగినశోక మెల్లఁ బోఁగొట్టుచున్న సీత యొక్కడ నున్నది? బంధువులను, చెలికాండ్రను బాసి, యడవియందుండి రాకొఱతయగు సీతను గానక నిద్దురపట్టక యుండు నా కీ రాత్రులు నిడుదలు గాఁగలవు. మందాకినీనదియందును, ఈ జనస్థానమునందును, ప్రస్రవణ పర్వతమునందును సీతను వెదకుదము. అక్కడ సీత కనఁబడునేమో! గొప్ప మొనకాఁడా! యీ మృగములెల్ల మాటిమాటికి నన్నుఁ జూచుచున్నవి. ఇవి సీతనుగూర్చి నాతో నేమి యైనఁ జెప్పఁగోరుచున్నవేమో యనునట్లు వీని యభిప్రాయము దెలియవచ్చుచున్నది" అని చెప్పెను. అట్టి పురుషశ్రేష్ఠుఁడయిన రాముఁ డా మృగములను జూచి, "ఓ మెకములారా! సీత యొక్కడ నున్నది" యని కన్నీటిచే నడ్డగింపఁబడిన దృష్టితో నా మృగముల నడిగెను. నరేంద్రుఁడయిన రాముఁ డిత్తెఱఁగున నడుగఁగా, నా మృగములెల్ల లేచి నిల్చి, దక్షిణపువైపునకుఁ దిరిగి మోరలు పైకెత్తి యా సీతను రావణుఁడు గొనిపోయిన మార్గమువంకఁ జూచుచు నా మార్గమునే పరుగెత్తుచు నృపాలునిఁ జూచుచుండెను. ఆ మృగము లట్లు లేచి దక్షిణదిశకుఁ దిరుగుటయు, క్రిందఁ జూచుటయు, అదారిని బోవఁ గోరుటయుఁ జూచి, బుద్ధిమంతుఁడగు లక్ష్మణుఁడు వానిచేష్ట లన్నిటి యభిప్రాయము నెఱిఁగినవాఁడై, తన యన్ననుజూచి, దీనస్వరముతో "ఓ యన్నా! సీత యొచ్చటి కేఁగెనని నీ వడిగినంతటనే యీ మృగము లన్నియుఁ దటాలున లేచి, దక్షిణంపుదెసకుఁ దిరిగి, పుడమిని జూపుచున్నవి. దేవా! మంచిది. మన మీ దెసకుఁ బోదము. సీతను గూర్చిన

వృత్తాంతమైనఁ దెలియును. లేక యా పూజ్యశాలయినఁ గనఁబడ వచ్చును" అని చెప్పెను.

కికుత్స్థవంశమునఁ బుట్టినవాఁడయిన శ్రీరాముఁ డట్లే యని లక్ష్మణునిఁదోడ్కొని, దక్షిణదిశకు వెడలి పుడమినిఁ జూచుచుఁ బోయెను. అట్లు రామలక్ష్మణు లొండొరులు మాటలాడుచుఁ బోవు చుండఁగా, నేలయందుఁ బూవులు రాలియున్న దారిని జూచిరి. శూరుఁడగు రాముఁడు నేలఁ గురిసియున్న యా పూవులవానను జూచి, వ్యసనము నొందినవాఁడై, లక్ష్మణుం జూచి, నిచారకరమైన మాట యిట్లుచెప్పెను. "లక్ష్మణా! నేను కాననమునఁ గోసి తెచ్చి యీయఁగా సీత పెట్టుకొన్న పూవులేయివి యని నాకుఁ దోఁచుచున్నవి. నాకు మేలుగావింపఁగోరి సూర్యఁ డీ పువ్వులను వాడఁజేయకయు, వాయు వెగురఁగొట్టకయు, కీర్తియుతియగు భూదేవి మంటిలోఁ గలుపకయుఁ గాపాడుచున్నారని తలంచెదను."

అని యిట్లు ధర్మాత్ముఁడును బురుషులలో మేటియునైన రాముఁడు నిడుదచేతులుగలవాఁడగు లక్ష్మణునితోఁ జెప్పి, పెక్కుసెలయేళ్లుగల పర్వతమును జూచి, "ఓ గట్లరాయఁడా! సర్వాంగసుందరియగు సీత ననున్నెడఁబాసి, మనోహరమయిన యీ వనమున నుండఁగాఁ జూచితివా? యని యడిగెను. రాముఁడు దానికిఁ బర్వతమువలనఁ బ్రత్యుత్తరము వడయక, యలిగినవాఁడై, సింగము తగ్గుమెకములం జూచి చెప్పుచంద మున నా ప్రస్రవణ పర్వతము నుద్దేశించి, "ఓ పర్వతమా! పసిఁడివన్నె గల బంగరు బొమ్మవంటిదగు సీతను జూపుము. నీ వట్లు సీతను నాకుఁ జూపవేని, ఖదిగో నీ చరియలనెల్లఁ బడఁగొట్టెదను" అని యాక్షేపించెను. అప్పుడు పర్వతము రామునకు సీతనుగూర్చిన సంగతి దెలుపు చున్నదో యనునట్లు ప్రతిధ్వను లినుచున్నను, రామునికి సీతను గనఁ బఱపదాయెను. అంత రాముఁ డప్పర్వతముఁజూచి, "ఓ పర్వతమా! నీపై నే నిదిగో బాణమేయుచున్నాను. నీవు నా బాణాగ్నికి మలమల మాడి; గడ్డి, చెట్లు, చిగుళ్లునులేక, బూదియై యొకరికిని దగ్గఱఁజేర నుపయోగింపక పోదువు సుమీ" అని చెప్పి, "లక్ష్మణా! చందురుని బోలు మోమునగల సీత నీ నదియుఁ జూపదేని, దీనిని సైత మింకఁజేసె

దను" అని రాముఁడు కోపముచేఁ గన్నులనుండి మిణుఁగురులు రాలు నట్లు చూచుచు నొక రాక్షసుని గొప్పయడుగులను, ఆ రాక్షసునికి వెఱచి తనకడకుఁ రాఁగోరి యిక్కడి కక్కడికిఁ బరుగెత్తుచు నా రక్కసు నిచే వెంబడింపఁబడుచుండిన సీతయడుగులను జూచెను. రాముఁ డట్లు సీతయడుగులను, రాక్షసునియడుగులను జూచి, వెంటనే, దానిచేరువ విఱిగిపడియున్న ధనుస్సును, అమ్ములపొదులను, పలుతెఱఁగులవిఱిగి చిందర వందరయై పడియున్న యరదమును జూచి, మనమున చెదరిన వాఁడై, తన యనుఁగుఁదమ్మునితో నిట్లనెను.

లక్ష్మణా! చూడుము. సీత దాల్చెడి తొడవులబంగరుతునుక లంతటఁ బడియున్నవి. సౌమిత్రీ! పలుతెఱఁగులైన పుష్పమాలికలును బడియున్నవి. ఈ ప్రదేశ మెల్ల యపరంజితునుకలమూఁడ్కి వెలుఁగు పలు రంగులుగల నెత్తుటిబొట్లు పడియున్నవి చూడుము. లక్ష్మణా! కామ రూపులగు రక్కసులందఱు గలిసి, యా సీతను ముక్కలుముక్కలుగాఁ గోసి పంచుకొనియో, లేక మ్రింగియో యుందురు. ఇది నిజము. సౌమిత్రీ! ఆ సీత నిమిత్తమై యిరువురు రాక్షసులు వివాదపడి యిచ్చట గొప్ప పోరు సేసినట్లు తోఁచుచున్నది. నాయనా! యిచ్చట బంగరు నగిషీపని గలిగినదియు, ముత్తెములు రతనములు చెక్కినదియునైన విల్లొకటి విఱిగి నేలఁబడియున్నది. ఇదెవనిదో! బాలసూర్యనిపగిది వెలుఁగునదియు, వైడూర్యమణులు చెక్కినదియునై, నేలమీఁదఁ బడి యున్న యీ పైఁడికవచమెవ్వనిది! నూఱుకమ్ములును బంగారుకాడయుఁ గలిగి, శ్రేష్ఠమునైన వూలదండలచేఁ గైసేయఁబడిన యీగొడుగు చక్కఁగా విఱిచి నేలఁద్రోయఁబడియున్నది; రెవ్వనిది! పసిఁడి మైమ రువు దొడిగినవియు, దయ్యపుమోరయు వలుఁద మేనును, వజ్రపుగోలుపు రూపును గల యీ వేసడము లెవ్వనివో బవరమునఁ జిప్పిలఁడియున్నవి! కాంతిగలదియు, అగ్నిహోత్రునిమాడ్కిఁ బ్రకాశిల్లునదియునైన యీ విఱిగిన బవరంపుఁ డెక్కెమును, యుద్ధసంబంధమ్మయిన యీ భయంకరమైన యరదము నెవనిదో? నాలుగునూఁతుల యంగుళీముల పొడవు గలవియు, స్వర్ణభూషణాలంకృతములునైన రమ్ములు కొనలు విఱిగి యిచ్చటఁ చిందరవందరగాఁ బడియున్నవి. ఈ యే ఘోరకర్మనివో?

V.R. LIBRARY ACC No. D.R. MEMORIAL

లక్ష్మణా! చూడు బాణములతో నిండిన రెండస్తులపాదు లెవ్వానివో
విఱిగిపడియున్నవి. పగ్గములను ములుకోలను జేతఁ బట్టుకొన్నట్లే
యెవనిసారథియో చచ్చిపడియున్నాఁడు ! ఓ పురుషశ్రేష్ఠుఁడా!
సౌమ్యుఁడా! పాగయు, రత్నకుండలముల దాల్చిన యీ యిరువురు
వింజామరము లేయువారు యుద్ధరంగమునఁ జంపఁబడియున్నవారు. వీ
రెవ్వనివారలో ! ఈతీరంతయుఁజూడ నెవనిదో రాక్షసునిదిగా నున్నది.
ఇది నిజము. ఇంతకుమున్ను రక్కసులమీఁద నంతగాఁ గసి కలుగలేదు.
ఇప్పుడు నాకు వారిపైఁగోపము నూఁతంతలు పెరిగినది. దీనితో రాక్షసుల
నందఱిని వధించెదను. కడుఁ గఠినంపుకెడఁదగల యిచ్ఛాసుసారిరూప
ధారులగు రక్కసులు సీత నెత్తికొనిపోయిరో, లేక తినిరో
యుందురు. లేక సీత రాక్షసులఘోరరూపముఁజూచి భృతినొందియైన
నుండును. సీత మహాననమున నపహరింపఁబడునప్పుడు ధర్మచేవత
యా సీతను గాపాడలేదుగదా! లక్ష్మణా! సీత తినఁబడినదేకానిమ్ము.
అపహరింపఁబడినదేకానిమ్ము. లోకమున నాకు సంతసమును గలిగింపఁ
జాలినవా రెవ్వరు ? లక్ష్మణా! లోకముల సృజించువాఁడయిననుఁ, హరుఁ
డైనను పరులయెడ జాలిచూపువాఁడయినచో, భూతములెల్ల నాతని
ప్రభావమెఱుఁగక యాతనిఁ దిరస్కరింతురు. ఏను మెత్తనివాఁడనై
జనుల మే లొదవించుటయందు శ్రద్ధగలిగి, కోపములేక యందఱియెడ
దయఁజూపువాఁడనై యున్నందున, ననున్నుఁ జూచి వేల్పులంద ఱితఁడు
మగఁటిమి లేనివాఁడని తలంతురు. ఇది నిజము. లక్ష్మణా! గుణము
నాకడఁజేరి దోషముగా మాఱి యిప్పుడే సకలభూతములయొక్కయు
రాక్షసులయొక్కయు వినాశమునకుఁ గారణమయినది. వెన్నెల నడఁచి
సూర్యుఁడు వేఁడివెలుఁగుతో నుదయమొందునట్లు, నా ప్రతాపము
సకలగుణములను సంహరించి వెలుఁగుచున్నది. లక్ష్మణా ! యక్షులు
గాని, గంధర్వులుగాని, పిశాచములుగాని, రక్కసులుగాని, మనుజులు
గాని సుఖమునొందఁజాలరు. లక్ష్మణా ! చూడుము నే నాకసమున
నస్త్రములచే నిండించి మల్లోకములందుఁ దిరుగువారికి దారిలేకుండు
నట్లు కావించెదను. లక్ష్మణా ! గ్రహగణములనెల్ల నడ్డగించి, చంద్రునిఁ
దిరుగకుండఁజేసి, అగ్ని సూర్య వాయు బలంబుల యుబ్బడఁచి, కొండల

కొనలను త్రుంచి, కొలఁకుల నింకునట్లొనర్చి, చెట్లను, తీఁగలను, పొదలను బాడుసేసి, సముద్రజలముల శోషింపఁజేసి, యీ తీరున ముల్లోకములను ప్రలయము నొందించెదను. వేల్పులు నాకు సీతను సురక్షితముగా నీయరేని, యీ క్షణముననే నా మగతనము నరయఁగలరు. లక్ష్మణా! సకలభూతములు నావింటినుండి యేయఁబడిన యస్త్రములగుంపుచే నెడ తెంపులేక నిండిన యాకసమున సంచరింపఁ బై కెగురఁజాలకయుండునట్లు చేసెదను. ఈ జగమునందలి మృగపక్షులు నా వాఁడియస్త్రులచేఁ బీడింపఁ బడినవై నశించి గిరగిరపరిగి బ్రమసిపోవునట్లును, కలఁతనొంది మేర మీఱునట్లును గావించెదను చూడుము. సౌమిత్రీ! సీతనిమిత్తము నేను జెవిపఱుకు సీడ్చి యస్త్రములను లోకములందేసి రాక్షసులయు, పిశాచులయు పేరు లేకుండునట్లుగావించెదను. లక్ష్మణా! నేనిప్పుడురోషముతోఁ బ్రయోగించి కడుదూరమునకుఁ గడు వేగిరముగాఁ బోవు నాబాణములను వేలుపులు చూడఁగలరు. నేను కినుకపూని యీ ముల్లోకములను ధ్వంసముచేసితినేని, దేవత లుండరు. అసురు లుండరు. పిశాచరాక్షసులుండరు. నేను దేవ దానవ రాక్షసలోకములు తుత్తునియలయి పాడయిపోవునట్లు వాఁడియస్త్రుల నేసెదను. సౌమిత్రీ! ఆయాలోకములకుఁ బ్రభువులగువారు, సీత యపహరింపఁబడినదే కానిమ్ము, మృతినొంది నదే కానిమ్ము. ఆనా ప్రియురాలిని నాకుఁ దెచ్చియీయరేని యాలోకములను తొఱుమాఱుచేసెదను. నా యనుఁగుఁ జెలియొక్క స్థితిని వేల్పులు నా కెఱిఁగింపరేని, స్థావరజంగమరూపమగు నీ ప్రపంచమెల్లను రూపుమాపెదను." అని యిట్లు రాముఁడు పలికి కన్ను లెఱ్ఱచేసి వింటిని వంచి, పామువలె భీకరమై వెలుఁగుచున్న యస్త్రమునుగొని, ధనుస్సునందు జోడించి ప్రలయకాలాగ్నిచందమున బాగుగ మండిపడుచు లక్ష్మణునిం జూచి, "లక్ష్మణా! ఎట్లు రాజును, మృత్యుదేవతను, యముని, దైవమును మీఱుట కెవ్వనికిని దరముగాదో, యట్లె కినుకతోఁ గూడిన నన్ను మీఱుటను సకలభూతములలోపల నెవరికిని నే తీరునను దరముగాదు. లక్ష్మణా! యథాప్రకారముగాఁ జక్కనిరూపుగలదియు నొచ్చెములు లేనిదియునైన సీతను వేల్పులు నా కొసఁగరేని, నేను దేవ గంధర్వ సర్ప గరుడ మనుష్యులతోఁ గూడియున్న యీ జగమెల్లఁ

బర్వతములతోఁగూడఁ దలక్రిందులు చేసివై చెదను సుమీ" యని లక్ష్మణునితోఁ జెప్పినవాఁ డయ్యెను.

65- వ స ర్గ ము.

లక్ష్మణుఁడు రాముని శాంతపఱచుట

సీతను గోలుపోవుటచేఁ జిక్కినవాఁడై యత్తెఱఁగునఁ జింతపడు చుండువాఁడును, ప్రలయాగ్నిమాడ్కి లోకవినాశమునకుఁ బూనిన వాఁడును, లోకమెల్ల దహింపగోరిన ప్రలయకాలరుద్రునిచందమునఁ దేజరిల్లువాఁడును, ఎక్కువెట్టిన వింటిని జూచి మాటిమాటికి నిట్టూర్పు విడుచువాఁడును, తొలింటియట్లుగాక, క్రొత్తరూపు దాల్చినవాఁడును, కడునలుకగలవాఁడునైన రామునిం జూచి లక్ష్మణుండు వాడుపాటిన మోమునతోఁగూడి చేతులు జోడించి యిట్లనియె:

ఆర్యా! నీవు మొదటినుండి మెత్తనివాఁడవు; ఓర్పుగలవాఁడవు; సకలలోకముల మేలుగోరువాఁడవునై యుండి యీగ్రహము పొంది, నేఁ డిట్లు నీ స్వాభావికగుణమును విడుచుటతగదు. చంద్రునందుఁ గాంతివలెను, సూర్యునందు వెలుగువలెను, వాయువునందు గమనము వలెను, పుడమియందోర్పువలెను నీయందును నీగొప్పకీర్తి యెల్లప్పుడు నియతమై యున్నది. ఒకనితెప్పిదమునకై లోకములనెల్ల సంహారింపఁదలఁ చుట తగినదికాదు. ఈ విఱిగియున్న యుద్ధార్థమయిన రథమెవ్వనిదో, ఈ యాయుధములును, సారథి మున్నగు నుపకరణములును నెవ్వనివో, ఎవఁ డెందుకై వీనిని విఱిచెనో నాకుఁ దెలియలేదు. రాచకొమరుఁడా! ఈ ప్రదేశము గిట్టలచేతను, తేరియంచులచేతను, నలిగి నెత్తుటి బొట్లచేఁ దడిసియున్నది. గొప్ప పోరు జరగియుండునని తెలియుచున్నది. ఇది యొక్కని పోరేకాని, యిరువురిది గాదు. విస్తారసైన్యముయొక్క యడుగులజాడ లిచ్చటఁ గనఁబడలేదు. ఒకనిదోషమునకై పెక్కండ్రను సంహరించుట యుక్తముగాదు. నృపాలురు దండ్యులను దండన సేయుచు, సజ్జనులయెడఁ గడునోర్పును మెత్తదనము గల్గియుందురు. నీ వన్ని భూతముల కెల్లప్పుడు రక్షకుఁడవు నుత్తమగతివియునై యుండు వాఁడవు. రాఘవా! నీవు పెండ్లామును గోలుపోవుట మంచిదని యెవఁ డును జెప్పఁడు. యాగదీక్షితునకు ఋత్విజులు చెఱుపునేయఁజాలని

యట్లు నదులును, సముద్రములును, పర్వతములును, దేవదానవ గంధర్వులును నీకును గీడుసేయఁజాలరు. ఓ రాజా! నీవు విల్లు చేతఁ బూని సీత నెత్తికొనిపోయినవానిని వెదకుము. నేనును గూడ వచ్చెదను. మహామునులును నీ వెంబడి వత్తురు. మన మందఱముఁగలిసి సముద్రములను, పర్వతములను, వనములను, పెక్కు ఘోరపుగుహలను, తామరకొలఁకుల నరసెదము. నీ ప్రియురాలి నపహరించినవాఁడు దొరకునంతవఱకును జాగ్రత్తగలవారమై దేవ గంధర్వ లోకములను వెదకుదము. వేల్పులు నీ ప్రియురాలిని మంచిమాటలతో నీయఁజేని, కోసలేంద్రా! యప్పటికెయ్యది యుక్తమో దానిం జేయుదువు సుమీ. నరేంద్రా! తిన్నదనముతోను, మంచిమాటలతోను, అడఁకువతోను, నీతితోను సీతనుబడయవేని, పొగ్గులుకులు గలవియు, నూఱించుల వాఁడికైదువులంబోలునవియునైన బాణములగుంపులతో సీత నియ్యని వానిని సంహరింపుము" అని లక్ష్మణుఁడు రామునితోఁ జెప్పినవాఁడయ్యెను.

66-వ సర్గము.

లక్ష్మణుఁడు రామునిశోకమును శాంతపఱచుట

సీత నెడఁబాసినవెతచే నొచ్చినవాఁడయి, దీనునిమాడ్కి విలపించుచు, ఎక్కువ మోహముతోఁ గూడి రోదనము సేయుచు మైమఱపు నొందుచున్న రాముని లక్ష్మణుఁ డిట్లెఱిఁగునఁ గొంతసే పోదార్చి, కాళ్ళుపట్టికొని యిట్లనియె.

రామా! దేవతలు కడఁకతో నమృతము బడసినచందమున దశరథనృపాలుఁడు గొప్ప తపస్సుచేసియు, యజ్ఞములు మున్నగు గొప్ప కార్యము లొనర్చియు నిన్నుఁ బడసెను. మహీపాలుఁడును నీ సుగుణము లనుత్రాళ్ళకుఁ గట్టుపడినందున నిన్నెడఁబాసి యుండఁజాలఁ స్వర్గమున కేఁగెనని భరతునివలన మనము వింటిమి. కాకుత్థ్సా! సంప్రాప్తమయిన యీ దుఃఖమును నీ వోర్చుకొనవేని, బలహీనుఁడయిన సామాన్యజనుఁడెవఁ డీ దుఃఖము నోర్వఁగలడు? నీవు వ్యసనము నొందినవాఁడవై, నీ పరాక్రమముచే లోకములనెల్ల దహింతువేని, యీపన్నులగు జనులంద లెక్కడి కేఁగి సుఖము నొందఁగలరు? లోకమున నిట్లు

జనులు కడగండ్లను బొందుట స్వాభావికమే. తొల్లి నహుషునిపుత్రుఁడగు యయాతి యింద్రలోకమునొంది, "మీ లోకమున నెవ్వఁడు శ్రేష్ఠుఁడు" అని యింద్రుఁడడుగఁగా, తానే శ్రేష్ఠుఁడని చెప్పికొనెను. అప్పుడు యయాతి యాత్మశ్లాఘాదోషమువలన మఱలఁ బుడమిని బొందెను. మనతండ్రికిని మనకును గురువగు వసిష్ఠమునీంద్రుని కొక్క దినమునఁ నె నూఱుగురు కొడుకులు పుట్టి, యొక్కదినమున నేనుడిసిరి. ఓ ప్రతినతప్పనివాఁడా! జనుల పొగడ్తలకుఁ బాత్రమైన లోకముల తల్లియగు భూదేవియు నప్పుడప్పుడుఁ జలనమొందుట మనము చూచుచున్నాముగదా! ఎవరు ధర్మస్వరూపులో, ఎవరు లోకమునకుఁ గన్నులో యెవరియం దన్నివస్తువులు నెలకొనియున్నవో, అట్టి చేవ కాంద్రగు సూర్యచంద్రులను రాహుకేతువులు పీడించుచున్నారుగదా! పురుషశ్రేష్ఠా, గొప్పభూతములును వేదములును సకలభూతాంతర్యామి యగు దైవమును మీఁబోఁటి జాలవు. ఇంద్రుఁడు మొదలగు దేవతలును నయానయములమూలమున నగుసుఖదుఃఖములకుఁ బాలగుచున్నారని వినెదము. కావున పురుషశ్రేష్ఠుఁడా! నీవు దుఃఖింపఁజనదు. ఓ యనఘా! సీత నశించినను, రాక్షసులే సీత నెత్తికొనిపోయిరనను, సామాన్యమాన వునిమాడ్కి శూరుఁడవగు నీవు శోకించుట తగదు. రామా! గొప్ప కడగండ్లువచ్చినను నీబోంట్లనయము సత్యమునుగుర్తించినవారలై, యెట్టియిక్కట్టులయందును విచారపడకయుందురు. పురుషోత్తమా! నీవు చక్కఁగా నిజమును బరికింపుము గొప్పవిద్వాంసులగువారు తెలివితేటలు గలిగి, రాఁబోవు మేలుకీళ్ళను దెలిసికొనుదురు. పూర్వజన్మమునఁ జేసిన కర్మల కనుగుణముగ నీ జన్మమున నా యా కర్మముల ఫలమనుభవింపవలయును. ఇప్పుడు మంచి గలుగు ననికాని, ఇప్పుడు చెడ్డి కలుగుననికాని తెలియదు. ఇవి యిట్టివని నిశ్చయింప వీలుకాదు. ఫలానుభవముచేత మాత్ర మట్టి కర్మముల నెఱుఁగవలయును. రామా! నీవె నా కెన్నిమాఱులో పలుతెఱఁగుల బోధించితివికదా. అట్టి నీకు సాక్షాత్తుగా బృహస్పతియైన బోధింపఁగలఁడే! నీ విషయమున నాతఁడెంతటివాఁడు? గొప్ప పండితుఁడా! నీతెలివి దేవతలకుఁగూడ గోచరముగాదు. ఇప్పుడు సీతావియోగచింతచే నిద్రితమైయున్న

నీ జ్ఞానమును నేను మేలుకొలుపుచున్నాను ఇక్ష్వాకువంశశ్రేష్ఠుఁడా! భూలోకమునందలి బ్రాహ్మణాదులును, స్వర్గమునందలి దేవాదులును వధ్యులుకారనియు, నీపరాక్రమము సకలలోకసంహారసమర్థమనియుఁ దెలిసికొని యీవల శత్రునాశమునకై ప్రయత్నపడుము. పురుషశ్రేష్ఠుఁడా! సర్వలోకసంహారముచే నేమి యుపయోగము? వీ పాపాత్ముఁడా సీతను దొంగిలించినాఁడో, యీ శత్రువును గనిపెట్టి వానిదుంప ద్రెంచుము" అని లక్ష్మణుఁడు రాముని కోపముపశమింపఁ జేసినవాఁడయ్యెను.

67-వ సర్గము.

రాముఁడు జటాయువువలన సీతసంగతి నెఱుఁగుట

లక్ష్మణుఁడు సారవంతమైన మంచి మాట పలుకఁగా, సారము గ్రహించువాఁడయిన నిడుదచేతులు గలవాఁడగు రాముఁడు లక్ష్మణుని యీ హితవాక్యమును విని, తనకుఁ గలిగిన కోపము నడఁచికొని, వింతయైన ధనుస్సునానుకొని లక్ష్మణుం గూర్చి, "నాయనా! మనమేమి చేయుదము? ఎందుఁబోదము? ఏ యుపాయమున సీతసంగతిఁ దెలియుదము? నీ వాలోచింపుము" అని పలికెఁ.

అట్లారాటంపడుచున్న రామునిఁజూచి లక్ష్మణుండును, "అన్నా! పెక్కుచెట్లతోను, తీఁగెలతోను గూడినదియు, పలురక్కసుల కునికిపట్టు నైన యీ జనస్థానమునందే వెదకవలయును. ఇచ్చట దుర్గములును, గోనలును, పణుకులును, పెక్కు మృగసంఘములతోఁ గూడిన పలుతెఱఁగులగు భయంకరములైన గవులును, కిన్నరుల యునికిపట్టులును, గంధర్వుల భవనములును గలవు. నన్ను వెంటఁ బెట్టికొని, యీ ప్రదేశములందెల్ల సీతను వెదకుము. నరశ్రేష్ఠా, బుద్ధిమంతులగు నీబోటి దిట్టలు గాలికిఁ గొండలుగదలన క్లేశట్టి యాపదలకును జలింపరు" అని చెప్పఁగా, రాముఁడు వింటియందు వాఁడియైన యర్ధచంద్రబాణమును జోడించి, యీ గ్రహముతోఁగూడి యీ వనమెల్ల సంచరించెను.

అట్లు రాముఁడా గ్రహముతో వనమెల్లఁ దిరుగుచు, నొక్కచోట నేలఁబడి నెత్తుటఁ దడిసినవాఁడును, పర్వతశిఖరముఁబోలువాఁడును, వీర్యశాలియునైన పక్షులదొరయగు జటాయువుం జూచెను.

రాముఁడు కొండకొనఁబోలు నా జటాయువుం జూచి, లక్ష్మణా! వీఁడు మనసీతను మ్రింగినవాఁడు. దీనికి సందియము లేదు. వీడు గ్రద్దరూప ముతోఁ గానయందు సంచరించు నొక రాక్షసుఁడు. ఇది నిజము. వీఁడు విఱివికన్నులుగలదగు సీతను మ్రింగి సుఖముగా నున్నవాఁడు. మండు చున్న మోముగలవియు, చాయగాఁ బోవునవియు, వెఱపు గలిగించు నవియునైన యమ్ములనేసి, యీతనిని వధించెదను" అని చెప్పి యలుకఁ బూని పాగరపరివృతమగు పుడమినెల్ల గదలఁజేయువానివలె వింటి యందుఁ జంద్రవంకవంటి బాణమును జోడించి యా జటాయువు వీఁదికి దుమికెను.

రాముఁడు దనపైకి వచ్చుటంజూచి, నురుగులు గట్టునట్లు నెత్తురు గ్రక్కుచు, తిన్నని గొంతుతో నా దశరథనందనునికి నిట్లనెను. "ఓ దీర్ఘాయుష్మంతుఁడా! గొప్పవనమున నొక్క మాలికను వెదకిన చాడ్పున నీ వే సీతను వెదకుచున్నావో, యా సీతను, నా ప్రాణ ములను రెంటిని రావణుం డపహరించెను. రామా! నీవును, లక్ష్మ ణుఁడును లేక యొంటరిగానుండఁగా, బలవంతుఁడయిన రావణుఁడువచ్చి సీతనెత్తికొని పోవుచుండుటఁ జూచి, సీతను గాపాడఁ గోరినవాఁడనై రావణునితోఁ బోరి యాతని తేరు విఱిచి క్రిందఁ ద్రోసితిని. ఈ విఱిగినది యాతని విల్లు. ఈ చిల్లులుపడినది యాతని మైమరుగు. ఈ కనఁబడునట్టి యా రావణుని యుద్ధార్థమైన రథమును నేను విఱిచితిని. ఆ రావణుని సారథియగు నీతఁడు నా తొక్కల దెబ్బలచే హతుఁ డయ్యెను. ఇంతదూరము పోరి యలసియున్న నన్ను తొక్కలు దెగ నఱికి, సీతనుగొని యాకసమున కుఱికెను. రామా నే నసలు రావణునిచేఁ జావమోదఁబడియున్న నన్ను నీవు మఱిలఁ జంపఁదగదు." అని జటాయువు రామునితోఁ జెప్పెను.

రాముఁడు జటాయువు చెప్పిన మాటలు విని, కన్నీరు విడిచి, యింపయిన సీతకథను వినుటవలన రెట్టించిన దుఃఖముచే నొచ్చినవాఁడై, యా గొప్ప వింటిని గ్రిందవైచి, జటాయువుం గౌఁగిలించి, మయిమఱచి పుడమింబడి, లక్ష్మణునితోడఁ గూడి యేడ్చెను. రాముడు సంచరింప నలవికాని కాలిదారినియొంటరియై, యెట్టకేలకు నిట్టూర్పు విడుచుచున్న

యా జటాయువుం జూచి యాలింగన మొనర్చి కడువెతనొందినవాఁడై, విలపించి లక్ష్మణుం జూచి, "రాజ్యమునుండి తొలఁగుట, అడవియందుండుట, సీత కనఁబడకపోవుట, జటాయువు చంపఁబడుట"యని నివి తలఁచిన నిట్టి నా దౌర్భాగ్య మగ్నిహోత్రునిగూడఁ గాల్చివేయునని తోఁచుచున్నది. సీటితో నిండిన సముద్రమున నేను జొత్తునేని, నా దురదృష్ట మనునది యా సముద్రజలమును గూడఁ బీల్చివేయును. స్థావర జంగమాత్మకమగు నీ ప్రపంచమున నాకంటె దరిద్రుఁడు మఱొక్కఁడు లేఁడు. నేనుగాక మఱెవ్వఁడైన నిట్టి వంత లనెడి గొప్ప వలయందుఁ జిక్కియున్నాఁడే గ్రద్దలకు ఱేఁడగు నితఁడు తండ్రికి నెచ్చెలి; ముదుసలి. నా దురదృష్టవశముననే యీ జటాయువుగూడ నెవని చేతనో కొట్టఁబడి నేలఁగూలియున్నవాఁడు" అని యిట్లు పలుతెఱంగులఁ జెప్పి రాముఁడు తండ్రియందుఁబోలె నెయ్యముఁ గనఁబఱచుచు జటాయువుందడవెను. లక్ష్మణుండును తన యన్నవలెనె జటాయువుం డాఁకి విలపించెను. రావణునిచే తెక్కలు దెగవేయఁబడినందున నేలఁగూలి నెత్తుటఁ దడిసిన మేనుతోఁ గూడిన జటాయువును రాముఁడు గట్టిగాఁ గౌఁగిలించికొని, "నాకుఁ బ్రాణసమానుఁడాలగు సీతయొక్కఁడనున్నది" యని బిగ్గఱిగా నఱచి, స్మృతిదప్పి క్రిందఁబడెను.

68-వ సర్గము.

రాముఁడు జటాయువున కుత్తరక్రియలు సల్పుట

రాముఁడు క్రూరుఁడగు రావణునిచే జావఁగొట్టఁబడి క్రిందఁబడియున్న గృధ్రరాజగు జటాయువుం జూచి, యనుఁగుసైదోడగు లక్ష్మణుంగూర్చి, "లక్ష్మణా! యీ పక్షీంద్రుఁడగు జటాయువు సీతను గాపాడఁబోయి, తానే యా రాక్షసునిచేఁ బోరునందు దెబ్బలు తిని, యెట్టకేలకు విడువరాని యూఁపిరి విడువ నున్నాఁడు. ఈతని శరీరమున నిదిగో కొంత యూపిరియున్నది. కంఠస్వరము హీనమై తొట్రుపాటు గలిగియున్నది. ఇతఁడు చైన్యమునొందినట్లు కనబడుచున్నవాఁడు" అని చెప్పి, "ఓ జటాయువా! నీవు మాటాడఁగలవేని, సీతను గుఱించినవార్త చెప్పుము. అతఁడేల నిన్నుఁ జావమోఁదెను? చెప్పుము. నీకు మేలగును గాక, వీల రావణుఁడు సీత నపహరించెను? నాప్రియురాలి నపహరించు

నంత యపకారము నే నతనికేమి చేసితిని? పక్షీంద్రుఁడా! రావణుఁ డెత్తుకొని పోవునపుడు చంద్రునివలె మనోహరమగు సీత మొగ మెట్లుం డెను? అప్పుడు సీత యేమాటలు పలికినది? ఆ రాక్షసుని మగఁటిమి యేపాటిది? రూప మెట్టిది? నడత యెటువంటిది? ఆతని యునికిపట్టయ్యేది? నాకు పవిస్తరముగాఁ జెప్పు"మని జటాయువు నడిగెను.

అంత రావణునిచేఁ జావఁగొట్టుఁబడి బాధపడుచున్న జటాయువు పలవించుచున్న రామునిఁజూర్చి మిక్కిలి హీనమయిన కంఠధ్వనితో నిట్లనియె "రాక్ష సేంద్రుఁడగు రావణుఁడు మాయాబలమువలన గాలిని, మబ్బులను గలిగించి చీకట్లు క్రమ్మునట్లొనరించి, సీత నపహరించెను. నే నప్పుడు నా శక్తికొలఁదిఁ బోరి, యలసటనొందియుండఁగా, నతఁడు నా తెక్కలు నఱికివైచి, సీతను గైకొని దక్షిణపువైపునకుఁ బోయెను. నా ప్రాణములు కొట్టుకొనుచున్నవి. కన్నులు గిరగిర దిరుగుచున్నవి. వట్టివేళ్ళతోఁ జేసిన నెత్తికురులుగల పసిఁడిచెట్లు నాకంటి కగపడు చున్నవి. ఇఁక నేను బ్రదుకను. రావణుఁడు సీత నెత్తుకొనిపోవు ముహూర్తము విందమును పేరుగలది. ఇది వానికి మంచివేళగాదు. ఈ ముహూర్తమునఁ గనఁబడకపోయిన సొమ్ము దానిసొంతగానికిఁ దప్పక దొరకఁగలదు. ఆ మూఢుఁడు దీని నెఱుఁగఁ డయ్యె. కాలమును మ్రింగిన చేప వెంటనేనశించునట్లు నీప్రియురాలగు సీత నపహరించినట్టి రాక్షసా ధిపుఁడగురావణుఁడును వేగమే నాశ మొందఁ గలఁడు. నీవు జానకిం గూర్చి చింత నొందఁ బనిలేదు. నీ వా రాక్షసునిఁ బిలుకుమార్చి, వేగరమే సీతంగూడి క్రీడింపఁగలవు" అని యిట్లు జటాయువు తెలివిదప్పక రాము నితో మాటాడుచుండఁగాఁ జావ నుండు నాతని నోటినుండి నెత్తురును మాంసమును గాఁ దెను. అప్పటికిని బతగేంద్రుఁడగు జటాయువు మఱలఁ జెప్పఁబూని "విశ్రవసుని కొడుకును, కుబేరునికి సాక్షాత్తుగాఁ దమ్ముఁ డును–"అని చెప్పుచు నాఁపఁజాలని తన ప్రాణములను దొఱఁగెను. రాముఁ డాదరముతోఁ జేతులుమోడ్చి "చెప్పుచెప్పు"మని యడుగు చున్నను, జటాయువు ప్రాణములు మేను విడిచి పైకెగసిపోయెను. అంత జటాయువు తల వ్రేలాడవేసి, కాళ్ళు చాఁచి, తన శరీరము నెగుర వేసి నేలఁబడినవాఁ డయ్యెను.

దీనుఁడగు రాముఁడును నెట్టని కన్నులు గలవాఁడయిన పర్వతాకారుఁడగు నామృతినొందిన గ్రద్దలతేనిం జూచి, పలువిధము లగు వ్యసనము లందినవాఁడై, లక్ష్మణుం జూచి, "పెక్కేండ్లుగా రాజ్య సుల కునికిపట్టయిన యీ యరణ్యమున సుఖముతో నున్న యీ పక్షి రాజు నేఁడిచ్చటనే మృతినొందెను. పెక్కేండ్లు జీవించి చిరకాలము గొప్పదనముగలిగియుండిన యీతఁడు చచ్చి నేలపైఁబడియున్నాఁడు. అక్కటా! కాలమును మీఱుట లేరికిని శక్యముగాదుగదా. లక్ష్మణా! యీ జటాయువు నా కుపకారము నేయఁగోరి సీతను గాపాడఁబోయి, కడు బలవంతుఁడగు రావణునిచేతఁ జిక్కి, వంశపారంపర్యముగా వచ్చిన గొప్పదగు గ్రద్దలరాజ్యమును బాసి, నాకొఱకుఁ బ్రాణములను వదలెను. అన్నిజాతులయందుఁ దిర్యగ్యోనులందుఁ బుట్టినవారియందును కూడ శూరులును, ధర్మము నడపువారును, శరణుచొచ్చినవారి కాశ్ర యులునగు సజ్జను లున్నారు. పగతురఁ బరిమార్చినట్టి యో తమ్ముఁడా! నా నిమిత్తము జటాయువు మృతినొందుటచేఁ గలిగినంత వ్యసనము సీతగనఁబడమిచేతఁ గూడఁ గలుగలేదు. మహాకీర్తిమంతుఁడగు శ్రీమంతుఁడయిన దశరథనరేంద్రుఁ డెట్టులో, అట్లె జటాయువును బూజాగౌరవముల కర్హుఁడు. సౌమిత్రీ! కట్టెలు దెమ్ము. నిప్పుఁ జిలుకు దము. నానిమిత్తము మృతినొందిన యీ జటాయువునకు దహనసంస్కార మొనరించెదను. భయంకరుఁడగు రావణునిచేఁ జంపఁబడిన పక్షిలోక మున కెల్ల నాథుఁడయిన యీ జటాయువును చితిమీఁదనుంచి, కాల్చె దము" అని లక్ష్మణునితోఁ జెప్పి, జటాయువు కళేబరముఁ జూచి, "బల వంతుఁడవగు గృధ్రరాజా! యజ్ఞములు చేయువారి కే లోకమో, ఆహి తాగ్ని కే లోకమో, మోక్షాసక్తిగల సన్న్యాసుల కే లోకమో, భూదానమొనర్చువారి కే లోకమో, ఆలోకములు నీకును గలుగును గాక! నే ననుజ్ఞ నొసంగితిని. నావలన దహనసంస్కారమును బొంది యుత్తమలోకములను దప్పక పొందుదువు." అని చెప్పి, వ్యసనపరుఁడై, తమ్ముఁడు పేర్చిన చితియందు జటాయువు నుంచి చిచ్చువెట్టి తన దాయా దునిఁబోలె దహన మొనరించెను. అంతట వీర్యవంతుఁడగు రాముఁడు లక్ష్మణసమేతుఁడయి వనమునకుఁబోయి, గొప్ప కేసరిమృగములను సంహా

రించి, వానిమాంసమును ముద్దలుసేసి, రమ్యమగు పచ్చని పచ్చిక పట్టిన దర్భలుపఱచి, యాజటాయువునకుఁ బిండప్రదాన మొనరించెను. బ్రాహ్మణులు మృతునికిఁ బుణ్యలోకముల నొసఁగునట్టియే మంత్రము లను జపింతురో, యట్టి పితృసూక్తములనెల్ల రాముఁడును జటాయువు నిమిత్తమై జపించెను. అంత రాముఁడు లక్ష్మణసమేతుఁడై, గోదావరీ నదికడ కేఁగి యందు మునిఁగి, శాస్త్రోక్తవిధానమున నా జటాయువునకుఁ దర్పణ మొనర్చెను. ఆ జటాయువు కీర్తికరమును, దుష్కరమును నైనయుద్ధకర్మము నాచరించి రావణుచే సంహరింపఁబడి, మహర్షులం బోలిన రాముఁడు, సంస్కార మొనర్పుటంజేసి, తనకు మే లొదవునట్టి యుత్తమలోకములం బొందెను. వేల్పు తేఁడులగు విష్ణుదేవేంద్రుల మాడ్కి వెలుఁగు రామలక్ష్మణులు జటాయువున కుత్తరక్రియలు సల్పి, పక్షీంద్రుఁడు సెప్పిన పలుకునందే బుద్ధిని నిలిపి, సీతను వెదకుటయందు మనముఁ జొప్పించి, యరణ్యమున దిరుగుచుండిరి.

69-వ సర్గము.

రామలక్ష్మణులు కబంధునిఁ జూచుట

బలవంతులును, పరాక్రమశాలురునైన రామలక్ష్మణు లివ్విధమున జటాయువున కుత్తరక్రియలు సల్పి చేత బాణములను వింటిని కత్తిని బూని సీతను వెదకుచుఁ బడమరగాఁ గొంతదూరముపోయిరి. అటనుండి దక్షిణమునకు మఱలి పెక్కుపొదలతోను, చెట్లతోను, తీఁగెలతోను మిగుల దట్టమయి పోవుటకు నలవికానిదియు, కష్టమయినదియు, చూపఱకు వెఱపు పుట్టించునదియు, నింతకు ముందెవ్వరు నడువనిదియు నైన యొక దారిఁ బోయి, సింహ వ్యాఘ్రాదులగు కూళ మృగములకు నివాసమై, కడు భీతిఁగలిగించెడి యా గొప్ప దండకారణ్యమును దాఁటి, జనస్థానమునుండి మూఁడు కోసుల దూరమేఁగి, చొఱరాని క్రౌంచమను నరణ్యమునఁ బ్రవేశించిరి. సీతాపహరణముచేఁ గృశించియున్న యా తోఁబుట్టువు లిరువురు పెక్కు మొగుళ్ల గుంపువలె నుండునదియు, నంతట సంతసముతో నున్నట్లు కానిపించునదియు, పలుతెఱఁగులగు పక్షులును, క్రూరమృగములును గలదియునైన యా క్రౌంచారణ్యము దచ్చటచ్చట నిలిచి, సీతను జూడఁగోరి వనమెల్ల వెదకిరి. అప్పుడు

వా రచ్చట సీతను గానక తూర్పునకు మఱలి, మూఁడుకోసులు నడచి, క్రౌంచారణ్యము దాఁటి, మతంగాశ్రమసమీపమున పెక్కులగు క్రూర మృగములకును, బక్షులకు నునికియు, పలుజంతువుల కాశ్రయమును గొప్ప వ్రాఁకులతో విలసిల్లునదియునైన యొక వనమున నంతట వెదకుచు నొక్కచో పాతాళలోకమువలె లోతయినదియు, ఎడతెగక చీకటి గ్రమ్మియుండునదియునైన యొక్క గవిని జూచిరి. పురుషశ్రేష్ఠులగు రామలక్ష్మణు లా గుహచేరువకుఁ జని, యచ్చట గొప్ప రూపును, వికృతంపు మోరయుఁ గలిగియున్న యొకరక్కసిం జూచిరి.

ఆ రక్కసి వ్రుక్కడిమెకములఁ కెల్ల వెఱపుగలిగించునదియు వీవగింపఁదగినదియు బెగడుచూడ్కులు, తోరపు బొజ్జయు, పదునుకోఱలును, బిఱుసు చర్మమును గలదియు, కరాళయునై కురులు విరియఁబోసికొని, వనమందలి కూళమెకములను దినుచు, విరూపయై యుండెను. అట్టి యా రక్కసి యా శూరులకడ కేగుదెంచి, యన్నకు ముందటఁ బోవుచున్న లక్ష్మణుం జూచి, "లక్ష్మణా! క్రీడింతము ర"మ్మని పిలిచి యతని రెట్టఁ బట్టుకొనెను. అ ట్లారక్కసి లక్ష్మణునిఁ బట్టిలాగి యాతని గౌఁగిలించి, "శూరుఁడా! నే నయోముఖియను పేరుగలదానను; నీపాలఁ బడితిని. నీవు నా మనసునకెక్కిన వాఁడవు. నాథా! నీవు జీవితమున మిగిలినకాల మెల్లఁ గొండలకొనలందును, వీటి యిసుకదిన్నెలయందును నాతోఁగూడి రమింపుము. అని యా రాక్షసి యనఁగా, శత్రుసంహారియగు లక్ష్మణుఁడు కినుకఁ బూని, కత్తిదూసి యా యయోముఖియొక్క పాలిండ్లను, ముక్కును, చెవ్రులును గోసెను. భయంకరరూపిణియగు నా రక్కసి, ముక్కు చెవ్రులు లక్ష్మణుఁడు గోయఁగా, వెఱపు పుట్టునట్లుగా నఱచి, వచ్చినదారిం బట్టి పాఱిపోయెను.

ఆ రక్కసి పాఱిపోవఁగా, శత్రుసంహారకులగు రామలక్ష్మణులు బలిమి మెఱయఁ జొఱనలవికాని యరణ్యము సొచ్చిరి. అప్పు డెక్కుడు వెలుఁగు, బలిమి, నడత, ఆచారముగలవాఁడగు లక్ష్మణుఁడు చేమోడ్చి మిగులఁ దేజస్సుగల యన్నను జూచి "అన్నా! నా యెడమచేయి మిక్కిలి యదురుచున్నది; మన స్నుత్తలంపాటునొందుచున్నది. విశేషముగా నవశకునములు తోఁచుచున్నవి. కావున నన్నా! యీయితుఁడ

వయి యుండుము. హితవగు పనిసేయుము. ఈ యవశకునములెల్ల మన కేదియో చెఱుపు వెంటనే కలుగునని తెలుపుచున్నవి. ఈ వంచులక పక్షికాంత పోరు జగఁగఁగలదనియు, దానియందు మనకు జయము గలుగఁ గలదనియుఁ దెలుపుచున్నది" అని చెప్పెను. ఇట్లు వా రిరువురు మాటాడికొనుచు నా వనమెల్ల సీతను వెదకుచుండఁగా, ఆ వనమెల్ల విఱుగుచున్నదో యన్నట్లు యొక గొప్ప కూఁత పుట్టెను. ఆవనము నందుఁ బుట్టిన యా సద్దాకస మెల్ల బాగుగా వ్యాపించునట్లు గాలి యొనర్చెను. రాముఁడును ప్రక్కన లక్ష్మణుం జేర్చికొని, యా సద్దేదియో తెలియఁగోరి నలుదెసలఁ జూడఁగా, నొకప్రక్క వెడఁదయొత్తును గొప్ప మేనుంగల యొక రక్కసుఁ డగపడెను.

ఆ రక్కసుఁడు తలయు మెడయు లేనివాఁడై, కడుపునందు నోరుగల యొక మొండెముగ నుండెను. మొండెమురూపుదాల్చిన యా రక్కసుఁడు దట్టమ్మైన వాఁడిమొనలుగల రోమములుగలవాఁడును, గొప్పపర్వతమువాడిక్కి నెత్తయినవాఁడును, కఱిమబ్బుచాయ గలవాఁడును, ఉఱుమువంటి కంఠధ్వని గలవాఁడునునై యుండెను. ఆ రక్కసునికి నగ్నిజ్వాలకైవడి వెలుఁగుచు, గొప్ప తెప్పగలిగి, మిక్కిలి పొడవును నిడివియుఁ గలిగి, చుఱుకుగాఁ జూడఁగలదియై, పచ్చరంగుతో నొసట నొకకన్ను విరాజిల్లుచుండెను. వాని నోరు కడుపునందుండుటచే ముఖమునందలి యాకన్ను తోనఁ గానవచ్చుచుండెను. అట్టి యొంటి కన్నుగల యా రక్కసుఁడు గొప్ప కోఱలు గలవాఁడై నాలుకతోఁ బెదవులను నాకుచు యోజనము నిడివిగల భయంకరములగు తన చేతులను జాపి, యొలుఁగుబంట్లు, వీనుఁగులు, మృగములు, పక్షిసంఘ ములు మొదలగువానిని పట్టుకొనుచు మృగశ్రేష్ఠమును చేరువ కీడ్చి కొనుచు, ఆవలకు విసరివైచుచు దాపునకు వచ్చిన యా రామలక్ష్మణుల దారి కడ్డముగా వచ్చి నిలఁబడెను.

అంత రామలక్ష్మణు లెదురుగాఁ బోయి, మహాభయంకర దేహుఁడై, చేతులను జాచి మృగములను భక్షించుచు, మొండెమువలె నుండుటచేఁ జూచుటకు మిక్కిలి భయము గలిగించువాఁడైయున్న యా కబంధునిఁ గ్రొత్తెదురుదూరమునఁ జూచిరి. ఆ రాక్షసుఁడు తన నిడుపు

చేతులను జక్కఁగాఁ జూపి వారి నిద్దఱి నొక్కఁటేతడవఁ దన బలిమి మెఱయ నలుపుచు గట్టిగాఁ బట్టెను. ఎక్కువ ప్రతాపము గలవారయి నను, గట్టివిల్లును ఖడ్గమును గలవారయినను, బలిమిగలవారయినను, రామలక్ష్మణు లిద్దఱు కబంధునిచే నీడ్వఁబడి పారవశ్యము నొందిరి. వారిలో శూరుఁడగు రాముఁడు మాత్రము ధైర్యవంతుఁడు గనుక నా కబంధునియాదచ్చటకు నొవ్వఁడయ్యె. లక్ష్మణుఁడు మాత్రము పసి వాఁడును, ఆశ్రయము లేనివాఁడును నగుటంజేసి మిక్కిలి నొచ్చి, దిగులుపడి రాముం జూచి, "శూరుఁడా! చూడుము. నే నీ రాక్షసుని చేతఁ జిక్కి, నలిగి సొక్కితిని, ననొక్కని వీని కప్పగించి, నిన్నుఁ దప్పించు కొనుము. నన్నీ రక్కసునికి బలియిచ్చి, నీవు సేమముతోఁ బరుగిడుము. నీకు వేగిరమే సీత దొరకఁగలదని నే నెంచెదను. కాకుత్థ్సా! సీతను బడసి, వనవాసము ముగించి, యయోధ్యకు మఱలిపోయి, వంశపారం పర్యముగావచ్చిన రాజ్యము నొంది, రాజ్యపరిపాలనము గావించుచు నన్ను మఱువకయుండుము" అని చెప్పఁగా, రాముఁడును "వీర్యవంతుఁడా! వెఱవకుము. నీవంటివా రిట్లు దిగులుపడరు" అని లక్ష్మణు నోదార్చెను.

ఈలోపలఁ గడుసరియగు దానవశ్రేష్ఠుఁడయిన కబంధుఁడు పెద్ద గొంతుతో రామలక్ష్మణులం బిలిచి, "యెద్దు మూఁపురములం బోలు మూఁపురములు గలవారును, గొప్ప ఖడ్గములను ధనుస్సులను దాల్చిన వారునై వచ్చుచున్న మీ రెవ్వరు? నా కెరయగుటకై యీఘోరపు టడవి కేతెంచితిరే? మీ రిచటికేల వచ్చితిరి? ఇచ్చట మీకేమి పని? ఆఁకలికినొచ్చి యెరకై వేచియుండు నాకుఁ బారణగావించుటకై మీ రిచ్చటికి వచ్చితిరి కాఁబోలు! పదును కొమ్ములుగల రెండెద్దులకైవడి బాణ ఖడ్గ ధనుర్ధరులయిన మీరు నానోటికడకు వచ్చితిరి. ఇఁక మీరు బ్రదుకుట యరుదు" అనెను.

అని యిట్లు దురాత్ముఁడయిన కబంధుఁడు చెప్పిన మాటలు విని, రాముఁడు బెండుపాఱిన మోముతో లక్ష్మణుం జూచి, "తిరమగు మగ టిమిగలవాఁడా! మనకుఁ గష్టముమీఁదఁ గష్టము వచ్చుచున్నది. ప్రియ కాంత పోఁబడి తెలియక వెతచేఁ గదుఁ గుందుచుండఁగా, నిప్పుడ దేమి

చూతు వని మన ప్రాణములకే మోసము వచ్చినది. కాల మన్నిభూత ములను గెల్వఁజాలినది. దానికి లోఁబడనివాఁ డొక్కఁడును లేఁడు. నరశ్రేష్ఠా! చూడుము; శత్రువుల నొప్పించు బలిమిగల మన మిపు డెట్టి వ్యసనములలోఁ దగిలి శ్రమపడుచున్నామో! కావున నెంత కార్యము నైనను గాలము చేయఁగలదు. బలవంతులైనను, మొనగాండ్రైనను, యుద్ధరంగమునఁ బెక్కు బాణముల నేయఁగల విలువిద్దె నేర్చినవా రయినను జెడ్డకాలము వచ్చినపు డిసుకకట్టలవలెఁ గరఁగిపోవుదురు." అని యిట్లు దిట్టమయిన శాశ్వతమగు మగఁటిమిచే మెఱయువాఁడును, ప్రతాపముగలవాఁడును, పేరువడసినవాఁడునునైన రామునఁ డెక్కువ పౌరుషముగల లక్ష్మణునితోఁ జెప్పి, దిటవుచేఁ దన బుద్ధిని నిలువఁ ద్రొక్కెను.

70-వ సర్గము.

రామలక్ష్మణులు కబంధుని చేతులు నఱికుట

కబంధుఁడు తన యిరుగేల నడుమఁ జిక్కికొని యా ప్రకారము చింతిల్లుచు నిలుచున్న తోఁబుట్టువులగు రామలక్ష్మణులను జూచి, "యో ఋత్రియోత్తములారా! నే నాఁకలిచే డస్సియుండుటం జూచి, భగవం తుఁడు మిమ్ము నా కాహారమునిమిత్త మంపెను. మీ రిప్పుడేల మతి మఱచి నిలిచియున్నారు" అని యడుగఁగా, లక్ష్మణుఁడు వ్యసనమొందిన వాఁడై, ధైర్యముపూని, యన్నతో సముచితమగు నొకమాట చెప్పెను. "రామా! యీ రాక్షసాధముఁడు నిన్ను నన్ను వేగిరముగా లాగికొనకమునుపే, యీతని రెండు నిడుద చేతులను ఖడ్గములతో నఱికివేయుదము. గొప్పమేనుగలిగి, యెక్కువ భుజబలముఁ జూపునట్టి యీ భీకర రాక్షసుఁడు లోక మెల్ల జయించి మనల నిప్పుడు వధింపఁ గోరుచున్నాఁడు. రాజపుత్రా! యజ్ఞమధ్యమునకుఁ దెచ్చిన పశువులను వధించుట కారానియట్లు, నిరపరాధులయినవారిని వధించుట రాజునకు కారాదు" అని చెప్పెను.

ఇట్లు రామలక్ష్మణులు మాట్లాడుకొనుటనువిని, కబంధుఁ డలిగిన వాఁడై, నోరు తెఱచి వారిని మ్రింగఁబోయెను. అప్పుడు దేశకాలముల నెఱింగిన యా రామలక్ష్మణులు ఖడ్గములను దూసి, భయముచే వణఁకు

చున్న యా కబంధుని చేతులను రెంటిని మూఁపురములవఱకుఁ దెగ నఱికిరి. నేర్పరియగు రాముఁడు వాని కుడిచేతి నాటంకము లేకుండ నఱికి వైచెను. వీరుఁడగు లక్ష్మణుఁ డెడమచేతిని నఱకెను. అంత నిడుదచేతులుగలవాఁడగు నా కబంధుఁడు చేతులు దెగినవాఁడై, మొయిలుమూఁడి గొప్ప యార్పఱచి, భూమ్యంతరిక్షములను, దెసలను బిక్కటిల్లఁ జేయుచుఁ గ్రిందఁబడెను. అట్లు కబంధుఁడు క్రిందఁబడి పొంగడఁగి, నెత్తుటివెల్లువయందు మునిఁగినవాఁడై, తన చేతులకోలు పోకకై వగచి, రామలక్ష్మణులను "మీ రెవరు" అని యడిగెను.

ఇట్లు కబంధుఁ డడుగఁగా, శుభలక్షణుఁడగు లక్ష్మణుఁడు మహా త్ముఁడగు కబంధుని నుద్దేశించి, "యీతఁ డిక్ష్వాకువంశమునఁ బుట్టిన వాఁడు. రాముఁడని ప్రఖ్యాతి గాంచినవాఁడు. నే నితని తమ్ముఁడను. నన్ను లక్ష్మణుఁ డందురు. దివ్యమహిమగల యీ రాముఁడు నిర్జ నారణ్యమున నుండఁగా, నెవ్వఁడో రాక్షసుఁ డీ రామునిభార్యను దొంగిలించెను. ఆమెను వెదకుచు మే మిచ్చటి కేతెంచితిమి. మా సంగతిఁ జెప్పితిమి సరే. నీ వెవ్వఁడవు? నీ వేల యొమ్మునఁ బ్రకాశించు తల గలిగి, మోఁకాళ్లు లేక, మొండెముచందమునఁ గనఁబడుచున్నాఁడవు." అని యిట్లు లక్ష్మణుఁడడుగఁగా, కబంధుఁడు గడు సంతసమంది, యింద్రుని మాటను జ్ఞప్తికిఁ దెచ్చుకొని యిట్లనియెను. "ఓనరోత్తములారా! మీకు సుఖాగమనమేకదా! నాభాగ్యవశమునను నేను మిమ్ముఁ జూడఁగలిగి తిని. నాభాగ్యవశముననే మీరు నా మూఁపురములను రెంటిని నఱకి తిరి. నరశ్రేష్ఠా! నా కీకురూపమే యపరాధమువలన వచ్చినదియో యీయపరాధమును చెప్పెద నాలకింపుఁడు."

71-వ స ర్గ ము.

కబంధుఁడు తన పూర్వజన్మకథ నెఱిఁగించుట

ఎక్కువ బల పరాక్రమములు గలవాఁడవు, నిడుదచేతుల వాఁడవునైన ఓరామా! పూర్వజన్మమున సూర్య చంద్ర దేవేంద్ర లకుఁబోలె ముల్లోకములందుఁ గడుఁ బ్రసిద్ధి చెందిన యెంచ నలవి కాని రూపము నా కుండెను. నే నట్టి సుందరరూపముగలవాఁడ నయ్యి, లోకములకెల్ల భీతిగలిగించు గొప్ప రూపముఁదాల్చి, వనమున

నచ్చటచ్చట నున్న మునులను వెఱపించుచుఁ దిరుగుచుంటిని. అట్టి సమయమున నొక్కనాఁడు స్థూలశిరుఁడను నొక్కముని కందమూలఫలాదులను వెదకుచు వచ్చి, నాచే వెఱపింపఁబడినవాఁడయి నాపయి నలిగి "ఓరీ నీ వెల్లప్పుడు క్రూరమును, లోకులంద ఱసహ్యపడఁ దగినదియునైన యీ రూపమునే ధరించియుందువుగాక! యని నిరింపరాని శాపమొసఁగెను. అప్పు డమ్మహాముని నేను శమింప వేఁడఁగా, నమ్మహాముని "ఓరీ! రాముఁ డెప్పుడు నీ నిడుదచేతులను నఱికి నిన్నెప్పుడు దహనము చేయునో, అప్పుడు కడుఁ జక్కనిదగు స్వస్వరూపము నొందఁగలవు" అని శాపవిమోచన మొసఁగెను.

లక్ష్మణా! నేను దనుపుత్రుఁడను. కడు రూపసిని, రణభూమియందింద్రుఁ డలిగి నా కిట్టి రూపముఁ దెచ్చిపెట్టెను. నేను గడుతీవ్రమైన తపమొనర్చి బ్రహ్మను సంతసపఱచితిని. అప్పుడు బ్రహ్మదేవుఁడు సంతసించి, నాకు దీర్ఘాయుస్సునొసఁగెను. అ వరప్రభావముచే నొడలు మఱిచి గర్వించి, "నాకుఁ బితామహుఁడు దీర్ఘాయువు నొసఁగెను. ఇంద్రుఁడు నాకేమి కీడుసేయఁగలఁడు" అని యెంచి యుద్ధమున దేవేంద్రు నెదిరించితిని. ఆతఁ డేసిన నూఱించులవాలు నా తుంటిని నా తలను నా యుదరమునఁ జొప్పించెను. నే నతనిఁ బ్రార్థింపఁగా, "బ్రహ్మదేవుని వాక్కు నిక్కువ మగుఁగాక" యని పలికి, నన్నుఁ జమునివీటికి విందు గావింపఁడయ్యెను. అప్పుడు నే నింద్రునిఁ జూచి, "దేవేంద్రా! నీవు వజ్రాయుధముతోఁ గొట్టి, నా తలను తొడలను విఱిచితివి. నే నిట్లు మొండెమై యాహారము మాని చిరకాల మెట్లు జీవింపఁగలను" అని యడుగఁగా నింద్రుఁడు యోజనము నిడివిగల రెండు చేతులను, కడుపునందే వాతిని, పదునుకోఱల నొసఁగెను. అయ్యింద్రుఁడు నన్నుఁ గూర్చి, రాముఁడు లక్ష్మణసమేతుఁడై, నా చేతిని నఱికినప్పుడు, నేను స్వర్గమునకేఁగుదునని చెప్పెను. ఏ నది మొదలు నా నిడుపుచేతులతో నడవిదిమ్మరులగు సింహ వ్యాఘ్ర గజ మృగములను లాగికొని భక్షించుచున్నాను. రాజశ్రేష్ఠుఁడవయిన యో రామా! యీ శరీరము నెత్తిన తర్వాత నేను జూచిన వస్తువులనెల్ల నవలీలగాఁ బట్టి మ్రింగుటయేగాని, యిదిమంచిదా చెడ్డదాయను నాలోచనయు లేదు. ముని చెప్పిన

మాటను బట్టి రాముఁడు నాకడకు వచ్చునని నమ్మినవాఁడనై, యెంతయుఁ గష్టముతో నీ దేహమును డాల్చియుంటిని. రాఘవా! యా రాముఁడవు నీవెకాని యటొక్కఁడు గాఁడు. నీవు దప్ప మఱొక్కఁడు ననున్నుఁ జంపఁ జాలఁడని యా స్థూలశిరమహర్షి నాతోఁ జెప్పెను. ఇది నిక్కము. మీరు నాదేహసంస్కారముఁ గావింతురేని, మీకు నే నాలోచన నెప్పెదను. మీ రొక చెలికానిని నేర్పఱిచెదను" అని కబంధుఁ డనెను.

ఇట్లు కబంధుఁడు చెప్పిన మాటను విని, పున్నెంపునడతగల రాముఁడు, లక్ష్మణుఁడు దగ్గఱనుండి వినుచుండ నిట్లనియె "ఓ కబంధా! నేనును నా తమ్ముఁడును బయటఁ బోయియుండఁగా, పతివ్రతయని ఖ్యాతిగన్న నా ప్రియురాలగు సీతను రావణుఁడు జనస్థానము నుండి కడుసులువుగా నెత్తికొనిపోయెను. రావణుఁ డన్న పేరు మాత్రము దెలియునుగాని, యాతఁ డే యూర నుండువాఁడో, ఆతని రూప మెట్టిదో, ఆతని పరాక్రమ మెంతమాత్రమో మాకుఁ దెలియదు. వెతలచేఁ గుందినవారమై దిక్కుదోఁచక యివ్విధముగా నడవులందుఁ ద్రిమ్మరుచున్నట్టి పరోపకారశీలుర మగు మాయందుఁ జాలి యుంచుట యుత్తమమేకదా! బహుదినములకు ముందే యడవియేనుఁగులు విఱిచివేసిన యెండుఁగట్టెలను దెచ్చి, గొప్ప పల్లము త్రవ్వి యందు నిన్నుంచి యాకట్టెలతోఁ దగులఁ బెట్టెదము. ఆ సీత నెవ్వఁ డెత్తుకొనిపోయినది, ఎక్కడికిఁ గొనిపోయినది నీకుఁ దెలియునేని మాకుఁ జెప్పి, గొప్ప యుపకారముఁ జేయుము." అని యిట్లు మాటలందు నేర్పరియగు రాముఁ డడిగిన, నా పలుకులు విని, మాటల నేర్పు మీఱఁ గబంధుఁ డిట్లు రామునకు బదులుచెప్పెను; "ఓ రాఘవా! స్వయంకృతాపరాధముచే నిట్టి లోకనింద్యమైన రూప మందితిని. శాప ప్రభావమువలననే యాతత్త్వజ్ఞానము నశించినది. ఈ వికృతముతో నా సీతా దేవి సంహరించిన యా రాక్షసు నెఱుఁగు దివ్యజ్ఞానము లేదు. కావున నన్ను మీరు దహింతురేని స్వస్వరూపము వరించి, వెసఁబ సీతసంగతి నెఱిఁగినదానిం జెప్పెదను. "రఘునందనా! రామా! యంతియగాక, సూర్యుఁ డలసిన గుట్టములుగలవాఁడై, యస్తమించులోపల నన్ను బల్లముననుంచి శాస్త్రప్రకారముగా సంస్కరింపుము. నీవు నన్నుఁ బల్ల

ముననుంచి కాల్తువేసి, సీత నపహరించినవాని నెఱుఁగఁగలవానిం జెప్పెదను. రాఘవా! వానితో న్యాయపద్ధతిచేఁ జెలిమి చేసికొనుము. వేగముగాఁ దిరుగునట్టి నేర్పుగల యాతఁడు సంతసించి, మీకు సాహాయ్యము సేయఁగలఁడు. కొండొకకారణమున నాతఁడు లోకములం దంతటను తిరిగియున్నవాఁడు కావున ముల్లోకములం దతనికిఁ దెలియనిది యొక్కటియు లేదు" అని కబంధుఁడు రామునితోఁ జెప్పెను.

72-వ సర్గము.

కబంధుఁడు రామునకు సీతాలాభోపాయముఁ దెల్పుట

ఇట్లు కబంధుఁడు చెప్పఁగా, శూరులయిన రాజేంద్ర లిద్దఱు కొండయందలి యొక గొప్ప పల్లమును జూచి, యందుఁ గబంధుని కళేబరము నుంచి, చిచ్చువెట్టిరి. అంత లక్ష్మణుండు మండుచున్న కొఱవుల నంతట నుంచి చితిరగులఁ జేసెను. అప్పుడా చితి చక్కగా మండుచున్నను, ఆ కబంధుని తోరపుమేను నేతిముద్దతో సాటిగా నున్నను, మెదడుతో నిండినదగుటవలన నగ్నిహోత్రుఁడు మెల్ల మెల్లగా దహించుచుండెను. అప్పు డా బలవంతుఁడగు కబంధుఁ డా కాష్ఠమును విడిచి, పొగలేని యగ్నివలె మండుచుఁ బైకిలేచి, నిర్మలములగు వలువలను, దివ్యములైన పుష్పమాలలను ధరించి, సకలాంగములకు భూషణములఁ దొడిగి, మోహన యానందముతోఁ బైకెగసి, మెఱుఁగుగలదియు, హంసలతోఁ గూడినదియు, వాసి కెక్కినదియునైన యొక్క విమానమునఁ గూర్చుండి తన వెలుఁగుచేఁ బదిదెసల వెలుఁగఁ జేయుచు, రామునిఁగూర్చి యిట్లనియె.

రాఘవా! సీత నొందుటకుఁ దగిన యుపాయముఁ జెప్పెద నాలింపుము. లోకమున * సంధి, విగ్రహ, యాన, ఆసన, ద్వైధీభావ, సమాశ్రయము లనెడి యాఱు యుక్తులు సర్వకార్యసాధకములై యున్నవిగదా! కష్టము లందినవాఁడు తనవలెఁగష్టము లందినవానితోఁ జేరుచున్నాఁడు. రామా! నీవు భార్యను గోలుపోయి, యా సీతనిమిత్త

* సంధి=పిడంబడిక; విగ్రహ=పోరు చేయుట; యాన=యుద్ధయాత్ర చేయుట; ఆసన=మొట్టడించుట; ద్వైధీభావ=చీలుట; సమాశ్రయములు=బలవంతుల నాశ్రయించుట.

మింత వ్యసనము నొంది నీవును లక్ష్మణునితోఁగూడఁ గష్టపడుచున్నాఁ
డవు; ధైర్యము చెడి లొంగియున్నాఁడవు. మంచి మనసుగలవారి
లోపల శ్రేష్ఠుఁడా! నీ వవశ్యముగా నీవలె నవస్థపడుచున్న వానితోడనే
చెలిమి చేయవలయు. అట్టివానితోఁ జెలిమి యొనర్పక నీ కార్యము
నెఱవేఱునని నేఁ దలఁచెదను. రామా! నీయట్టివాఁ డొక్కఁడున్నాఁడు.
వానిసంగతి వినిపించెదను. సుగ్రీవుఁడు, వాలియని యిరువు రన్న
దమ్ములుగలరు. వారిలో నింద్రునిపుత్రుఁడగు వాలి యేదియో కారణ
ముచేత నలిఁగి, తమ్ముఁడగు సుగ్రీవుని రాజ్యమునుండి తఱుమఁగొట్టెను.
అది మొదలు ధైర్యవంతుఁడును, శూరుఁడునగు సుగ్రీవుఁడు నలువురు
వానరులతోఁ గూడి పంపానదీతీరప్రాంతమున వెలయు ఋశ్యమూక
పర్వతమున నున్నవాఁడు. ఆ సుగ్రీవుఁడు వానరులకు దొర; మగటిమి
గలవాఁడు; తేజస్సుగలవాఁడు; మేర లేని వెలుఁగుగలవాఁడు; మాట
దప్పనివాఁడు; అడఁకువ, సంతసము, మది, గౌరవముం గలవాఁడు;
కార్యము లన్నిటియందు నేర్పరి; లోఁతుగలవాఁడు; బలిమిగలవాఁడు.
ఇట్టి సుగుణములతోఁ గూడిన యా సుగ్రీవుని రాజ్యమున కాసపడి
వాలి తఱుమఁగొట్టెను. ఆతఁడు నీకు నెచ్చెలియై సీతాన్వేషణ కార్యము
నందుఁ దోడ్పడఁగలఁడు. కావున రామా! నీవు మనమునఁ జింతిం
పకుము. ఇక్ష్వాకువంశ ప్రదీపుఁడా! యేది యెట్లు కావలయునో, అది
యట్లు కాక మానదు. కాలము మీఱుట యేరికిని సాధ్యముగాదు.
రామా! నీవు తడవుసేయక యా బలవంతుఁడగు సుగ్రీవునికడకుఁ బొమ్ము.
ఆతని కవిశ్వాసము గలుగకుండుటకై యగ్నిసాక్షికముగా నతనితోఁ
జెలిమియొడఁగూర్చుకొనుము. వానరుడుగదా యని యతని నవమానింపఁ
దగదు. ఆతఁడు మేలు మఱువనివాఁడు; కామరూపి; వీర్యముగలవాఁడు.
అయినను ఇప్పుడు స్వకార్యముకొఱకు సాయము గోరుచున్నాఁడు
ఆతని కార్యము మీరు నెఱవేర్పఁ జాలుదురు. అతనికార్య మీఁడేరి
ననే, మీకు మాఱుమే లతండు సేయునని తలంపఁ బోకుఁడు. అతని
కార్య మీఁడేరినను, ఈడేరకపోయినను, మీ కార్యము నతఁడు తప్పక
నెరవేర్పఁగలఁడు. ఆతఁడు ఋక్షరజోఁడనువాని భార్యకు సూర్యుని
యనుగ్రహమునఁ బుట్టినవాఁడు; వాలి తన్ను వెడల నడచుటచే వెఱచి,

పంపాసరోవరముగట్టునఁ దిరుగుచున్నాఁడు. నీవు వేగ బుశ్యమూకమున కేఁగి, యా సుగ్రీవుఁ డను వానరునితో నాయుధసాక్షికముగాఁ జెలిమి చేసికొనుము. ఆ వానరశ్రేష్ఠుఁడు రాక్షసు లుండు తావుల నెల్ల నేర్పుతో నరయఁగలఁడు. రఘునందనా! ఆ సుగ్రీవుని కీ లోకమున సూర్యుఁ డెంతవఱకు వెలుఁగుచున్నాఁడో, యంతకులోపలఁ దెలియని దొక్కటి యైన లేదు. వేయి వెలుఁగుఁదేఁడగు నాతఁడు వానరులను బాసట గొని, గొప్ప పర్వతములందును, పర్వతదుర్గములందును, గుహాలయందును, నదులందును వెదకి యెట్టకేలకు నీ ప్రియపత్నిని గనుఁగొనఁగలఁడు. నీయెడఁబాటుచేఁ గుందుచుండు సీతను వెదకుటకై మూలమూలకు గొప్ప మేనుగల వానరులను బంపఁగలఁడు. పతివ్రతయగు సీత రావణు నింట నెక్కడ నున్నదో యతఁడు గనుఁగొనఁ గలఁడు. ఆ పతివ్రతయైన సీత వేల్పుఁగొండకొన నున్నను, పాతాళతలమున నున్నను వెదకి, యచ్చటి రక్కసులను బరిమార్చి నీకడకుఁ దెచ్చి యప్పగింపఁగలఁడు.

73-వ సర్గము.

కబంధుఁడు రామునికి మార్గముఁ దెల్పుట

కార్య మిట్టిదని యెఱిఁగిన కబంధుఁడు రామునకు సీతను బొందు టకుఁ దగిన యుపాయము దెలిపి, యుపయుక్తార్థముగల యొక్కమాట వెండియు నిట్లనియె. రామా! ఇచ్చటికిఁ బడమరగా దారి యొక్కటి పోవుచున్నదిగదా. ఈ దారి పొడుగునను నేరెడు, మోరటి, పనస, జువ్వి, మట్టి, తుమ్మికి, రావి, కొండగోఁగు, మామిడి, చంద్ర, పొన్న, బొట్టుగు, కానుగు, నల్లయశోకము, కడప, గన్నేరు, జిడి, యశోకము మొదలగు వృక్షములు పుష్పవంతములై సొంపుమీఱి వెలయుచున్నవి. మీరి త్రోవం బోవుచు నా చెట్లకొమ్మల వంగదీసి యైనను నమృతముంబోలెడి పండ్లనుగోసి తిని దారి సాగిపొండు.

కాకుత్స్థా! ఆ వనము దాఁటి మఱికొంత దవ్వేఁగితిరేని, పుష్పఫల భరితమయి యుత్తరకురుదేశ మునఁదగినదియు, నందనవనమును బురుడించునదియునగు మఱియొక్క వనముఁ గాంతురు. ఆ వనమున నన్నివృక్షము లివి యవి యనక యన్నిపండ్లతో నిండి, తేనియ లొలుకు చుండును. చైత్రరథ మనెడి మహేంద్ర నుద్యానముండుఁబోలె నా వనమున

నన్ని ఋతువులు విడువక వాసము సేయుచుండును. వృక్షములన్ని యుం బండ్లబరువుచే ముందుకు వంగి, గొప్పకొమ్మలు గలిగి, మొగ్గలను గొండలను బోలియున్నవి. లక్ష్మణుఁ డాచెట్లనెక్కి కాని, వానిని వంగఁ దీసికాని యమృతమున కెనవచ్చు పండ్లను గోసి నీకుఁ దెచ్చియిచ్చును. అచ్చటినుండి వెడలి దేశములనుండి దేశములకు, పర్వతమునుండి పర్వతమునకు, వనముననుండి వనమునకుఁ బోవుచు గఱుకుతోలు లేక, జాఱుడు లేనిదయి, చక్కని రేవులుగలిగి, పాచిలేక, మెత్తని యిసుకతో నిండి, తామరలచేతను, గలువలచేతను నొప్పుచున్న పంపాసరోవరతీరమునకుం బోఁగలరు. రాఘవా! యా సరస్సునందు రాయంచలు, నీరుకోళ్ళు, క్రౌంచములు, లకుముకిపిట్టలు నీటియందుఁ దేలుచు నింపుగాఁ గూయు చుండును. ఆ పక్షులు తిన్నని స్వభావముగలవిగ్గొ, వధమన నెట్టిదో యెఱుఁగవు గాన మానవులను జూచి యవి భయపడవు. నేతిముద్దలం బోలెడి యా బలిసిన పక్షులను దినఁగలరు. లక్ష్మణుఁడు నీయెడ భక్తి గలవాఁడు గనుక, మంచివియు, చర్మము తెక్కలు లేనివియు, బలిసినవియు, ముండ్లు లేనివియునైన గండు చేఁపలను, చొఱచేఁపలను, రొయ్య చేఁపలను బాణములచేఁ గొట్టి, వాని నినుపశలాకకు గ్రుచ్చి, కాల్చి నీకుఁ దెచ్చి యిూఁగలఁడు. నీ వా చేఁపలను పంపాతీరమునఁ గూర్చుండి భక్షించుచుండఁగా పంపాసరసునఁ దామరపుష్పములు వెక్కలుండుటచే నెక్కువ తావిగలిగి, పరిశుద్ధమును, త్రాగఁదగినంత చల్లనిదియు, నెల్లప్పుడుఁ దేటయు, వెండి స్ఫటికములను బోలినదియు నైన జలమును దామరాకుదొప్పలోఁబట్టి తెచ్చి యిూఁగలఁడు. నరశ్రేష్ఠా! కొండగవు లునికిపట్టుగాఁగలవియు, వనమునఁ దిరుగుచున్నవియునైన బలిసిన యడవిపందులు నీరువట్టుతోఁ బంపాసరోవరమునకు వచ్చి యొద్దులవలె అంకె వేయుచుండఁగా నీవు వానిని, సాయంకాలమునఁ బరిహాసము సల్పుచుఁ బూవులదాల్పులైన చెట్లవరుసలను, పంపాసరము నందలి చల్లనియుదకమును, పుష్పభరితములయిన తిలకవృక్షములను, కానుఁగుచెట్టులను, చక్కఁగఁ బూచిన కలువలను, తామరపువ్వులను జూడఁగలవు. ఆచెట్లపువ్వులసరము లెవ్వఁడును జుట్టునఁ దాల్పఁడు. ఆ పూవులు వాడవు; క్రిందఁబడవు. అచ్చట మతంగశిష్యులు గడుఁ

దీర్ఘమగు సమాధియం దుండిరి. వా రొకప్పుడు గురువునిమి త్తము వనమునఁ గల వస్తువులను మోయుచు, మిక్కిలి బరుఁగుచే డస్సి యుండఁగా, వారి యొడలినుండి వేగ జాతీన చెమటబొ ట్లామునుల తపఃప్రభావమువలనఁ బూవులసరంబులుగా నయ్యెను.

రాఘవా! ఆ మునుల ప్రభావముచే నా పుష్పము లెప్పటికి వాఁడవు. ఆ మునులచ్ఛాటు వాసినను, వారి పరిచారికయగు చిరకాల జీవినియైన శబరియను నొకసన్యాసిని యిప్పుడు నచ్చట నున్నది. ఆ శబరి సర్వదా పున్నెపుఁగార్యములను జేయుచు నీ రాకకై వేచియున్నది. సకల భూతములచే నమస్కరింపఁబడినవాఁడవును, దేవతలకెనయైనవాఁ డవునగు నిన్ను దర్శించి స్వర్గమునొందఁగలదు. రామా! పంపాసరస్సునకుఁ బడమరగాఁ బోతివేని, సాటిలేని యేకాంతమగు నాశ్రమస్థానముఁ జూడఁ గలవు. ఆ పర్వతప్రాంతవనమునఁ బెక్కేనుఁగులున్నను, ఆ మతంగముని ప్రభావమునం జేసి, యడవియేనుఁగులు రాఁజాలవు. నందనవనమును, దేవతారణ్యములను బోలినవై యనేక పక్షిసమూహములతో నిండిన యా వనమున నీవు సీతావియోగ దుఃఖముఁ బాసి సుఖముగా విహరింపఁ గలవు. రామా! పంపాసరస్సునకు ముందటి ప్రదేశమున ఋశ్యమూక మను నొకపర్వత మున్నది. అది పూఁచిన చెట్లతోఁ గూడియుండును. ఏనుఁగుగున్నల కది యొక్కుటకు వీలుగాని యంత గొప్పదిగా నుండు నట్లు బ్రహ్మదేవుఁడు నిర్మించెను. రామా! ఆపర్వత శిఖరమున నిద్రించు వాఁడు స్వప్నమున నెంత ధనమును గాంచునో, ఆతఁడు మేల్కాంచిన పిదప నా ధనమును బొందును. విరుద్ధాచారుండును, పాపంపుఁ బనులు సేయు వాఁడును నాపర్వతము నెక్కఁజాలఁడు. అట్టివాఁ డా పర్వతము నెక్కెనేని, అతఁడు నిద్రించునప్పుడు వానిని రక్కసులు తిందురు. రామా నీ వా మతంగాశ్రమమున నుండునప్పుడు, అయ్యాశ్రమమున వాసము చేయుచుఁబంపాసరసునఁ గ్రీడించునట్టియేనుఁగుగున్నలు సేయు బృంహిత ములు వినఁబడుచుండును. మేఘమువంటి ఛాయగలవియు, బలిమిగలవి యునైన గొప్ప యేనుఁగు లొండొంటితోఁ గలహించి, నెత్తుటిధారలచేఁ దడిసినవై చెదతీ యంతట నడయాడుచుండును. ఆ యడవియేనుఁగు లా సరస్సు నందలి యారోగ్యకరమగు చల్లని తేటనీటిని ద్రావి, యడవు

A 190



శబరి రాముని దర్శించి స్వర్గమునకుఁ బోవుట. ఆ—160

B 90

లందు సుఖముగాఁ దిరుగు చుండును. మఱియు నా వనమున నెలుఁగు బంట్లును, ఇంద్ర నీలముల చాడ్పున నల్లని కాంతిగలవియు, ఓటమి నొంద నివియునైన వ్యాఘ్రములను చారలదప్పులను జూచి, నీవు విచారము మానుదువు. రామా! ఆ ఋశ్యమూకపర్వతమున గొప్పగుహా యొక్కటి యున్నది. అయ్యది బాలచేమా యుఁబడియున్నది. దానిలోపలఁజొచ్చుట యేరికిని శక్యము గాదు. ఆ గుహాయొక్క తూర్పుద్వారమునఁ బెక్కు మృగములతోఁ గూడినదియు, కందమూలఫల సమృద్ధిగల చెట్లుగలదియు నైన యొక మడుఁగున్నది. సుగ్రీవుఁడు నలువురు వానరులతోడ నా గుహాయందు నివసించుచున్నాఁడు. ఒకొక్కప్పుడు ఋశ్యమూక పర్వత శిఖరముమీఁదను నుండును.

అని యిట్లు కబంధుఁడు రామలక్ష్మణుల కిరువురకుఁ జెప్పి, భూదండలుదాల్చి, సూర్యునిమాడ్కిఁ దేజరిల్లు వన్నెగలవాఁడై మగఁటిమితోఁ గూడి వెలుఁగుచుండెను. రామలక్ష్మణులు యాకసమున నున్న మహాత్ముఁడగు కబంధుని దాపునకుఁజని "నీ వింకఁ బోయిర"మ్మని యానతిచ్చిరి. ఆ కబంధుఁడును "మీకార్యసిద్ధికై మీరు పోయిరండు" అని రామలక్ష్మణులను వీడ్కొలిపి నిజనివాసమునకుఁ బయనమయిపోయెను. ఇట్లు కబంధుఁడు నిజరూపము నొంది సూర్యునిఁబోలె వెలుఁగు దేహము గలవాఁడై, యాకసమున నుండి, రామునికి యోచన చెప్పి సుగ్రీవునితోఁ జెలిమిచేసికొనుమని చెప్పెను.

74-వ సర్గము.

శబరి రాముని దర్శించి స్వర్గమునకుఁ బోవుట

రామలక్ష్మణులు కబంధునివలనఁ బంపాసరోవరమునకుఁ బోవు మార్గమును విన్నవారలై, సుగ్రీవునిఁ గనుఁగొనఁ గోరి పడమటి దిక్కునకుఁ దరలి, యచ్చటచ్చటఁ బర్వతములందుఁ దేనియవలెఁ దీయనైన పండ్లుగల చెట్లను జూచుచు, కొండవైన విడిసి బంపయొక్క పడమటి గట్టుచేరి, యచ్చటఁ బలుతెగలగు చెట్లతో మనోహరముగ నుండు శబరి యాశ్రమముఁదిలకించి, లోపలికిఁ జని, శబరిం గాంచిరి. అప్పు డా సిద్ధ రాలు రామలక్ష్మణులు వచ్చుటఁ జూచి, లేచి చేమోడ్చి ధీమంతులగు

రామలక్ష్మణుల కాళ్ళను బట్టుకొని యర్ఘ్య పాద్యములను, ఆ చమనీయమును శాస్త్రప్రకారముగా నొసఁగెను.

అంత రాముఁడు కఠిననియమము పూనియుండు సిద్ధురాలినిజూచి, "ఓ తపోధనా! నీ వన్ని యాటంకములను జయించితివికదా? నీ తపము పెంపొందుచున్నదే? కోపము నడఁచియున్నదానవే? ఆహారమున నియమముగలిగి యున్నావే? నీ వ్రతములు చక్కఁగా జరుగుచున్నవే? నీ మనసునకు సౌఖ్యమే? చారుభాషిణీ! నీయొక్క గురుశుశ్రూష సఫలమేకదా?" యని యడుగఁగా, సిద్ధుల మన్ననవడసినదియు, తపస్సిద్ధి నొందినదియునైన యా ముదుసలి తాపసియగు శబరి రాముని పలుకులు విని, యెదుట నిలిచి, "ఓ పురుషోత్తమా! యిప్పుడు నీ దర్శనమువలన నా తపస్సిద్ధి కలిగినది. నా తపస్సు సఫలమైనది. నా గురువులు చక్కగాఁ బూజింపఁబడిరి. ఇప్పుడు దేవదేవుఁడయిన నీ దర్శనము చేయుటచే నేను జన్మమెత్తినందుకు ఫలము గలిగినది. నాకు స్వర్గము గలుగఁగలదు. రఘునందనా! నెనరుగల నీ చూపు పడుటచేఁ బాపములనుండి విడువఁబడి పరిశుద్ధురాలనైతిని. శత్రుసంహారకా! నీ యనుగ్రహమునం జేసి, నేను శాశ్వతలోకములను బొందెదను. నీవు చిత్రకూటమునకు వచ్చియున్నప్పుడు, నా శుశ్రూష నాదరించెడి గురువులు తులలేని కాంతులుగల విమానములలో నెక్కి యిచ్చటినుండి స్వర్గమునకుఁ బోయిరి. మహాత్ములు, సకల ధర్మవేత్తలునగు నమ్మహామునులు పుణ్యలోకములకుఁ బోవుచు నన్నుఁజూచి, "నీ విచ్చటనే కొంతకాల ముండుము. రాముఁడు లక్ష్మణసమేతుఁడై పావనమగు యీ నీ యాశ్రమమునకు రాఁగలఁడు. వారికి నీ వతిథిపూజ లొనర్చి, వారి యనుజ్ఞవడసి పుణ్యలోకములకుఁ బోఁగలవు" అని చెప్పిరి. ఓ పురుషోత్తమా! తమరాకకై యెదురుచూచుచుఁ బంపాసరస్తీరపు వనములో దొరకెడి కంద మూల ఫలములను దమకుఁ గానుకవెట్టి సేకరించియున్నదానను."

ఇట్లు శబరి పలుకఁగా; ధర్మాత్ముఁడగు రాముఁడా శబరిపలుకులనువిని; యెల్లప్పుడు బ్రహ్మోపాసనాపరాయణురాలగు నా శబరి కిట్లనియె. "ఓ శబరీ! నీ యథార్థమయినమహిమము నేను దనుపుత్రుఁడగు కబంధునివలన వినియున్నాను; నీకు సమ్మతమేని ప్రత్యక్షముగఁజూడఁ

గోరుచున్నాను." అని రాముఁడడుగఁగా, శబరి రాముని నోటికుండి వచ్చిన యా మాటవిని, యా రామలక్ష్మణుల కిరువురికిఁ దన యాశ్ర మంపుఁదీరు చూపుచు నొకచోటఁ జూపి, "రఘునందనా! యీ వనము జూడుము. ఇది మేఘమండలమును బోలిమృగపక్షులతో నిండియున్నది. ఇది మతంగవన మని ప్రసిద్ధికెక్కియున్నది. ఎక్కుడువెలుఁగుగల యో రామా! మా గురువు లిచ్చట మంత్రవేత్తలగు ఋత్విజులను దగ్గఱ నుంచికొని యాగముఁ జేసిరి. ఈపడమటివై పునఁగల యున్నతస్థలము పూజావేదిక. నేను గొల్చుచుండిన గురువులు వార్ధక్యముచే వణఁకు హస్తములతో నిచటఁ బుష్పములతోఁ బూజసేయుచుండిరి. రఘువంశో ద్ధారకా! యీ పూజావేదికలు మాయాచార్యుల తపోమహిమచేతనే తులలేనికాంతులను జిమ్ముచు దెసలెల్ల వెలుఁగఁజేయుచున్నవి. వా రుప వాసములబడలికచేతను, వార్ధక్యముచేతను పోఁజాలక ధ్యానింపఁగా, నేడు సముద్రములును యీ యాశ్రమమందే వచ్చియున్నవి; చూడుము. రఘునందనా! అమ్మునిశ్రేష్ఠులు స్నానముచేసి, యీ ప్రదేశ మందలి చెట్లపై నారవేసిన నారబట్ట లిప్పటికి నెండకున్నవి. వారు దేవపూజకై గోసి తెచ్చిన కలువపూవు లింకను వాడుపాటక యున్నవి. రామా! యీ యాశ్రమమునఁ జూడవలసినది యెల్లఁ జూపి తిని. వినఁదగినది వినిపించితిని. ఇఁక మీరు నా కనుజ్ఞ యొసఁగితిరేని, యీ శరీరమును వదలెదను. ఈ యాశ్రమము బ్రహ్మజ్ఞానులగు నేమునులదియో నే నే మునులకుఁ బరిచారికనో, వారికడకుఁ బోవఁ గోరెదను. అనుజ్ఞ యిండు" అని శబరి రామలక్ష్మణుల నడిగెను.

రామలక్ష్మణు లా శబరియొక్క పలుకులు విని, తపోవనము యొక్క సొంపున కాశ్చర్యపడి యొక్కువ సంతోషము నొందిరి. అప్పుడు రాముఁడు తీవ్రనియమముగల యా శబరిం జూచి, "నీవు మిగుల ప్రేమతో నన్నుఁ బూజించితివి. ఇఁక స్వేచ్ఛగాఁ బొమ్ము" అని యాన తీయఁగా, జడలు దాల్చి, నారచీర గట్టి, జింకతోలు గప్పికొనయున్న యా శబరి తన జీర్ణదేహము విడువఁగోరినదై, రాముని యాజ్ఞ వడసి, శరీరమును హోమకుండమున విడిచి, మండుచున్న యగ్నింబోలినదై

మేటియాభరణములను, మేలిమిగంధమును, పూవులదండలుం దాల్చి, దివ్యరూపము దరించి, చూపఱి కింపుగొలుపుచు మెఱుపు వైవడి నాప్రదేశము వెలుఁగఁ జేయుచు నా పుణ్యాత్ములగు మహర్షు లుండు తావునకు యోగబలముచేఁ బోయిచేరెను.

75-వ సర్గము.

రాముఁడు పంపాసరస్తీరము చేరుట

ఆశబరి తన తపోమహిమవలన స్వర్గమునకుఁబోయి చేరఁగా, ధర్మాత్ముఁడగు రాముఁడు గొంత తడవు మహామునులప్రభావముఁ గూర్చి చింతించి, హితము సేయువాఁడును, భక్తుఁడునైన లక్ష్మణుం జూచి, "లక్ష్మణా! మిక్కిలి వింత గొల్పునది, తిన్ననిది, పుణ్యాత్ములగుమునీంద్రుల యునికిపట్టు, ఒండొంటియెడఁ బ్రీతిగల పెక్కు మృగపక్షులు గలదియునగు నీ యాశ్రమము చూచితిమి. ఈ సప్తసముద్ర తీర్థములలో మునిఁగితిమి. పితృతర్పణ మొనరించితిమి. ఆ యా మన యనిష్టములెల్లఁ దీఱినవి. ఇఁక మనకు మేలు గలుగును. ఆ వాస్తవార్థముచేతనే నా మన సిప్పుడు నిర్మలమైయున్నది. నా మనమునకు మంచి గలుగఁగలదని తోఁచెడి. కావున చూచుట కింపగు పంపాసరస్సునకుఁ బోదము రమ్ము. దానికి దాపుననేకదా ఋశ్యమూకపర్వతము వెలయుచున్నది. ధర్మాత్ముఁడయిన సూర్యపుత్రుఁడగు సుగ్రీవుఁడు వాలికి వెఱచి నలుగురు వానరులను సహాయులనుగఁ గొని యచ్చటనేకదా యున్నవాఁడు. సౌమ్యా! సీతాన్వేషణము సుగ్రీవుని యధీనమయినది గదా! కావున నరశ్రేష్ఠా! తడవు సేయక యా సుగ్రీవుం జూడఁ బోదము" అని చెప్పఁగా లక్ష్మణుఁడు "అట్లేపోదము. నా మనస్సుగూడఁ ద్వరపడుచున్నది" అని చెప్పెను.

అంతట రామునఁడు పయనమై, పలుతెఱఁగులగు చెట్లతోను, తీఁగెలతోను గూడినదియు, పానయోగ్యమగు జలముగలదియు, ఎఱ్ఱి తామరపువ్వులచేతను, ఎఱ్ఱి కలువలచేతను నెఱ్ఱినిదియు, తెల్లగలువలచేఁ దెల్లనిదియు, నల్ల కలువలగుంపుచే నల్లనిదియునై నందునఁ బలురంగులు గలిగి రత్నకంబళముఁబోలిన శోభిల్లుచుండునదియునైన పంపాసరస్సును

దవ్వునుండియే చూచి, యచ్చటికిఁ బయనమై, డాని చేరువ నున్న మతంగసరస్సునందు స్నాన మాచరించెను. అట్లు పరాక్రమశాలియగు రాముఁడు కృతస్నానుఁడై, యేకతమగు మనసుతోఁగూడి, తీరము లందు పుష్పితములగు మామిడి, బొట్టుగు, దానిమ్మ, మద్ది, గన్నేరు, పొన్న, మట్టి, తినాస, ఏడాకులపొన్న, మొగిలి, అశోకము, పూఫుగురివింద మొదలగు పెక్కు వృక్షములచేతను, మొల్లలు, విరిజాజులు మొదలగు తీవజొంపములచేతను నింపయి, యలంకృత యగు నంగనవోలె నొప్పారుచున్నదియు, కుముదేందీవరకల్హారపద్మ పుండరీకకోకనదాది పద్మ భేదములచే నొప్పుచున్నదియు, నెమ్మి కూఁతలు మొదలగు పక్షుల కూఁతలచే సొంపుమీఱి యున్నదియునై శీతజలము గల్గియున్న యా పంపాసరసునకుఁ బోవు మార్గమున నుండు మహావనములను, పలుకొలఁకులను జూచుచు మదన తాపముచే నుడుకుచుఁబోయి, పుష్పించిన మద్ది, సంపంగి మొదలగు చెట్ల తోటలతోఁ గూడినది యీటచేఁ బూదేనె నానుట కేతెంచి యున్న పెక్కు తేఁటులుగలదియు, సాటిలేని చెలువుగలదియు, స్ఫటికమువలెఁ దెల్లనైన యుదకముగలదియు, సన్నని యిసుకగలదియునైన పంపాసరో వరముచేరి, దానిని మిగుల నాదరుఫుతో నీక్షించి, లక్ష్మణు నుద్దేశించి, "నాయనా! యీ తటాకముగట్టునకేకదా కబంధుఁడు నెప్పిన పుష్పిత వృక్షోపేతమయి, కావిఁబాళ్లగనులతోఁగూడి, ఋశ్యమూకమని ప్రఖ్యాతి గాంచిన పావనమగు పర్వతమున్నది. ఋక్షరజుని పుత్రుఁడును, బలశాలి యని ప్రసిద్ధికాంచిన వానరోత్తముఁడును నైన సుగ్రీవుఁడీ పర్వతమునఁ నే యున్నవాఁడు. పురుషశ్రేష్ఠా! నీవు సుగ్రీవునికడకుఁ బోయిరమ్ము" అని చెప్పి, వెండియు నతనింజూచి, "రాజ్యముఁ గోల్పోయి దీనుఁడనయి యున్నను సీతతోఁగూడ నుండుటంజేసి, యీ వ్యసనము మఱిఁగియుండె. లక్ష్మణా! నాదుఃఖముల కుపశమనము గావించు నా ప్రియురాలిం గానక నే నెట్లుండఁగలను?" అని పలికి, మదనుని బారిం జిక్కి, యేకాంతభక్తుఁడగు లక్ష్మణుని కిట్లు చెప్పి, శోకవిషాదములకుఁ గట్టువడి, మనోహరమగు పంపాసరమునఁ బ్రవేశించెను.

ఇట్లు రాముఁడు జనస్థానమునుండి వెడలి చాలదూరము దారి నడచి, బాటసారుల కనుకూలములుగాని యొడారులను దాఁటి, పెక్కు తోఁటలతోఁగూడి, నానావిధములగు పక్షులసంఘములతో నిండి యొప్పు చున్న పంపాసరస్సునకుఁ బోయి చేరెను.

శ్రీమద్వాల్మీకి రామాయణమునకు సరియైన యాంధ్రవచనరామాయణమున

ారణ్యకాండము సమాప్తము.

ఫలశ్రుతి

శ్లో. ఆరణ్యకంతు యఃకాండ మతిభక్తి సమన్వితః,
పఠేద్వా శృణుయాద్వాపి సోమసాయుజ్య మాప్నుయాత్.

బ్రహ్మాండపురాణము. 147 వ అధ్యాయము.

ఆరణ్యకాండమును గడు భక్తితో నెవ్వఁడు చదువుచున్నాఁడో, లేక వినుచున్నాఁడో, వాఁడు సోమసాయుజ్యము నొందును.

చెన్నపురిః వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్సువారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము—1951

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనావలోకన

పుస్తకం సంఖ్య	AOUA104B133
పుస్తకం పేరు	శ్రీమదాంధ్ర వచనరామాయణముఅరణ్యకాండము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	no
వెనుక అట్ట	no
మొత్తం పేజీలు	213
పెద్ద సైజు పేజీలు	NO
ఖాకీ పేజీలు	C.I.A.46.BC1
లేని పేజీలు	NO
తయారు చేసినది	P. Jayamma
పేజీలు విడదీసినది	P Jayamma
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	anusha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	good